www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI



బుధవారం | 12-11-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 23 సంచిక (Issue) : 224 | శ్రీ విశ్వావసునామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, కార్తీకమాసం, బహుళపక్షం, తిథి: అష్టమి రా.10.59 తదుపరి నవమి, నక్షత్రం: ఆశ్లేష రా.6.35 తదుపరి మఖ, వర్జ్యం: ఉ.7.15-8.52, దుర్ముహూర్తం: ఉ.11.36-12.21, అమృతఘడియలు: సా.4.57-6.35, రాహుకాలం: మ.12.00-1.30, సూర్యోదయం: 6.22, సూర్యాస్తమయం: 5.36 | వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

యూసుఫ్‌గూడలో ఓ వృద్ధురాలిని పోలింగ్ బూత్‌కు తీసుకొస్తున్న పోలీసు అధికారి; కార్మికనగర్‌లో క్యూలో ఓటర్లు





జూబ్లీహిల్స్‌లో పోలింగ్

50 శాతం లోపే

చివరిదాకా డబ్బులు పంచినా.. గడప దాటని ఓటర్

48.47% పోలింగ్.. 2023 కంటే 1% అధికం

కాంగ్రెస్ కార్యకర్తలు దొంగ ఓట్లు వేస్తున్నారంటూ పలుచోట్ల బీఆర్ఎస్ నిరసనలు.. లాఠీచార్జి

కౌశిక్ రెడ్డి, పెద్ది సుదర్శన్ రెడ్డి తదితరుల అరెస్టు

జూబ్లీహిల్స్ సీటు కాంగ్రెస్‌దే!

హస్తం పార్టీకి 6-8 శాతం ఓట్ల ఆధిక్యం

దాదాపు అన్ని ఎగ్జిట్ పోల్స్‌లో అదే తీర్పు

6.5 శాతం ఓట్లకే బీజేపీ పరిమితం!

పోల్ మేనేజ్‌మెంట్‌లో కాంగ్రెస్ సక్సెస్

పోలింగ్ సరళిపై ఎప్పటికప్పుడు సీఎం ఆరా

హైదరాబాద్ సిటీ, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): చెదురుమదురు ఘటనలు, స్వల్ప ఉద్రిక్తతలు మినహా జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ ఉప ఎన్నిక పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. ఉదయం 7 గంటలకు మొదలైన పోలింగ్ పలు ప్రాంతాల్లో రాత్రి 8.30 గంటల వరకు కొనసాగింది. సాయంత్రం 6 గంటల వరకు క్యూలో ఉన్నవారిని తర్వాత కూడా ఓటు వేసేందుకు అధికారులు అనుమతించారు. కడపటి సమాచారం అందే సమయానికి 48.47 శాతం పోలింగ్

మిగతా 13వ పేజీలో...

13

80% మందికి పంచినా.. కొన్నిచోట్ల 35 శాతమే ఓటింగ్

బస్తీలు ఓటేసినా.. మేడ దిగని మధ్యతరగతి

బిహార్ మళ్లీ ఎన్డీయేదే!


నితీశ్-మోదీ జోడీకే ప్రజల పట్టం

130కి పైగా సీట్లు ఖాయం

వెల్లడించిన 9 ఎగ్జిట్‌పోల్స్

ప్రతిపక్ష కూటమికి గరిష్ఠంగా 108!

పీకే ప్రభావం శూన్యమేనని అంచనాలు



ఓ పోలింగ్ బూత్‌లో బారులు తీరిన మహిళలు

న్యూఢిల్లీ, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): బిహార్ అధికార పీఠం మళ్లీ ఎన్డీయేదేనని ఎగ్జిట్‌పోల్స్ వెల్లడించాయి. మహాగఠ్‌బంధన్ (ఎంజీబీ)పై భారీ మెజారిటీతో అధికార కూటమి విజయం సాధిస్తుందని పేర్కొన్నాయి. ఇక తొలిసారి ఎన్నికల బరిలో నిలిచిన ప్రశాంత్ కిశోర్ పార్టీకి తీవ్ర నిరాశే మిగులుతుందని తేల్చాయి. బిహార్‌లో బీజేపీ, జేడీయూ

మిగతా 10వ పేజీలో...

ఓటెత్తిన బిహార్

రెండో దశలోనూ భారీగా 68% పోలింగ్

బిహార్ చరిత్రలోనే అత్యధికం 10

పెద్దఎత్తున పాల్గొన్న మహిళా ఓటర్లు

మొదటి విడతలో 65.09%

ఎల్లుండి కౌంటింగ్.. ఫలితాల ప్రకటన







ఢిల్లీ ఘటనలో అనుమానితుడి తండ్రిని జమ్మూ కశ్మీర్‌లో అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు; ఢిల్లీలో బాధితుల రోదనలు

ఆత్మాహుతి దాడా? అనూహ్య పేలుడా?

ఢిల్లీ బాంబుదాడిపై భిన్నాభిప్రాయాలు.. దొరికిపోతానన్న భయంతో బాంబు పేల్చాడంటున్న పోలీసులు

ఉద్దేశపూర్వకంగానే పేల్చి ఉండొచ్చని మరికొందరి వాదన.. కేసు దర్యాప్తు ఎన్ఐఏకు అప్పగింత

హర్యానాలోని ఫరీదాబాద్ కేంద్రంగా ఉగ్ర కుట్ర.. అల్ ఫలాహ్ యూనివర్సిటీలో ముగ్గురు వైద్యుల అరెస్టు

11 గంటలపాటు కారులోనే తిరిగిన ఉగ్రవాది.. పేలుడుకు వాడిన కారు దర్యాప్తులో కీలకం

న్యూఢిల్లీ, నవంబరు 11: ఢిల్లీలోని ఎర్రకోట వద్ద సోమవారం సాయంత్రం జరిగిన కారుబాంబు పేలుడు ఆత్మాహుతి దాడా? కాదా? అన్నదానిపై భిన్న వాదనలు వినిపిస్తున్నాయి. ఢిల్లీ పోలీసులు, ప్రభుత్వ వర్గాలు ఇది ఆత్మాహుతి దాడి కాదని చెబుతుండగా, మరికొందరు మాత్రం ఉగ్రవాది ఆత్మాహుతి దాడికే పాల్పడ్డాడని పేర్కొంటున్నారు. ఈ ఉగ్రకుట్ర మొత్తం హర్యానాలోని ఫరీదాబాద్ కేంద్రంగానే జరిగినట్లు పోలీసులు తెలిపారు. కారున నడిపిన ఉమర్ నబీతోపాటు మరో ఇద్దరు అందులో ఉన్నట్లు మొదట వార్తలు వచ్చినప్పటికీ.. ఉమర్ నబీ ఒక్కడే కారులో వెళ్లాడని పోలీసులు మంగళవారం ప్రకటించారు. ఈ కేసు దర్యాప్తును కేంద్ర ప్రభుత్వం మంగళవారం ఎన్ఐఏకు

మిగతా 2వ పేజీలో...

ఆ మహిళా డాక్టర్.. జైషే ఉగ్రవాద లీడర్!

అల్ ఫలాహ్ యూనివర్సిటీ రెసిడెంట్ డాక్టర్ షహీన్ వెనుక కీలక కోణం 2

భారత్‌లో జైషే మహమ్మద్ మహిళా విభాగం బాధ్యతలు ఆమెవే

మా అన్న నిరపరాధి

మొహియుద్దీన్ సోదరుడు ఒమర్ 2





అందెశ్రీ అంతిమయాత్రలో పాడె మోస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్; దుఃఖంతో విలపిస్తున్న అందెశ్రీ భార్యను ఓదారుస్తున్న సీఎం

సహజకవికి తుది వీడ్కోలు!

అధికార లాంఛనాలతో అందెశ్రీ అంత్యక్రియలు

స్వయంగా పాడె మోసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

హాజరైన శ్రీధర్‌బాబు, జూపల్లి, అడ్లూరి, మహేశ్‌గౌడ్

అందెశ్రీ గొప్పమానవతావాది.. ఆయనతో మాట్లాడితే అన్నతో మాట్లాడినట్లు అనిపించేది

పాఠ్యపుస్తకాల్లో జయజయహే తెలంగాణ గీతం

ఆయన కుటుంబసభ్యుల్లో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం

స్మృతివనంగా ఘట్‌కేసర్ జంక్షన్‌స్థలం: సీఎం రేవంత్

మేడ్చల్, మేడ్చల్ ఆంధ్రజ్యోతి బృందం, హైదరాబాద్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): కష్టాలు, కన్నీళ్ల మధ్య ఓ పశువుల కాపరిగా అతి సామాన్యుడి నుంచి తన జీవితానుభవాలే కవితా వస్తువుగా చేసుకొని ప్రజాకవిగా అనన్య సామాన్యుడిగా ఎదిగి.. జయజయహే తెలంగాణ, జననీ జయకేతనం అంటూ ప్రత్యేక రాష్ట్రానికి గీతాన్ని సృజించి.. తెలంగాణ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయిన చైతన్యసిరి అందెశ్రీ శాశ్వతంగా సెలవు తీసుకున్నారు. ఆప్తులైన కవులు, ఉద్యమకారులు, కళాకారుల అశ్రునయనాల మధ్య సహజకవి అందెశ్రీ అంత్యక్రియలు ముగిశాయి. మల్కాజ్‌గిరి జిల్లా ఘట్‌కేసర్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీసు పక్కన ఉన్న హెచ్ఎండీఏ స్థలంలో మంగళవారం పూర్తి అధికార లాంఛనాల మధ్య అందెశ్రీ

మిగతా 3వ పేజీలో...

భారత్‌తో వాణిజ్య ఒప్పందానికి చేరువయ్యాం



రష్యా నుంచి భారత్ చమురు కొనుగోళ్లు గణనీయంగా తగ్గించింది

ఈ నేపథ్యంలో మేం సుంకాలు తగ్గిస్తాం

అమెరికా అధ్యక్షుడు ట్రంప్

విదేశీ విద్యార్థులు అమెరికా వస్తే మంచిదే

రాకుంటే కొన్ని విద్యాసంస్థలకు వ్యాపారాలు ఉండవని వ్యాఖ్య

న్యూయార్క్, నవంబరు 11: భారత్‌తో వాణిజ్య ఒప్పందానికి చేరువ అయ్యామని, ఒప్పందాలపై ఉత్సాహంగా ఉన్నామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వ్యాఖ్యానించారు. అంతేకాదు, ఏదో ఒక దశలో భారత్‌పై విధించిన సుంకాలను కూడా తగ్గిస్తామని చెప్పారు. కాగా, భారత్-అమెరికా ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందాలపై గడిచిన రెండు వారాల్లో ట్రంప్ ఈ విధంగా వ్యాఖ్యానించడం ఇది రెండోసారి. అయితే, ఒప్పందాలపై ట్రంప్ అతిశయోక్తి ప్రదర్శిస్తున్నారా?.. లేక నిజంగా ఇరు దేశాల మధ్య చర్చల్లో బలమైన పురోగతి కనిపించిందా?.. అనే విషయంపై స్పష్టత రావాల్సి ఉంది. "గతంలో ఉన్న ఒప్పందాలకు పూర్తి భిన్నంగా భారత్‌తో మేం ఒప్పందాలు చేసుకుంటున్నాం. నన్ను వారు

మిగతా 10వ పేజీలో...

వరద బాధితులకు

తక్షణ సాయం రూ.12.99 కోట్లు 12

విడుదల చేస్తూ సర్కారు ఉత్తర్వులు

రాష్ట్రవ్యాప్తంగా 16 జిల్లాల పరిధిలో 8662 ఇళ్లు దెబ్బతిన్నాయని నివేదికలు



ఏజెన్సీ గ్రామాల్లో గజ..గజ

కుమరం భీం జిల్లా లింగాపూర్‌లో.. 8.7 డిగ్రీల అత్యల్ప ఉష్ణోగ్రత నమోదు

అన్ని జిల్లాలకు యెల్లో అలెర్ట్ 3

నిఠారీ వరుస హత్యల కేసు..

సురేందర్ కోలీ నిర్దోషి

వేరే కేసులు లేకపోతే విడుదల చేయండి

20 ఏళ్ల నాటి కేసులో సుప్రీంకోర్టు తీర్పు

నోయిడాలో 8 మంది పిల్లల పుర్రెలు బయటపడటంతో అప్పట్లో సంచలనం

వ్యాపారవేత్త పంధేర్, అతని ఇంట్లో పనిమనిషి కోలీ అరెస్టు

ఇప్పటికే నిర్దోషిగా పంధేర్ విడుదల

కోలీకి విధించిన జరిమానాను కూడా రద్దుచేసిన ధర్మాసనం 14

ఛత్తీస్‌గఢ్‌లో ఎన్‌కౌంటర్

ఆరుగురు మావోయిస్టుల మృతి.. వారిలో ముగ్గురు మహిళలు

మృతుల్లో ఇంద్రావతి నేషనల్ పార్కు ఏరియా కమిటీ ఇన్‌చార్జి బుచ్చన్న

తప్పించుకున్న పాపారావు? 14

ఆయన భార్య ఊర్మిళ మృతి

గాయాలతో పట్టుబడిన కొందరు నక్సల్స్?

లొంగిపోయిన వారిచ్చిన వివరాలతోనే..

అక్రమాస్తుల కేసులో..

21న కోర్టుకు జగన్

ప్రత్యేక న్యాయస్థానంలో వెల్లడి

హాజరు మినహాయింపును తీవ్రంగా వ్యతిరేకించిన సీబీఐ

కోర్టుకు రాకుండా తప్పించుకు తిరుగుతున్నారని కౌంటర్

మెమో ఉపసంహరించుకున్న ఏపీ మాజీ సీఎం జగన్

ఆరేళ్ల తర్వాత కోర్టు మెట్లు ఎక్కనున్న వైనం 14

12 ఏళ్లుగా బెయిల్‌పైనే..

షార్ట్ సర్క్యూట్‌తో ప్రైవేటు బస్సు దగ్ధం

హైదరాబాద్-విజయవాడ హైవేపై ఘటన



రహదారిపై మంటల్లో కాలిపోతున్న ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు

నల్లగొండ జిల్లా చిట్యాల మండలం వెలిమినేడు శివారులో ప్రమాదం

డ్రైవర్ అప్రమత్తతతో తప్పిన భారీ ప్రాణనష్టం 14

చూస్తుండగానే బస్సు దగ్ధం..

గగుర్పాటుకు గురైన ప్రయాణికులు

భావోద్వేగంతో పలువురు కన్నీటి పర్యంతం

చౌటుప్పల్ నుంచి వచ్చి మంటలార్పిన ఫైరింజన్లు



పీయూష్ గోయల్ నుంచి అవార్డు తీసుకుంటున్న రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సంజయ్ కుమార్

సులభతర వాణిజ్య సంస్కరణలలో

రాష్ట్రానికి అగ్రస్థానం

బీఆర్ఏపీ-2024లో టాప్ అచీవర్‌గా అవార్డు

న్యూఢిల్లీ, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): తెలంగాణకు అరుదైన గౌరవం దక్కింది. సులభతర వాణిజ్య విధానం(ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్)కు సంబంధించిన సంస్కరణల అమలులో దేశంలోనే అగ్రగామిగా నిలిచింది. బిజినెస్ రిఫార్మ్స్ యాక్షన్ ప్లాన్ (బీఆర్ఏపీ)-2024లో టాప్ అచీవర్‌గా ఘనత సాధించింది. ఇందుకు సంబంధించిన

మిగతా 12వ పేజీలో...

3

జల సంరక్షణలోనూ దేశంలోనే నం.1

ఏ 23 యాప్ తెలంగాణలో లేదు!

చట్టపరంగానే ప్రచారం చేశా

సిట్‌కు తెలిపిన సినీ హీరో విజయ్ దేవరకొండ

బెట్టింగ్ యాప్‌ల కేసులో గంటన్నర పాటు విచారణ

బిగ్‌బాస్ ఫేం సిరి హనుమంతునూ ప్రశ్నించిన అధికారులు.. గోవిందా 365 యాప్‌కు సిరి ప్రచారం



హైదరాబాద్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): బెట్టింగ్ యాప్‌ల కేసులో సినీ హీరో విజయ్ దేవరకొండ సిట్ విచారణకు హాజరయ్యారు. సిట్ అధికారుల బృందం విజయ్‌తో పాటు బిగ్‌బాస్ ఫేం సిరి హనుమంతును కూడా విచారించారు. పంజాగుట్ట, మియాపూర్‌లో నమోదైన రెండు కేసుల్లో సిట్ అధికారులు విచారణ జరుపుతున్నారు. ఇటీవలే వివిధ రాష్ట్రాల్లో సోదాలు చేసి, ఆరు బెట్టింగ్ యాప్‌లకు సంబంధించి 8 మందిని అరెస్టు చేశారు. తాజాగా విజయ్ దేవరకొండకు నోటీసులు జారీ చేయడంతో మంగళవారం విచారణకు హాజరయ్యారు. దాదాపు

మిగతా 3వ పేజీలో...

వారిని వదిలేదే లేదు!



- ఢిల్లీ పేలుడు ఘటన బాధ్యుల్ని న్యాయస్థానం ముందు నిలబెడతాం
- బాధిత కుటుంబాలకు యావత్ దేశం అండగా ఉంది: మోదీ

థింపు/ న్యూఢిల్లీ, నవంబరు 11: దేశ రాజధాని ఢిల్లీలో కారు పేలుడు ఘటనకు కారణమైన వారిని వదిలే ప్రసక్తే లేదని, బాధ్యులందరినీ న్యాయస్థానం ముందు నిలబెడతామని ప్రధాని మోదీ స్పష్టం చేశారు. ఈ కేసుపై విచారణ సంస్థలు ఆమూలాగ్రం దర్యాప్తు జరుపుతున్నాయన్నారు. భూటాన్ మాజీ రాజు జిగ్మే సింగ్యే వాంగ్‌చుక్ 70వ జన్మదినం సందర్భంగా మంగళవారం ఆ దేశ రాజధాని థింపులో జరిగిన ఓ కార్యక్రమానికి మోదీ అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ.. ఢిల్లీ ఘటన నేపథ్యంలో భారమైన హృదయంతో తాను భూటాన్‌కు వచ్చానన్నారు. సోమవారం రాత్రంతా దర్యాప్తు సంస్థలతో మాట్లాడుతూనే ఉన్నానని తెలిపారు. పేలుడు ఘటన ప్రతి ఒక్కరినీ కలిచివేసిందని, బాధిత కుటుంబాలకు యావత్ దేశం అండగా ఉందని ప్రధాని ఉద్ఘాటించారు. భారత్-భూటాన్ స్నేహ సంబంధాలను ప్రస్తావిస్తూ.. శతాబ్దాలుగా ఇరుదేశాలు గాఢమైన ఆధ్యాత్మిక, సాంస్కృతిక బంధాన్ని కలిగి ఉన్నాయని, అందువల్లే ముఖ్యమైన ఈ కార్యక్రమంలో పాల్గొనటానికి తాను భారత్ నుంచి వచ్చానని మోదీ వెల్లడించారు. మాజీ రాజు జిగ్మే సింగ్యే హయాంలో భూటాన్ రాజ్యాంగబద్ధ ప్రజాస్వామ్య రాచరికంగా, ఆధునిక రాజ్యంగా ఎదిగిన పరిణామాన్ని మోదీ ప్రస్తావించారు. కాగా, ఢిల్లీ పేలుడు ఘటనలో మరణించిన వారికి సంతాపంగా భూటాన్ రాజు జిగ్మే ఖేసర్ నాంగ్యేల్ వాంగ్‌చుక్.. 'చాంగ్లిమెథాంగ్ స్టేడియం'లో వేలాదిమందితో ప్రార్థనా సమావేశం నిర్వహించారు. ఢిల్లీ ఘటనతో సంబంధం ఉన్న ప్రతీ ఒక్క నేరస్థుడ్నీ వేటాడుతామని, ఈ మేరకు దర్యాప్తు సంస్థలకు ఆదేశాలు జారీ చేశానని కేంద్ర హోంమంత్రి అమిత్ షా వెల్లడించారు. సీనియర్ అధికారులతో మంగళవారం రెండుసార్లు సమీక్ష సమావేశాలు జరిపానని తెలిపారు.

అమిత్ షా రాజీనామా చేయాలి: కాంగ్రెస్

న్యూఢిల్లీ, నవంబరు 11: ఢిల్లీలో సోమవారం సంభవించిన పేలుడు ఘటన పట్ల కేంద్రంలోని మోదీ సర్కారు వ్యవహరిస్తున్న తీరును ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా తప్పుబట్టింది. పేలుడు జరిగి 18 గంటలు దాటినా.. ఘటనపై ప్రభుత్వం ఇప్పటికీ స్పష్టత ఇవ్వకపోవడమేంటని కాంగ్రెస్ మీడియా ఇన్‌చార్జి పవన్ ఖేరా ప్రశ్నించారు. దేశ రాజధానిలో చోటుచేసుకున్న ఈ పేలుడుతో ప్రజల్లో భయాందోళనలు నెలకొన్నాయని, దీనిపై హోం మంత్రి, హోంశాఖ కార్యదర్శి గానీ, ఢిల్లీ పోలీస్ కమిషనర్ గానీ తక్షణమే స్పష్టత ఇవ్వాలని అన్నారు. భద్రతా కారణాల దృష్ట్యా పూర్తి వివరాలు వెల్లడించే అవకాశం లేకపోయినా.. భిన్న కథనాలు రాకుండా చూడాల్సిన అవసరం ఉందన్నారు. కాగా, ఢిల్లీ పేలుడు ఘటనకు నైతిక బాధ్యత వహించి కేంద్ర హోంమంత్రి అమిత్ షా తన పదవికి రాజీనామా చేయాలని ఉత్తరప్రదేశ్ రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు అజయ్‌రాయ్ డిమాండ్ చేశారు. ఇది పూర్తిగా ప్రభుత్వ వైఫల్యమేనని, పుల్వామా, పహల్గాం ఘటనల తరువాత కూడా ఉగ్రవాద హెచ్చరికలను ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు. స్వతంత్ర భారతదేశంలో అమిత్ షా లాంటి అసమర్థ హోంమంత్రి ఇప్పటివరకు ఎవరూ లేరని కర్ణాటక మంత్రి ప్రియాంక్ ఖర్గే విమర్శించారు. భారత్‌కు విద్వేషాన్ని ప్రచారం చేసే మంత్రి కాకుండా సమర్థుడైన హోంమంత్రి కావాలని తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ మహువా మొయిత్రా అన్నారు. ఈ విమర్శలను అధికార బీజేపీ తప్పుబట్టింది. ప్రతిపక్షాలు విషాదాన్ని కూడా రాజకీయం చేయాలని చూస్తున్నాయని ఆ పార్టీ ఐటీ సెల్ ఇన్‌చార్జి అమిత్ మాలవీయ అన్నారు.

పేలుళ్లపై కేంద్రం వివరణ ఇవ్వాలి: సిద్దరామయ్య

బెంగళూరు, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): ఢిల్లీలో బాంబు పేలుళ్లపై కేంద్రప్రభుత్వం దర్యాప్తు జరిపి, వివరణ ఇవ్వాలని కర్ణాటక సీఎం సిద్దరామయ్య అన్నారు. మైసూరులో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ...ఎన్నికల సందర్భంలోనే పేలుళ్లు ఎందుకు జరుగుతాయనే దానికి కేంద్రం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ సంఘటనతో బిహార్ ఎన్నికల్లో బీజేపీకి లబ్ధి చేకూరే అవకాశం ఉందని అభిప్రాయపడ్డారు. కాగా, ఈనెల 15న తాను ఢిల్లీకి వెళతానని, కాంగ్రెస్ అగ్రనేత కపిల్ సిబల్ పుస్తకావిష్కరణ కార్యక్రమంలో పాల్గొంటానని సిద్దరామయ్య తెలిపారు. రాహుల్‌గాంధీని కలిసేందుకు సమయం కోరానని, అవకాశం లభిస్తే అధిష్ఠానంతో భేటీ అవుతానని, లేదంటే అదేరోజు వెనుదిరిగి వస్తానని చెప్పారు.

ఒక్కడి మృతితో ఆ ఇంట్లోని 8 మంది వీధిన..

- గుర్తుపట్టలేని స్థితిలో మాంసపు ముద్దలుగా మృతదేహాలు
- ఢిల్లీ పేలుడు విషాదంతో సర్వం కోల్పోయిన కుటుంబాలు

న్యూఢిల్లీ, నవంబరు 11: ఢిల్లీలోని ఎర్రకోటకు దగ్గర్లో రద్దీగా మెట్రో స్టేషన్ వద్ద సోమవారం రాత్రి సంభవించిన భారీ పేలుడు కొన్ని కుటుంబాల్లో పెను విషాదం నింపింది. ఘటనాస్థలికి 600 మీటర్ల దూరంలోని ఓ మెడికల్ షాపు యజమాని అమర్ కటారియా పేలుడు మూడు నిమిషాల ముందే షాపు నుంచి ఇంటికి బయలుదేరారు. పేలుడు తర్వాత అతడి ఆచూకీ తెలియలేదు. నాలుగేళ్ల క్రితమే అతడికి పెళ్లయింది. భార్య, మూడేళ్ల కుమారుడు ఉన్నారు. ఆస్పత్రికి మార్చురీకి వెళ్లిన అమర్ తండ్రి.. ఏమాత్రం గుర్తుపట్టలేని స్థితిలో ఉన్న మృతదేహాలను చూస్తూ భుజానికి పచ్చబొట్లతో ఉన్న ఓ మృతదేహం వద్ద ఆగి బిగ్గరగా రోదించాడు. మృతుడి భుజంపై 'మామ్ మై ఫస్ట్ లవ్', డ్యాడ్ ఈజ్ మై స్ట్రెంత్, అండ్ క్రితి' అని రాసి ఉండటంతో అది తన కుమారుడిదేనని గుర్తించాడు. ఇక యూపీలోని షామ్లీ జిల్లాకు చెందిన 22 ఏళ్ల నౌమన్ అన్సారీ.. తన ఫ్యాన్సీ షాపులో సరుకులు కొనేందుకు వచ్చి దుర్మరణంపాలయ్యాడు. నౌమన్ ఒక్కడి సంపాదనతోనే అతడి కుటుంబం నడుస్తోంది. నౌమన్‌కు తోడుగా వచ్చిన అతడి బంధువు అమన్.. గాయాలతో బయటపడ్డాడు. ఢిల్లీ రోడ్డు రవాణా సంస్థలో కండక్టర్‌గా పనిచేస్తున్న యూపీలోని అమ్రోహా జిల్లాకు చెందిన 34 ఏళ్ల అశోక్ కుమార్, టాక్సీ డ్రైవర్ అయిన 22 ఏళ్ల పంకజ్ సాహిని కూడా పేలుడు ఘటనలో మృతిచెందారు. బంధువును కలిసేందుకు అశోక్ బైక్‌మీద మెట్రోస్టేషన్‌కు వెళ్లాడు అశోక్. మృతితో అతడి తల్లిదండ్రులు, భార్య, నలుగురు పిల్లలు, తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న సోదరుడు, సోదరి మొత్తంగా ఎనిమిది దిక్కులేనివారయ్యారు. కుటుంబాన్ని పోషించుకోవడానికి పంకజ్ మూడేళ్లుగా టాక్సీ తోలుతున్నాడని, పేలుడు తీవ్రతకు అతడి వెనుకవైపు తల ఛిద్రమైందని.. అతడి కారు ధ్వంసమైపోయిందని మృతుడి తండ్రి రోదిస్తూ చెప్పాడు. పేలుడు తర్వాత ఆ దగ్గర్లోని ప్రింటింగ్ ప్రెస్‌లో పని చేసే దినేశ్ కుమార్‌కు అతడి తండ్రి, సోదరులు ఫోన్ చేసినా కాల్ వెళ్లలేదు. కొద్దిసేపటికి దినేశ్ ప్రాణాలతో లేడని వారికి తెలిసింది. భర్త మృతితో తాను సర్వం కల్పోయానని.. తన ముగ్గురు పిల్లలకు దిక్కెవరంటూ దినేశ్ భార్య రీనా కంటికీమంటికి ధారా రోదించింది. పేలుడులో మృతుల సంఖ్య 12కు పెరిగిందని.. 20 మందికిపైగా గాయపడ్డారని ఢిల్లీ పోలీసులు చెప్పారు. కొన్ని మృతదేహాలను గుర్తించాల్సి ఉంది.

'శబరిమల బంగారం కేసు'లో మరో అరెస్టు

- సిట్ అదుపులోకి టీడీబీ మాజీ అధ్యక్షుడు వాసు

తిరువనంతపురం, నవంబరు 11: శబరిమల అయ్యప్ప దేవాలయంలోని బంగారం అదృశ్యమైన కేసులో దర్యాప్తు ముమ్మరంగా కొనసాగుతోంది. దీనిలో భాగంగా ట్రావెన్‌కోర్ దేవస్థానం బోర్డు(టీడీబీ) మాజీ అధ్యక్షుడు ఎన్. వాసును మంగళవారం అరెస్టు చేసినట్లు సిట్ వర్గాలు వెల్లడించాయి. టీడీబీ అధ్యక్షుడిగా నియమితుడయ్యే ముందు రెండుసార్లు బోర్డు కమిషనర్‌గా కూడా పనిచేసిన ఆయన్ను విచారణ అనంతరం అదుపులోకి తీసుకున్నట్లు తెలిపాయి. కేరళ ప్రభుత్వంలోని అగ్రనేతలకు అత్యంత సన్నిహితుడిగా పేరొందిన వాసును అరెస్టు చేయడం సంచలనాత్మకంగా మారింది. ఈ కేసులో సిట్ దర్యాప్తును కేరళ హైకోర్టు పర్యవేక్షిస్తోంది. శబరిమలలో గర్భాలయం తలుపులకు ఉన్న బంగారం మాయమైన కేసులో వాసు నిందితుడు. ఈ కేసులో ప్రధాన నిందితుడు ఉన్నికృష్ణన్ పొట్టితో పాటు ఇద్దరు సీనియర్ అధికారులు, ఒక రిటైర్డ్ అధికారిని సిట్ ఇప్పటికే అరెస్టు చేసింది.

ఆత్మాహుతి దాడా? అనూహ్య పేలుడా?

(మొదటి పేజీ తరువాయి)

అప్పగించింది. యూఏపీఏ చట్టం కింద మంగళవారం ఢిల్లీ పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. బాంబుపేలుడులో సోమవారం ఘటనా స్థలంలోనే 9 మంది మరణించగా, మంగళవారం ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న క్షతగాత్రుల్లో మరో ముగ్గురు మరణించటంతో మృతుల సంఖ్య 12కు చేరింది. మృతుల్లో ఏడుగురిని గుర్తించినట్లు పోలీసులు తెలిపారు. మృతుల కుటుంబాలకు ఢిల్లీ సీఎం రేఖాగుప్త మంగళవారం రూ.10 లక్షల చొప్పున పరిహారం ప్రకటించారు. తీవ్రంగా గాయపడ్డవారికి రూ.2 లక్షల చొప్పున ఆర్థిక సహాయం చేస్తామని తెలిపారు.

అధికారుల గంటకో మాట..

కారు బాంబు పేలినప్పటి నుంచి దాడి తీరుపై భిన్న వాదనలు వినిపిస్తున్నాయి. మొదట సిలిండర్ పేలుడు అని భావించిన పోలీసులు.. తర్వాత ఉగ్ర దాడి అని ప్రకటించారు. మంగళవారం ఆత్మాహుతి దాడి అని మొదట అనధికారికంగా మీడియాకు తెలిపిన ఢిల్లీ పోలీస్ వర్గాలు.. సాయంత్రానికి ఉగ్రవాదులు భయంతోనే బాంబును పొరపాటున పేల్చి ఉంటారని తెలిపాయి. తన సహచర ఉగ్రవాదులంతా పోలీసులకు పట్టుబడటంతో ఏం చేయాలో పాలుపోని స్థితిలో ఫరీదాబాద్ నుంచి పారిపోయి తిరుగుతున్న ఉమర్ నబీ.. బాంబును పొరపాటున పేల్చేసి ఉంటాడని పేర్కొన్నాయి. పేలిన బాంబు కూడా పూర్తిగా తయారైన ఇంప్రూవైజ్డ్ ఎక్స్‌ప్లోజివ్ డివైజ్ (ఐఈడీ) కాదని తెలిపాయి. ఆత్మాహుతి దాడి జరిగి ఉంటే ఆ ప్రదేశంలో గుంత పడి ఉండేదని, కారు లక్ష్యంపైకే నేరుగా దూసుకుపోయి ఉండేదని అభిప్రాయపడ్డాయి. అయితే, ఆత్మాహుతి ప్రతిసారి ఒకేలా జరగాలని ఏమీ లేదని మరికొందరు వాదిస్తున్నారు.




దర్యాప్తులో కీలకంగా ఐ20 కారు..

బాంబుపేలుడుపై దర్యాప్తులో దాడికి ఉపయోగించిన ఐ20 కారు (హెచ్ఆర్26సీఈ7674) కీలకంగా మారింది. ఈ కారు సోమవారం ఉదయం ఫరీదాబాద్ నుంచే ఢిల్లీకి వచ్చినట్లు గుర్తించారు. ఈ కారు సోమవారం ఉదయం 7.30 గంటలకు ఫరీదాబాద్‌లోని ఏషియన్ హాస్పిటల్ ముందు నుంచి వెళ్తున్న దృశ్యాలు సీసీటీవీలో రికార్డు అయ్యాయి. ఉదయం 8.30 గంటల సమయంలో ఈ కారు బదర్పూర్ టోల్‌ప్లాజాను దాటి ఢిల్లీలోకి ప్రవేశించింది. ఆ తర్వాత ఢిల్లీ నగరంలో చాలాచోట్ల తిరిగిన కారు.. మధ్యాహ్నం 3.19 గంటల సమయంలో ఎర్రకోట సమీపంలోని పార్కింగ్ కాంప్లెక్స్ వద్దకు వచ్చి ఆగింది. అక్కడే దాదాపు మూడు గంటలపాటు ఉన్న తర్వాత సాయంత్రం 6.22 గంటలకు ఎర్రకోట వైపు వెళ్లిపోయింది. ఆ తర్వాత 24 నిమిషాలకు 6.52 గంటల సమయంలో పేలుడు సంభవించింది. ఈ కారు అక్టోబర్ 29వ తేదీన ఒక పెట్రోల్ బంక్ వద్ద ఉన్న పొల్యూషన్ చెక్ కేంద్రం వద్ద ఆగిన వీడియో కూడా బయటకు వచ్చింది. అదే రోజు ఈ కారును ఉమర్ నబీ కొనుగోలు చేయటం గమనార్హం. కారులో నుంచి ఉమర్ నబీతోపాటు మరో ఇద్దరు వ్యక్తులు బయటకు దిగి అక్కడ ఓ వ్యక్తితో కొద్దిసేపు మాట్లాడి పొల్యూషన్ చెక్ చేయించుకొని, తిరిగి కారులో వెళ్లిపోయారు. కాగా, ఫరీదాబాద్ నుంచి బయలుదేరినప్పటి నుంచి బాంబు పేలేవరకు దాదాపు 11 గంటలపాటు ఉమర్, మరో ఇద్దరు కారులో నుంచి బయటకు దిగలేదని పోలీసులు తెలిపారు. మరోవైపు ఈ కారు మొదటి యజమాని సల్మాన్‌కు ఇంటిని అద్దెకు ఇచ్చిన దినేశ్ అనే వ్యక్తిని కూడా పోలీసులు అదుపులోకి తీసుకొన్నారు.

రోగినీ చంపేశాడు

కారు బాంబు పేలుడుకు కారణమైన ఉమర్ నబీ గతంలో జమ్ముకశ్మీర్‌లోని అనంత్‌నాగ్ ఆసుపత్రిలో రెసిడెంట్ డాక్టర్‌గా ఉన్నప్పుడు ఓ రోగి మరణానికి కారణమయ్యాడని తాజాగా బయటపడింది. 2023లో నబీకి పై అధికారిగా ఉన్న రిటైర్డ్ డాక్టర్ జిలానీ రాంషో షాకింగ్ విషయాన్ని వెల్లడించారు. ఆ తర్వాత అతడిని ప్రభుత్వం విధుల నుంచి తొలగించినట్లు వెల్లడించారు. కాగా, ఉమర్ కుటుంబ సభ్యుల డీఎన్ఏతో కారుబాంబు పేలుడు ప్రదేశంలో సేకరించిన పలు శరీర భాగాల డీఎన్ఏ సరిపోలినట్లు పోలీసులు తెలిపారు. బాంబు దాడికి ముందు అతడు మూరు రోజుల ముందే అజ్ఞాతంలోకి వెళ్లినట్లు వివరించారు.

లోకం తీరు



అల్ ఫలాహ్ వర్సిటీ కేంద్రంగా కుట్ర

ఢిల్లీకి 45 కిలోమీటర్ల దూరంలో హర్యానాలోని ఫరీదాబాద్ సమీపంలో ఉన్న అల్ ఫలాహ్ యూనివర్సిటీని ఉగ్రవాదులు తమ కుట్రకు కేంద్రంగా మలుచుకున్నట్లు దర్యాప్తులో తేలింది. దీంతో ఢిల్లీ క్రైం బ్రాంచ్ పోలీసులు మంగళవారం యూనివర్సిటీలో విచారణ జరిపారు. అక్కడ పని చేస్తున్న ముగ్గురు వైద్యులను అదుపులోకి తీసుకున్నారు. ముజమ్మిల్ యూనివర్సిటీ క్యాంపస్‌లోనే నివాసం ఉంటూ.. ఫరీదాబాద్‌లో వేర్వేరు చోట్ల రెండు ఇళ్లను అద్దెకు తీసుకొని 2,900 కిలోల పేలుడు పదార్థాలు, ఆయుధాలు నిల్వచేయగా.. పోలీసులు వాటిని స్వాధీనం చేసుకున్న విషయం తెలిసిందే.

అమ్మోనియం నైట్రేట్!

ఢిల్లీలో కారుపేలుడుకు వాడిన రసాయనం

- మొక్కలకు ఆక్సిజన్ అందించేందుకు వాడే ఎరువు
- పెట్రోలియం పదార్థాలతో కలిస్తే ప్రాణాంతకం

ఎర్రకోట వద్ద సోమవారం జరిగిన కారు పేలుడుకు వాడింది అమ్మోనియం నైట్రేట్ అని అధికారులు భావిస్తున్నట్టు సమాచారం. ఈ పేలుడుకు కొన్ని గంటల ముందు హరియాణాలో జమ్ముకశ్మీర్ పోలీసులు 350 కిలోల అమ్మోనియం నైట్రేట్ సహా 2900 కిలోల బాంబు తయారీ పదార్థాలను పట్టుకోవడం గమనార్హం. ఈ నేపథ్యంలోనే ఎర్రకోట వద్ద పేలుడుకూ దాన్నే వాడి ఉంటారని అనుమానిస్తున్నారు. ఆర్డీఎక్స్‌కి దీనికి తేడా ఏమిటంటే.. ఆర్డీఎక్స్ అత్యంత శక్తిమంతమైన మిలటరీ గ్రేడ్ పేలుడు పదార్థం. దాని లభ్యత చాలా కష్టం. సైన్యానికి, లైసెన్స్ ఉన్న సంస్థలు, ప్రభుత్వం అనుమతించిన పరిశ్రమలకు మాత్రమే లభిస్తుంది. అదే అమ్మోనియం నైట్రేట్ అయితే.. అది ఒక సాధారణ కెమికల్ సాల్ట్. సహజంగా దానంతట అది ఒక పేలుడు పదార్థం కాదు. ఇది ఒక ఆక్సిడైజర్. అందుకే రైతులు మొక్కలకు ప్రాణవాయువు అందించడానికి దాన్ని ఎరువుగా వాడుతారు. ఆక్సిడైజర్ కాబట్టి.. ఇది కాలిపోవడానికి అవసరమైన ఆక్సిజన్‌ను కూడా అందిస్తుంది. ఢిల్లీలో పేలుడుకు దీన్ని అందుకే వాడుకున్నారు. పేలుడు ప్రారంభం కావడానికి ఫ్యూయల్ ఆయిల్‌ని (డీజిల్/పెట్రోల్/కిరోసిన్.. ఏదైనా కావొచ్చు) వాడుతారు. ఆ పేలుడు తీవ్రతను పెంచడానికి ఈ అమ్మోనియం నైట్రేట్ ఉపయోగపడిందన్నమాట. అయితే.. అమ్మోనియం నైట్రేట్ కూడా అంత సులువుగా ఎవరికి పడితే వారికి దొరకదు. దాని తయారీ, నిల్వ, వినియోగం అన్నిటికీ 'పెట్రోలియం అండ్ ఎక్స్‌ప్లోజివ్స్ సేఫ్టీ ఆర్గనైజేషన్' నుంచి అనుమతులు కావాలి.


బాంబు పేలుడులో చనిపోయిన నౌమన్ అన్సారీ కుటుంబసభ్యులు

తీవ్రతలో తేడాలు..

ఆర్డీఎక్స్‌కు, దీనికి ఉన్న మరొక ప్రధానమైన తేడా.. పేలుడు తీవ్రత. ఆర్డీఎక్స్ డిటొనేషన్ వేగం సెకనుకు 8700 మీటర్లు. అంటే.. పేలినప్పుడు షాక్ వేవ్ చాలా వేగంగా వ్యాపిస్తుంది. దాని రిలెటివ్ ఎఫెక్టివ్‌నెస్ (ఆర్ఈ) ఫ్యాక్టర్ దాదాపుగా 1.5 నుంచి 1.6 దాకా ఉంటుంది. అంటే ఒక కిలో ఆర్డీఎక్స్ పేలుడు తీవ్రత 1.5 కిలో టీఎన్‌టీ బలానికి సమానం. ఢిల్లీలో కారు పేలుడుకు ఉపయోగించిన ఏఎన్ఎఫ్‌వో (అమ్మోనియం నైట్రేట్+ఫ్యూయెల్ ఆయిల్) ఆర్ఈ ఫ్యాక్టర్ 0.75 మాత్రమే. ఆర్డీఎక్స్‌తో పోలిస్తే.. దీని పేలుడు తీవ్రత అందులో సగమే. అందుకే పేలుడుకు పెద్ద ఎత్తున వినియోగిస్తారు. ఉదాహరణకు.. 1995లో టిమోతీ మెక్వీ అనే అమెరికన్ మాజీ సైనికుడు అమెరికాలోని ఒక్లహోమా నగరంలో ఒక ప్రభుత్వ కార్యాలయం ముందు 2000 కిలోల ఏఎన్ఎఫ్‌వో బాంబును పెద్ద ట్రక్కులో పెట్టి పేల్చేశాడు. ఆ పేలుడు ధాటికి 168 మంది మృతి చెందారు. అమెరికా చరిత్రలో అప్పటికి అదే అతిపెద్ద ఉగ్రదాడి. ఐదేళ్ల క్రితం లెబనాన్ రాజధాని బీరుట్‌లో పెద్ద పేలుడు జరిగి 218 మంది మరణించారు గుర్తుందా? అప్పుడు అంతమంది చనిపోవడానికి ప్రధాన కారణం అమ్మోనియం నైట్రేటే. అమ్మోనియం నైట్రేట్ ఉన్న గిడ్డంగిలో అగ్ని ప్రమాదంతో భారీ పేలుళ్లు సంభవించాయి. - సెంట్రల్ డెస్క్

ఆ మహిళా డాక్టర్.. జైషే ఉగ్రవాద లీడర్!

అల్ ఫలాహ్ ప్రైవేటు యూనివర్సిటీ రెసిడెంట్ వైద్యురాలు షహీన్ వెనుక కీలక కోణం

- భారత్‌లో జైషే మహమ్మద్ మహిళా విభాగం బాధ్యతలు ఆమెవే..
- ఆయుధాలు దాచేందుకు ఆమె కారునే వినియోగించిన ఉగ్రవాది ముజమ్మిల్

న్యూఢిల్లీ, నవంబరు 11: ఫరీదాబాద్ ఉగ్రకుట్రలో అరెస్టయిన మహిళా వైద్యురాలు షహీన్ షాహీద్‌కు పాకిస్థాన్ ఉగ్రవాద సంస్థ జైషే మహమ్మద్‌తో సంబంధాలు ఉన్నట్టుగా బయటపడింది. జైషే మహమ్మద్ మహిళా విభాగం జమాతుల్ మొమినాత్ భారత విభాగానికి షహీన్ నేతృత్వం వహిస్తున్నట్టు వెల్లడైంది. ఆమెను అరెస్టు చేసిన అనంతరం అధికారులు చేపట్టిన దర్యాప్తులో కీలక అంశాలు బయటపడినట్టు తెలిసింది. ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా పాకిస్థాన్‌లోని జైషే మహమ్మద్ ప్రధాన కార్యాలయాన్ని భారత వాయుసేన ధ్వంసం చేసిన విషయం తెలిసిందే. ఆ దాడుల్లో కాందహార్ విమానం హైజాక్ సూత్రధారి యూసుఫ్ అజార్ సహా జైషే మహమ్మద్ అగ్ర నాయకత్వం తుడిచిపెట్టుకుపోయింది. ఈ క్రమంలోనే యూసుఫ్ అజార్ భార్య, జైషే వ్యవస్థాపకుడు మసూద్ అజార్ సోదరి అయిన సాదియా అజార్ నేతృత్వంలో 'జమాతుల్ మొమినాత్' పేరిట మహిళా విభాగాన్ని జైషే మహమ్మద్ ప్రారంభించింది. ఈ క్రమంలోనే దాని భారత విభాగం బాధ్యతలను వైద్యురాలు షహీన్‌కు అప్పగించినట్టు తెలిసింది.

ప్రైవేటు యూనివర్సిటీలో వైద్యురాలిగా..

ఉత్తరప్రదేశ్‌లోని లక్నోకు చెందిన షహీన్ హరియాణాలోని ఫరీదాబాద్‌లో ఉన్న అల్ ఫలాహ్ ప్రైవేటు యూనివర్సిటీలో వైద్యురాలిగా పనిచేస్తున్నారు. జమ్మూకశ్మీర్‌లోని పుల్వామాకు చెందిన ముజమ్మిల్ కూడా వైద్యుడిగా పనిచేస్తున్నారు. శ్రీనగర్‌లో జైషే మహమ్మద్ ఉగ్రవాద సంస్థకు మద్దతుగా పోస్టర్లు వెలిసిన కేసులో ముజమ్మిల్‌ను పోలీసులు అరెస్టు చేశారు. ఈ క్రమంలోనే షహీన్‌కు ఉగ్రవాద లింకులు ఉన్నాయని, ఆయుధాలను దాచిపెట్టేందుకు ఆమె కారును వినియోగిస్తున్నారని గుర్తించారు. షహీన్‌ను అరెస్టు చేసి, ఆమె మారుతి స్విఫ్ట్ కారులో ఒక అసాల్ట్ రైఫిల్, పిస్టల్‌ను స్వాధీనం చేసుకున్నారు. విచారణ సందర్భంగా షహీన్‌కు 'జమాతుల్ మొమినాత్' భారత విభాగంలో షహీన్ కీలకంగా పనిచేస్తున్నారని, మహిళల రిక్రూట్‌మెంట్ చేపట్టారని పోలీసులు గుర్తించారు. ముఖ్యంగా బాగా చదువుకున్న, వివిధ వృత్తుల్లో ఉన్న వారిని ఆకర్షించేందుకు ప్రయత్నిస్తున్నట్టు తేల్చారు. కాగా, షహీన్ ప్రవర్తన చిత్రంగా ఉండేదని, ఎవరితోనూ పెద్దగా మాట్లాడది కాదని ఆమె పనిచేస్తున్న అల్ ఫలాహ్ యూనివర్సిటీ ప్రొఫెసర్ ఒకరు చెప్పారు. "షహీన్ విధుల్లో నిర్లక్ష్యంగా ఉండేది. ఒక్కోసారి చెప్పాపెట్టకుండానే వెళ్లిపోయేది. చాలా మంది కాలేజీకి వచ్చి ఆమెను కలుస్తూ ఉండేవారు. ఒక్కోసారి ఆమె చిత్రంగా ప్రవర్తించేది. దీనిపై యాజమాన్యానికి పలుమార్లు ఫిర్యాదులు కూడా వెళ్లాయి" అని వెల్లడించారు. పోలీసుల దర్యాప్తునకు పూర్తిగా సహకరిస్తామని తెలిపారు.


షహీన్

మా అన్న నిరపరాధి

ఎవరో ట్రాప్ చేసి ఇరికించారు

- ఉగ్రవాది మొహియుద్దీన్ సోదరుడు ఒమర్ ఫారూఖీ ఆరోపణ
- గుజరాత్ ఏటీఎస్ పోలీసుల అదుపులో మొహియుద్దీన్

హైదరాబాద్/హైదరాబాద్ సిటీ/రాజేంద్రనగర్/శంషాబాద్ రూరల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఉగ్రవాద ఆరోపణలతో గుజరాత్ ఏటీఎస్ పోలీసులు అరెస్టు చేసిన హైదరాబాద్‌కు చెందిన వైద్యుడు డాక్టర్ సయ్యద్ అహ్మద్ మొహియుద్దీన్ నిరపరాధి అని అతడి సోదరుడు ఒమర్ ఫారూఖీ తెలిపారు. చార్మినార్ రెహమానియా మదర్సాలో మౌలనాగా పనిచేస్తున్న ఫారూఖీ మంగళవారం ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ.. ఎవరో కావాలనే తన అన్నను కుట్రలో ఇరికించారని ఆరోపించారు. 'మా అన్న ఎంతో మంచివాడు.. నిరపరాధి.. చైనాలో డాక్టర్ చదివాడు.. కొవిడ్ సమయంలో ఎంతో మందికి సహాయం చేశాడు. దేశానికి ద్రోహం తలపెట్టే వ్యక్తి కాదు.. ఎక్కడో ఏదో జరిగింది.. ఎవరో మా అన్నను ట్రాప్ చేసి ఇరికించారు.. ఉగ్రవాదిగా చిత్రీకరించారు' అని పేర్కొన్నారు. ఏటీఎస్ పోలీసులు ఆదివారం మొహియుద్దీన్‌తోపాటు ఉత్తరప్రదేశ్‌కు చెందిన మరో ఇద్దరు ఆజాద్ సులేమాన్ షేక్, మొహమ్మద్ సుహైల్ మొహమ్మద్ సలీమ్‌లను బనస్కాంత జిల్లాలో అరెస్టు చేసిన విషయం తెలిసిందే.

ఖమ్మం నుంచి హైదరాబాద్‌కు..

మీడియాతోపాటు ఎవరితోనూ మాట్లాడవద్దని ఏటీఎస్ పోలీసులు తమను ఆదేశించారని చెప్పిన ఫారూఖీ.. తర్వాత తమ కుటుంబ వివరాలను వెల్లడించారు. తమ కుటుంబం 20 సంవత్సరాలుగా హైదరాబాద్ నగరంలోని మెహిదీపట్నం, టోలిచౌకి, రాజేంద్రనగర్ సర్కిల్ ఉప్పర్‌పల్లి ఫోర్ట్‌వ్యూ కాలనీలో నివాసం ఉందని చెప్పారు. ఫోర్ట్‌వ్యూ కాలనీలోని అసద్ మంజిల్‌లో నాలుగు సంవత్సరాలుగా ఉంటున్నట్లు తెలిపారు. 'మాది ఖమ్మం.. మా నాన్న దివంగత డాక్టర్ అబ్దుల్ ఖాదర్ జిలానీ. అమ్మ అస్రా తఫజ్జుల్. మేము ఆరుగురం సంతానం. డాక్టర్ సయ్యద్ అహ్మద్ మొహియుద్దీన్ పెద్దవాడు. ఆయన 2007 నుంచి 2013 వరకు చైనాలో మెడిసిన్ చదివాడు. అనంతరం వివిధ ఆసుపత్రులలో ఉద్యోగం చేశాడు. కొవిడ్ సమయంలో ఎంతో మందికి వైద్యం అందించాడు. ఎవరైనా కష్టాల్లో ఉంటే తట్టుకోలేని మనస్తత్వం ఆయనది. 2021లో పెళ్లైంది. భార్యతో విడాకులూ అయ్యాయి. ఆ తర్వాత ఆయన అమెరికా వెళ్లి కొంత కాలం జాబ్ చేశాడు' అని వివరించారు.


ఒమర్ ఫారూఖీ

టెలిగ్రాంలో ఉగ్ర సందేశాలు

అహ్మద్ మొహియుద్దీన్ హైదరాబాద్‌లో ఎక్కడెక్కడ రెక్కీ చేశాడనే అంశంపై దర్యాప్తు సంస్థలు దృష్టి సారించాయి. ఆముదం గింజల నుంచి ప్రాణాంతకమైన రెసిన్ విషపదార్థాన్ని తయారు చేసిన మొహియుద్దీన్, దానిని వాడటం కోసం కొన్ని ప్రాంతాలను ఎంపిక చేసుకున్నాడని నిఘా వర్గాలు అనుమానిస్తున్నాయి. నగరంలోని మంచినీటి వ్యవస్థ, దేవాలయాల్లోని ప్రసాదాల్లో వాడే నీటిలో ఈ రెసిన్ కలపాలని మొహియుద్దీన్‌కు ఆదేశాలు అందినట్లు భావిస్తున్నాయి. పాకిస్థాన్‌లోని మొహియుద్దీన్ హ్యాండ్లర్ అయిన అబూ ఖదీజా టెలిగ్రాం యాప్ ద్వారా సందేశాలు పంపాడని, ఇదే మాడ్యూల్‌కు చెందిన ఢిల్లీ పేలుడు అనుమానితులు కూడా సంభాషణలు జరిపారని దర్యాప్తు అధికారులు ఇప్పటికే గుర్తించారు. మొహియుద్దీన్ ఎక్కడెక్కడ తిరిగాడనే విషయాన్ని గుర్తించడానికి నిఘా బృందాలు సీసీ కెమెరాలను జల్లెడ పడుతున్నాయి. మొహియుద్దీన్ తన ఫోన్‌లో గూగుల్ లోకేషన్‌ను ఆఫ్ చేసుకున్నాడని, సహచరులతో టెలిగ్రాం యాప్ ద్వారానే మాట్లాడేవాడని గుర్తించారు. రెసిన్ తయారీకి కావాల్సిన ల్యాబొరేటరీని ఇంట్లోనే ఏర్పాటు చేసుకున్నట్లు ఏటీఎస్ అధికారులు కనిపెట్టారు. కాగా, ఢిల్లీ బాంబు పేలుడు నేపథ్యంలో శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో రెండో రోజు మంగళవారం కూడా హై అలర్ట్ కొనసాగింది. అనుమానితులు కనిపిస్తే అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు.

బిజినెస్ డీల్ ఉందని వెళ్లాడు

ఈ నెల 5వ తేదీన బిజినెస్ డీల్ ఉందని చెప్పి ఇంట్లో నుంచి మొహియుద్దీన్ బయటకు వెళ్లాడని ఫారూఖీ తెలిపారు. '9న ఏటీఎస్ పోలీసులు నాకు ఫోన్ చేసి మీ అన్నకు ఉగ్రవాదులతో సంబంధాలున్నాయని, అందుకే అరెస్ట్ చేశామని చెప్పారు. దాంతో అందరం ఒక్కసారిగా షాక్‌కు గురయ్యాం. పోలీసులు పూర్తిస్థాయిలో దర్యాప్తు చేసి మా అన్నయ్యను కాపాడాలి' అని వేడుకున్నారు. మొహియుద్దీన్ గదిలో ఉన్న సామగ్రిని తీయవద్దని, రెండు రోజుల్లో వచ్చి వాటిని స్వాధీనం చేసుకుంటామని ఏటీఎస్ పోలీసులు చెప్పినట్లు ఫారూఖీ వెల్లడించారు. అసద్ మంజిల్‌కు వాచ్‌మెన్‌గా ఉన్న షబానాను విచారించగా తాను నాలుగు నెలల నుంచే వాచ్‌మెన్‌గా ఉన్నట్లు తెలిపింది. ఫోర్ట్‌వ్యూ కాలనీ వాసులు మాత్రం ఈ అంశంపై మాట్లాడేందుకు ఇష్టపడలేదు.

ఐసిస్‌తో దోస్తీ.. పేలుళ్లకు రెక్కీ..

- విజయనగరం వాసి సిరాజ్ హైదరాబాదీ సమీర్‌పై ఎన్ఐఏ చార్జిషీట్

అమరావతి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఆరు నెలల క్రితం విజయనగరంలో ఉగ్రదాడికి పథక రచన చేసిన ఐసిస్ ఉగ్రవాది సిరాజ్ ఉర్ రెహమాన్, తెలంగాణకు చెందిన మరో ఉగ్రవాది సమీర్ ఉమ్మడి కుట్రను ఎన్ఐఏ కోర్టుకు వివరించింది. విశాఖపట్నంలోని ఎన్ఐఏ కోర్టులో మంగళవారం దాఖలు చేసిన చార్జిషీటు దాఖలు చేసింది. సిరాజ్, సమీర్ ఇద్దరూ హైదరాబాద్, ఢిల్లీ, బెంగుళూరు, ముంబై నగరాల్లో బాంబు పేలుళ్ల కోసం రెక్కీ నిర్వహించారని ఎన్ఐఏ తన చార్జిషీట్లో కోర్టుకు వివరించినట్లు తెలిసింది. సౌదీ అరేబియా, ఒమన్, పాకిస్థాన్ నుంచి సిరాజ్, సమీర్‌కు అందిన ఆదేశాలు, నిధులు.. ఆయా బ్యాంకుల ఖాతాల్లో లావాదేవీల వివరాలతో పాటు ఒమన్‌లో ఉంటున్న హైదరాబాద్ వాసి ఇమ్రాన్ అక్రమ్ పేలుడు పదార్థాల తయారీ నిమిత్తం సిరాజ్‌కు డబ్బులు పంపినట్లు తేలింది. ఆ డబ్బుతో పేలుడు పదార్థాల కోసం ఆన్‌లైన్‌లో ఆర్డర్ పెట్టి విజయనగరంలోని తన ఇంటి చిరునామా కాకుండా సమీపంలోని ఉర్దూ పాఠశాల అడ్రస్ ఇచ్చి జాగ్రత్త పడిన వైనాన్ని దర్యాప్తు అధికారులు గుర్తించారు. సిరాజ్, సమీర్‌కు ఐసిస్ ఉగ్ర సంస్థతో ఉన్న లింకులతో పాటు బీహార్‌కు చెందిన అబూ మసాబ్ (ప్రస్తుతం పాకిస్థాన్‌లో ఉన్నాడు) ద్వారా ఐసిస్ శిక్షణకు ఈ ఇద్దరూ సిద్ధమైన విషయాన్ని సైతం ఎన్ఐఏ విచారణలో తేల్చింది. హైదరాబాద్‌లో పేలుడు పదార్థాలు కొనుగోలు చేస్తే నిఘా వర్గాలకు దొరికిపోతామనే ఉద్దేశంతో విజయనగరంలో టిఫిన్ బాంబుల తయారీకి సిద్ధపడినట్లు చార్జిషీట్‌లో కోర్టుకు వివరించినట్లు తెలిసింది. సిరాజ్, సమీర్‌లపై పై ఉపా చట్టం కింద అభియోగాలు నమోదు చేసినట్లు ఎన్ఐఏ తెలిపింది.

ఏ 23 యాప్ తెలంగాణలో లేదు!

(మొదటి పేజీ తరువాయి)

గంటన్నర పాటు విజయ్‌ను విచారించిన సిట్ అధికారులు.. ఆయన వాంగ్మూలాన్ని నమోదు చేసుకున్నారు. గతంలో విజయ్ ఏ23 బెట్టింగ్ యాప్‌ను ప్రమోట్ చేశారు. దీనిపై ఈ ఏడాది ఆగస్టు 6న విజయ్‌ను ఈడీ అధికారులు విచారించారు. ఏ23 బెట్టింగ్ యాప్ పారితోషికానికి సంబంధించిన వివరాలను సిట్ అధికారులు సేకరించారని సమాచారం. వాస్తవానికి తాను ప్రమోట్ చేసిన ఏ23 బెట్టింగ్ యాప్ తెలంగాణలో ఓపెన్ కాదని, తాను చట్టపరంగానే ఆ యాప్‌కు ప్రచారం చేశానని, తర్వాత అది తప్పని తెలియడంతో కొత్తగా బెట్టింగ్ యాప్‌ల ప్రమోషన్లు అంగీకరించడం లేదని విజయ్ వివరించినట్లు తెలుస్తోంది. ఇక, గోవిందా365 అనే బెట్టింగ్ యాప్‌కు ప్రమోషన్ నిర్వహించి భారీగా పారితోషికం తీసుకున్న బిగ్‌బాస్ ఫేం సిరి హనుమంతు కూడా సిట్ విచారణకు హాజరయ్యారు. బెట్టింగ్ యాప్ ప్రమోషన్ ద్వారా వచ్చిన డబ్బుతో ఆమె బ్యూటీ ట్రీట్‌మెంట్ కేంద్రాలు ప్రారంభించిందని గుర్తించిన సిట్ అధికారులు.. పెట్టుబడుల గురించి ఆరాతీసినట్లు తెలుస్తోంది. వాస్తవానికి ఆ యాప్ ప్రమోషన్‌ను సిరి హనుమంతు భిన్నంగా నిర్వహించారు. 'మీరు సంపాదించే ప్రతి రూపాయికి పైసా పన్ను చెల్లించాల్సిన అవసరం లేదు. నో ట్యాక్స్ బెట్టింగ్ యాప్' అంటూ ప్రచారం చేసినట్లు అధికారులు గుర్తించారు.

బుద్వేల్ భూములపై వచ్చే నెల 12లోగా నిర్ణయం తీసుకోవాలి

- రంగారెడ్డి కలెక్టర్‌కు హైకోర్టు ఆదేశం

హైదరాబాద్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ మండలం బుద్వేల్‌లోని వివాదాస్పద 4.19 ఎకరాల భూమికి సంబంధించి వచ్చే నెల 12లోగా నిర్ణయం తీసుకోవాలని కలెక్టర్‌ను హైకోర్టు ఆదేశించింది. ఆ తర్వాత మూడు రోజుల్లో నిర్ణయానికిగల కారణాలు తెలుపుతూ ప్రైవేట్ పార్టీలకు నోటీసులు జారీ చేయాలని స్పష్టం చేసింది. డిసెంబర్ 31తర్వాతే ఈ-వేలంపై నిర్ణయం తీసుకోవాలని చెప్పింది. 2023 ఆగస్టు 10న హెచ్ఎండీఏ నిర్వహించిన భూమి వేలాన్ని సవాల్ చేస్తూ రంగారెడ్డి జిల్లాకు చెందిన కె.రవీందర్‌తోపాటు మరొకరు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. తొలుత ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టిన ఏకసభ్య ధర్మాసనం.. చట్టప్రకారం నిర్దేశించిన విధానాన్ని పాటించలేదంటూ వేలాన్ని రద్దు చేశారు. దీన్ని సవాల్ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం అప్పీల్ దాఖలు చేసింది. ఈ అప్పీల్‌పై ధర్మాసనం మంగళవారం విచారణ చేపట్టింది. ప్రభుత్వం తరఫున అడ్వొకేట్ జనరల్ ఏ.సుదర్శన్ రెడ్డి, పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది దేశాయి ప్రకాశ్‌రెడ్డి వాదనలు వినిపించారు. వాదనలు విన్న ధర్మాసనం.. సింగిల్ జడ్జి ఆదేశాలను నిలిపివేసింది. విచారణను జనవరి 2కు వాయిదా వేసింది.





అందెశ్రీ పార్థివదేహానికి నివాళులర్పిస్తున్న రేవంత్ రెడ్డి, గౌరవ సూచకంగా గాల్లోకి కాల్పులు జరుపుతున్న పోలీసులు

సహజకవికి తుది వీడ్కోలు!

(మొదటి పేజీ తరువాయి)

అంత్యక్రియలు నిర్వహించారు. అందెశ్రీకి గౌరవ సూచకంగా పోలీసులు తుపాకులను మూడుసార్లు గాల్లోకి పేల్చారు. అంత్యక్రియలకు సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు శ్రీధర్‌బాబు, పొంగులేటి, జూపల్లి, అడ్లూరి లక్ష్మణ్, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, కాంగ్రెస్ సీనియర్ నేత వీహెచ్ హాజరై అక్షర యోధుడికి తుది వీడ్కోలు పలికారు. సీఎం రేవంత్ రెడ్డి స్వయంగా అందెశ్రీ పాడెను మోశారు. అందెశ్రీ కుమారుడితో కలిసి అంత్యక్రియల కార్యక్రమాన్ని నిర్వహించారు. కుటుంబసభ్యులను ఓదార్చారు. అనంతరం రేవంత్ రెడ్డి మాట్లాడారు. నాలుగు కోట్ల జనాల సమస్యలను తన కుటుంబసమస్యగా భావించిన గొప్ప మానవతవాది అందెశ్రీ అని కొనియాడారు. ఆయన మరణం తెలంగాణ సమాజానికి, వ్యక్తిగతంగా తనకు తీరని లోటన్నారు. రాష్ట్ర సాధనలో ప్రముఖ పాత్ర పోషించిన అందెశ్రీని కోల్పోవడం దురదృష్టకరమని పేర్కొన్నారు. తాను పీసీసీ అధ్యక్షుడిగా ప్రజాక్షేత్రంలో పర్యటిస్తున్న సమయంలో అందెశ్రీని కలవాలని ప్రయత్నిస్తే రాజకీయనాయకులకు తాను దూరంగా ఉంటానని, వేదికలపైనే వారిని కలుస్తానని వ్యక్తిగతంగా కలవనని ఓ మిత్రుడి ద్వారా సమాచారం చేరవేశారని గుర్తుచేసుకున్నారు. అయినా ఒకసారి తెలంగాణ రాష్ట్ర భవిష్యత్తు గురించి చర్చిద్దామని, నాలుగున్నర కోట్ల తెలంగాణ ప్రజలు కష్టాల్లో ఉన్న సమయంలో మీదైన పాత్ర పోషించాలని ఆయన్ను తాను కోరడం జరిగిందన్నారు. అప్పట్లో తాను పార్టీని నడిపించే క్రమంలో తనకు అందెశ్రీ ఒక గొప్ప స్ఫూర్తినిచ్చారని కొనియాడారు. కొట్లాడితే తెలంగాణ ప్రజలు కచ్చితంగా ఆశీర్వదిస్తారని అందెశ్రీ తనతో చెప్పారని, తెలంగాణ ప్రజల కష్టాలను తీర్చడానికి కలిసి పనిచేద్దామని అన్నారని గుర్తుచేసుకున్నారు. చదువుకోవడానికి పట్నం వచ్చిన తమ్ముడి దగ్గరకు ఊర్లో వ్యవసాయం చేసే అన్న చూసేందుకు వచ్చినట్లు కలిగే అనుభూతి తనకు అందెశ్రీతో మాట్లాడుతున్నప్పుడు కలిగేదని చెప్పారు. పేదలకు ప్రయోజనాలు చేకూర్చాలనే తన ఆలోచనకు గద్దర్ అన్న స్థాయిలో స్ఫూర్తిని అందెశ్రీ ఇచ్చారని పేర్కొన్నారు. అందెశ్రీ రాసిన రాష్ట్ర గీతం జయజయహే తెలంగాణను పాఠ్యపుస్తకాల్లో చేర్చేందుకు రానున్న రోజుల్లో నిర్ణయం తీసుకుంటామని ప్రకటించారు. తెలంగాణ ఉన్నంత కాలం రాష్ట్ర సాధనంలో అందెశ్రీ కృషిని శ్వాశతం చేసేందుకు ఆయన రచనలను గ్రంథస్థం చేస్తామని చెప్పారు. అందెశ్రీ పేరును గత ఏడాది రాష్ట్ర ప్రభుత్వం పద్మశ్రీకి సిఫారసు చేసినా రాలేదని, ఈ ఏడాది కూడా మళ్లీ సిఫారసు చేస్తామని చెప్పారు. ఆయనకు పద్మశ్రీ ఇచ్చేందుకు కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ సహకరించాలని సీఎం విజ్ఞప్తి చేశారు. అందెశ్రీ రచించిన నిప్పులవాగు పుస్తకం యువకులకు భగవద్గీత, ఖురాన్, బైబిల్‌తో సమానం అని పేర్కొన్నారు. తెలంగాణ సమస్యలపై పోరాటం చేసేవారికి ఈ పుస్తకం ఒక గైడ్ లాగా పనిచేస్తుందన్నారు. అందెశ్రీ రచించిన నిప్పులవాగు పుస్తకాన్ని 20 వేల కాపీలతో తెలంగాణలోని ప్రతితండాల్లో, గ్రామాల్లోని అన్ని గ్రంథాలయాల్లో ఉండే విధంగా చర్యలు తీసుకుంటామని చెప్పారు. అందెశ్రీ కుటుంబసభ్యుల్లో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పిస్తామని చెప్పారు. అందెశ్రీ అంత్యక్రియల్లో విమలక్క, పాశం యాదగిరి, ఉద్యమకారులు, కవులు, కళాకారులు, ప్రముఖులు పాల్గొన్నారు.



ఘట్‌కేసర్ నుంచి అందెశ్రీ అంతిమ యాత్ర

స్మృతి వనంగా అవుటర్ జంక్షన్

అందెశ్రీ అంత్యక్రియల కోసం అధికార యంత్రాంగం ఘట్‌కేసర్‌లోని ఔటర్ జంక్షన్‌ను ఎంపిక చేసింది. అంత్యక్రియలు నిర్వహించిన ఔటర్ జంక్షన్ స్థలాన్ని స్మృతి వనంగా తీర్చిదిద్దనున్నట్లు సీఎం ప్రకటించారు. ఈ మేరకు జిల్లా అధికారులు తగు ఏర్పాట్లు చేస్తున్నారు. అంతకుముందు లాలాపేట్‌లోని అందెశ్రీ ఇంటి నుంచి ప్రత్యేక వాహనంలో పార్థివదేహాన్ని ఉదయం 10:40 గంటలకు ఘట్‌కేసర్‌లోని అందెశ్రీ నిర్మాణంలో ఉన్న ఇంటి వద్దకు తీసుకొచ్చారు. అక్కడ ప్రజల సందర్శనార్థం 10 నిమిషాల పాటు ఉంచారు. తర్వాత ప్రత్యేక వాహనంలో అంతిమయాత్ర మొదలై అంత్యక్రియల స్థలికి చేరుకుంది.

రూ. 50 వేలు లంచం తీసుకుంటూ.. ఏసీబీకి చిక్కిన ఎస్ఐ, కానిస్టేబుల్

- సిద్దిపేట జిల్లా ములుగులో ఘటన

ములుగు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : రూ.50 వేలు లంచం తీసుకుంటూ సిద్దిపేట జిల్లా ములుగు ఎస్ఐ విజయ్‌కుమార్, కానిస్టేబుల్ రాజు మంగళవారం ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు. ఏసీబీ డీఎస్పీ సుదర్శన్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని బైలంపూర్ గ్రామానికి చెందిన ఓ మహిళకు కేటాయించిన డబుల్ బెడ్‌రూం ఇంట్లో ఇతరులు కిరాయికి ఉంటున్నారు. ఇరు వర్గాల మధ్య వివాదం ఏర్పడిన నేపథ్యంలో విషయం కోర్టుకు చేరింది. ఈ విషయంలో కోర్టు ఫిర్యాదుదారులకు అనుకూలంగా తీర్పు ఇవ్వగా, సదరు కోర్టు ఆర్డర్‌ను అమలుచేయాలని ఎస్ఐని కోరారు. అందుకు తన వద్ద సిబ్బంది లేరని, కొన్ని రోజులు ఆగాలని ఎస్ఐ విజయ్‌కుమార్ ఉద్దేశపూర్వకంగా కాలయాపన చేశారు. విసిగిపోయిన ఫిర్యాదుదారు ఎస్ఐతో నేరుగా మాట్లాడగా రూ. లక్ష లంచం ఇస్తే ఇల్లు ఖాళీ చేయిస్తానని చెప్పారు. ఈ క్రమంలో రూ. 50 వేలకు ఒప్పందం కుదిరింది. అయితే ఫిర్యాదుదారు నవంబరు 5న ఏసీబీ అధికారులకు ఈ విషయంపై ఫిర్యాదు చేశారు. మంగళవారం బాధితులు ఎస్ఐ తరఫున కానిస్టేబుల్ రాజుకు రూ. 50 వేలు లంచం ఇస్తుండగా ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఎస్ఐ విజయ్‌కుమార్‌తో పాటు కానిస్టేబుల్ రాజుపై కేసు నమోదు చేసి ఇద్దరిని రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ సుదర్శన్ తెలిపారు. ఎవరైనా లంచం అడిగితే తమకు ఫిర్యాదు చేయాలని, ఫిర్యాదు చేసిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని డీఎస్పీ తెలిపారు.

త్వరలో 10 కొత్త బొగ్గు బ్లాకులు

- 100 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తే లక్ష్యం
- సింగరేణి సీఎండీ ఎన్.బలరామ్
- బలరామ్ పదవీ కాలం పొడిగింపుపై కేంద్రానికి రాష్ట్రం లేఖ

హైదరాబాద్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): త్వరలో 100కుపైగా బొగ్గు బ్లాకులకు జరిగే వేలంలో కనీసం 10 బొగ్గు బ్లాకులను వేలంలో దక్కించుకుంటామని సింగరేణి సీఎండీ ఎన్ బలరామ్ ప్రకటించారు. తద్వారా ఏటా 100 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధించడమే లక్ష్యమని చెప్పారు. సింగిరేణికి చెందిన గుర్తింపు, ప్రాతినిధ్య కార్మిక సంఘాలు, అధికారుల సంఘం ప్రతినిధులతో 38వ సంయుక్త సంప్రదింపుల కమిటీ సమావేశం హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో మంగళవారం జరిగింది. ఈ సమావేశంలో సింగరేణి సీఎండీ మాట్లాడుతూ.. బొగ్గు మార్కెట్‌లో పోటీని ఎదుర్కొని నిలబడేందుకు ఇటీవల బొగ్గు ధరను టన్నుకు రూ.1000 తగ్గించామని తెలిపారు. కార్మిక సంఘాల సూచన మేరకు మెడికల్ అటెండెన్స్ నిబంధనలను సరళతరం చేస్తామని, కార్మికులకు, అధికారులకు రావాల్సిన పదోన్నతుల్లో జాప్యం లేకుండా చూస్తామని వెల్లడించారు. దేశంలోని 10 రాష్ట్రాలతోపాటు చిలీ, బ్రెజిల్, అర్జెంటీనా, ఆస్ట్రేలియా దేశాల్లో ఖనిజ రంగంలో పనిచేయడానికి ప్రణాళికలు రూపొందించినట్లు వెల్లడించారు. సింగరేణి థర్మల్ విద్యుత్ కేంద్రంలో కార్బన్ డయాక్సైడ్ నుంచి మిథనాల్ తయారీ ఇప్పటికే విజయవంతమవ్వగా త్వరలో గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తిలో సింగరేణి అడుగుపెట్టనుందని తెలిపారు. సింగరేణి సంస్థ అమలు చేసిన రూ.1.25 కోట్ల ప్రమాద బీమా పథకం దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. అధికారులకు సంబంధించిన వేతన సవరణ విషయంలో త్వరలో సానుకూల నిర్ణయం రానుందని తెలిపారు. ఇక, సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య, జనరల్ సెక్రటరీ రాజ్‌కుమార్, ప్రాతినిధ్య కార్మిక సంఘం ఐఎన్టీయూసీ కార్యదర్శి జనరల్, రాష్ట్ర కనీస వేతనాల సలహా మండలి చైర్మన్ జనక్ ప్రసాద్, అధికారుల సంఘం అధ్యక్షులు లక్ష్మీపతి గౌడ్ వివిధ సమస్యలకు సంబంధించి చేసిన సూచనలపై ఎన్.బలరామ్ సానుకూలంగా స్పందించారు.

సీఎండీ బలరామ్ పదవీ కాలం మరో ఏడాది పెంపు ?

సింగరేణి సీఎండీగా ఎన్.బలరామ్‌ను మరో ఏడాది పాటు కొనసాగించాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. ఈ మేరకు బలరామ్ డిప్యుటేషన్‌ను మరో ఏడాది పాటు పొడిగించాలని కోరుతూ కేంద్రానికి లేఖ రాసింది. ఇండియన్ రెవెన్యూ సర్వీసెస్(ఐఆర్ఎస్ అధికారైన బలరామ్ డిప్యుటేషన్‌పై రాష్ట్రంలో పనిచేస్తున్నారు. గతంలో సింగరేణి డైరెక్టర్(ఫైనాన్స్)గా పని చేసిన బలరామ్.. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టిన తర్వాత సంస్థ సీఎండీ అయ్యారు. బలరామ్ డి ప్యుటేషన్ గడువు డిసెంబరు 7తో ముగియనుంది.

మొంథా దెబ్బ.. 1,17,757 ఎకరాల్లో పంట నష్టం

- భారీగా దెబ్బతిన్న వరి, పత్తి, మొక్కజొన్న
- నాగర్‌కర్నూల్ జిల్లాలో అత్యధికంగా 23,580 ఎకరాల్లో నష్టం
- వ్యవసాయశాఖ క్షేత్రస్థాయి సర్వేలో వెల్లడి

హైదరాబాద్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మొంథా తుపాను ప్రభావంతో రాష్ట్రంలో దెబ్బతిన్న పంటల లెక్క తేలింది. రాష్ట్ర వ్యాప్తంగా 1,17,757 ఎకరాల్లో వివిధ రకాల పంటలు దెబ్బతిన్నట్లు వ్యవసాయశాఖ తుది నివేదిక ఇచ్చింది. 33 శాతానికి పైగా నష్టపోయిన పంటలనే అధికారులు పరిగణనలోకి తీసుకున్నారు. ఆ నివేదిక ప్రకారం 83,407 ఎకరాల్లో వరి, 30,144 ఎకరాల్లో పత్తి, 2,097 ఎకరాల్లో మొక్కజొన్న పంటలు దెబ్బతిన్నాయి. రాష్ట్రంలోనే అత్యధికంగా నాగర్‌కర్నూల్ జిల్లాలో 23,580 ఎకరాల్లో పంటనష్టం జరిగింది. వరంగల్ జిల్లాలో 19,736 ఎకరాలు, కరీంనగర్ జిల్లాలో 11,473 ఎకరాలు, హనుమకొండ జిల్లాలో 11,310 ఎకరాల్లో పంట నష్టం జరిగింది. జనగామ, జగిత్యాల, ఖమ్మం, మహబూబాబాద్, మెదక్, నల్లగొండ, సంగారెడ్డి, సిద్దిపేట, సూర్యాపేట, వనపర్తి జిల్లాల్లో కూడా పంట నష్టం సంభవించింది. మొత్తం 27 జిల్లాల్లో పంటలు దెబ్బతినగా 1,22,242 మంది రైతులు నష్టపోయారు. వీరికి నష్టపరిహారం ఇవ్వడానికి రూ.117.75 కోట్ల మేర నిధులు అవసరమని వ్యవసాయశాఖ తన నివేదికలో పేర్కొంది.

ఎన్‌డీఆర్ఎఫ్ నిధుల కోసం కేంద్ర ప్రభుత్వానికి లేఖ

మొంథా తుపాను ప్రభావంతో జరిగిన పంటనష్టానికి కేంద్ర ప్రభుత్వం నుంచి పరిహారం తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. ఈ మేరకు 'ఎన్‌డీఆర్ఎఫ్' కింద రాష్ట్రానికి సాయం అందించాలని వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాయనున్నారు. ఎన్‌డీఆర్ఎఫ్ నిబంధనల ప్రకారం.. ఇసుకమేటలు వేస్తే ఎకరానికి రూ.7,235, నీటిపారుదల కింద సాగైన పంటలకైతే ఎకరానికి రూ.6,880, వర్షాధార పంటలైతే ఎకరానికి రూ.3,440, తోటలకు ఎకరానికి రూ.9,106 చొప్పున మొత్తం రాష్ట్రానికి రూ.70 కోట్ల నిధులు ఇవ్వాల్సి ఉంటుందని కేంద్ర ప్రభుత్వానికి లేఖలో వివరించనున్నారు.

ఎకరానికి రూ.10 వేల ఆర్థిక సాయం: తుమ్మల



ప్రకృతి విపత్తుల వల్ల రైతులు పంట నష్టపోతే ఎకరానికి రూ.10 వేల చొప్పున నష్ట పరిహారం చెల్లిస్తున్నామని, మొంథా తుపాను బాధిత రైతులకు కూడా ఎకరానికి రూ.10వేలు చొప్పున ఆర్థిక సాయం అందజేస్తామని వ్యవసాయ మంత్రి తుమ్మల తెలిపారు. మొంథా తుపానువల్ల జరిగిన పంట నష్టాన్ని పరిశీలించి అంచనా వేయటానికి కేంద్ర బృందాన్ని రాష్ట్రానికి పంపాలని కోరుతామని తెలిపారు.

ఏటా రెండు లక్షల ఎకరాల్లో పామాయిల్ సాగు

పామాయిల్ సాగుకు రాష్ట్రంలో 12 లక్షల ఎకరాలకు పైగా అనువైన భూములున్నాయని, వచ్చే నాలుగేళ్లలో ఏటా 2 లక్షల ఎకరాల్లో సాగు జరగాలని పామాయిల్ కంపెనీల ప్రతినిధులకు మంత్రి తుమ్మల స్పష్టం చేశారు. పామాయిల్ కంపెనీల ప్రతినిధులు, ఉద్యానశాఖ అధికారులతో మంగళవారం ఆయన సమీక్ష నిర్వహించారు. వచ్చే ఏడాదిలో ప్రతి ఉమ్మడి జిల్లాలో ఒక పామాయిల్ ప్రాసెసింగ్ పరిశ్రమ స్థాపనకు ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈనెలలో నర్మెట్ట(సిద్దిపేట)లో 30- 120 టన్నుల సామర్థ్యంతో ఆయిల్ ఫెడ్ ఫ్యాక్టరీ ప్రారంభిస్తామని చెప్పారు.

జల సంరక్షణలో తెలంగాణకు జాతీయ అవార్డు

- 5,20,362 పనులతో దేశంలోనే అగ్రస్థానం
- కార్పొరేషన్లలో హైదరాబాద్‌కు రెండోస్థానం

న్యూఢిల్లీ, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): వర్షపు నీటి సంరక్షణ, భూగర్భ జలాల పెంపులో తెలంగాణకు జాతీయ స్థాయిలో అత్యున్నత గుర్తింపు లభించింది. కేంద్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టిన 'జల్ సంచయ్ జన్ భాగీదారీ' కార్యక్రమంలో రాష్ట్రం అగ్రస్థానంలో నిలిచింది. ఈ కార్యక్రమం కింద దేశవ్యాప్తంగా రూఫ్‌టాప్ రెయిన్ వాటర్ హార్వెస్టింగ్, చెరువులు, సరస్సులు, బావుల పునరుద్ధరణ, ఇంకుడు గుంతలు వంటి 10 లక్షల నిర్మాణాలను లక్ష్యంగా పెట్టుకోగా, గడువులోగా ఏకంగా 27.6 లక్షల నిర్మాణాలు పూర్తయినట్లు జలశక్తి శాఖ తెలిపింది. మంగళవారం కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ ప్రకటించిన అవార్డుల్లో.. ఏకంగా 5,20,362 కృత్రిమ రీచార్జ్, నీటి నిల్వ నిర్మాణాలను పూర్తి చేసి తెలంగాణ దేశంలోనే ప్రథమ స్థానం సాధించగా, చత్తీస్‌గఢ్, రాజస్థాన్ తరువాతి స్థానాల్లో నిలిచాయి. ఈ నెల 18న న్యూఢిల్లీలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఈ పురస్కారాలను ప్రదానం చేయనున్నారు. జిల్లాల విభాగంలోనూ తెలంగాణ హవా చాటింది. దేశవ్యాప్తంగా 67 జిల్లాలు ఎంపికవగా, సదరన్ జోన్‌లో తొలి మూడు ర్యాంకులనూ రాష్ట్రంలోని జిల్లాలే కైవసం చేసుకోవడం గమనార్హం. అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన ఆదిలాబాద్, నల్గొండ, మంచిర్యాల జిల్లాలకు కేటగిరీ-1లో, రూ. 2 కోట్ల చొప్పున నగదు బహుమతి దక్కనుంది. అలాగే, కేటగిరీ-2లో రూ. కోటి రూపాయల అవార్డుకు వరంగల్, నిర్మల్, జనగాం జిల్లాలు ఎంపికయ్యాయి. కేటగిరీ-3.. రూ. 25లక్షల విభాగంలో భద్రాద్రి కొత్తగూడెం, మహబూబ్‌నగర్ జిల్లాలు ఎంపికయ్యాయి. ఇక.. 'టాప్ 10 మున్సిపల్ కార్పొరేషన్ల' జాబితాలో హైదరాబాద్ దేశంలోనే రెండో స్థానంలో నిలిచి రూ. 2 కోట్ల నగదు బహుమతిని గెలుచుకుంది.

ధాన్యం లేకున్నా అమ్మినట్టు చూపి.. రూ.2.10 కోట్లు కొట్టేశారు

- సూత్రధారి శ్రీనివాస్ సహా 13 మంది అరెస్టు
- రూ.9.50లక్షలతోపాటు ఒక కారు స్వాధీనం

వరంగల్ క్రైం, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): ధాన్యం లేకున్నా అమ్మినట్టుగా నకిలీ రికార్డులు సృష్టించి, ప్రభుత్వ ఖజానా నుంచి అక్రమంగా రూ.2.10కోట్లు కొట్టేసిన కేసులో ఇప్పటికే ఏడుగురిని అరెస్టు చేయగా.. తాజాగా మరో 13 మందిని అరెస్టు చేసినట్లు వరంగల్ పోలీస్ కమిషనరేట్ ఈస్ట్‌జోన్ డీసీపీ అంకిత్‌కుమార్ మంగళవారం వెల్లడించారు. హనుమకొండ జిల్లాలోని శాయంపేట, కాట్రపల్లి ఐకేపీ సెంటర్లలో రబీ సీజన్‌కు సంబంధించి పలు అక్రమాలు జరిగాయని పౌరసరఫరాల శాఖ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అక్టోబరు 11న శాయంపేట పోలీసుస్టేషన్‌లో కేసు నమోదైంది. దీనిపై పోలీసుల దర్యాప్తులో విస్తుపోయే విషయాలు వెలుగులోకి వచ్చాయి. హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలానికి చెందిన బెజ్జంకి శ్రీనివాస్‌కు రబీ సీజన్ సమయంలో పత్తిపాకకు చెందిన బండ లలిత పరిచయమైంది. వారిద్దరూ కలిసి ప్రైవేట్ ట్యాబ్ ఆపరేటర్ వాంకుడోతు చరణ్‌సింగ్ సహకారంతో తమ కుటుంబసభ్యులను నకిలీ రైతులుగా సృష్టించారు. వారి పేరిట 312 ఎకరాల పోడుభూమి ఉందని, అందులో 9,100 క్వింటాళ్ల ధాన్యం పండిందని రికార్డుల్లో చూపించారు. ఏఈవో సుప్రియ సహకారంతో టోకెన్ బుక్స్ తీసుకొని ఏవో లాగిన్ ఐడీలో చరణ్‌సింగ్, లలిత తప్పుడు సమాచారం నమోదు చేశారు. ఈ క్రమంలో 15 మంది నకిలీ రైతుల ఖాతాల్లోకి రూ.2.10 కోట్లు జమ అయ్యాయి. నకిలీ ఎంట్రీలు చేసినందుకు చరణ్‌సింగ్, లలిత క్వింటాల్‌కు రూ.120 చొప్పున రూ.10,92,000 తీసుకున్నారు. సూత్రదారి బెజ్జంకి శ్రీనివాస్ తన కుటుంబసభ్యులైన నకిలీ రైతుల ఖాతాల నుంచి రూ.1.32కోట్లు డ్రా చేసి పంగిడిపల్లిలో ఎకరం భూమి కొనుగోలు చేశారు. రూ.8లక్షలతో హైదరాబాద్‌లో ఓ కారు కొన్నారు. మిగతా రూ.1.06కోట్లతో ధాన్యం కొనుగోలు చేసి ఓ మిల్లులో భద్రపరిచారు. విచారణ చేపట్టిన పోలీసులు.. ప్రధాన సూత్రదారి బెజ్జంకి శ్రీనివాస్, ఆయన భార్య బెజ్జంకి శోభారాణి, కుమారులు పున్నం చారి, శివకుమార్, చందు, కోడళ్లు నవత, శ్రీ నవ్య, బంధువులు వెల్దూరి కళ్యాణ్, వేంనూరి శ్రీనివాస్, వేంనూరి ఉదయలక్ష్మి, చిరంచ చందు, కాట్రపల్లి క్లస్టర్ ఏఈవో ఎం.సుప్రియ, బండ లలిత భర్త రజినీకర్‌రెడ్డిని అరెస్టు చేశారు. నిందితుల బ్యాంకు ఖాతాల్లో ఉన్న రూ.54 లక్షలను ఫ్రీజ్ చేయడంతో పాటు రూ.53.84లక్షల విలువైన భూముల పత్రాలు, ఓ కారు, ప్రధాన నిందితుడి నుంచి రూ.9.50లక్షలను సీజ్ చేశారు. కాగా, నిందితులను పటుకోవడంలో ప్రతిభ కనబరిచిన సిబ్బందికి డీసీపీ నగదు రివార్డులను అందజేశారు.

ఏజెన్సీ గ్రామాల్లో గజ గజ

- కుమరం భీం జిల్లా లింగాపూర్‌లో 8.7 డిగ్రీల అత్యల్ప ఉష్ణోగ్రత
- అన్ని జిల్లాలకు యెల్లో అలెర్ట్

హైదరాబాద్, ఆసిఫాబాద్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని ఏజెన్సీ గ్రామాలు చలితో వణికిపోతున్నాయి. నాలుగు రోజులుగా ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పట్టడంతో చలి తీవ్రత పెరిగిపోయింది. మంగళవారం లింగాపూర్ మండలంలో 8.7 డిగ్రీల అత్యల్ప ఉష్ణోగ్రత నమోదైంది. సిర్పూర్(యు)లో 9, కెరమెరిలో 10.4, తిర్యాణిలో 11, వాంకిడిలో 12, రెబ్బెన, కాగజ్‌నగర్ మండలాల్లో 12.3, ఆసిఫాబాద్‌లో 12.6, చింతలమానేపల్లిలో 13.4, సిర్పూర్(టి), దహెగాం, పెంచికలపేట మండలాల్లో 13.5 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. చలి తీవ్రతకు వృద్ధులు, పిల్లలు ఇబ్బందులు పడుతున్నారు. కాగా తెలంగాణలో రాగల రెండు రోజుల్లో కొన్ని ప్రాంతాల్లో కనిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణంకంటే రెండు నుంచి మూడు డిగ్రీలు తక్కువగా నమోదు అయ్యే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. సోమవారం రాత్రి ఆదిలాబాద్ జిల్లా బజార్‌హత్నూర్‌లో 10, సిరిసిల్ల జిల్లా రుద్రంగిలో 11.5 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదైనట్లు పేర్కొంది. రాగల రెండు రోజులకు రెండు జిల్లాలకు ఆరెంజ్, మిగిలిన అన్ని జిల్లాలకు యెల్లో అలెర్ట్ జారీ చేసింది. ఆసిఫాబాద్, ఆదిలాబాద్, మంచిర్యాల జిల్లాల్లో పది డిగ్రీలలోపు కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదు అయ్యే అవకాశం ఉందని పేర్కొంది.

14న బీఎస్సీ అగ్రికల్చర్ ప్రవేశాలకు కౌన్సెలింగ్

హైదరాబాద్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం (పీజేటీఏయూ) అనుబంధ కళాశాలలో బీఎస్సీ అగ్రికల్చర్ కోర్సులో ప్రవేశం కోసం దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఈనెల 14న కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. సంబంధిత ఒరిజినల్ సర్టిఫికెట్లు, జిరాక్స్ కాపీలతో రాజేంద్రనగర్‌లోని పీజేటీఏయూ ఆడిటోరియంలో నిర్వహించే కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని మహాత్మా జ్యోతిబా పూలే తెలంగాణ వెనుకబడిన తరగతుల గురుకుల విద్యాసంస్థల సొసైటీ కార్యదర్శి బడుగు సైదులు సూచించారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

ఎదురులేని మునీర్

పొరుగుదేశం పాకిస్థాన్‌లో నాలుగోసారి సైనికకుట్ర జరుగుతోంది. అయితే, ఇదేమీ ఓ చీకటిరాత్రిన, తుపాకీమోతల మధ్య జరగడం లేదు. స్పష్టంగా చెప్పాలంటే, రాజ్యాంగబద్ధంగా, చట్టసభ తోడ్పాటుతో, గతానికి పూర్తిభిన్నంగా కొత్తతరహాలో కొనసాగుతోంది. పాకిస్థాన్‌లో మిగిలిన ఆ కాస్త ప్రజాస్వామ్యాన్ని కూడా మింగేసి, సైన్యమే సర్వంసహాధికారిగా అవతరించబోతోంది. ఒకే ఒక్క రాజ్యాంగ సవరణతో అటు సుప్రీంకోర్టు ఔన్నత్యాన్ని కుదించి, మరోవైపు ఆర్మీచీఫ్ ఆసిమ్ మునీర్‌కు చీఫ్ ఆఫ్ డిఫెన్స్ ఫోర్సెస్ (సీడీఎఫ్) హోదాతో అపరిమిత అధికారాలు కట్టబెట్టేపని అతివేగంగా జరుగుతోంది.

షరీఫ్ సోదరుల కుట్రతో పాక్ రాజ్యాంగం పునాదులు కదిలిపోతాయంటూ విపక్షాలు ప్రతిపాదిత 27వ సవరణకు అడ్డుతగిలే ప్రయత్నం శక్తిమేర చేస్తున్నాయి. సెనేట్‌లో బిల్లు చక్కగా నెగ్గిన తరువాత, మంగళవారం జాతీయ అసెంబ్లీలో దీనిని న్యాయమంత్రి ప్రవేశపెట్టారు. మంగళవారం జరగాల్సిన చర్చ బుధవారానికి వాయిదాపడినప్పటికీ, అధికార కూటమి ప్రభుత్వానికి బిల్లును నెగ్గించుకోగలిగినంత సంఖ్యాబలం ఉన్నది కనుక ఇక అడ్డంకులేమీ లేవు. తనను జైల్లోకి నెట్టి, సమీప భవిష్యత్తులో సైతం బయటకురానివ్వకుండా కుట్రలు చేస్తున్న మార్షల్ మునీర్ మరింత బలపడుతున్నందుకు మాజీ ప్రధాని ఇమ్రాన్‌ఖాన్ భయపడుతున్నారు. దేశవ్యాప్త నిరసనలు జరపమని, సభలో అడ్డుపడమని తనవారిని ఆదేశించాడు కానీ, బిల్లును అడ్డుకొనేంత శక్తి విపక్షానికి లేదు. సెనేట్‌లో ఇద్దరు విపక్ష సభ్యులు బిల్లుకు అనుకూలంగా ఓటుచేసిన దృశ్యం కూడా చూశాం. పాకిస్థాన్ వ్యవస్థాగత నిర్మాణాన్నే మార్చివేసే బిల్లు ఇది. ఇప్పటివరకూ అనధికారికంగా సైనికపెత్తనంలో ఉన్న పాకిస్థాన్ ఈ చట్టం సాయంతో సైనికరాజ్యంగా మారుతుంది.

షెహబాజ్ షరీఫ్ ప్రభుత్వం ఒకేమారు న్యాయ, సైనిక చట్టాలను ఈ బిల్లుద్వారా సవరిస్తోంది. సుప్రీంకోర్టును బలహీనపరచే లక్ష్యంతో, దాని నెత్తిన ఫెడరల్ కాన్‌స్టిట్యూషనల్ కోర్టు (ఎఫ్‌సీసీ) ఏర్పాటు ప్రయత్నాలు జరుగుతున్నాయని మేధావులు భయపడుతున్నారు. భవిష్యత్తులో తమకు నచ్చిన తీర్పులనూ, తీర్మానాలనూ చేయించుకొనేందుకు పాలకులకు, ముఖ్యంగా మునీర్‌కు ఇది ఉపకరించవచ్చు. ఫీల్డ్ మార్షల్ మునీర్ ఈ నెల 27వ తేదీ నుంచి సీడీఎఫ్‌గా త్రివిధ బలాలకూ శక్తిమంతమైన అధినాయకుడు కావడమే కాక, జీవితపర్యంతం ఆ హెదాలోనే ఉంటారు. మరణించేంతవరకూ శత్రువులెవరూ కేసులు పెట్టడానికీ, ఏ కోర్టులూ శిక్షించడానికి వీల్లేకుండా ఆయనకు అపరిమిత రక్షణలు లభిస్తాయి. అభీష్టానికి వ్యతిరేకంగా ఆయనను తొలగించడమూ అసాధ్యమంటున్నారు. ఫీల్డ్‌మార్షల్ హోదాకు రాజ్యాంగబద్ధతలేదన్న న్యాయవివాదం నేపథ్యంలో, ఈ చట్ట సవరణ ఆయనకు ఆ హోదాను శాశ్వతం చేసి, జీవితకాల ప్రతిరోధక శక్తిని ప్రసాదిస్తోంది. అణ్వాయుధాలపై పెత్తనాన్నీ కట్టబెడుతుంది.

పాకిస్థాన్ రాజకీయార్థిక, సామాజిక రంగాల్లో సైన్యం ప్రభావం, పెత్తనం గురించి ప్రత్యేకంగా చెప్పుకోనక్కరలేదు. సైన్యం ఆశీస్సులు, అండదండలు లేని నాయకులు, ప్రజాబలం ఎంత ఉన్నా కూడా అనతి కాలంలో కుప్పకూలవలసిందే. పరిమితిలో, పరిధుల్లో ఉండమని సైన్యానికి చెప్పినందుకు నవాజ్‌షరీఫ్‌కు, సైన్యం పెత్తనాన్ని ప్రశ్నించినందుకు ఇమ్రాన్‌ఖాన్‌కు ఏ గతిపట్టిందో తెలుసు. సుప్రీంకోర్టు అధికారాలకే కళ్ళెంవేసే ప్రయత్నం జరుగుతోంది కనుక ఇక ఇమ్రాన్‌వంటి వారు వెలుగుచూడలేరు, ప్రజాస్వామ్యంమీదా, స్వేచ్ఛాయుత ఎన్నికల మీదా ఆశలన్నీ వదులుకోవాల్సిందే. సైనికనియంతలు అయూబ్‌ఖాన్, జియా ఉల్ హఖ్, పర్వేజ్ ముషార్రఫ్‌లు సర్వాధికారాలనూ దఖలుపరచుకోవడానికి అనుసరించిన సర్వవిధాలనూ ఈ ఒక్క సవరణలో మేళవించి మునీర్ వారందరినీ మించిపోబోతున్నాడు. మొత్తానికి ఆపరేషన్ సిందూర్ మనకెంత ప్రయోజనం చేకూర్చిపెట్టిందో తెలియదు కానీ, మునీర్‌ను మాత్రం మహాయోధుడిని చేసింది. అమెరికా అధ్యక్షుడు పాక్ ప్రధానినో, అధ్యక్షుడినో కాక, ఈ సైనికుడికి ఎర్రతివాచీ పరిచి, శ్వేతసౌధంలో పంచభక్ష్యపరమాన్నాల విందుచేశారు. అతడిని మహావీరుడుగా, తనకు అత్యంత ప్రియమైన ఫీల్డ్ మార్షల్‌గా కీర్తించారు. ఇకపై, పూర్తిగా మునీర్ ఏలుబడిలోకి పోతున్న పాకిస్థాన్‌తో రక్షణ వ్యవహారం, సహకారం ట్రంప్‌కు మరింత సులువు. దేశాలకు సైన్యాలు ఉండటం సహజం. కానీ, సైన్యం కోసం ఉన్న ఏకైక దేశం పాకిస్థాన్.

న్యూయార్క్ మేయర్‌గా జొహ్రాన్ మమ్దానీ విజయం అమెరికా ప్రజా జీవితంలో ప్రబలమవుతోన్న మితవాద ధోరణులకు సవాల్ విసిరింది. ట్రంప్ ప్రేరణతో యూరోపియన్ దేశాలలోనూ జాత్యహంకార జాడ్యం పెచ్చరిల్లుతున్న వేళ మమ్దానీ గెలుపు రూపేణా ఒక ఆశావహ పరిణామం సంభవించింది.

ట్రంప్ గర్వభంగం

గల్ఫ్ లేఖ

అమెరికా పాలకులు చరిత్రను వక్రీకరిస్తున్నారు. వర్తమాన ప్రపంచ సమస్యలను మరింత సంక్లిష్టం చేస్తున్నారు. భవిష్యత్తు విషయమై నవతరంలో భయాందోళనలు పెంచుతున్నారు. శ్రమ జీవులు అయిన పేద వలసదారులను స్వదేశాలకు గెంటివేస్తున్నారు. సంకుచిత రాజకీయ ప్రయోజనాలకు సమున్నత అమెరికన్ విలువలకు తిలోదకాలు ఇస్తున్నారు. ఈ నేపథ్యంలో అమెరికా వాణిజ్య రాజధాని న్యూయార్క్ మహానగర ప్రజానీకం ఇచ్చిన తీర్పు ఆ ఒక్క నగరానికి లేదా దేశానికి మాత్రమే పరిమితమైనది కాదు. అది జాత్యహంకార భావనలకు గొడ్డలిపెట్టు. ప్రపంచవ్యాప్తంగా సగటు మనిషి రాజకీయ మనోగతాన్ని అవిష్కరించిన ప్రజా తీర్పు అది. కట్టుకథలతో విద్వేషాలు రెచ్చగొడుతూ తమను తప్పుదోవ పట్టిస్తున్న శ్వేతసౌధ ఆసామీని ధిక్కరిస్తూ న్యూయార్క్ ప్రజ తమ మేయర్ ఎన్నికలలో సంచలన, సముదాత్త తీర్పునిచ్చింది. మూర్తీభవించిన ఆ జన చైతన్యమే విజేత జొహ్రాన్ మమ్దానీ.

'ఈ నగరాన్ని మీరందరూ కలిసి నిర్మించారు. ఇది మీలో ప్రతి ఒక్కరిది కూడా' అని వలసదారులకు అభయమిస్తూ జొహ్రాన్ మమ్దానీ ఉద్ఘాటించారు. వలసల పట్ల విద్వేషం విషజిమ్ముతున్న నేలపై తెలియని ఒక నూతన పార్శ్వాన్ని మమ్దానీ విజయం ఆవిష్కరించింది. 'రిమోట్‌తో సౌండ్ హెచ్చించుకోవడం ద్వారా నా మాటలు సరిగా విను' అంటూ ఎన్నికయిన అనంతరం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నుద్దేశించి మమ్దానీ నిర్మొహమాటంగా వ్యాఖ్యానించారు. అమెరికా ప్రజా జీవితంలో ప్రబలమవుతోన్న కరడుగట్టిన మితవాద ధోరణులకు మమ్దానీ విసిరిన సవాల్ అట్లాంటిక్ మహాసముద్రానికి ఇరువైపులా ఇంకా ప్రకంపనలు సృష్టిస్తూనే ఉన్నది. ట్రంప్ ప్రేరణతో యూరోపియన్ దేశాలలోనూ జాత్యహంకార జాడ్యం పెచ్చరిల్లుతున్న వేళ మమ్దానీ విజయం రూపేణా ఒక ఆశావహ పరిణామం సంభవించింది.

మమ్దానీ చైతన్యశీల, స్ఫూర్తిదాయక వ్యక్తిత్వ నిర్మాణంలో ఆయన తల్లిదండ్రుల పాత్ర మౌలికమైనది. అమ్మానాన్న ఇరువురూ ప్రవాస భారతీయులే. తండ్రి మహ్మూద్ మమ్దానీ గుజరాతీ ముస్లిం కాగా తల్లి మీరా నాయర్ పంజాబీ హిందూ. తండ్రి విద్యావేత్త కాగా తల్లి మీరా నాయర్ సినిమా స్రష్ట. ప్రతిష్ఠాత్మక



బహుమమతులు గెలుచుకున్న మీరా నాయర్ ఫీచర్, డాక్యుమెంటరీ ఫిల్మ్ కొన్నిటిలో వలస జీవితాలే ప్రధానాంశంగా ఉన్నాయి. 1984లో నిర్మించిన 'India cabaret' అనే డాక్యుమెంటరీ ఫిల్మ్‌లో తెలుగు యువతి ఒకరు కుటుంబ అవసరాలకు తాను ఏ విధంగా క్యాబరే డ్యాన్సర్‌గా మారవలసివచ్చిందో వివరించింది. ఆ యువతి కుటుంబాన్ని కలిసేందుకు మీరా హైద్రాబాద్‌కు వచ్చారు. 2006లో నిర్మించిన 'The Namesake' అనే డాక్యుమెంటరీ ఫిల్మ్‌లో భారతీయ యువతీ యువకులు పలువురు తమ అమెరికా స్వప్నాన్ని సాకారం చేసుకునేందుకు స్వీయ జీవితాలను ఎలా నాశనం చేసుకున్నారో మీరా విపులీకరించారు. సుప్రసిద్ధ 'సలామ్ బాంబే!' (1985) సినిమా దర్శకురాలు మీరాయే. మమ్దానీ భార్య రమా దువజీ కూడా వలసల నేపథ్యం నుంచి ప్రభవించిన విద్యావతే. అమెరికాలో జన్మించినా ఆమె తన బాల్య కౌమారాలను గల్ఫ్‌లో గడిపారు. దుబాయి, దోహాలలో విద్యాభ్యాసం చేసిన రమా దువజీ వివాహం మమ్దానీతో దుబాయిలోనే జరిగింది. అరబ్బుల వలే రమా కూడ పాలస్తీనాకు గట్టి మద్దతుదారు.

స్వయాన వలసదారుడు అయిన జొహ్రాన్ మమ్దానీ తన భారతీయ మూలాలకు గర్వపడతారు. అయితే న్యూయార్క్ జీవన విధానంలో సంపూర్ణంగా సమ్మిళితమయ్యారు. న్యూయార్క్ సగటు పౌరుని సమస్యలు, సంకటాలు గుర్తించి వాటి పరిష్కారంపై దృష్టి కేంద్రీకరించి విజయం సాధించారు. సంప్రదాయక రాజకీయాలకు భిన్నంగా ప్రజా శ్రేయస్సే ధ్యేయంగా ఓటర్ల వద్దకు వెళ్ళి వారి మద్దతు పొందిన విధానం విలక్షణమైనది. అమెరికా, అంతర్జాతీయ రాజకీయాలపై మమ్దానీ తన అభిప్రాయాలను కుండబద్దలు కొట్టినట్లుగా చెప్పి మరీ ఓట్లు అడిగారు. ఒక్క అమెరికాకే కాకుండా ప్రపంచ ఆర్థిక వ్యవస్థకే దిక్సూచి అయిన న్యూయార్క్ మహానగరంలో యూదుల జనాభా ఇజ్రాయిల్ రాజధాని టెల్‌అవీవ్‌లో కంటే అధికంగా ఉన్నది. ఇజ్రాయిల్ ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహూ యుద్ధ నేరస్థుడు అని దుయ్యబట్టారు. ఒకవేళ నెతన్యాహు న్యూయార్క్ నగరానికి వస్తే ఆయన అరెస్టుకు ఆదేశించేందుకు వెనుకాడనని చెప్పిన మమ్దానీ తన ప్రత్యర్థులపై తిరుగులేని అధికృతతో జయపతాక ఎగురవేశారు. అమెరికా రాజకీయాలలో ఇది మాములు విషయం కాదు.

సామాన్యుల సంక్షేమంపై గళం విప్పిన మమ్దానీని యూదులూ అక్కున చేర్చుకున్నారు. మమ్దానీ చరిత్రాత్మక విజయం ఒక వర్గానికి మాత్రమే పరిమితం కాదు, సంకుచిత భావాలకు అతీతంగా సమస్త ప్రజలు ముక్తకంఠంతో చెప్పిన తీర్పు అది. న్యూయార్క్ కంటే చాల ముందుగా ఐరోపాలోని పెద్ద నగరమైన లండన్‌కు మూడు పర్యాయాలు మేయర్‌గా ఎన్నికైన సాదిఖ్‌ఖాన్ పాకిస్థానీ సంతతికి చెందినవాడు కావడం గమనార్హం. నవ భారత నిర్మాత జవహర్‌లాల్ నెహ్రూ చరిత్రాత్మక ప్రసంగం 'ట్రిస్ట్ విత్ డిస్టెనీ' లోని స్ఫూర్తిదాయక మాటలను మమ్దానీ తన విజయాన్ని అంగీకరిస్తూ వెలువరించిన ఉపన్యాసంలో ఉటంకించడం ఆయన వ్యక్తిత్వంలోని భారతీయతకు నిండు నిదర్శనం.

■ మొహమ్మద్ ఇర్ఫాన్
(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి)

పాకిస్థాన్‌కు గుణపాఠం నేర్పడమెలా?



■ ఎ. కృష్ణారావు

ఇండియాగేట్

సమస్త భారతీయులూ బిహార్ ఎన్నికలపై దృష్టి కేంద్రీకరించిన సమయంలో దేశ రాజధానిలోని ఎర్రకోట సమీపంలో బాంబు పేలుడు, ఫరీదాబాద్‌లో భారీ ఎత్తున మందుగుండు సామగ్రి దొరకడంతో అంతా ఉలిక్కిపడ్డారు. ఢిల్లీలో ఉన్న ఇతర రాష్ట్రాలకు చెందిన ప్రతి ఒక్కరికీ వారి బంధువుల నుంచి ఆందోళనతో ఫోన్లు వచ్చాయి. ఒకవైపు తీవ్రమైన కాలుష్యం, మరోవైపు పరిస్థితి సురక్షితంగా లేకపోవడంతో ఢిల్లీవాసులు దిక్కుతోచని స్థితిలో పడ్డారు. దేశంలో రాజకీయ వాతావరణంపై కూడా ప్రజల అభిప్రాయం భిన్నంగా ఉన్నది. జరిగిన ఘటనకూ, బిహార్ ఎన్నికలకూ ముడి వేసేవారూ ఎదురయ్యారు. 'ఈ బాంబు పేలుడు తర్వాత మంగళవారం బిహార్‌లో చివరి విడత పోలింగ్‌లో హిందూ ఓట్లు సంఘటితమైనా ఆశ్చర్యపోనక్కర్లేదు' అని సీనియర్ రాజకీయ విశ్లేషకుడు ఒకరు అన్నారు. ఆశ్చర్యకరమైన విషయం ఏమంటే ఇది కారులో ఉన్న సీఎన్‌జీ సిలిండర్ పేలుడు మాత్రమేనని హోంమంత్రిత్వ శాఖ అధికారి ఒకరు నమ్మబలికారు. అయితే ఆ తర్వాత కొద్ది సేపట్లోనే అది ఉగ్రవాద దాడేనని ఆయన అంగీకరించారు.

పహల్గామ్‌లో 26 మంది భారత పౌరులను ఉగ్రవాదులు విచక్షణా రహితంగా హతమార్చి, ఏడునెలలు కూడా పూర్తిగా గడవక ముందే దేశ రాజధాని నడిబొడ్డున ఎర్రకోట సమీపంలో కారు బాంబు పేలుడు జరిగి అనేక మంది మరణించడం దేశ సార్వభౌమత్వాన్ని మరోసారి సవాలు చేసినట్లయింది. సౌత్ బ్లాక్‌లోని ప్రధానమంత్రి కార్యాలయమూ, లోక్‌కల్యాణ్ మార్గ్‌లోని ఆయన నివాసమూ ఎర్రకోటకు సమీపంలోనే ఉన్నాయి. ఆపరేషన్ సిందూర్ ద్వారా భారతదేశ స్వావలంబన, వ్యూహాత్మక స్వతంత్రతను నిరూపించుకున్నామని, దేశంలోనే తయారు చేసిన ఆయుధాలతో ఉగ్రవాద నెట్‌వర్క్‌లను, పాక్‌లో ఉన్న ఉగ్రవాద మౌలిక సదుపాయాలను ధ్వంసం చేశామని మోదీ గత ఆగస్టు 15న ఎర్రకోటపై నుంచి ప్రకటించారు. శ్రీకృష్ణుడి సుదర్శన చక్రం మిషన్‌ను ప్రారంభిస్తున్నామని దాని ద్వారా శత్రువు చొరబాట్లను తిప్పికొట్టి అతి వేగంగా ఎదురుదాడులు చేసేందుకు సిద్ధంగా ఉంటామని కూడా ఆయన తన ఎర్రకోట ప్రసంగంలో తెలిపారు.

విషాదకరమైన విషయం ఏమంటే పహల్గామ్ హత్యాకాండ లేవనెత్తిన అనేక ప్రశ్నలకు జవాబులు రాకముందే ఎర్రకోట సంఘటన సంభవించింది. పహల్గామ్ సంఘటన జమ్మూ-కశ్మీర్‌లో జరిగితే ఢిల్లీలో చోటుచేసుకున్న వైపరీత్యం వెనుక కశ్మీర్ నుంచి వచ్చిన ఉగ్రవాదుల హస్తం ఉన్నదని తేలింది. ఈ ఉగ్రవాద సంఘటన సాయంత్రం 7 గంటలకు జరిగితే ఆ సమయానికి కొద్ది గంటలముందే ఢిల్లీ పొలిమేరల్లోని ఫరీదాబాద్‌లో రెండు ఇళ్లపై భద్రతాబలగాలు దాడి చేసి అక్కడ 2900 కిలోల పేలుడు సామగ్రి, రైఫిళ్లు, పిస్టళ్లు స్వాధీనం చేసుకున్నాయి. ఈ రెండు సంఘటనల వెనుక పాకిస్థాన్‌లో ఉన్న అంతర్జాతీయ ఉగ్రవాద సంస్థలు జైషే మహమ్మద్, అన్సర్ ఘజ్వత్ ఉల్ హింద్ ప్రమేయం ఉన్నదని, ఈ సారి జమ్మూ-కశ్మీర్‌కు చెందిన విద్యాధికులైన వైద్యులు ఉగ్రవాదులుగా ప్రత్యక్షమయ్యారని హోంశాఖ వర్గాలు చెబుతున్నాయి. 1999లో భారత విమానం హైజాక్‌కు గురైన తర్వాత భారత్ విడుదల చేసిన ఉగ్రవాది మసూద్ అజర్ స్థాపించిన సంస్థే జైషే మహమ్మద్. ఆ సంస్థ ద్వారా మసూద్ అజర్ పాకిస్థాన్ నుంచి భారత్ వ్యతిరేక ఉగ్రవాద కార్యకలాపాలు నిర్వహిస్తూనే ఉన్నాడు. 2001లో పార్లమెంటు పైన, 2019లో పుల్వామాలో సైనికులు ప్రయాణిస్తున్న బస్సుపైన దాడుల వెనుక మసూద్ హస్తం ఉన్నది. అతడి ఉగ్రవాద దౌష్ట్యాలకు పాక్ ప్రభుత్వం అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తోంది. ఇప్పుడు ఆయన సోదరి సదియా సైతం మహిళా విభాగాన్ని నెలకొల్పి ఉగ్రవాద మహిళలను మన దేశంలో ప్రవేశపెట్టిందని వార్తలు వస్తున్నాయి.

పహల్గామ్ సంఘటన తర్వాత కూడా జమ్మూ కశ్మీర్‌లో పాక్ ప్రేరేపిత ఉగ్రవాద కార్యకలాపాలు కొనసాగుతున్నాయని, అవి దేశ రాజధాని దాకా వ్యాపించాయని, ఉగ్రవాదులు పేలుడు సామగ్రి కూడా భారీ ఎత్తున సరఫరా చేయగలుగుతున్నారని ఎర్రకోట, ఫరీదాబాద్ సంఘటనలు నిరూపిస్తున్నాయి. ఢిల్లీ, ముంబై, గుజరాత్‌తో పాటు దేశంలోని అనేక ప్రాంతాల్లో రెడ్ అలర్ట్ జారీ చేశారు. అప్రమత్తంగా ఉండాలని అన్ని రాష్ట్ర ప్రభుత్వాలకు సందేశం పంపారు. దేశ వ్యాప్తంగా అనేక రైల్వే స్టేషన్లలో తనిఖీలు కూడా ప్రారంభమయ్యాయి.

మంగళవారం మెట్రోలో ఢిల్లీ విశ్వవిద్యాలయానికి వెళ్లే మెట్రో రైలు చాలా ఖాళీగా కనపడింది. మెట్రోలో ప్రయాణీకులు భయంభయంగా కనపడ్డారు. ఎర్రకోట వద్ద మెట్రోను ఆపనే లేదు. ఈ నేపథ్యంలో ఇంకా ఎక్కడెక్కడ దేశంలో ఉగ్రవాద శిబిరాలున్నాయి? ఎంత పేలుడు సామగ్రి వారి వద్ద ఉన్నది? ఇంకా ఎన్ని ఘటనలు జరిగే అవకాశాలున్నాయి? అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఈ ప్రశ్నలకు సమాధానం ఎవరు చెప్పగలరు? మన భద్రతా దళాలు గతంలో కంటే ఎక్కువగా గూఢచార సమాచారం సేకరించి అనేక మంది ఉగ్రవాదులను హతమార్చి, ఎన్నో దాడులు చేస్తూనే ఉన్నాయి కానీ అవేవీ సరిపోవడం లేదు.



'మేము ఈ సంఘటన లోతు దాకా వెళతాం. ఎవర్నీ వదిలిపెట్టం..' అని ప్రధానమంత్రి భూటాన్‌లో ప్రకటించారు. హోంమంత్రి అమిత్ షా, రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ కూడా ఇదే విధంగా ప్రకటనలు చేశారు. పహల్గామ్ సంఘటన సమయంలో సౌదీ అరేబియాలో ఉన్న మోదీ తన పర్యటనను వెన్వెంటనే రద్దు చేసుకుని పాకిస్థాన్ గగన తలం నుంచి కాకుండా వేరే మార్గంలో ఇండియాకు తిరిగి వచ్చారు. ఆ తర్వాత బిహార్‌లోని మధుబనికి వెళ్లి ఒక బహిరంగ సభలో మాట్లాడుతూ ఉగ్రవాదులు భూమిపై ఎక్కడ దాక్కున్నా భారత్ గుర్తించి, వెంటాడి హతమారుస్తుందని ప్రకటించారు. ఈ సారి దేశ రాజధానిలోనే ఉగ్రవాద ఘటన జరిగిన తర్వాత కూడా భూటాన్ పర్యటనకు మోదీ వెళ్లారు. ఉగ్రవాద ఘటన తర్వాత ఉన్నత స్థాయి భద్రతాధికారుల సమావేశం నిర్వహించే బాధ్యతను ఆయన కేంద్ర హోంమంత్రి అమిత్ షాకు వదిలిపెట్టడం విస్మయం కలిగిస్తోంది. మంగళవారం ఉదయం నుంచి అమిత్ షా, ఎన్ఐఏ అధికారులు, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ సమావేశాలు నిర్వహిస్తూనే ఉన్నారు. ఉగ్రవాద దాడుల్లో సైనికులు, ప్రజలు మరణించినప్పుడల్లా ఇలాంటి భద్రతా సమావేశాలు జరుగుతూనే ఉంటాయి. ఉగ్రవాదుల్ని వదిలిపెట్టబోమని మన నేతలు హెచ్చరికలు జారీ చేస్తూనే ఉంటారు. భారత్‌కు వ్యతిరేకంగా ఉగ్రవాద కార్యకలాపాలను పాక్ ప్రేరేపిస్తుందని వివరించేందుకు మన పార్లమెంటరీ ప్రతినిధి బృందాలు పలు దేశాలకు వెళ్లడం కూడా పరిపాటి అయిపోయింది. ఎంత కాలం ఇలా చేయగలం?

అసలు ఈ సంఘటనలకు ఎవరు జవాబుదారీగా వ్యవహరించాలి? రైలు ప్రమాదాలకు బాధ్యత వహించకపోవడం సరే, కనీసం ఉగ్రవాద ఘటనలకైనా ఎవరైనా ఒకరు బాధ్యత వహించాలి కదా! ఎవరో ఒకరు నైతిక బాధ్యత వహించి రాజీనామా చేయడం వల్ల పరిష్కారం లభిస్తుందా? అయితే భారత్‌లో పాక్ ఉగ్రవాదానికి అడ్డుకట్ట ఎలా వేయగలం అన్న ప్రశ్న దేశ ప్రజలందరి గుండెల్లోనూ మారుమ్రోగుతున్నది. ప్రముఖ జర్నలిస్టు అర్నాబ్ గోస్వామి తరుచూ 'దేశం తెలుసుకోవాలనుకుంటుంది' (నేషన్ వాంట్ టు నో) అని అంటూంటారు. ఆయన చేసే ఈ వ్యాఖ్యకు నేటి పరిస్థితుల్లో ఎంతో ప్రాధాన్యమున్నది.

పహల్గామ్ సంఘటన తర్వాత భారత పాకిస్తాన్‌ల మధ్య నాలుగు రోజుల పాటు తీవ్ర ఘర్షణ జరిగింది. బిహార్ మోదీలో హెచ్చరించిన విధంగానే పహల్గామ్ దారుణం జరిగిన రెండు వారాలకు పాక్‌పై భారత్ దాడులు ప్రారంభించింది. అణ్వస్త్ర దాడులు జరిగే ప్రమాదం కూడా ముంచుకొచ్చిందని అనేకమంది ఆందోళన వ్యక్తం చేశారు అయితే యుద్ధం తీవ్రమవుతున్న దశలో కాల్పుల విరమణ జరిగింది. అందుకు కారణాలు, మనకు జరిగిన నష్టాలపై అనేక చర్చలు ఇంకా జరుగుతూనే ఉన్నాయి. వాటిని పక్కన పెడితే, కాల్పుల విరమణ తర్వాత ప్రధాని మోదీ దేశ ప్రజలనుద్దేశించి అత్యంత కీలకమైన ప్రకటన ఒకటి చేశారు. 'భారతదేశం తన సైనిక చర్యను కేవలం తాత్కాలికంగా నిలిపివేసింది. భవిష్యత్‌లో పాకిస్తాన్ ఎటువంటి దాడి చేసినా భారత్ తిరిగి తీవ్రమైన ప్రతీకారం తీర్చుకుంటుంది. ఎవరి ప్రమేయం లేకుండా భారత్ స్వంత నిర్ణయం తీసుకుని పాక్‌కు బుద్ధి చెబుతుంది, పాక్ ప్రతి చర్యా గమనిస్తున్నాం.. ఉగ్రవాదం, చర్చలు కలిసికట్టుగా సాగవు. ఉగ్రవాదం, వర్తకం కూడా కలిసి సాగవు' అని హెచ్చరించారు. ఇప్పుడు దేశ రాజధాని ఢిల్లీలోనే పాక్ ప్రేరిత ఉగ్రవాదులు దాడులు చేశారు. భారత-పాక్ సంఘర్షణలో కొన్ని నష్టాలు జరిగినప్పటికీ మన సైనిక స్థావరాలు, వాయుతల రక్షణ సంస్థలు అవసరమైతే ఎప్పుడు ఏ దాడికైనా సంసిద్ధంగా ఉన్నాయని ఎయిర్ చీఫ్ మార్షల్ అమర్‌ప్రీత్ సింగ్ కొద్ది రోజుల క్రితం ప్రకటించారు. ఈ నేపథ్యంలో ఇప్పుడు పాక్‌కు మన ప్రధానమంత్రీ, సాయుధ బలగాలూ ఎలా బుద్ధి చెబుతారో అని దేశం ఉత్కంఠతో ఎదురుచూస్తున్నది.

నిజానికి మోదీ వైఖరి కన్నా పాకిస్తాన్ వైఖరే తీవ్ర ఆశ్చర్యం కలిగిస్తోంది. తాము శాంతి సాధించాలనే స్ఫూర్తితోనే కాల్పుల విరమణకు అంగీకరించామని పాక్ ప్రధానమంత్రి గత మేలో ప్రకటించారు. తాము కాల్పుల విరమణకు కట్టుబడి ఉన్నామని, తమంతట తాము ముందుగా దాన్ని ఉల్లంఘించబోమని పాక్ సైనిక అధికార ప్రతినిధి సైతం అన్నారు. ఒకరకంగా పాకిస్థాన్ వెనక్కి తగ్గిన వాతావరణం కనిపించింది. కాల్పుల విరమణ వెనుక అమెరికా హస్తం ఏ మాత్రం లేదని ఆ దేశం ఖండించలేదు. వైట్‌హౌజ్‌లో పాక్ సైనిక దళాధిపతి మునీర్‌కు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ విందు ఇచ్చి మరీ తన మాట విన్నందుకు అభినందించారు. ఇప్పుడు మరి ఉన్నట్లుండి ఆ దేశ ఉగ్రవాదులు ఎందుకు క్రియాశీలమయ్యారు? దాని వెనుక ఎవరి హస్తం ఉన్నది? దీని పర్యవసానాలు ఎలా ఉంటాయి?

(ఆంధ్రజ్యోతి ఢిల్లీ ప్రతినిధి)

> **ఉగ్రవాద దాడుల్లో సైనికులు, ప్రజలు మరణించినప్పుడల్లా ఉన్నత స్థాయి భద్రతా సమావేశాలు జరుగుతూనే ఉంటాయి. ఉగ్రవాదుల్ని వదిలిపెట్టబోమని మన నేతలు హెచ్చరికలు జారీ చేస్తూనే ఉంటారు. భారత్‌కు వ్యతిరేకంగా ఉగ్రవాద కార్యకలాపాలను పాక్ ప్రేరేపిస్తుందని వివరించేందుకు మన పార్లమెంటరీ ప్రతినిధి బృందాలు పలు దేశాలకు వెళ్లడమూ పరిపాటి అయిపోయింది. ఇలా ఎంత కాలం చేయగలం?**

రాజ్యాధికారం దిశగా రిజర్వేషన్ల పోరు!

తెలంగాణలో బీసీ జనాభాకు అనుగుణంగా ఆ సామాజిక వర్గాలకు రిజర్వేషన్ల పెంపుదల యత్నాలు సందిగ్ధంలో పడిన నేపథ్యంలో, బీసీల సంయుక్త కార్యాచరణ కమిటీ ఇటీవల తెలంగాణ రాష్ట్ర బంద్‌కు పిలుపునిచ్చింది. విశేషమేమంటే, ఆ బంద్‌కు అన్ని రాజకీయ పక్షాలూ మద్దతునిచ్చాయి. బీసీ రిజర్వేషన్ల పెంపుదలకు రాజకీయ పార్టీలు ప్రకటించిన ఈ మద్దతులో చిత్తశుద్ధి ఉన్నదా? అన్న సందేహం బీసీ విద్యావంతులలో వ్యక్తమవుతోంది. ఇది సహేతుకమైనదే.

కాంగ్రెస్ పార్టీ, నెహ్రూ నాయకత్వంలో 1959 మూడంచెల ప్రజాస్వామిక వికేంద్రీకరణ వ్యవస్థ నేర్పాటు చేసింది. రెవెన్యూ, శాంతి-భద్రతలు మినహాయించి, గ్రామ పాలనకు సంబంధించిన విధులు, అధికారాలు స్థానిక సంస్థలకు అప్పగించడం వల్ల, కేంద్ర-రాష్ట్రాలతో సమానంగా ప్రజలకు సేవలను అందించాయి. అయితే 1980వ దశకం నుంచి బీసీలు రాజ్యాధికారంలో భాగస్వాములవుతున్న క్రమంలో భూస్వామ్య అగ్రకులాలు తమ ఆధిపత్యం పోతుందనే భావనతో రాష్ట్ర నాయకత్వంపై ఒతిడి తెచ్చి పంచాయత్‌రాజ్ వ్యవస్థలు నిర్వీర్యమయ్యేలా చేశారు. సరళీకృత ఆర్థిక విధానాలు ఆరంభమయిన తరువాత పంచాయతీరాజ్ వ్యవస్థలు అందించే పౌర సేవలు కూడా ప్రభుత్వ-ప్రైవేట్ భాగస్వామ్య పద్ధతిలో నిర్వహిస్తున్నారు. ఈ వ్యవస్థలు స్వతంత్రంగా పనిచేయడం తగ్గి, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ కార్యక్రమాలు అమలు చేసే ఫీల్డ్ ఏజెన్సీ స్థాయికి దిగజారిపోయాయి. ఇప్పుడు ఈ స్థానిక పాలనా వ్యవస్థలకు తగిన అధికారాలు కొరవడ్డాయి. నిధులూ తగ్గిపోయాయి. ఫలితంగా నామమాత్ర పాలనా వ్యవస్థలుగా మిగిలిపోయాయి. స్థానిక పాలనా సంస్థలకు ఎన్నికైనవారు రాష్ట్ర ప్రభుత్వంపై అసంతృప్తిగా ఉన్నారు. ఈ పరిస్థితులలో బీసీ రిజర్వేషన్ల పెంపుదలకు పోరాటం కేవలం సంఖ్య పెరుగుదలకా? లేక రాజ్యాధికార సాధనకా? అనే విషయమై నిశిత విశ్లేషణ జరగవలసి ఉన్నది. బోధకుడుగా, పరిశోధకుడుగా దశాబ్దాల అనుభవం ఆధారంగా కొన్ని అంశాలను చర్చకు ప్రతిపాదిస్తున్నాను. ఈ చర్చ సామాజిక న్యాయం, సమాజ సమగ్ర అభివృద్ధికి దోహదం చేసేదిగా ఉండాలి. అత్యంత వెనుకబడిన తరగతుల (ఎంబీసీ), మహిళల ఆకాంక్షలను సమతుల్యం చేసే సూక్ష్మమైన చర్చలు జరిగితీరాలి.

ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు (ఈబీసీ) 10శాతం ప్రత్యేక రిజర్వేషన్లు కల్పించడంలో, రాజకీయ పార్టీలు తమ సైద్ధాంతిక విభేదాలను పక్కనపెట్టి 103వ రాజ్యాంగ సవరణను వేగంగా ఆమోదించాయి. ఈ చట్టాన్ని న్యాయ వ్యవస్థ కూడా సమర్థించింది. అయితే సామాజికంగా వెనుకబడిన కులాలకు 50శాతం పరిమితిని పెంచడంలో మాత్రం పార్టీల మధ్య అలాంటి ఏకాభిప్రాయం కనిపించదు! అంతేకాక, న్యాయ వ్యవస్థ కూడా ఈ పరిమితిని అధిగమించడంలో సానుకూలత చూపడం లేదనే భావన బీసీలలో విస్తృతంగా ఉంది. 1992లో 73వ, 74వ రాజ్యాంగ సవరణల ద్వారా షెడ్యూల్ కులాలు, షెడ్యూల్ తెగలు, మహిళలకు స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు కల్పించారు. అధికరణ 243(6) ప్రకారం బీసీల రిజర్వేషన్ల పరిమితిని ఆయా రాష్ట్రాల శాసనసభల అభిప్రాయానికే వదిలి వేయడం జరిగింది. 1994లో ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ సంస్థల చట్టం 50శాతం పరిమితి పరిధిలో 27శాతం బీసీల రిజర్వేషన్లను కల్పించింది. తమిళనాడు, మహారాష్ట్రలు ఈ పరిమితిని అధిగమించగా, కర్ణాటక ప్రభుత్వం ఓబీసీ రిజర్వేషన్లను పునర్వ్యవస్థీకరించేందుకు చర్యలు తీసుకున్నది. ప్రస్తుతం స్థానిక పాలనా సంస్థల ఉపసర్పంచ్‌లు, ఉపాధ్యక్షులు/చైర్మన్లకు రిజర్వేషన్లు లేకపోవడం వల్ల, ఈ సంస్థల నిర్ణయాలను ఉన్నత ఆధిపత్య కులాలే ప్రభావితం చేస్తున్నాయి.

> **బీసీల 42 శాతం రిజర్వేషన్లకు మద్దతునిస్తున్న పాలక, ప్రతిపక్షాలకు 'వెనుకబడిన కులాలకు రాజ్యాధికారంపై నిజమైన నిబద్ధత ఉందా? వివిధ మౌలిక అంశాలపై సమష్టి చర్చ జరిపి, బీసీలు రాజ్యాధికారం పొందడానికి స్పష్టమైన ఉద్యమ ప్రణాళికను తీసుకురావాలి. ఇది మాత్రమే రాజ్యాధికారాన్ని సాధించే దిశలో అర్థవంతమైన ముందడుగు అవుతుంది.**



తెలంగాణ రాష్ట్ర పరిపాలనను నిశితంగా పరిశీలిస్తే పోలీస్, రెవెన్యూ, పురపాలక, పట్టణాభివృద్ధి, నీటిపారుదల, రోడ్లు-భవనాలు, ఆహారం, పౌరసరఫరాలు, ప్రసార వ్యవస్థ, విద్య వంటి కీలక మంత్రిత్వ శాఖలు ప్రధానంగా ఒకే ఆధిపత్య కుల నియంత్రణలో ఉన్నాయి. బీసీలు రాష్ట్ర జనాభాలో 50శాతం కన్నా ఎక్కువ ఉన్నప్పటికీ, రాష్ట్ర మంత్రివర్గంలో వారి ప్రాతినిధ్యం అత్యంత తక్కువగా ఉంది. అంతేకాక, వారికి అప్పగించిన శాఖలు ప్రాధాన్యత లేనివిగా ఉన్నాయి. బీసీల అభ్యున్నతి పాలకవర్గం నిబద్ధత స్థాయిని ఇది స్పష్టంగా ప్రతిబింబించడం లేదా?

ప్రస్తావిత సవాళ్లు తెలిసికూడా అణగారిన కులాల వారికి 50 శాతం రిజర్వేషన్ల పరిమితిని, బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించే విషయంలో రాజకీయ పార్టీలు తరచుగా పరస్పర విమర్శలు చేసుకుంటున్నాయి. అందువల్ల, రాజకీయ పార్టీలు నిజంగా బీసీల రాజకీయ సాధికారతకు కట్టుబడి ఉన్నాయా లేక కేవలం రాజకీయ ప్రయోజనాల కోసమే మద్దతు తెలుపుతున్నాయా అన్న సందేహం బలపడుతోంది. ఈ సందర్భంలో రెండు అంశాల గూర్చి బీసీ సంయుక్త కార్యాచరణ కమిటీ, బీసీ విద్యార్థులు చర్చించుకోవాలి. మొదటిది- సామాజికంగా వెనుకబడిన కులాలకు 50శాతం రిజర్వేషన్ల పరిమితిని పెంచే విషయంలో రాజ్యాంగ సవరణ, న్యాయపరమైన సమీక్ష, రాజకీయ పార్టీల మద్దతు, అగ్రకులాల సానుకూలత, సామాజికంగా వెనుకబడిన కులాల ఐక్యత వంటి విషయాలలో రూపొందించుకోవాల్సిన వ్యూహం. ఈ వ్యూహం దీర్ఘకాలికమైనది. రెండవది- ప్రస్తుత పరిస్థితుల్లో బీసీలు రాజ్యాధికార సాధన దిశగా పయనించే వ్యూహం. తక్షణమే రాష్ట్ర చట్ట-పరిపాలనా పరిధిలో ఉన్నా చర్యలను ప్రభుత్వం తీసుకొనే విధంగా ఉద్యమ కార్యాచరణకు చర్చలు జరపడం, కార్యాచరణకు స్పష్టమైన రూపాన్ని ఇవ్వడం. ఈ చర్చకు కేంద్రంగా ఉండాల్సిన ముఖ్య అంశాలు ఎన్నో ఉన్నప్పటికి క్రింద పేర్కొన్న అంశాలు మరీ ముఖ్యమైనవి:

(అ) రాజ్యాంగ 11వ షెడ్యూల్‌లో పేర్కొన్న 29 విధులకుగాను కేవలం 10, 11; 12వ షెడ్యూల్‌లోని 18 విధులకుగాను 6, 8 మాత్రమే పట్టణ స్థానిక సంస్థలకు బదిలీ చేశారు. వాటి అమలుకు అవసరమైన నియమ నిబంధనలు స్పష్టంగా పేర్కొనకపోవడమే కాకుండా, తగిన ఆర్థిక వనరులు కూడా కల్పించలేదు. అందుకే పంచాయతీరాజ్ సంస్థలు నిర్వీర్యమయ్యాయి; (ఆ) రాష్ట్ర వార్షిక బడ్జెట్‌లో కనీసం 30-33శాతం నిధులను నేరుగా గ్రామీణ పట్టణ స్థానిక సంస్థలకు కేటాయించి, వాటి ద్వారా అమలయ్యే విధంగా చట్టబద్ధత కల్పించాలి. కేరళ, కర్ణాటకలు ఇటువంటి నమూనాను ఇప్పటికే అవలంబిస్తున్నాయి. ఒక రకంగా ఇది మన రాష్ట్రంలో షెడ్యూల్ కులాలు, షెడ్యూల్ తెగల ఉప-ప్రణాళిక నమూనాగా భావించవచ్చు; (ఇ) ఎమ్మెల్యేలు, ఎంపీలు స్థానిక పాలనా వ్యవస్థల్లో జోక్యాన్ని నివారించి, అవి స్వతంత్రంగా పనిచేసే వాతావరణాన్ని కల్పించాలి. నేడు పంచాయతీరాజ్ సంస్థలు 'ఎమ్మెల్యే రాజ్'గా మారిపోయాయి. ఇది స్థానిక స్వయంప్రతిపత్తికి విరుద్ధంగా ఉంది; (ఈ) జిల్లా ప్రణాళికా కమిటీలకు, రాష్ట్ర ఆర్థిక కమిషన్‌కు స్వతంత్ర ప్రతిపత్తి, తగిన వనరులు కల్పించాలి. స్థానిక పాలనా వ్యవస్థలో రెండవ స్థాయి నాయకత్వ స్థానాలకు కూడా రిజర్వేషన్ అమలు చేయాలి.

ఈ ప్రతిపాదనలకు షెడ్యూల్ కులాల, షెడ్యూల్ తెగల, స్త్రీల నుంచే కాకుండా అగ్రకులాల మద్దతు కూడా ఉంటుంది, ఎందుకంటే, స్థానిక సంస్థలకు ఎన్నికైన వారు తమ పరిధిలోని అంశాలపై స్వతంత్ర నిర్ణయాలు తీసుకునే సామర్థ్యం కలిగి ఉంటే, ప్రజలకు కావలిసిన సేవలను సులభంగా అందించవచ్చు. ఈ ప్రతిపాదనలు రాష్ట్ర పరిపాలనా పరిధిలో ఉన్నాయి కాబట్టి వాటిని ప్రభుత్వం అమలులోకి తీసుకురావాలి. అప్పుడే ప్రభుత్వానికి బీసీల రాజ్యాధికారంపై నిజమైన నిబద్ధతత ఉన్నట్లుగా భావించాలి. ఈ అంశాలపై సమిష్టి చర్చ జరిపి, బీసీల రాజ్యాధికార సాధనానికి స్పష్టమైన ఉద్యమ ప్రణాళికను రూపొందించాలి. ఈ ప్రణాళిక లక్ష్యాలు సాధించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకురావాలి. అప్పుడే రాజ్యాధికార సాధన దిశగా అర్థవంతమైన అడుగు పడుతుంది.

• చిన్నాల బాలరాములు
విజిటింగ్ ప్రొఫెసర్, 'సెస్'

మేడారానికి నేడు నలుగురు మంత్రులు

ములుగు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారంలో బుధవారం మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కొండా సురేఖ, ధనసరి సీతక్క, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పర్యటించనున్నారు. రానున్న మహా జతర నేపథ్యంలో మేడారంలో జరుగుతున్న అభివృద్ధి పనులను వారు పరిశీలించనున్నారు. ఉదయం 11 గంటలకు హెలీకాప్టర్ ద్వారా మేడారానికి చేరుకుంటారు. 11.30 గంటలకు పనులను పరిశీలించి, మధ్యాహ్నం 12 గంటలకు అధికారులతో సమావేశమై పనుల పురోగతిపై సమీక్షిస్తారు. మధ్యాహ్నం 2గంటలకు తిరిగి హైదరాబాద్ బయలుదేరుతారు.



సమ్మయ్యనగర్‌లో వరద బాధితురాలు ఇంటిని పరిశీలిస్తున్న సీఎం (ఫైల్)



హనుమకొండలో కేయూ రోడ్‌లోని సమ్మయ్యనగర్ వద్ద వరద (ఫైల్)

వరద బాధితులకు చేయూత

మొంథా తుపానుతో నష్టపోయిన వారికి ఆర్థిక సహాయం

- ఉమ్మడి వరంగల్ జిల్లాకు రూ.12.12 కోట్లు విడుదల
- వరంగల్ నగరంలో 8,059 ఇళ్లు దెబ్బతిన్నట్లుగా గుర్తింపు
- ఒక్కో ఇంటికి రూ.15 వేల చొప్పున రూ.12.08 కోట్లు కేటాయింపు
- మహబూబాబాద్‌లో 16 ఇళ్లకు రూ.2.40 లక్షలు, ములుగులో 5 ఇళ్లకు రూ.75 వేలు
- పంట నష్టం, మృతుల కుటుంబాలకు విడుదల కాని పరిహారం
- అధికారుల నుంచి ప్రభుత్వానికి నివేదికలు చేరకపోవడమే కారణం

▪ ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్

వరద బాధితులకు చేయూతనిచ్చేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. గత నెల 31న వరంగల్ నగరంలో పర్యటించిన సందర్భంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు, మొంథా తుఫాన్‌కు పాక్షికంగా ఇళ్లు దెబ్బతిన్న బాధితులకు పరిహారం విడుదల చేసింది. అలాగే పంటనష్టంతో పాటు వరదలకు ప్రాణాలు కోల్పోయిన వారి వివరాలను ఇవ్వాలని అధికారులను ఆదేశించింది. చాలాఇళ్లు నేలమట్టం కాగా, వీరందరికీ పక్కా గృహాలు అందిస్తామని సీఎం ప్రకటించారు. ఈ మేరకు అధికారులు నేలమట్టమైన ఇళ్లను గుర్తించి నివేదికలు తయారు చేస్తున్నారు. అయితే తాత్కాలికంగా చేయూతనిస్తున్నప్పటికీ ముంపునకు శాశ్వత పరిష్కారం చూపించాలని బాధితులు డిమాండ్ చేస్తున్నారు. పంట నష్టపోయిన రైతులు సైతం పరిహారం కోసం ఎదురుచూస్తున్నారు. నివేదికలు ఇవ్వటంలో అధికారుల వైఫల్యం తమకు శాపంగా మారుతుందనలో అన్నదాతలు ఉన్నారు.

రూ.12.12కోట్ల సాయం

మొంథా తుఫాన్ ఉమ్మడి జిల్లాను అతాలకుతలం చేసింది. ప్రధానంగా వరంగల్ నగరాన్ని నీటముంచింది. లోతట్టు ప్రాంతాలన్నీ జలమయం అయ్యాయి. అక్టోబరు 29, 30 తేదీల్లో వాన దంచికొట్టింది. దీంతో వరంగల్, హనుమకొండ, కాజీపేట నగరాల్లో కాలనీల నుంచి జనం బయట అడుగుపెట్టలేని పరిస్థితి. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అక్టోబరు 31న వరంగల్ నగరంలో వరద ముంపు ప్రాంతాల్లో పర్యటించారు. హనుమకొండ కలెక్టరేట్‌లో ఉమ్మడి జిల్లా ప్రజాప్రతినిధులు, అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా వరద బాధితులకు అండగా ఉంటానని హామీ ఇచ్చారు. అధికారులు వరద నష్టంపై నివేదికలు ఇవ్వాలని ఆదేశాలు జారీ చేశారు. ఇటీవల ప్రభుత్వానికి పాక్షికంగా ఇళ్లు దెబ్బతిన్న బాధితులకు రూ.15వేల చొప్పున ప్రభుత్వం మంగళవారం విడుదల చేసింది.

హనుమకొండ నగరంలో పలు కాలనీల్లో వరద పోటుకు 4,691 ఇళ్లు పాక్షికంగా దెబ్బన్నట్లుగా అధికారులు గుర్తించారు. వీరికి ఒక్కొక్కరికి రూ.15వేల చొప్పున రూ.7.03 కోట్లను ప్రభుత్వం విడుదల చేసింది. అలాగే వరంగల్ నగరంలో 3,368 ఇళ్లు పాక్షికంగా దెబ్బతిన వీరికి రూ.5.05 కోట్లను పరిహారంగా మంజూరు చేసింది. నగరంలో మొత్తంగా 8,059 ఇళ్లు దెబ్బతిన్నట్లుగా గుర్తించి రూ.12.08 కోట్లను ప్రభుత్వం విడుదల చేసింది. అలాగే వరదలకు మహబూబాబాద్ జిల్లాలో 16ఇళ్లు పాక్షికంగా దెబ్బతినగా, వీరికి రూ.2.40లక్షలు, ములుగు జిల్లాలో 5ఇళ్లకు రూ.75వేలను పరిహారంగా ప్రభుత్వం విడుదల చేసింది. మొత్తంగా మొంథా తుఫాన్‌కు పాక్షికంగా ఇల్లు దెబ్బతిన్న బాధితులకు ప్రభుత్వం రూ.12.12కోట్ల నిధులు మంజూరు చేయటంతోబాధితుల్లోఆనందంవ్యక్తం అవుతోంది.

ఆస్తి, ప్రాణ నష్టపరిహారంపైనే ఆశలు

మొంథా తుఫాన్‌కు రైతులు విలవిలలాడారు. చేతికి వచ్చే పంటలు పూర్తిగా నీటిపాలయ్యాయి.వరంగల్, హనుమకొండ, మహబూబాబాద్ జిల్లాల్లో భారీగా పంటలు దెబ్బతినగా, ములుగు, భూపాలపల్లి, జనగామ జిల్లాల్లో పాక్షికంగా పంటల్లో ఇసుకమేటలు వేశాయి. ప్రధానంగా పత్తి, వరి, మిరప, మొక్కజొన్న పంటలు దెబ్బతిన్నాయి. పత్తి వానలకు తడిసి ముద్దయింది. దీంతో రైతులు తీవ్రశోకంలో ఉన్నారు. ప్రభుత్వం అందించే సాయం కోసం ఎదురుచూస్తున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి తన పర్యటనలో పంట నష్టం వాటిల్లిన రైతులకు ఎకరాకు రూ.10వేల నష్టపరిహారం చెల్లిస్తామని ప్రకటించారు. అయితే ఇప్పటి వరకు పంట నష్టంపై అధికారులు ప్రభుత్వానికి సమగ్ర నివేదికలు అందించలేదు. పలుమార్లు ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చినప్పటికీ సర్వేల పేరుతో అధికారులు తాత్సారం చేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. తాజాగా పాక్షికంగా ఇళ్లు దెబ్బతిన్న వారికి (మిగతా 7వ పేజీలో)



కాజీపేట రైల్వే స్టేషన్‌లో తనిఖీలు చేస్తున్న పోలీసులు

రైల్వేస్టేషన్లలో విస్తృత తనిఖీలు

ఢిల్లీ బాంబు పేలుడు ఘటనతో అప్రమత్తం

గిర్మాజీపేట/కాజీపేట, నవంబరు11(ఆంధ్రజ్యోతి): ఢిల్లీలోని ఎర్రకోట మెట్రో స్టేషన్ సమీపంలో సోమవారం సాయంత్రం జరిగిన భారీ పేలుళ్ల నేపథ్యంలో మంగళవారం వరంగల్ రైల్వేస్టేషన్‌లో పోలీసులు తనిఖీలు నిర్వహించారు. ప్రభుత్వ రైల్వే పోలీసు (జీఆర్‌పీ) సీఐ పి.సురేందర్, రైల్వే రక్షిత దళం (ఆర్‌పీఎఫ్) సీఐ కె.శ్రీనివాస్ పర్యవేక్షణలో సిబ్బంది రైల్వేస్టేషన్‌లోని నాలుగు ప్లాట్‌ఫారాలు, వరంగల్, శివనగర్ ప్రవేశ ద్వారాలు, ప్రయాణీకుల విశ్రాంతి మందిరాలను తనిఖీ చేశారు. ప్రయాణికుల బ్యాగులను పరిశీలించారు. అనుమానాస్పదంగా కనిపించిన వారి వివరాలు సేకరించారు. రైల్వేస్టేషన్‌లో ఎవరైనా అనుమానాస్పదంగా కనిపించినా, వస్తువులు, బ్యాగులు వదిలి వెళ్లినా వెంటనే 100లేదా 139 (రైల్వే కంట్రోల్)కు సమాచారం ఇవ్వాలని కోరారు.

కాగా ఢిల్లీ బాంబు పేలుడు నేపథ్యంలో సోమవారం రాత్రి, మంగళవారం ఉదయం పోలీసులు కాజీపేట రైల్వే స్టేషన్, ఇతర ప్రాంతాల్లో భారీగా తనిఖీలు చేపట్టారు. అనుమానితుల బ్యాగులను తనిఖీ చేశారు. డాగ్‌స్క్వాడ్‌తో చెక్‌చేశారు. ముందస్తు చర్యల్లో భాగంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా తనిఖీలు చేస్తున్నామని స్థానిక ఇన్‌స్పెక్టర్ వై.సుధాకర్‌రెడ్డి తెలిపారు. సీఐ వెంట ఎస్సై నవీన్‌కుమార్ పోలీస్ సిబ్బంది ఉన్నారు.

పాఠశాలల తనిఖీలకు ఏడు బృందాలు

వరంగల్ ఎడ్యుకేషన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలను తనిఖీ చేసేందుకు జిల్లా స్థాయిలో ఏడు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు జిల్లా అడిషనల్ కలెక్టర్, డీఈవో ఎ.వెంకట్‌రెడ్డి తెలిపారు. కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. విద్యానాణ్యతను మెరుగుపచడం, పాఠశాలల పర్యవేక్షణను బలోపేతం చేయడానికి ఈ బృందాలు పాఠశాలలను నిరంతరం తనిఖీలు చేస్తాయన్నారు. మూడు బృందాలు ప్రాథమిక పాఠశాలలను, మూడు బృందాలు హైస్కూళ్లను, ఒక బృందం ప్రాథమికోన్నత స్థాయి పాఠశాలలను తనిఖీలు చేస్తాయన్నారు. విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు, హాజరు, బోధన ప్రమాణాలు, డిజిటల్ లర్నింగ్, ఎఫ్ఎల్ఎన్, రికార్డులు, మౌలిక వసతులు, పరిశుభ్రత, భద్రత ప్రమాణాలు తదితర అంశాల్లో తనిఖీలు చేసి నివేదికలు సమర్పిస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎంవో మన్మోహన్, టీచర్లు పాల్గొన్నారు.

‘ధాన్యం’ దొంగల ఆటకట్టు

- ఐకేపీ కొనుగోళ్ల అక్రమాల్లో ప్రధాన సూత్రధారి బెజ్జంకి శ్రీనివాస్ సహా 13 మంది అరెస్టు
- అరెస్టయిన వారిలో శ్రీనివాస్ భార్య, కుమారులు, కోడళ్లు..
- కాట్రపల్లి క్లస్టర్ ఏఈవో ఎం.సుప్రియ, ఆమె భర్త కూడా...
- నిందితుల పేరిట వివిధ బ్యాంకుల్లో ఉన్న రూ.54 లక్షల నగదు ఫ్రీజ్
- ప్రధాన సూత్రధారి నుంచి రూ.9.50 లక్షల నగదు స్వాధీనం
- రూ.32 లక్షల విలువ చేసే భూమి పత్రాలు, రూ.8లక్షల విలువ చేసే నెక్సాన్ కారు సీజ్
- ఇప్పటికే ఏడుగురి అరెస్టు.. పరారీలో మరో ఇద్దరు

7



వివరాలు వెల్లడిస్తున్న ఈస్ట్‌జోన్ డీసీపీ అంకిత్‌కుమార్



స్వాధీనం చేసుకున్న నగదు, భూమి పత్రాలు

జీడబ్ల్యూఎంసీకి కోతి తిప్పలు

- కోతులను పట్టే కాంట్రాక్టు ఖరారు
- ఒక్కో కోతికి రూ.520 చెల్లించనున్న అధికారులు



వరంగల్ కార్పొరేషన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): నగర పాలక సంస్థ పరిధిలో కోతులను పట్టే కాంట్రాక్టు పనికి మంగళవారం టెండర్ నిర్వహించారు. జీడబ్ల్యూఎంసీ అదనపు కమిషనర్ చంద్రశేఖర్ పర్యవేక్షణలో టెండర్ సీల్ బాక్స్‌లను తెరిచి తక్కువ కొటేషన్ వేసిన కాంట్రాక్టర్‌కు కోతులు పట్టే పని అప్పగించారు. రెండు వారాల కిందట జీడబ్ల్యూఎంసీ బహిరంగ ప్రకటన చేయడంతో ఆంధ్రప్రదేశ్ ప్రాంతానికి చెందిన చిన్నరి శివయ్య, దాసరి నాగభూషణం అనే వ్యక్తులు టెండరు వేశారు. ఇద్దరిలో శివయ్య ఒక కోతిని రూ.520 పట్టేందుకు కొటేషన్ వేసి కాంట్రాక్ట్ దక్కించుకున్నాడు.

కోతిని పట్టిన తర్వాత 10 రోజులు వాటికి కావలసిన ఆహారంతో పాటు అధికారుల సమక్షంలో ఆరోగ్య పరీక్షలు చేసి ఆటవీప్రాంతంలో ఫారెస్ట్ అధికారులు పర్యవేక్షణలో విడిచి పెడతారు. అప్పటివరకు కాంట్రాక్టర్‌దే పూర్తి బాధ్యత అని షరతులు విధించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈ సత్యనారాయణ, సీఎంహెచ్‌వో డాక్టర్ రాజారెడ్డి, ఈఈ మహేందర్, వెటర్నరీ అధికారి డాక్టర్ గోపాల్‌రావు, సూపరింటెండెంట్‌లు దేవేందర్, రావుల ఆనంద్‌తో పాటు జూనియర్ అసిస్టెంట్ అనిల్, పుష్పరాజ్ తదితరులు పాల్గొన్నారు.

నగరంలో గాయత్రి మహాయజ్ఞం

15, 16 తేదీల్లో హంటర్‌రోడ్డులోని బీఎస్‌కే గ్రౌండ్‌లో నిర్వహణ

వరంగల్ కల్చరల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 15, 16 తేదీల్లో నగరంలో గాయత్రి మహాయజ్ఞాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. అఖిలభారత విశ్వగాయత్రి పరివార్, గాయత్రి తీర్థ్ శాంతి కుంజ్ హరిద్వార్ వారి ఆధ్వర్యంలో 108 హోమ గుండాలలో ఈ యజ్ఞాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు వనమా సురేష్, జేఎన్.శర్మ తెలిపారు.

హంటర్‌రోడ్డులో గల గ్రీన్‌వుడ్ స్కూల్ వెనక బీఎస్‌కే గ్రౌండ్‌లో రెండు రోజుల పాటు హోమాలు జరుగుతాయని తెలిపారు. లోక కల్యాణార్థం నిర్వహించే ఈ వేడుకకు హరిద్వార్ నుంచి 12 మంది పండితులు వస్తున్నారని తెలిపారు. దేశంలోని 24 వందల తీర్థాలలోని పవిత్ర మట్టి, జలంతో నిండిన కలశాన్ని హోమాలు నిర్వహించే యాగశాలకు తీసుకువస్తామన్నారు. ఈ నెల 15 శనివారం సాయంత్రం 3గంటలకు పోతన విజ్ఞాన పీఠం నుంచి యాగశాల వరకు కలశంతో శోభయాత్ర నిర్వహిస్తామని, సాయంత్రం 7 గంటలకు యాగశాలలో సహస్ర దీప యజ్ఞం నిర్వహిస్తామని తెలిపారు. 16న ఆదివారం ఉదయం 9 గంటలకు 108 హోమ గుండాలతో జరిగే గాయత్రి మహాయజ్ఞంలో దాదాపు 3 వేల మంది పాల్గొంటారని పేర్కొన్నారు. హోమంలో పాల్గొనే పురుషులు ధోవతి ఉత్తరీయం, మహిళలు పసుపు రంగు చీరలను ధరించాలన్నారు.

ఈ-కేవైసీ ఉంటేనే ‘రేషన్’

- ఆధార్ అప్‌డేట్ లేక ఇబ్బందులు
- కేంద్రాల చుట్టూ తిరుగుతున్న లబ్ధిదారులు

వరంగల్ కలెక్టరేట్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): నూతనంగా రేషన్ కార్డులు పొందిన లబ్ధిదారుల్లో కొందరికి సరుకులు అందడం లేదు. ఈ- కేవైసీ ప్రక్రియ పూర్తి చేసుకోనివారికి ఈ సమస్య ఎదురవుతోంది. రేషన్‌కార్డులో పేర్లున్న కుటుంబ సభ్యులందరూ సమీపంలోని రేషన్ దుకాణాలకు వెళ్లి ఈ పాస్ యంత్రం ద్వారా బయోమెట్రిక్ వేలిముద్రలు అప్‌డేట్ చేయించుకోవాలని సంబంధిత అధికారులు సూచిస్తున్నారు. ప్రతీ ఒక్కరు ఈ- కేవైసీ నమోదు చేయించుకోవాలని సుమారు రెండు సంవత్సరాల నుంచి అధికారులు సూచిస్తూనే ఉన్నారు. ఈ ప్రక్రియ కోసం ప్రభుత్వం ఎప్పటికప్పుడు గడువు పెంచుకుంటూ వెళుతోంది. ఈ- కేవైసీ చేయించుకోని యెడల రేషన్ సరుకులు బంద్ చేస్తామని ప్రకటించింది. ఆధార్‌కు ఈ-పాస్ యంత్రానికి అనుసంధానం చేయడం వల్ల బియ్యం పంపిణీ దుర్వినియోగం కాకుండా ఉండేందుకే ఈ ప్రక్రియ చేపట్టామని అధికారులు చెబుతున్నారు.

అప్‌డేట్ లేక ఇబ్బందులు..

ఆధార్ అప్‌డేట్ లేకపోవడంతో కొందరు లబ్ధిదారులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఆధార్ కేంద్రాలకు వెళ్లి అప్‌డేట్ చేయించుకున్నప్పటి కీ ఈ-కేవైసీ ప్రక్రియలో కొందరి వేలిముద్రలు రావడం లేదు. దీంతో ఆధార్ కేంద్రాలకు వెళ్లి ప్రశ్నిస్తే ఆధార్ అప్‌డేట్ కాకపోవడంతోనే ఈ-కేవైసీ కావడం లేదని పేర్కొంటున్నారు. దీంతో బాధితులు అటు ఆధార్ కేంద్రాలు, ఇటు రేషన్ దుకాణాల చుట్టూ తిరుగుతున్నారు.

ఆధార్ కేంద్రాలకు పరుగులు..

జిల్లాలోని అన్ని మండల కేంద్రాలలో ఆధార్ కేంద్రాలు లేకపోవడంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. గతంలో మాదిరిగా ఆధార్ కేంద్రాలు లేకపోవడం, ఉన్న ఒక్క ఆధార్ కేంద్రం ఎప్పుడు రద్దీగా ఉండడంతో సమీప మండలాల్లోని ఆధార్ కేంద్రాలకు వెళ్లాల్సి వస్తోంది. నూతనంగా రేషన్ కార్డు పొందిన వారు తప్పనిసరిగా ఆధార్ అప్‌డేట్, ఈ-కేవైసీ చేయించుకో వాలని సంబంధిత అధికారులు సూచిస్తున్నారు.



ఈ-కేవైసీ తప్పనిసరి..



నూతనంగా రేషన్ కార్డు పొందిన వారు తప్పనిసరిగా ఈ-కేవైసీ చేయించుకోవాలి. ఈ విషయంపై రెండు సంవత్సరాలుగా సూచిస్తున్నా కొందరు ఇప్పటి వరకు చేయించుకోలేదు. ఈ-కేవైసీ చేయించుకోని వారి రేషన్ రద్దు చేయడం జరుగుతుందని కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన విషయం తెలిసిందే. ఇప్పటి వరకు జిల్లాలో 2,66,429 రేషన్ కార్డులు ఉండగా, స్థానిక సంస్థల ఎన్నికల కోడ్ వచ్చే నాటికి 15,533 నూతన రేషన్‌కార్డులు జారీ అయ్యాయి. ఈ కార్డులలో 59,012 మంది లబ్ధిదారులు ఉన్నారు. వీరు తప్పనిసరిగా ఈ-కేవైసీ చేయించుకోవాలి.

కిష్టయ్య, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి



కాశిబుగ్గ సర్కిల్‌లో ఉగ్రవాదుల దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీజేపీ శ్రేణులు

అమాయకులను బలిగొనడం పిరికిపందల చర్య

వరంగల్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు రవికుమార్

మిల్స్‌కాలనీ, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీలో కారు బాంబుతో అమాయకులు ప్రాణాలు బలిగొన్న ఉగ్రవాదులది పిరికిపంద చర్య అని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంటా రవికుమార్ విమర్శించారు. బాంబు పేలుళ్లలో మృతి చెందిన వారి ఆత్మకు శాంతిచేకూరాలని కోరుతూ మంగళవారం రాత్రి కాశిబుగ్గ సర్కిల్‌లో ఉగ్రవాదుల దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ... దేశంలో ఎక్కడ ఉగ్రదాడులు జరిగినా మన రాష్ట్రంతో సంబంధం ఉంటుందని, ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం ఉగ్రమూలాలపై దృష్టి సారించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు అపరూప రజనీష్, సముద్రాల పరమేశ్వర్, హరిశంకర్, రఘునారెడ్డి, రంజిత్‌కుమార్, కుమార్, శ్రీనివాస్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మేజిక్ స్టార్ అవార్డు అందుకున్న కల్యాణ్

హనుమకొండ కల్చరల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ మెజిషియన్స్ అసోసియేషన్ (ఏపీఎంఏ) ఆధ్వర్యంలో ఏపీలోని అన్నమయ్య జిల్లా రాజంపేటలో జరిగిన 41వ మేజిక్ ఫెస్టివల్ మాయాలోకంలో వరంగల్‌కు చెందిన ప్రముఖ మెజీషియన్, నేషనల్ అవార్డు విజేత శ్రీరాం కల్యాణ్ మేజిక్ స్టార్ అవార్డుతోపాటు రూ.5వేల నగదు రివార్డును అందుకున్నారు. ఇంద్రజాల రంగంలో విశిష్ట సేవలందిస్తున్న వారికి ప్రముఖ మెజీషియన్ డాక్టర్ బోస్ ప్రతీయేటా ప్రదానం చేసే ప్రతిష్ఠాత్మక మేజిక్ స్టార్ అవార్డుకు ఈ సంవత్సరం కల్యాణ్‌ను ఎంపిక చేయడం విశేషం. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు జేవీఆర్, యూపీ రాముడు, ఆర్యల్, డాక్టర్ రమ్యశ్రీ, రఘుబాబు, విజయభాస్కర్‌రెడ్డి, సృజన్ కుమార్ తదితర ప్రముఖులు పాల్గొన్నారు. ఈ వేడుకల్లో ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి సుమారు 200 మంది ఇంద్రజాలికులు పాల్గొన్నారు.



అవార్డు అందుకుంటున్న కల్యాణ్

18 నుంచి కేయూ డిగ్రీ రెగ్యులర్ సెమిస్టర్ పరీక్షలు

కేయూ క్యాంపస్ నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీ పరిధిలో బీఏ, బీకామ్, బీఎస్సీ, బీసీఏ, బీబీఎం, బీఏ లాంగ్వేజెస్‌తో పాటు ఇతర డిగ్రీ కోర్సుల 1, 3, 5వ సెమిస్టర్ పరీక్షలు నవంబరు 18 నుంచి నిర్వహిస్తామని కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ కట్ల రాజేందర్, అదనపు పరీక్షల నియంత్రణాధికారులు ఎం.తిరుమల దేవి, పి.వెంకటయ్యలు తెలిపారు. పరీక్షలు ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాల్లో ఎంపిక చేసిన పరీక్షలకేంద్రాల్లో జరుగుతాయి. ఇతర వివరాలకు కేయూ వెబ్‌సైట్‌లో కానీ కళాశాలలో సంప్రదించాలని కోరారు. మొదటి సెమిస్టర్ పరీక్షలు నవంబరు 18, 20, 22, 25, 27, 29, డిసెంబరు 2, 4, తేదీల్లో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. అలాగే మూడో సెమిస్టర్ పరీక్షలు నవంబరు 19, 21, 24, 26, 28, డిసెంబరు 1, 3, 5, 8 తేదీల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు జరుగుతాయని, ఐదో సెమిస్టర్ పరీక్షలు నవంబరు 18, 20, 22, 25, 27, 29, డిసెంబరు 2, 4, 6, 9, 11, 12 15 తేదీల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు పరీక్షలు జరుగుతాయని తెలిపారు.

కొనసాగుతున్న భీమారం శ్యామల చెరువు సర్వే

మత్తడి నీరు పారే నాలా పాయింట్ల గుర్తింపు ● శాశ్వత పరిష్కారానికి అధికారుల కసరత్తు ● ముంపు ప్రాంతాల ప్రజల రక్షణకు తక్షణ చర్యలు

హసన్‌పర్తి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 55వ డివిజన్ పరిధి భీమారం శ్యామల చెరువు సర్వే పనులు కొనసాగుతున్నాయి. మంగళవారం రెండోసారి మండల సర్వేయర్ సుజాత పర్యవేక్షణలో ఏడీ సర్వే బృందం సభ్యులు శ్యామల చెరువు నాలా పాయింట్లను గుర్తించారు. భీమారం శివారు నుంచి లష్కర్ సింగారం సున్నంకుంట వరకు నాలా హద్దులను గుర్తించి పాయింట్లు ఏర్పాటు చేశారు. గతంలో గ్రామస్తుల విజ్ఞప్తి మేరకు అధికారులు చెరువును సందర్శించి మొదటిసారి నాలా పాయింట్లను గుర్తించిన విషయం తెలిసింది. అయితే ఇటీవల కురిసిన భారీ వర్షాలతో శ్యామల చెరువు మత్తడి ద్వారా విడుదలైన వరదనీరు నాలా ద్వారా కాకుండా చెరువు వెనకవైపునకు చింతగట్టు క్యాంపులోని కరీంనగర్-హనుమకొండ ప్రధాన రహదారిపైకిచేరి వాహనాలకు ఇబ్బందికరంగా మారినట్లు అధికారులు గుర్తించారు. అయితే నాలాలు ఆక్రమణకు గురికావడం వల్లే వరదనీరు ఇండ్లలోకి చేరి కాలనీలు నీట మునిగి ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నట్లు అధికారులు గుర్తించారు. ఈ క్రమంలోనే సర్వే అధికారులు ఆక్రమణకు గురైన నాలా పాయింట్లను ఖరారు చేసి శాశ్వత పరిష్కారానికి శ్రీకారం చుడుతున్నట్లు తెలిసింది. సర్వే పూర్తియిన వెంటనే నాలాల ఆక్రమణకు పాల్పడిన యాజమాన్యంపై చట్టపరమైన చర్యలు తీసుకోవడమే కాకుండా అక్రమ నిర్మాణాలను కూల్చివేసేందుకు చర్యలు చేపట్టనున్నట్లు అధికారులు తెలిపారు. శ్యామల చెరువు ఆక్రమణ నుంచి రక్షించేందుకు ప్రభుత్వ యంత్రాంగం ముందడుగు వేయడం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. చెరువు పునరుద్ధరణ జరిగితే గ్రామానికి మళ్లీ పూర్వ వైభవం వస్తుందని, కాలనీల్లో భూగర్భజలాలు పెరిగి నీటి ఎద్దడి నివారణకు సహాయపడుతుందని గ్రామస్తులు చెబుతున్నారు.



భీమారం శ్యామల చెరువు కట్టపై ఏర్పాటు చేసిన డిజిటల్ సర్వే మిషన్ పాయింట్ వద్ద గ్రామస్థులు



అబుల్ కలాం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న కలెక్టర్ సత్యశారద

కలెక్టరేట్‌లో అబుల్ కలాం జయంతి

వరంగల్ కలెక్టరేట్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): దేశ తొలి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ 137వ జయంతి వేడుకలను మంగళవారం వరంగల్ కలెక్టరేట్‌లో ఘనంగా నిర్వహించారు. అబుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి కలెక్టర్ సత్యశారద పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. మౌలానా అబుల్ కలాం ఆజాద్ దేశ విద్యా వ్యవస్థను తీర్చిదిద్దిన మహనీయుడని కొనియాడారు. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత దేశ మొదటి విద్యాశాఖ మంత్రిగా పని చేశారని గుర్తుచేశారు. ఆయన చేసిన సేవలకు ప్రభుత్వం భారతరత్న అవార్డు ప్రదానం చేసిందన్నారు. ఆయన జీవితాన్ని అందరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, డీఆర్‌వో విజయలక్ష్మీ, జడ్పీ సీఈవో రామిరెడ్డి, జిల్లా మైనార్టీ సంక్షేమశాఖ అధికారి శ్రీనివాస్, డీఈవో రంగయ్య నాయుడు, డీసీవో నీరజ, డీబీసీడీవో పుష్పలత, కలెక్టరేట్ ఏవో విశ్వప్రసాద్, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నిల్వ చేసిన మిర్చిని అమ్ముకున్న వ్యాపారి

కేసు నమోదు చేసిన పోలీసులు

వరంగల్ సిటీ, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): రైతు నిల్వ చేసుకున్న ఎండుమిర్చిని అక్రమంగా అమ్ముకున్న వ్యాపారిపై ఏనుమాముల పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. దుగ్గొండి మండలం తిమ్మంపేట గ్రామానికి చెందిన రైతు దండు రవి గత ఏడాది మార్చి నెలలో 17 బస్తాల ఎండుమిర్చిని మార్కెట్‌కు తీసుకువచ్చాడు. రేటు తక్కువగా ఉండడంతో తర్వాత అమ్ముకుందామని అనుకున్నాడు. అడ్తిదారు మీరిపెల్లి రాజు ద్వారా కొత్తపేటరోడ్డులోని కళ్యాణి కోల్డ్‌స్టోరేజ్‌లో నిల్వ చేసుకున్నాడు.

అయితే సదరు రైతుకు తెలియకుండా అడ్తి వ్యాపారి రాజు 17 బస్తాల మిర్చిని అమ్ముకున్నాడు. విషయం తెలుసుకున్న బాధిత రైతు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సదరు వ్యాపారితో పాటు కోల్డ్ స్టోరేజ్ యజమానిపై కేసునమోదు చేశారు. రైతులను మోసం చేస్తే ఉపేక్షించేది లేదని సీఐ జివ్వాజి సురేష్ హెచ్చరించారు.



పోతన ట్రాన్స్‌ఫర్ స్టేషన్ తనిఖీ చేస్తున్న మేయర్

బయో కంపోస్ట్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయాలి

● వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణి

● పోతన ట్రాన్స్‌ఫర్ స్టేషన్ ఆకస్మిక తనిఖీ

వరంగల్ కార్పొరేషన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): వరంగల్ నగరంలో బయో కంపోస్ట్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయాలని మేయర్ గుండు సుధారాణి అధికారులకు సూచించారు. మంగళవారం వరంగల్ పోతన ట్రాన్స్‌ఫర్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడి అధికారులకు తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. ట్రాన్స్‌ఫర్ స్టేషన్‌లో అన్ని కంటెనర్లు పని చేసే విధంగా అధికారులు చొరవ చూపాలన్నారు. మరమ్మతుకు గురైన కంటైనర్లు త్వరగా రిపేరు చేసే విధంగా కాంట్రాక్టర్లను అధికారులు అప్రమత్తం చేయాలన్నారు. చెత్త తరలింపు తర్వాత కంటైనర్లు శుభ్రం చేయాలని తెలిపారు. వాటర్ షెడ్డును త్వరగా నిర్మించాలన్నారు. చెత్త సేకరించిన వాహనాలు అక్కడే శుభ్రం చేసిన తర్వాత బయటకు వెళ్లాలని అన్నారు. విండ్రో కంపోస్ట్ షెడ్డుతో పాటు కంపోస్ట్ ప్లాంట్‌ను త్వరగా అందుబాటులోకి తీసుకురావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఈఈ మహేందర్‌తో పాటు ఎంహెచ్‌వో రాజేశ్, సిబ్బంది పాల్గొన్నారు.

ఆకేరు ఇసుక తవ్వకాలపై అధికారుల విచారణ

ఐనవోలు, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): ఆకేరు వాగు పరివాహక ప్రాంతంలో అక్రమంగా ఇసుక తవ్వకాలపై మూడు శాఖల అధికారులు విచారణను చేపట్టారు. నందనం గ్రామానికి చెందిన మాజీ జడ్పీ వైస్ చైర్మన్ గజ్జెలి శ్రీరాములు అక్రమ ఇసుక రవాణాపై అధికారులకు ఫిర్యాదు చేసింది తెలిసిందే. ఫిర్యాదు మేరకు మైనింగ్ శాఖ ఏడీ రవిశంకర్, ఆర్ఐ చంద్రకళ, పర్వతగిరి సీఐ రాజగోపాల్, ఎస్సై పస్తం శ్రీనివాస్, రెవెన్యూశాఖ నుంచి ఆర్ఐ రాణిలు మంగళవారం నందనం సమీపంలో ఆకేరువాగు పరివాహక ప్రాంతాన్ని సందర్శించారు. ఇసుక తవ్వకాలకు సంబంధించిన భూమిని సర్వే చేసే ప్రయత్నంలో ఉండగా స్థానికులు అక్కడికి చేరుకున్నారు. దీంతో ఫిర్యాదుదారుడైన గజ్జెలి శ్రీరాములు, స్థానికుల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. అక్కడ సుమారు 20 ఎకరాలు సర్వే నెంబర్‌లోలేని ప్రభుత్వ భూమి ఉందని, ఆ విలువైన భూమిని తమదంటే తమదని ఎవరికి వారే కబ్జాచేశారని ఆ భూమిని సర్వే చేసి వెలికితీయాలని స్థానికులు అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఘర్షణ చోటుచేసుకోవడంతో అధికారులు సర్వే చేయకుండా వెనుతిరిగారు. మరో సారి క్షేత్రస్థాయిలో సర్వేచేసి ఇసుక తవ్వకాలపై కలెక్టర్‌కు నివేదికను అందజేస్తామని మైనింగ్ శాఖ ఏడీ తెలిపారు.



ఇసుక తవ్వకాలపై విచారణ చేస్తున్న మైనింగ్ ఏడీ, సీఐ, ఎస్సైలు



కాజీపేట చౌరస్తాలో గుంతలు పూడ్చుతున్న ట్రాఫిక్ పోలీసులు

ట్రాఫిక్ పోలీసులే మేస్త్రీలై..

గుంతలు పూడ్చి.. సమస్య పరిష్కరించి..

కాజీపేట, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): కాజీపేట చౌరస్తా, ఫాతిమానగర్ బ్రిడ్జిపై ఉన్న గుంతలను కాజీపేట ట్రాఫిక్ సీఐ వెంకన్న బృందం మంగళవారం మేస్త్రీల అవతారం ఎత్తి గుంతలు పూడ్చారు. ఉదయం ప్రారంభించిన ఈ పనులు.. మధ్యాహ్నం వరకు చేపట్టారు. కాజీపేట చౌరస్తాలో, ఫాతిమా బ్రిడ్జిపై ఉన్న సుమారు పదివరకు పెద్ద పెద్దగుంతలు పూడ్చి వాహనదారులతో శభాష్ అనిపించుకున్నారు. ఈ మధ్య కురిసిన భారీ వర్షాల నేపథ్యంలో రోడ్లు బాగా దెబ్బతినడంతో పెద్ద పెద్ద గుంతలు ఏర్పడి నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. వాహనదారులు ఇబ్బందులు గమనించిన ట్రాఫిక్ సీఐ వెంకన్న.. తన సిబ్బందితో కలిసి గుంతలు పూడ్చారు. దీంతో మంగళవారం ఉదయం సుమారు రెండుగంటల వరకు ట్రాఫిక్ జామ్ అయినప్పటికీ వాహనదారులు సహకరించడంతో గుంతల సమస్య పరిష్కారం జరగటంతో స్థానికులు సంతృప్తి వ్యక్తం చేశారు.

విద్యార్థులు డిజిటల్ విద్యను సద్వినియోగం చేసుకోవాలి

వరంగల్ డీఈవో బి.రంగయ్యనాయుడు

వరంగల్ ఎడ్యుకేషన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): పాఠశాల స్థాయిలో విద్యార్థులు డిజిటల్ విద్యను సద్వినియోగం చేసుకోవాలని డీఈవో బి.రంగయ్యనాయుడు అన్నారు. తెలంగాణ గెజిటెడ్ హెడ్మాస్టర్ల సంఘం, టీశాట్ ఆధ్వర్యంలో మంగళవారం మట్టెవాడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వక్తృత్వం, వ్యాసరచన, క్విజ్ జిల్లాస్థాయి పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రంగయ్య మాట్లాడుతూ.. ఆధునిక సాంకేతికతపై విద్యార్థులు లోతైన అవగాహన పెంచుకోవాలన్నారు. ఏఐపై సమగ్ర అవగాహన పెంచుకోవాలన్నారు. విద్యార్థులకు జిల్లా స్థాయి పోటీలు నిర్వహించిన సంఘాన్ని ఆయన అభినందించారు. జిల్లా స్థాయిలో వ్యాసరచన పోటీల్లో చెన్నారావుపేట మండలం ఉప్పరపల్లి జడ్పీహెచ్ఎస్ విద్యార్థిని సీహెచ్. ద్రాక్షాయని, వక్తృత్వ పోటీల్లో ఖానాపురం మండలం బుధరావుపేట జడ్పీహెచ్ఎస్ విద్యార్థిని జి.శివాని, క్విజ్‌లో అదే పాఠశాల విద్యార్థి ఎం.డి. హసన్ మొదటి బహుమతులు సాధించి రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారు. కాగా, బుధ, గురువారాల్లో హైదరాబాద్‌లో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి పోటీల్లో వీరు పాల్గొంటారని సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు ఎస్.రవీందర్, ఎల్.సుధాకర్‌రావు తెలిపారు. కార్యక్రమంలో డీఎస్‌వో డాక్టర్ కె.శ్రీనివాస్, డీసీఈబీ సెక్రెటరి జి.కృష్ణమూర్తి, హెడ్మాస్టర్లు శారద బాయి, సదాశివరావు, పట్టాభి తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న డీఈవో రంగయ్యనాయుడు

అద్దె బస్సు ఓనర్ల సమస్యలు పరిష్కరించాలి

హనుమకొండ టౌన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకంతో అద్దె బస్సుల్లో సీట్లకు మించి ప్రయాణించడంతో ప్రమాదాలకు గురవుతున్నాయని, అద్దె బస్సుల ఓనర్ల సమస్యలు పరిష్కరించాలని సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు లక్కం ప్రభాకర్, వరంగల్ రీజినల్ అధ్యక్షుడు మారిపెల్లి రాంరెడ్డి ఆర్ఎంకు మంగళవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బస్సుల్లో కెపాసిటీకి మించి ప్రయాణికులు ఎక్కుతుండడంతో బస్సులకు నష్టం వాటిల్లుతోందని, తద్వారా రోడ్డు ప్రమాదాలకు గురవుతున్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ప్రభుత్వం ఆర్టీసీ అద్దె బస్సుల ఓనర్ల సమస్యలు పరిష్కరించాలని వినతిపత్రంలో కోరారు. ఈ కార్యక్రమంలో ఎం.డి. అబీబ్ బుద్దీన్, ఫర్వేజ్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.



వరంగల్ ఆర్ఎంకు వినతిపత్రం ఇస్తున్న అద్దె బస్సుల ఓనర్స్ అసోసియేషన్ సభ్యులు

క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు

హసన్‌పర్తి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): క్రీడల్లో రాణిస్తేనే క్రీడాకారుడికి ఉజ్వల భవిష్యత్ ఉంటుందని తెలంగాణ రాష్ట్ర అథ్లెటిక్స్ ప్రధాన కార్యదర్శి సారంగపాణి అన్నారు. మండలంలోని ఎర్రగట్టుగుట్ట కిట్స్ ఇంజనీరింగ్ కళాశాల క్రీడా మైదానంలో మంగళవారం ఎస్‌జీఎఫ్ హనుమకొండ సెక్రటరీ వెలిశెట్టి ప్రశాంత్ కుమార్ ఆధ్వర్యంలో ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి ఎస్‌జీఎఫ్ అండర్-14, అండర్-17 బాలబాలికల అథ్లెటిక్స్ సెలక్షన్స్ జరిగాయి. ఈ సందర్భంగా ఆయన ముఖ్య అతిథిగా హాజరై అథ్లెటిక్స్ సెలక్షన్స్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో కిట్స్ ఫిజికల్ డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, భూపాలపల్లి సెక్రటరి జైపాల్, హనుమకొండ అధ్యక్షుడు ఎస్.పార్థసారథి, స్టేట్ అసోసియేట్ ప్రెసిడెంట్ బి.సుధాకర్, కన్వీనర్ రజనీకాంత్, వాసుదేవరావు, చంద్రశేఖర్‌రెడ్డి, అశోక్, సుభాష్, రవీంద్ర ప్రసాద్, ఆవారి శ్రీనివాస్, శంకర్ పాల్గొన్నారు.



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న తెలంగాణ రాష్ట్ర అథ్లెటిక్స్ ప్రధాన కార్యదర్శి సారంగపాణి

రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులు పరిష్కరించాలి

ఆర్డీవోలు, తహసీల్దార్లను ఆదేశించిన హనుమకొండ కలెక్టర్ స్నేహ శబరీష్

హనుమకొండ కలెక్టరేటర్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులను పెండింగ్‌లో పెట్టకుండా త్వరగా పరిష్కరించాలని ఆర్డీవోలను, తహసీల్దార్‌లను జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ ఆదేశించారు. హనుమకొండ కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌నుంచి మంగళవారం అన్ని మండలాల తహసీల్దార్‌లతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. సాదాబైనామా దరఖాస్తులను త్వరగా పరిష్కరించే చర్యలు తీసుకోవాలని చెప్పారు. తహసీల్దార్‌ల నుంచి వచ్చిన సాదాబైనామా దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని ఆర్డీవోలను కలెక్టర్ ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, హనుమకొండ, పరకాల ఆర్డీవోలు రాథోడ్ రమేశ్, కె.నారాయణ, కలెక్టరేట్ అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ స్నేహ శబరీష్

డ్రంకెన్ డ్రైవ్‌లో ముగ్గురికి జైలు శిక్ష

కాజీపేట, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): డ్రంకెన్ డ్రైవ్‌లో ముగ్గురికి జైలు శిక్షపడింది. ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ పి. వెంకన్న తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కాజీపేట ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో చేపట్టిన డ్రంకెన్ డ్రైవ్ స్పెషల్ డ్రైవ్‌లో మద్యం సేవించి వాహనాలు నడుపుతూ 18మంది పట్టుబడ్డారు. వీరిని మంగళవారం సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ ఎస్. ఫాతిమా చిన్నప్ప ముందు హాజరుపర్చగా, మెజిస్ట్రేట్ విచారించి 15 మందికి జరిమానా, ముగ్గురుకి కడియం బాబు, తోట రవీందర్, ఉప్పుతల వెంకటేశ్వర్లుకు రెండురోజుల జైలు శిక్ష విధించి హుజురాబాద్ జైలుకు తరలించారు.

● వరంగల్ క్రైం: డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడ్డ 73 మందిని మంగళవారం కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి ఎ.వేణుగోపాల్ రూ.84,100 జరిమానా విధించారని హనుమకొండ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ జి.సీతారెడ్డి తెలిపారు. డ్రైవింగ్ లైసెన్స్ లేని 16 మందిని కోర్టులో హాజరుపరచగా రూ.10,100 జరిమానా విధించామన్నారు.



వార్షిక పరీక్ష ఫీజుల చెక్‌ను అందజేస్తున్న జీఆర్‌కే సంస్థ ప్రతినిధులు

జీఆర్‌కే ఫౌండేషన్ ఉదారత

టెన్త్ విద్యార్థుల వార్షిక పరీక్ష ఫీజు చెల్లింపు

ఖిలా వరంగల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): నిరుపేద విద్యార్థులకు అండగా నిలిచేందుకు జీఆర్‌కే (గంటా రవికుమార్) ఫౌండేషన్ ముందుకు వచ్చింది. వరంగల్ శివనగర్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థుల వార్షిక పరీక్ష ఫీజు డబ్బులను ఫౌండేషన్ చెల్లించింది. ఈ మేరకు సంస్థ ప్రతినిధులు.. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నరేంద్రస్వామికి చెక్ అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శివనగర్ బిడ్డగా గంటా రవికుమార్ తన పేరుతో ఫౌండేషన్ స్థాపించి నిరుపేద విద్యార్థులను ఆదుకునేందుకు సంకల్పించారని తెలిపారు. విద్యకు పేదరికం అడ్డుకారాదని, నిరుపేద విద్యార్థుల్ని ఆదుకునేందుకు ఫౌండేషన్ తన వంతు సహకారం అందిస్తుందని పేర్కొన్నారు. అదేవిధంగా 8, 9, 10వ తరగతి చదివే పేద విద్యార్థులకు డిసెంబరు 1 నుంచి ఉచిత ట్యూషన్లు నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు ఎమ్డీ రఫీ, కందుకూరి విజయ్‌కుమార్, సామల శ్రీనివాస్, పాలకుర్తి విక్రమ్‌గౌడ్, కాళీ రాజు తదితరులు పాల్గొన్నారు.

'ధాన్యం' దొంగల ఆటకట్టు

• ఐకేపీ కొనుగోళ్లలో అక్రమాల్లో ప్రధాన సూత్రధారి బెజ్జంకి శ్రీనివాస్ సహా 13 మంది అరెస్టు
• అరెస్టయిన వారిలో శ్రీనివాస్ భార్య, కుమారులు, కోడళ్లు..

వరంగల్ క్రైం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ జిల్లాలోని శాయంపేట మండల కేంద్రంతో పాటు కాట్రపలి ఐకేపీ సెంటర్‌లో నకిలీ రైతుల పేరిట ప్రభుత్వ ఖజానాకు గండికొట్టి రూ.2కోట్ల 10 లక్షలు లూటీ చేసిన 22మంది నిందితుల్లో ఇప్పటికే ఏడుగురిని అరెస్టు చేయగా, తాజాగా 13 మందిని అరెస్టు చేసినట్లు వరంగల్ పోలీస్ కమిషనరేట్ ఈస్ట్‌జోన్ డీసీపీ అంకిత్‌కుమార్ వెల్లడించారు. మంగళవారం కమిషనరేట్ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో డీసీపీ మాట్లాడుతూ.. 2024- 25 రబీ సీజన్‌కు సంబంధించి శాయంపేట, కాట్రపల్లి ఐకేపీ సెంటర్లలో అక్రమాలు జరిగాయని సివిల్ సప్లయిస్ శాఖ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అక్టోబరు 11న శాయంపేట పోలీసుస్టేషన్‌లో కేసు నమోదు చేశామన్నారు.

బెజ్జంకి శ్రీనివాస్ ప్లాన్

కమలాపూర్ మండలానికి చెందిన బెజ్జంకి శ్రీనివాస్‌కు రబీ సీజన్ సమయంలో పత్తిపాకకు చెందిన బండ లలిత పరిచయమైంది. ఈ క్రమంలో లలిత, ప్రైవేట్ ట్యాబ్ ఆపరేటర్ వాంకుడోతు చరణ్‌సింగ్ సహకారంతో బెజ్జంకి శ్రీనివాస్‌తో కుమ్మక్కై శ్రీనివాస్ కుటుంబసభ్యుల పేరుతో పాటు తమను నకిలీ రైతులుగా సృష్టించారు. వీరిందరి పేరిట 312 ఎకరాల ప్రభుత్వ పోడుభూమి ఉన్నట్లుగా, అందులో 9,100 క్వింటాళ్ల ధాన్యం పండించినట్లుగా సృష్టించారు. ఏఈవో సుప్రియ సహకారంతో టోకెన్ బుక్స్ తీసుకొని ఏవో లాగిన్ ఐడీలో చరణ్, లలిత తప్పుడు సమాచారం నమోదు చేశారు. ఈ క్రమంలో 15 మంది నకిలీ రైతుల అకౌంట్‌లలోకి ప్రభుత్వ కార్పొరేషన్ నిధి నుంచి రూ.2.10 కోట్లు జమ అయ్యాయి.

నకిలీ ఎంట్రీలు చేసినందుకు చరణ్‌సింగ్, లలితలు ఒక్కో క్వింటాకు రూ.120 చొప్పున రూ.10,92,000, బెజ్జంకి శ్రీనివాస్ ఒక్కో క్వింటాకు బోనస్ పేరిట రూ.40 లక్షలు, మిల్లింగ్ చార్జ్ పేరిట రూ.4లక్షలు జమ అయిన డబ్బుల్లో నుంచి పొందాడు. ప్రధాన సూత్రదారి బెజ్జంకి శ్రీనివాస్ నకిలీ రైతుల అకౌంట్‌ల నుంచి రూ.కోటి 32లక్షలు డ్రా చేసి తన కుమారులైన పున్నం, శివకుమార్‌లపై కమలాపూర్ మండలం వంగిడిపల్లి గ్రామంలో ఎకరం భూమి కొనుగోలు చేశారు. రూ.8లక్షలతో హైదరాబాద్‌లోని కన్సల్టెన్సీలో టాటా నెక్సాన్ కారు కొనుగోలు చేశారు. మిగతా రూ.కోటి 6లక్షలతో గత సీజన్‌తో పాటు ప్రస్తుత సీజన్‌కు సంబంధించిన షార్టేజ్ ధాన్యం కొనుగోలుకు ఖర్చుచేసి మరో మిల్లర్‌లో భద్రపరచగా సివిల్ సప్లయిస్ అధికారుల పరిశీలన కోసం అప్పగించారు.

ఈ మేరకు విచారణ చేసిన పోలీసులు మంగళవారం కమలాపూర్‌కు చెందిన ప్రధాన సూత్రదారి బెజ్జంకి శ్రీనివాస్, ఆయన భార్య బెజ్జంకి శోభారాణి, పెద్ద కుమారుడు పున్నం చారి, రెండో కుమారుడు శివకుమార్, చిన్న కుమారుడు చందు, కోడళ్లు నవత, శ్రీనవ్య, బంధువులు వెల్దారి కళ్యాణ్, వేంనూరి శ్రీనివాస్, వేంనూరి ఉదయలక్ష్మీ, చిరంచ చందు, కాట్రపల్లి క్లస్టర్ ఏఈవో ఎం.సుప్రియ, బండ లలిత భర్త రజినీకర్‌రెడ్డిని అరెస్టు చేశారు.

నిందితులకు సంబంధించిన వివిధ బ్యాంకు అకౌంట్‌లలో ఉన్న రూ.54 లక్షల నగదును ఫ్రీజ్ చేయడంతో పాటు రూ.53 లక్షల 84 వేల 134 విలువ గల రెండు ల్యాండ్ డాక్యుమెంట్స్, టాటా నెక్సాన్ కారు, ప్రధాన నిందితుడి నుంచి రూ.9లక్షల 50 వేల నగదు సీజ్ చేయగా, జమ అయిన డబ్బుల్లో నుంచి సివిల్ సప్లయిస్ శాఖకు లారీ ట్రాన్స్‌ఫోర్ట్ కాంట్రాక్టర్ సుదాటి రాజేశ్వర్‌రావు రూ.4లక్షల 14 వేల 134 చెల్లించినట్లు గుర్తించడంతో పాటు గతంలో అరెస్టు అయిన చరణ్‌సింగ్ నుంచి రూ.20 వేలు స్వాధీనం చేసుకున్నారు. కాగా, నిందితులను పట్టుకొని, ఆస్తులను స్వాధీనం చేసుకోవడంలో ప్రతిభ కనబరిచిన సిబ్బందికి డీసీపీ నగదు రివార్డులను అందజేశారు. ఈ సమావేశంలో ఏసీపీలు మధుసూదన్, సతీష్‌బాబు, శాయంపేట సీఐ రంజిత్‌రావు, టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ బాబులాల్, శాయంపేట ఎస్సై పరమేశ్వర్, దామెర ఎస్సై అశోక్ పాల్గొన్నారు.

సబ్సిడీ టార్పాలిన్లు ఎక్కడ!?

• ఏడేళ్లుగా నిలిచిన పంపిణీ • ప్రకృతి విపత్తుల నుంచి పంట ఉత్పత్తులకు రక్షణ కరువు
• బయటి వ్యక్తుల నుంచి అద్దెకు తెచ్చుకుంటున్న వైనం • అదనపు భారంతో అన్నదాతల సతమతం

వర్ధన్నపేట రూరల్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి) : ఆరుగాలం శ్రమించి పండించిన పంట ఉత్పత్తులను ఆరబెట్టుకోవడానికి, వర్షాల నుంచి పంటను కాపాడుకునేందుకు రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారు. మరో వైపు ఎప్పుడు వర్షం వస్తుందో తెలియని పరిస్థితి నెలకొంది. ఈ క్రమంలో అకాల వర్షాల నుంచి పంట ఉత్పత్తులను కాపాడుకునేందుకు టార్పాలిన్లు రైతులకు ఇప్పుడు అత్యవసరం. దీంతో గతంలో ప్రభుత్వం 50 శాతం సబ్సిడీపై టార్పాలిన్లను రైతులకు సరఫరా చేసేది. కానీ గత ఏడు సంవత్సరాల నుంచి ప్రభుత్వం టార్పాలిన్ల పంపిణీని నిలిపివేసింది. మార్కెట్లో టార్పాలిన్ల ధరలు అధికంగా ఉండటంతో టార్పాలిన్లను కొనలేక రైతులు అద్దెకు తెచ్చుకుంటూ పంటను కాపాడుకుంటున్నారు.

ఏడేండ్లుగా నిలిచిన పంపిణీ

వర్షాలు, ప్రకృతి విపత్తుల నుంచి పంటలను రక్షించుకోవడానికి వ్యవసాయ శాఖ గతంలో సబ్సిడీపై రైతులకు టార్పిలిన్లు అందించేది. మార్కెట్లో రూ. 2500 లభించే టార్పాలిన్లను 50 శాతం సబ్సిడీతో రూ. 1250 కే ప్రభుత్వం రైతులకు అందించేంది. ప్రభుత్వం రాయితీపై సరఫరా చేసే టార్పిలిన్లు నాణ్యతతో పాటు ఎక్కువ కాలం మన్నికగా ఉండేవి. ఈ విధంగా 208 వరకు ప్రభుత్వం రైతులకు సబ్సిడీపై పంపిణీ చేసింది. రైతులుకూడా వాటిని తీసుకోవడానికి పోటీ పడేవారు. ప్రతిసారి ఆశించిన మే టార్పాలిన్లు రాకపోవడంతో ఉన్నంత మేరలో అధికారులు రైతులకు అందించేవారు. కానీ 2018 తర్వాత సబ్సిడీ టార్పాలిన్ల జాడే లేదు. వాటి కోసంరైతులు ఏడేళ్లుగా ఎదురు చూస్తేనే ఉన్నారు.

అదనపు భారం

జిల్లాలోని పెద్ద గ్రామాలు, పట్టణ శివారుల్లో పలువురు ఇతర రాష్ట్రాల నుంచి వచ్చి టార్పాలిన్లు కిరాయిలకు ఇస్తూ జీవనోపాధి పొందుతున్నారు. ఒక్కో టార్పాలిన్ రోజుకు రూ. 15-25 వరకు ప్రాంతాల వారీగా అద్దెకు ఇస్తున్నారు. ధాన్యం ఆరబెట్టుకోవడానికి సాధారణంగా ప్రతి రైతుకు కనీసం 6-10 టార్పాలిన్లు అవసరం అవుతుండగా, వాటిపై ప్రతిరోజు సుమారు రూ. 100-200 వరకు భారం పడుతోంది. ఇలా రోజుల తరబడి టార్పాలిన్లను అద్దెపై తీసుకవస్తే రైతులకు రూ. వెయ్యికి పైగా ఖర్చవుతోంది. దీంతో టార్పాలిన్ల అద్దె భారం మోయలేపోతున్నట్లు రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి గతంలో మాదిరిగా టార్పాలిన్లను సబ్సిడీపై అందించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

ఆయా గ్రామాల్లో దాదాపు రైతులు ఎక్కువగా ఇతర రాష్ట్రాల నుండి వచ్చిన బస్తాల టార్పాలిన్లనే వాడుతున్నారు. వర్ధన్నపేట మండలంలోని ఇల్లంద గ్రామంలో వరంగల్ ఖమ్మం జాతీయ రహదారిపై రాజు అనే వ్యక్తి గుంటూరు నుంచి వచ్చి టార్పాలిన్లను రైతులకు ఇస్తున్నాడు. నమ్మకమైన వ్యక్తులకే ఇస్తానని, గత కొన్ని సంవత్సరాలుగా ఈ సీజన్‌లో వస్తానని చెపుతున్నాడు. ఇలా తనతో పాటు చాలా మంది ఆయా ప్రాంతాల్లో వరంగల్ జిల్లా వ్యాప్తంగా ఉన్నట్లు చెపుతున్నాడు.



ఇల్లంద మార్కెట్ యార్డులో ధాన్యం రాశులపై కప్పిన బస్తాల టార్పాలిన్

కన్న బిడ్డ సాకడం లేదు

• ఆమెకు ఇచ్చిన భూమిని తిరిగి బదలాయించండి
• తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేసిన వృద్ధురాలు

ఎల్కతుర్తి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఆస్తిని చేజిక్కించుకున్న కూతురు తన సంరక్షణ చూడటం లేదని ఓ తల్లి కుమార్తెకు రాసి ఇచ్చిన భూమిని తిరిగి తన పేర బదలాయించాలని తహసీల్దార్‌కు మంగళవారం వినతిపత్రాన్ని అందజేసింది. బాధితురాలు లక్ష్మి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఎల్కతుర్తి మండలం గోపాల్‌పూర్ గ్రామానికి చెందిన తాళ్ల లక్ష్మి-రాజమౌళి దంపతులకు ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు. భర్త అనారోగ్యంతో, కుమారుడు ప్రమాదవశాత్తు మృతి చెందారు. లక్ష్మి పేర ఉన్న 4 ఎకరాల వ్యవసాయ భూమిలో 3 ఎకరాలు కుమార్తెల పేర పట్టా మార్పిడి చేయించింది. ఒక ఎకరం భూమిని ఖర్చుల కోసం అమ్మేశారు.

భీమదేవపల్లి మండలం మాణిక్యపూర్‌కు చెందిన పెద్ద కుమార్తె బుర్ర లీలా, మహారాష్ట్రలోని సిరివంచలో ఉంటున్న రెండో కుమార్తె దాసరి లక్ష్మిలు తల్లి సంరక్షణ చూస్తున్నారు. కానీ, ఎల్కతుర్తి మండలం పెంచికల్‌పేట గ్రామానికి చెందిన చిన్న కుమార్తె బొనగాని సుమలత తనను పట్టించుకోవడం లేదని, కనీసం ఫోన్‌లు కూడా మాట్లాడటం లేదని తల్లి లక్ష్మి ఆవేదన వ్యక్తం చేసింది. దీంతో తనను సాకని చిన్న కుమార్తెకు గోపాల్‌పూర్ గ్రామ శివారులోని చెరువు కింద ఇచ్చిన వ్యవసాయ భూమిని తిరిగి తన పేర బదలాయించాలని తహసీల్దార్ ఐతరాజు ప్రసాద్‌రావుకు వినతిపత్రాన్ని అందజేసి వేడుకుంది.



తహసీల్దార్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న తాళ్ల లక్ష్మి

వరికి మద్దతు ధర దక్కాలంటే..

• కేంద్రాలకు నాణ్యమైన ధాన్యం తీసుకురావాలి • తేమశాతం 17లోపు ఉండేలా ఆరబెట్టాలి

వర్ధన్నపేట, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఈ వానాకాలం సీజన్‌కు సం బంధించి వరి కోతలు మొదలయ్యాయి. ఇప్పుడిప్పుడే పంట చేతికొస్తోంది. ఇప్పటికే కొన్ని మండలాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం కాగా, మరో వారంలోగా అన్ని చోట్ల ప్రారంభం కానున్నాయి. ఆరుగాలం శ్రమించి వరి పంట పండించిన రైతులు తమ పంటకు ప్రభుత్వం మద్దతు ధర పొందాలంటే కొన్ని జాగ్రత్తలు పాటించక తప్పదు. ముఖ్యంగా ధాన్యం అర బోయకుండా మార్కెట్‌కు తీసుకెళ్తే మద్దతు ధర రాక నష్టపోతున్నారు. ఈ నేపథ్యంలో రైతులు వరి కోతల నుంచి అమ్మకం వరకు తగిన జాగ్రత్తలు పాటిస్తే ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర పొందవచ్చని వర్ధన్నపేట మండల వ్యవసాయ అధికారి విజయ్ కుమార్ పేర్కొన్నారు.



వరిధాన్యాన్ని ఆరబెడుతున్న మహిళారైతు (ఫైల్ ఫోటో)

కోతకు ముందు, తర్వాత ఇవి పాటించాలి

వరి గింజలన్నీ బంగారు రంగులోకి వచ్చిన తర్వాతనే కోతలు ప్రారంభించాలి. వరి కోతకు ముందు పొలంలో ఉన్న కల్తీ మొక్కలను తీసివేయాలి. కోతకు 15 నుంచి 20 రోజులు ముందే నీటి తడులు ఆపివేయాలి. 1010 రకం వరి గింజలు బంగారు రంగులోకి వచ్చే వరకు ఆగితే రాలిపోతాయి. ఈ ఒక్క రకాన్ని గోధమ రంగులోకి రాగానే కోయాలి. కోసిన వరి మెదళ్లను నాలుగు రోజులు పాటు బాగా ఎండనివ్వాలి. అనంతర ఒక్కో రకం వరి వేర్వేరు కల్లాలు చేసి టార్పాలిన్‌లలో వరి మెదలు వేసి ట్రాక్టర్ల ద్వారా నూర్పిడి చేయాలి. ఒక రకానికి చెందిన వరి ధాన్యాన్ని మరోరకం వరి ధాన్యంతో కలపొద్దు. పొలం వద్దే సరైనా గ్రేడింగ్ చేయాలి. గడ్డిని తీసివేసి గింజలన్నీ కుప్పగా పోసి గాలిపంకల సహాయంతో (తాలు గింజలు) నాణ్యత లేని గింజలు లేకుండా శుభ్రంగా తూర్పారా పట్టాలి. ధాన్యంలో 17 శాతంలోపు తేమ ఉండే వరకు అరబెట్టి ధాన్యం కొనుగోలు కేంద్రాలకు తీసుకెళ్తే మద్దతు ధర వచ్చే అవకాశాలు ఉంటాయి. హార్వేస్టర్‌తో కోస్తే మొదటిసారి పోసే డబ్బాను వేరుగా పోయాలి.

ఆ తరువాత కోసినవన్నీ ఒక చోట పోయాలి. ఇలా చేయడం వల్ల కల్తీ ప్రమాదం తప్పుతుంది. వడ్లను సిమెంట్ కల్లాలు లేదా టార్పాలిన్ షీట్లపై ఆరబెట్టాలి. రెండు, మూడు రోజులు బాగా ఎండేలా కాళ్లతో కలియదున్నాలి. పంట కోశాక సరిగా ఆరబెట్టకపోతే గింజలు రంగు మారి, పంట నాణ్యత తగ్గుతుంది. పంటను అరబెట్టే సమయంలో రాళ్లు, మట్టి పెళ్లలు, చెత్తా చెదారం వంటి వ్యర్థ పదార్థాలు చేరకుండా జాగ్రత్త వహించాలి. నిల్వ చేసే పక్షంలో గోనే సంచులను కింద వేయకుండా కవర్లు పరిచి లేదా బల్లలపై బస్తాలు నెట్టుగా వేయాలి. పురుగులు ఆశించకుండా లీటరు నీటికి 5 ఎంఎల్ మలాథియాన్ మందును కలిపి బస్తాలపై పిచికారీ చేయాలి. ఎలుకల నుంచి రక్షించుకోవడానికి బస్తాల మధ్య జింక్ పాస్పేట్ ట్యాబ్లేట్లు ఉంచాలి. ఒక రోజు తలుపులు పూర్తిగా మూసివేసి గాలి చొరబడకుండా జాగ్రత్తలు వహించాలి. ఇలా చేయడంతో ఎలుకలు లేకుండా పోతాయి. మరుసటి రోజు నుంచి తలుపులు తీయొచ్చు.

నాణ్యత ప్రమాణాలు తప్పనిసరి

వరి ధాన్యం ఏ గ్రేడ్ రకం క్వింటాకు ప్రభుత్వం రూ.2,389, సాధారణ రకానికి రూ.2,369 మద్దతు ధర ప్రకటించింది. ఈ ధర దక్కాలంటే రైతులు ధాన్యంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి. తేమ శాతం 17 శాతంలోబడి తాలు 1శాతం, మటిపెళ్లలు, రాళ్ల (పాడైన, రంగు మారిన, మొలకెత్తిన, పురుగు తిన్న ధాన్యం, పూర్తిగా కాని, ముడుచుకుపోయిన ధాన్యం, తక్కువ రకం మిశ్రమం, ఆరు శాతం లోబడి తదితరవి) లేకుండా చేసుకోవాలి.

రైతులు తీసుకురావాల్సిన పత్రాలు

ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చేటప్పుడు రైతులు ఆధార్ కార్డు జిరాక్స్, భూమి పట్టాదారు పాసుపుస్తకం జిరాక్స్, రైతు బంధుకు అనుసంధానమైన బ్యాంకు అకౌంట్ బుక్కు జిరాక్స్, ఆధార్ కార్డుకు అనుసంధానమైన ఫోన్ నంబర్‌లను వెంట తెచ్చుకోవాలి. కౌలు రైతులు సైతం ఆధార్ కార్డు, బ్యాంకు పాసుబుక్కు, కౌలు ఇచ్చిన రైతు పట్టాదారు పాసుపుస్తకం జిరాక్స్‌లతో పాటు ఆధార్ కార్డుకు అనుసంధానమైన ఫోన్ నంబర్, ఆయ మండలాల వ్యవసాయ అధికారిచే జారీ చేయబడిన కౌలు సర్టిఫికేట్‌లను సమర్పించాల్సి ఉంటుంది.

ఎస్‌హెచ్‌జీ సభ్యులకు చీరలు

• జిల్లాలకు చేరుకుంటున్న స్టాకు • గ్రామాల వారీగా అందజేతకు ఏర్పాట్లు
• ఒకే రకమైన డిజైన్ రంగుల్లో చీరలు • రెండు జిల్లాలకు 5.54 లక్షల చీరల రాక

హనమకొండ, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మహిళా స్వయం సహాయక సంఘాల (ఎస్‌హెచ్‌జీ) సభ్యులకు చీరలను పంపిణీ చేయనున్నారు. ఈ మేరకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. పొదుపు సంఘాల మహిళలకు వాస్తవంగా దసరా, బతుకమ్మ సంబరాల సందర్భంగా పంపిణీ చేయాలని ప్రభుత్వం మొదట భావించింది. ఆ మేరకు అన్ని జిల్లాలకు చీరెల స్టాక్‌ను పంపించింది. కానీ వివిధ కారణాల వల్ల పంపిణీ వాయిదా పడింది. ఇప్పుడు తాజాగా ఈనెల 19వ తేదీన ఇందిరాగాంధీ జయంతిని పురస్కరించుకొని ఎస్‌హెచ్‌జీ మహిళలకు కానుకగా అందరికీ ఒకే రకమైన రీతిలో (యూనిఫామ్) రూపంలో అందజేయనున్నారు. ఈ మేరకు అన్ని జిల్లాల డీఆర్‌డీవో అధికారులకు ఆదేశాలు వచ్చాయి. అయితే పంపిణీ తేదీకి సంబంధించి ఇంకా స్పష్టమైన ఆదేశాలు రానట్టు తెలిసింది.

గతంలో...

గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం బతుకమ్మ పండుగను పురస్కరించుకొని 18 ఏళ్ల నిండిన, తెల్లరేషన్‌కార్డు కలిగిన వారందరికి బతుకమ్మ చీరెలను పంపిణీ చేసింది తెలిసిందే. గత ప్రభుత్వం రేషన్‌కార్డులో పేరున్న ప్రతీ మహిళకు రేషన్ డీలర్ల ద్వారా బతుకమ్మ చీరలను పంపిణీ చేసింది. కాగా, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరా మహిళా శక్తి కార్యక్రమంలో భాగంగా పొదుపు సంఘాల్లో సభ్యులుగా ఉన్నవారికి అక్కా చెల్లెళ్లకు రేవంత కానుక పేరుతో ఏడాదికి రెండు చేనేత చీరలను పంపిణీ చేయనున్నారు. ఇందుకు అవసరమైన చీరలు ఇప్పటికే జిల్లాలకు రాగా, వాటిని గోదాముల్లో భద్రపరిచారు. వరంగల్, హనుమకొండ జిల్లాలకు వచ్చిన చీరలను వరంగల్‌లోని ఏనుమాముల గోదాముల్లో భద్రపరిచారు.

5.54 లక్షల చీరలు

వరంగల్, హనుమకొండ జిల్లాలకు కలుపుకొని మొత్తం 5.54 లక్షల చీరలు పంపిణీ చేయనున్నారు. హనుమకొండ జిల్లా పరిధిలో సెర్ప్ పరిధిలో 397గ్రామైక్య సంఘాలు, 10225 స్వ యం సహాయక సంఘాలు ఉన్నాయి. వీటిలో 1.12 లక్షల మంది సభ్యులు ఉన్నారు. వీరితో పాటు మెప్మా సభ్యులను కూడా కలుపుకుంటే మొత్తం 2.80 లక్షల మంది సభ్యులు ఉన్నారు. వరంగల్ జిల్లాలో 435 గ్రామైక్య సంఘాలు, 11358 స్వయం సహాయక సంఘాలు, వీటిలో 1,23,013 సభ్యులు ఉన్నారు. మెప్మా సభ్యులతో కలుపుకొని 2.74 లక్షల మంది సభ్యులు ఉన్నారు. ఈ మేరకు చీరెలను అందజేస్తారు.

మొదటి విడతగా ఒక్కో మహిళకు ఒక చీరను అందించనున్నారు. ఉన్నతాధికారుల నుంచి వచ్చే ఆదేశాల ప్రకారం పంపిణీ చేపట్టనున్నట్టు డీఆర్‌డీవో అధికారులు తెలిపారు. స్వయం సహాయక సంఘాల మహిళలకు చీరలు అందించడం ద్వారా చేనేత కార్మికులకు ఉపాధి అవకాశాలు కల్పించడమే ప్రధాన ఉద్దేశంగా ఈ పంపిణీ ప్రక్రియను ప్రభుత్వం చేపట్టింది. నాణ్యత విషయంలో ఇబ్బంది లేకుండా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంది. జిల్లా కేంద్రాలకు చేరుకున్న ఈ చీరలను మండలాల్లోని స్టాక్ పాయింట్లకు తరలిస్తారు. మండలాల్లో చీరలను నిల్వ చేసే స్టాక్ పాయింట్లను ఇప్పటికే గుర్తించారు. ఇక్కడి నుంచి గ్రామాల వారీగా ఎస్‌హెచ్‌జీ సభ్యులకు అందించనున్నారు.



పొదుపు సంఘాల మహిళలకు పంపిణీ చేయనున్న చీర

ఇదే మొదటి సారి

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత మహిళా సంఘాలకు చీరలను ఇవ్వడం ఇదే మొదటిసారి. గత సంవత్సరం ఇవ్వలేదు. అంతకు ముందు బీఆర్ఎస్ ప్రభుత్వం బతుకమ్మ చీరల పంపిణీలో భాగంగా మహిళా సంఘాల సభ్యులకు, మెప్మా సభ్యులకు కూడా చీరెలను పంపిణీ చేసేది. మహిళకు రెండు రకాల చీరలను అందించనుండగా.. ఇందులో 6.30 మీటర్ల చీరలు, 9 మీటర్ల చీరెలు ఉంటాయి. ప్రస్తుతం ప్రభుత్వం అందించనున్న చీరలు చేనేతవి కావడమే కాకుండా చాలా మన్నికగా ఉండనున్నట్లు తెలుస్తోంది. ఒక్కొక్క చీర సుమారు రూ.800 విలువ ఉంటుందని చెబుతున్నారు. ఎస్‌హెచ్‌జీ సభ్యులకు పంపిణీచేసే చీరలను వరంగల్ జిల్లాతో పాటు కరీనగర్, సిరిసిల్ల జిల్లాలోని పలు ప్రాంతాల్లో తయారు చేయించారు. టెస్కో పెట్టిన ఆర్డర్ ప్రకారం ఆ సంస్థ ఇచ్చిన డిజైన్, రంగుల మేరకే చీరలను నేశారు.

వరద బాధితులకు చేయూత

(5వ పేజీ తరువాయి)

ప్రభుత్వం పరిహారం మంజూరు చేయటంతో పంటనష్టం పరిహారంపై రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. అలాగే ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వర దలకు అనేకమంది మృతిచెందారు. మృతి చెందిన కుటుంబ సభ్యులకు ఒక్కొక్కరికి రూ.5లక్షల చొప్పున నష్టపరిహారం చెల్లిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. ఇప్పటివరకు 10మంది వరకు మృతి చెందినట్లుగా అధికారులు ప్రాథమికంగా గుర్తించినట్లుగా సమాచారం. వరద మృతుల వివరాలు ప్రభుత్వానికి చేరకపోవటంతో ప్రాణ నష్టపరిహారం చెల్లింపుల్లో జాప్యం జరుగుతుందనే విమర్శలున్నాయి. కలెక్టర్లు జోక్యం చేసుకుని పంట, ప్రాణ నష్టంపై సమగ్రంగా నివేదికలు ప్రభుత్వానికి సకాలంలో చేరేలా చూడాల ని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

శాశ్వత పరిష్కారం ఎప్పుడో..?

క్లౌడ్ బరస్ట్‌లు ఎప్పుడైనా రావొచ్చని, వరదను ఎదుర్కొనేందుకు శాశ్వత పరిష్కారాలు చూడాలని సీఎం రేవంత్‌రెడ్డి వరంగల్ పర్యటనలో పేర్కొన్నారు. చిన్నపాటి వానకే వరంగల్ నగరం వణికిపోతోంది. కాలనీలన్నీ కూడా జలమయం అవుతున్నాయి. ఈ క్రమంలో వరదల నుంచి నగరా నికి రక్షణేది? అనే చర్చ జరుగుతోంది. ఇటీవల హంటర్‌రోడ్డు, గోపాలపూర్ రోడ్డులో ముంపు కాలనీల ప్రజలు రోడ్డెక్కారు. ముంపు నుంచి తమను శాశ్వతంగా కాపాడాలంటూ ఆందోళనకు దిగారు. చిన్నపాటి వర్షానికి ఈ ప్రాంతాల్లో ప్రజలు నరకం చూస్తున్నారు.

ప్రభుత్వం నగరంలో వరద ముంపును నివారించేందుకు రూ.4,170కోట్ల అంచనా వ్యయంతో భూగర్భ డ్రైనేజీ (యూజీడీ) కోసం డీపీఆర్‌ను సిద్ధం చేసింది. పరిపాలన అనుమతులు కూడా ఇచ్చింది. యూజీడీ ప్రాజెక్టు తుదిదశకు చేరుకుంది. అయితే యూజీడీ నగరానికి వరద ముంపు నుంచి శాశ్వత పరిష్కారం సాధ్యం కాదని, కొంత వరకు మాత్రమే ఉపశమనం లభిస్తుందనే చర్చ జరుగుతోంది. నగరంలో కబ్జాలకు గురైన నాలాలు, చెరువుల శిఖం భూములకు విముక్తి కల్పించే సంకల్పం అధికారుల్లో కని పించటం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. దీంతో వర్షం వరద కాలువల నుంచి బయటకు వెళ్లే పరిస్థితి లేక కాలనీల్లోకి చేరుతోంది. సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలను నగర పాలక అధికారులు పాటించి అక్రమార్కులపై ఉక్కుపాదం మోపాలని నగరవాసులు కోరుతున్నారు.

నాడు కళాపోషణ.. నేడు భిక్షాటన..

» ఆర్థిక ఇబ్బందులతో భారమైన కుటుంబ పోషణ
» దయనీయంగా మారిన అంధ సోదరులు జీవనం

పాలకుర్తి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : ఇద్దరూ సోదరులే.. ఒకరు పుట్టుకతోనే చూపు కోల్పోతే.. ఇంకొకర చిన్నతనంలో అనారోగ్యంతో కోల్పోవాల్సి వచ్చింది. అయితేనేం వారు గొంతు సవరించి గళం విప్పితే విన్నవారంతా మంత్రముగ్ధులు కావాల్సిందే. హార్మోనియం, ఫ్లూటు, తబలా, పియానో ఇలా ఏది వాయించారంటే చిన్నాపెద్దా తేడాలేకుండా అక్కడి నుంచి కదలడం కష్టమేననడంలో అతిశయోక్తి కాదు. కానీ, ఆదరణ లేక ఆ అంధ కళాకారులకు కుటుంబాన్ని పోషించుకునేందుకు భిక్షాటన చేయాల్సిన దుస్థితి నెలకొంది. ఇద్దరు అంధ సోదరులు దయనీయస్థితిపై ప్రత్యేక కథనం..

జనగామ జిల్లా పాలకుర్తి మండల కేంద్రానికి చెందిన మారోజు పుల్లయ్య, సుశీల దంపతులకు నలుగురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు. పెద్ద కుమారుడు పదేళ్ల క్రితం అనారోగ్యంతో మృతి చెందగా, రెండో వారు కులవృత్తి చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. మూడు, నాలుగో కుమారుడు భీష్మాచారి, శంకరాచారి ఇద్దరూ అంధులే. భీష్మాచారికి పుట్టుకతోనే చూపు కోల్పోగా, శంకరచారి ఆరో తరగతి చదివే సమయంలో వచ్చిన అరుదైన వ్యాధితో అంధత్వం వచ్చింది.



వాయిద్యాలతో అంధ కళాకారులు భీష్మాచారి, శంకరాచారి

చిన్న రేకుల షెడ్డులోనే జీవనం..

భీష్మాచారికి భార్య ఉమారాణి, ఇద్దరు కుమార్తెలు సృజన, జ్యోతి ఉన్నారు. శంకరాచారికి భార్య సునీత, కుమార్తె అఖిల ఉంది. గూడులేక చిన్నపాటి రేకుల షెడ్డులోనే కాలం వెళ్లదీస్తున్నారు. భీష్మాచారి ఉదయం వేళలో మండల కేంద్రంలోని శ్రీ సోమేశ్వర లక్ష్మీనర్సింహస్వామి ఆలయం మెట్లపై, గ్రామాల్లో ఇద్దరు సోదరులు బికాటన చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. ప్రభుత్వం ఇచ్చే పెన్షన్ మాత్రమే ప్రధాన జీవనాధారమైంది. ప్రభుత్వం ఇందిరమ్మ ఇల్లు ఇచ్చి ఆదుకోవాలని అంధ కళాసోదరులు కోరుతున్నారు. శంకరాచారి భార్య సునీత కూలీ పనులు చేసుకుంటోంది.

భిక్షాటన చేస్తున్న అంధ కళాకారులు

భీష్మాచారికి 53 ఏళ్లు ఉండగా, తమ్ముడు శంకరాచారికి 48 ఏళ్లు ఉన్నాయి. చిన్ననాటి నుంచి తమకున్న కళను నమ్ముకుని జీవించారు. పదేళ్ల క్రితం వరకు పాఠశాలలు, గ్రామాల్లో ప్రత్యేక ప్రదర్శనలు ఇచ్చారు. దాతలు ఇచ్చింది తీసుకుని జీవించేవారు. ఆయా ప్రదర్శనలో సినీ, భక్తి, జానపద గీతాలకు వినసొంపుగా ఆలపించే వారు. అంతేకాదు, హార్మోనియం, ఫ్లూటు, తబలా, పియానో లాంటివి అద్భుతంగా వాయించే వారు. రానురాను వారి కళకు ఆదరణ లేకపోవడంతో కుటుంబ పోషణ భారంగా మారింది. దీంతో చేసేదేమీ లేక భిక్షాటన చేస్తూ పొట్ట పోసుకుంటున్నారు.

భద్రకాళి ఆలయంలో కార్తీక దీపోత్సవం

వరంగల్ కల్చరల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసోత్సవాలను పురస్కరించుకొని భద్రకాళి దేవస్థానంలో మంగళవారం సాయంత్రం దీపోత్సవం నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి భద్రేశ్వర స్వామికి అభిషేకాలు, అలంకరణలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కూచిపూడి నృత్యం, కర్ణాటక సంగీతంతో అందరినీ అలరించారు. దీపోత్సవం కార్యక్రమంలో ఈవో రామల సునిత, సిబ్బందితో పాటు లక్ష్మి శ్రీనివాస సేవా ట్రస్టు సభ్యులు పాల్గొన్నారు.



ఆలయంలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు

రహీమాకు ఇంటర్నేషనల్ ఐకాన్ బెస్ట్ సింగర్ అవార్డు

బాలసముద్రం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): హను మకొండ పట్టణానికి చెందిన రహీమా మొహ్మద్‌కు ఇంటర్నేషనల్ ఐకాన్ బెస్ట్ సింగర్ అవార్డు లభించింది. భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో వల్లూరి ఫౌండేషన్ సంస్థ, ప్రగతి ఫౌండేషన్ సంస్థ ఆధ్వర్యంలో సామాజిక సేవా రంగంలో విశిష్ట సేవలందిస్తున్న సమాజ సేవకులకు, కవులకు, కళాకారులకు హైదరాబాద్ బాగ్ లింగ్ లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞానకేంద్రంలో ప్రభుత్వ భాషా సాంస్కృతిక శాఖ అవార్డులను ప్రదానం చేసింది.

అవార్డును హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, రాజ్యసభ సభ్యులు, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య చేతుల మీదుగా రహీమా మొహ్మద్‌కు అవార్డును ప్రదానం చేసి ఘనంగా సత్కరించారు.


అవార్డు అందజేస్తున్న దత్తాత్రేయ



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న పెన్షనర్లు

కలెక్టరేట్ ఎదుట పెన్షనర్ల నిరసన

హనుమకొండ కలెక్టరేట్, నవంబరు11(ఆంధ్రజ్యోతి): తమ సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ ఆల్ పెన్షనర్స్, రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ నాయకులు మంగళవారం కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. 2024 మార్చి తర్వాత రిటైర్ అయిన పెన్షనర్లకు పెన్షనరీ బెనిఫిట్స్ వెంటనే చెల్లించాలని, ఈహెచ్‌ఎస్ వైద్య విధివిధానాలు రూపొందించి కార్పొరేట్, ప్రైవేట్ హాస్పిటల్స్‌లలో గరిష్ఠంగా రూ.10 లక్షల వరకు ఉచిత నాణ్యమైన వైద్యం అందించాలన్నారు. అనంతరం జిల్లా రెవెన్యూ అధికారి వై.వి.గణేష్‌కు సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు తూపురాణి సీతారాం, ప్రధాన కార్యదర్శి నారాయణగిరి వీరన్న, పెండ్యాల బ్రహ్మయ్య, ఆకునూరి విద్యాదేవి, సంపత్‌కుమార్, పరికిపండ్ల వేణు, మాడిశెట్టి శేఖర్, ఎర్రగట్టు స్వామి, కె.శంకర్‌రావు, రహమాన్‌తో పాటు పెద్ద సంఖ్యలో పెన్షనర్లు పాల్గొన్నారు.

నేషనల్ హెల్త్ మిషన్ ఉద్యోగుల ధర్నా


కలెక్టరేట్‌లో ధర్నా చేస్తున్న ఉద్యోగులు

వరంగల్ మెడికల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): నేషనల్ హెల్త్ మిషన్ ఉద్యోగులకు పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం కలెక్టరేట్ నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులు మాట్లాడుతూ.. కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తున్న ఆల్‌క్యాడర్ ఉద్యోగుల పెండింగ్ వేతనాలు వెంటనే విడుదల చేయాలన్నారు. సుప్రీంకోర్టు తీర్పు మేరకు ఉద్యోగులందరికీ సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని, కాంట్రాక్టులో పని చేస్తున్న ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని తెలిపారు. ఏ జిల్లాలో పని చేస్తున్న ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులకు డిప్టేషన్లు, ట్రాన్స్‌ఫర్‌లు కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఎన్‌హెచ్‌ఎం జిల్లా నాయకులు డాక్టర్ అరుణ్ కుమార్, డాక్టర్ నవీన్ కుమార్, రుక్మిద్దీన్, ప్రవీణ్, సుదర్శన్, రహమాన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి అబుల్ కలాం బాటలు

జయంతి వేడుకల్లో కలెక్టర్ స్నేహ శబరీష్

హనుమకొండ కలెక్టరేట్, నవంబరు11(ఆంధ్రజ్యోతి): విద్యాభివృద్ధికి బాటలు వేసిన మహనీయుడు దేశ తొలి విద్యాశాఖ మంత్రి అబుల్ కలాం ఆజాద్ అని జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ అన్నారు. జిల్లా కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్‌హాల్‌లో మంగళవారం జాతీయ విద్యా దినోత్సవం, దేశ తొలి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి కార్యక్రమం జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ కేపీ గౌస్‌హైదర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన కలెక్టర్ అబుల్ కలాం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి వై.వి.గణేష్, డీఆర్‌డీఓ మేన శ్రీను, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

అబుల్ కలాంను ఆదర్శంగా తీసుకోవాలి

విద్యార్థులు మౌలానా అబుల్ కలాం ఆజాద్‌ను ఆదర్శకంగా తీసుకుని ముందుకు వెళ్లాలని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి(డీఐఈఓ)గోపాల్ సూచించారు. హనుమకొండ హంటర్‌రోడ్‌లోని కాజీపేట మైనారిటీ జూనియర్ కళాశాలలో మంగళవారం జాతీయ విద్యాదినోత్సవం కళాశాల ప్రిన్సిపాల్ పెరుమాండ్ల శిరీష అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా డీఐఈఓతోపాటు ప్రిన్సిపాల్, మైనారిటీ కమిషన్ సభ్యుడు, ఇతర ఉపాధ్యాయులు అబుల్ కలాం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం కళాశాలలో నిర్వహించిన పోటీలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మైనారిటీ కమిషన్ సభ్యులు దర్శన్‌సింగ్, శాంతి సంఘం ఉపాధ్యక్షుడు ఫిలిప్ లాజరస్, కళాశాల ప్రిన్సిపల్ పెరుమాండ్ల శిరీష, కళాశాల అధ్యాపక బృందం, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

హనుమకొండ గ్రంథాలయంలో..

● హనుమకొండ టౌన్: భారతదేశ మొదటి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ 137వ జయంతి వేడుకలు నగరంలో మంగళవారం ఘనంగా జరిగాయి. హనుమకొండలోని గ్రంథాలయంలో ఆజాద్ చిత్రపటానికి గ్రంథాలయ సంస్థ చైర్మన్ అజీజ్‌ఖాన్ పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి శశిజాదేవి, సిబ్బంది నిఖిల్, పురుషోత్తం, రాజు, సంతోష్, రాజేష్ పాల్గొన్నారు.

ఆర్టీసీ రీజినల్ కార్యాలయంలో..

హనుమకొండలోని ఆర్టీసీ రీజినల్ కార్యాలయంలో అబుల్ కలాం ఆజాద్ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా కలాం చిత్రపటానికి ఆర్టీసీ ఆర్‌ఎం విజయభాను పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఆర్టీసీ ఉద్యోగులు పాల్గొన్నారు.

సుబేదారి పోలీస్ స్టేషన్‌లో..

హనుమకొండ సుబేదారి పోలీస్‌స్టేషన్‌లో అబుల్ కలాం ఆజాద్ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా అబుల్ కలాం చిత్రపటానికి సీఐ మేకల రంజిత్‌కుమార్ పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఎస్‌ఐలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ కార్యాలయంలో..

హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో ప్రముఖ స్వాతంత్ర్య సమర యోధుడు, భారత దేశ తొలి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ 137వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. అబుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి వరంగల్ పశ్చిమ కో ఆర్డినేటర్ పులి రజనీకాంత్, మాజీ కార్పొరేటర్ జోరిక రమేష్, పోలెపల్లి రాంమూర్తి, బుద్దె వెంకన్న పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు సుధాకర్, సారయ్య, శ్రీనివాస్, అజయ్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.


అబుల్ కలాం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న కలెక్టర్ స్నేహ శబరీష్, ఇతర అధికారులు

కేయూ క్యాంపస్‌లో..

● కేయూ క్యాంపస్: దేశ తొలి విద్యాశాఖమంత్రి మౌలానా అబ్దుల్ ఆజాద్ కలాం 137వ జయంతిని పురస్కరించుకుని కేయూ పరిపాలన భవనంలో ఘనంగా నివాళులర్పించారు. అజాద్ చిత్రపటానికి కేయూ వీసీ ప్రొఫెసర్ కె.ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రంలు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కేయూ పాలక మండలి సభ్యులు, లా కళాశాలప్రిన్సిపాల్ నిమ్మ సుదర్శన్, కేయూ మైనార్టీ సెల్ డైరెక్టర్ కనీజ్‌పాతిమా, ఆసీం ఇక్బాల్, ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి, షయోదా, నవీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ, కాంగ్రెస్‌ల దొంగ నాటకాలను ఎండగట్టాలి

కేయూ రిటైర్డు ప్రొఫెసర్ కూరపాటి వెంకట్‌నారాయణ

కేయూ క్యాంపస్ నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల విషయంలో కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీలు నాటకాలు ఆడుతున్నాయని, వాటిని ఎండగట్టాలని కేయూ రిటైర్డు ప్రొఫెసర్, ప్రముఖ సామాజికవేత్త ప్రొఫెసర్ కూరపాటి వెంకటనారాయణ అన్నారు. కేయూ దూరవిద్య కేంద్రంలో చేపట్టిన బీసీల ధర్మదీక్షలను మంగళవారం వెంకటనారాయణ హాజరై ప్రారంభించి మాట్లాడారు. బీసీలకు జనాభా దామాషా మేరకు రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. బీసీ రిజర్వేషన్ల కోసం కాంగ్రెస్ పార్లమెంట్‌ను స్తంభింపచేయాలని అన్నారు. కామారెడ్డి డిక్లరేషన్‌ను అమలు చేయాలన్నారు. అసెంబ్లీలో బిల్లు ప్రవేశపెట్టి చేతులు దులుపుకుంటే బీసీ సమాజం ఊరుకోదని అన్నారు. బీసీలు విద్య, ఉద్యోగ, వ్యాపార, వాణిజ్యరంగాల్లో వెనుకపడ్డారని అన్నారు. అగ్రవర్ణాలు బీసీలను బానిసలుగా వాడుకుంటున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. బీసీలను మోసం చేసే పార్టీలకు బుద్ధి చెబుతామని హెచ్చరించారు. గ్రామస్థాయి నుంచి బీసీ ఉద్యమాలు కొనసాగుతాయని చెప్పారు. కేంద్రం స్పందించి బీసీల రిజర్వేషన్లకు ఆమోదం తెలపాలని అన్నారు. దీక్షలు కేయూ విద్యార్థి జేఏసీ చైర్మన్ ఆరెగంటి నాగరాజుగౌడ్ నేతృత్వంలో జరుగుతుండగా నేతలు సంగాని మల్లేశ్వర్, చిర్రా రాజుగౌడ్, ఆకుతోట శ్రీనివాస్, చీకటి శ్రీను, వేణు, మంద వీరాస్వామి, వేముల మహేందర్‌గౌడ్, ఏదునూరి రాజమౌళి, నాగరాజు పటేల్, నాగరాజు, సూర్య కిరణ్, అజయ్‌సింగ్, అన్వేశ్, రాజశేఖర్, గణేశ్, నవీన్, సురేందర్, అనిల్, రవితేజ, ధర్మ, బాసికే నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



దీక్షల్లో పాల్గొని మాట్లాడుతున్న కూరపాటి వెంకట్‌నారాయణ

పాఠశాలల్లో స్నేహపూర్వక వాతావరణం కల్పించాలి

వరంగల్ ఎడ్యుకేషన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని యాజమాన్య పాఠశాలల్లో ఆహ్లాదకరమైన, స్నేహపూర్వక వాతావరణం కల్పించేందుకు ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు కృషి చేయాలని అడిషనల్ కలెక్టర్, డీఈవో ఎ. వెంకట్‌రెడ్డి సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ... విద్యార్థులకు చదువుతో పాటు క్రీడ, సాహిత్య, సాంస్కృతిక రంగాల్లో రాణించేలా పాఠశాల వాతావరణం కల్పించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీఎం అండ్ హెచ్‌వో మదన్‌మోహన్, డీడబ్ల్యువో జయంతి, సీఎంవో సుదర్శన్‌రెడ్డి, సైకియాట్రిస్ట్ ప్రహసిత్, డాక్టర్ హిమబిందు, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు దామోదర్, అశోక్‌రెడ్డి, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

బీసీల ధర్మపోరాట దీక్షను జయప్రదం చేయాలి

వడ్డెపల్లి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): బీసీలకు విద్య, ఉద్యోగ, స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్ల సాధన కోసం బీసీ జేఏసీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు గురువారం హనుమకొండ బాలసముద్రంలోని ఏకశిల పార్కు వద్ద నిర్వహించే బీసీల ధర్మ పోరాట దీక్షను జయప్రదం చేయాలని బీసీ జేఏసీ ఉమ్మడి వరంగల్ జిల్లా జేఏసీ చైర్మన్ వడ్లకొండ వేణుగోపాల్ పిలుపునిచ్చారు. మంగళవారం హనుమకొండ 56వ డివిజన్ గోపాల్‌పూర్ జవహర్‌కాలనీలో నిర్వహించిన బీసీ సంక్షేమ సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజకీయాలకు అతీతంగా బీసీ మేధావులు, ఉద్యోగస్తులు, కుల ప్రజా సంఘాల ప్రతినిధులు, విద్యార్థులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. ఈ సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు దాడి మల్లయ్య యాదవ్, రాష్ట్ర మహిళా ఉపాధ్య క్షురాలు తమ్మల శోభారాణి, జిల్లా నాయకులు పంజాల మధు, మహేందర్, చంద్రశేఖర్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

మనస్తాపంతో వ్యాపారి ఆత్మహత్య

గిర్మాజిపేట, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : అనారోగ్యానికి తోడు ఆర్థిక సమస్యలు ఎక్కువ అవడంతో మనస్తాపం చెందిన ఓ చిరువ్యాపారి ఆత్మహత్య చేసుకున్నాడు. జీఆర్‌పీ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కరీమాబాద్ ప్రాంతానికి చెందిన తరాల భిక్షపతి (42) వరంగల్ పాతబీటు బజారులో అల్లం, ఎల్లిగడ్డ వ్యాపారం చేస్తున్నాడు. అందులో నష్టాలు రావడంతో పాటు ఆరోగ్యం సహకరించకపోవ డంతో అప్పులపాలయ్యాడు. ఈ క్రమంలో మద్యానికి బానిసై సోమవారం అర్ధరాత్రి బీటుబజార్ సమీపంలో రైలు కిందపడి దుర్మరణం చెందాడు. ఆయనకు భార్య, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు హెడ్‌కానిస్టేబుల్ ఎస్.రవిందర్ రెడ్డి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

జాతీయ శిబిరానికి లక్ష్మణ్ ఎంపిక

కేయూ క్యాంపస్ నవంబరు 11 (ఆంధ్రజ్యోతి):ఈ నెల 18 నుంచి 27 వరకు హిమాచల్‌ప్రదేశ్‌లోని ధర్మశాలలో జరిగే జాతీయ సాహసశిబిరానికి సుబేదారిలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్ సీహెచ్ లక్ష్మణ్ ఎంపికయ్యారు. ఈ మేరకు మంగళవారం కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సుంకరి జ్యోతి, వైస్ ప్రిన్సిపాల్ ఎమ్డీ రహమాన్, ఎన్‌ఎస్‌ఎస్ నాలుగో యూనిట్ పీవో డాక్టర్ అజ్మీరా రమేశ్‌లు లక్ష్మణ్‌కు కళాశాల ప్రిన్సిపాల్ చాంబర్‌లో ఎంపిక ధృవపత్రాన్ని అందచేసి అభినందించారు. లక్ష్మణ్ ఆర్ట్స్ కళాశాలలో ఎస్సీ బాటనీ రెండో ఏడాది చదువుతున్నారు. అంకితభావం, క్రమశిక్షణతో పాటు ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాంలో చురుకుగా పాల్గొనడం పట్ల లక్ష్మణ్‌ను అభినందనలు తెలిపారు. నిబద్ధతతో పని చేస్తే మంచి గుర్తింపు లభిస్తుందని చప్పారు. ఈ కార్యక్రమంలో పీవోలు, వలంటీర్లు, అధికారులు పాల్గొన్నారు.


లక్ష్మణ్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ జ్యోతి, రహమాన్, రమేశ్

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

రాంనగర్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ మరమ్మతుల దృష్ట్యా హనుమకొండలోని పలు సబ్‌స్టేషన్‌ల పరిధిలో బుధవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని హనుమ కొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు. న్యూశాయంపేట సబ్‌స్టేషన్ పరిధిలోని టెంపుల్ ట్రీ విల్లాస్ ఏరియా, కనకదుర్గ కాలనీ, వాసవి కాలనీ, అంజనేయుల టెంపుల్ హంటర్‌రోడ్డు ఏరియా లో ఉదయం 10 గంటల నుంచి 11 గంటల వరకు, మడికొండ సబ్‌స్టేషన్ పరిధిలో వాల్మీకి నగర్, శ్రీ సాయి కాలనీ, కపిల్ హోమ్స్ అండ్ ధర్మసాగర్ రోడ్డు ఏరియాలో ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరా జరగదని డీఈ తెలిపారు.

ఘనంగా యూనియన్ బ్యాంక్ వ్యవస్థాపక దినోత్సవం


కేక్ కట్ చేస్తున్న చీఫ్ మేనేజర్ కుందన్ కుమార్‌సింగ్

బాలసముద్రం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): యూనియన్ బ్యాంక్ 107వ వ్యవస్థాపక దినోత్సవాన్ని హనుమకొండ నక్కలగుట్ట యూనియన్ బ్యాంక్ శాఖలో మంగళవారం ఘనంగా జరుపుకున్నారు. బ్యాంక్ చీఫ్ మేనజర్ కుందన్ కుమార్ సింగ్ కేక్ కట్ చేసి బ్యాంక్ సిబ్బందికి, ఖాతాదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో 8,500లకు పైగా బ్యాంక్ శాఖలు పనిచేస్తున్నట్లు సుమారు 75వేలకు పైగా ఉద్యోగులు ప్రజా సేవల్లో నిమగ్నమైనట్లు వివరించారు. తమ బ్యాంక్ రూ.10 వేల నుంచి రూ.10వేల కోట్ల వరకు అవసరార్థులకు బ్యాంక్ రుణాలు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. ప్రజల సౌకర్యార్థం సేవింగ్ బ్యాంక్ అకౌంట్, కరెంట్ అకౌంట్లు, డిపాజిట్ల సేకరణతో పాటు విద్యారుణాలు, హౌసింగ్ లోన్లు తక్కువ వడ్డీరేట్లకు అందజేస్తున్నట్లు ఆయన తెలిపారు. డిప్యూటీ బ్రాంచ్ మేనేజర్ బి.శ్రీకాంత్, అసిస్టెంట్ మేనేజర్ పి.శ్రీనివాస్, క్రెడిట్ మేనేజర్ బి. రవికుమార్, సిబ్బంది, ఖాతాదారులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్టాండ్‌లో పోలీసుల తనిఖీలు

హనుమకొండ టౌన్ (ఆంధ్రజ్యోతి): హనుమకొండ ఆర్టీసీ బస్టాండ్‌లో పోలీసులు మంగళవారం ముమ్మరంగా తనిఖీలు చేపట్టారు. సోమవారం ఢిల్లీలో జరిగిన బాంబు పేలుళ్ల దృష్ట్యా వరంగల్ పోలీసు కమిషనర్ ఆదేశాల మేరకు హనుమకొండ సీఐ శివకుమార్ ఆధ్వర్యంలో సాయుధ పోలీసులు ముమ్మరంగా తనిఖీలు నిర్వహించారు. ప్రయాణికులతో మాట్లాడి ఎవరైన కొత్త వ్యక్తులు అనుమానస్పదంగా తిరిగినా పోలీసులకు, డయ ల్ 100కు సమాచారం ఇవ్వాలని సీఐ శివకు మార్ సూచించారు.

కాలనీల అభివృద్ధే ధ్యేయం

59వ డివిజన్ కార్పొరేటర్ గుజ్జుల వసంత మహేందర్‌రెడ్డి

జూలైవాడ, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): కాలనీల అభివృద్ధే ధ్యేయంగా పని చేయడం జరుగుతుందని 59వ డివిజన్ కార్పొరేటర్ గుజ్జుల వసంత మహేందర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం డివిజన్‌లోని కనకదుర్గాకాలనీ పార్కులో వాకర్స్‌తో చాయ్ పే చర్చ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు దెబ్బదిన్న రోడ్లు, డ్రెయినేజీ వ్యవస్థను పునరుద్ధరించేందుకు తగిన చర్యలు ప్రారంభించినట్లు తెలిపారు.

ప్రజల సూచనల ఆధారంగా కాలనీలలో మిగిలిన సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఆరోగ్య పరిరక్షణకు ప్రతి ఒక్కరూ వ్యాయామం చేయాలని కార్పొరేటర్ మహేందర్‌రెడ్డి సూచించారు. ఈ కార్యక్రమంలో కాలనీలోని పెద్దలు, వాకర్స్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కార్పొరేటర్ గుజ్జుల వసంత మహేందర్‌రెడ్డి

ఉచిత న్యూట్రిషన్ కిట్ల పంపిణీ

హనుమకొండ కలెక్టరేట్, నవంబరు11(ఆంధ్రజ్యోతి): హనుమకొండ సుబేదారిలోని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీలో టీబీ (క్షయ) వ్యాధిగ్రస్తులకు మంగళవారం రెడ్‌క్రాస్ పాలకవర్గం ఉచితంగా న్యూట్రిషన్ కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ డాక్టర్ పెసరు విజయ్ చందర్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రధానమంత్రి టీబీ ముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా రెడ్‌క్రాస్ సొసైటీ తరఫున 30మంది టీబీ బాధితులకు ఉచిత న్యూట్రిషన్ కిట్లు(పౌష్టికాహార పదార్థాలు, కోడిగుడ్లు, నిత్యావసరసరుకులు) పంపిణీ చేశామన్నారు. జూలై నుంచి 6నెలల పాటు ప్రతీ నెలా 30మందికి ఇలాంటి న్యూట్రిషన్ కిట్లు పంపిణీ చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సొసైటీ కోశాధికారి బొమ్మినేని పాపిరెడ్డి, రాష్ట్ర పాలకవర్గ సభ్యుడు ఈవీ శ్రీనివాసరావు, జిల్లా పాలకవర్గ సభ్యులు పుల్లూరు వేణుగోపాల్, బిల్ల రమణారెడ్డి, జిల్లా టీబీ నివారణ అధికారి కె.హిమబిందు, రెడ్‌క్రాస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



న్యూట్రిషన్ కిట్లతో రెడ్‌క్రాస్ ప్రతినిధులు

అందెశ్రీ ఆశయాలను కొనసాగించాలి

తెలంగాణ ఉద్యమకారుల వేదిక రాష్ట్ర చైర్మన్ వెంకటనారాయణ

వడ్డెపల్లి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): పీడిత ప్రజల విముక్తి కోసం, మానవీయ విలువల సమాజ నిర్మాణ మే ధ్యేయంగా, ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జీవితాతం రచించి పాడిన మహాకవి అందెశ్రీ ఆశయాలను సమాజంలోని ప్రతీ ఒక్కరు కొనసాగించాలని తెలంగాణ ఉద్యమకారుల వేదిక రాష్ట్ర చైర్మన్ కూరపాటి వెంకటనారాయణ అన్నారు. మంగళవారం హనుమకొండ పబ్లిక్‌గార్డెన్ ప్రాంతంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద వివిధ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో అందెశ్రీకి ఘనంగా నివాళులర్పించారు. తొలుత చిత్రపటానికి పూలమాలలు వేశారు.

ఈ సందర్భంగా వెంకటనారాయణ మాట్లాడుతూ.. పసితనంలోనే పశువుల కాపరిగా ఎన్నో కష్టాలు పడిన అందెశ్రీ తన కష్టాలతో పాటు ప్రజలు, సమాజ కష్టాలపై నిరంతరం ఆలోచన చేశారన్నారు. ప్రజా కవిగా ఎన్నో గీతాలను రాసి పాడి ప్రజలను చైతన్యం చేసిన ఘనత ఆయకే దక్కుతుందని తెలిపారు. మలిదశ తెలంగాణ ఉద్యమంలో తాను రాసి పాడిన జయ జయ హే తెలంగాణ పాట ద్వారా యావత్ తెలంగాణ ప్రజల్లో ఉద్యమ స్ఫూర్తి నింపారని తెలిపారు. పాఠశాలకు వెళ్లని అందెశ్రీకి కాకతీయ యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్ ఇచ్చి గౌరవించిందని, అలాంటి మహాకవి బాటలో తెలంగాణ సమాజం పయనించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆల్ ఇండియా ఓబీసీ జాక్ జాతీయ చైర్మన్ సాయిని నరేందర్, బీసీ మహాసేన రాష్ట్ర కన్వీనర్ తాడిశెట్టి క్రాంతి కుమార్, టీజేఎస్ జిల్లా అధ్యక్షుడు చిల్లా రాజేంద్రప్రసాద్, భారత్ బచావో రాష్ట్ర నేత ఎండి రాజ్ మహ్మద్, వివిధ ప్రజా సంఘాల నాయకులు నేదునూరి రాజమౌళి, కొంగ వీరస్వామి, సంఘాని మల్లేశ్వర్, నలిగంటి చంద్రమౌళి, చాపర్తి కుమార్‌గాడ్గే, మంద వీరస్వామి, సూరం నిరంజన్, కత్తెరపల్లి దామోదర్ తదితరులు పాల్గొన్నారు.

గోపాల్‌పూర్‌లో..

హనుమకొండ 56వ డివిజన్ గోపాల్‌పూర్‌లో అందెశ్రీ సంతాప సభను బీజేపీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. బీజేపీ గోపాల్‌పూర్ జోనల్ అధ్యక్షుడు బండి హరీష్‌ముదిరాజ్, బీజేపీ జిల్లా ఓబీసీ మోర్చ కార్యాలయ కార్యదర్శి అలుగునూరి కృష్ణంరాజు తదితరులు అందెశ్రీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. బీజేపీ శ్రేణులు చెరుకు శ్రీనివాస్, కొత్తపల్లి అమర్, తదితరులు పాల్గొన్నారు.

అశోక కాలనీలో..

హనుమకొండ 57వ డివిజన్ అశోక కాలనీలో జయ జయ హే తెలంగాణ గేయ రచయిత, ప్రజాకవి అందెశ్రీకి బీసీ సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షుడు ముత్తిలింగం, అధ్యక్షుడు పూర్ణచందర్ ఆధ్వర్యంలో మంగళవారం సంతాప సభను నిర్వ హించారు. అందెశ్రీ చిత్రపటం వద్ద కొవ్వొత్తులు వెలిగించి నివాళులను అర్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అందెశ్రీ జీవిత చరిత్రను పాఠ్యపుస్తకాల్లో ముద్రించాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం నేతలు రామచందర్, రామయ్య, వీరస్వామి, రవీందర్‌తో పాటు కాలనీ ప్రతినిధి ఎర్రబోయిన కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

వడ్డెపల్లిలో..

ప్రజాకవి అందెశ్రీకి సంతాప సభను హనుమకొండ వడ్డెపల్లిలోని దళిత వెల్ఫేర్ కమిటీ అధ్యక్షుడు తాళ్లపెల్లి రవీందర్ (జేకే), ప్రధాన కార్యదర్శి తాళ్లపెల్లి ప్రవీణ్‌కుమార్, కోశాధికారి నల్ల ఆశీర్వాదం ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. అందెశ్రీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివా ళులర్పించారు. కార్యక్రమంలో వడ్డెపల్లి దళిత వెల్ఫేర్ కమిటీ ప్రతినిధులు సుదర్శన్, సుధాకర్, భాస్కర్, ప్రసంగి తదితరులు పాల్గొన్నారు.


అంబేద్కర్ విగ్రహం వద్ద అందెశ్రీకి నివాళులర్పిస్తున్న ప్రజా సంఘాల నేతలు



విజేత

అంతరిక్షంలోకి తెలుగమ్మాయి

పువ్వు పట్టగానే పరిమళిస్తుందంటారు. **కుంచల కైవల్యరెడ్డి**కి ఈ నానుడి మెరుగ్గా వర్తిస్తుంది. ఎనిమిది, పదో తరగతుల్లోనే గ్రహశకలాలను కనుగొన్న ఈ 17 ఏళ్ల అమ్మాయి, తాజాగా అంతరిక్షంలోకి అడుగుపెట్టే అరుదైన అవకాశాన్ని సొంతం చేసుకున్న తెలుగమ్మాయిగా చరిత్ర సృష్టించింది. ఈ సందర్భంగా కైవల్య 'నవ్య'తో పంచుకున్న విశేషాలు...

> మనమిప్పుడు ఆవిష్కరించిన అంశం భవిష్యత్తులో ఉపయోగపడవచ్చు. ఒకప్పుడు న్యూటన్ కనిపెట్టిన లాస్ ఆఫ్ ఫిజిక్స్ అద్భుతమైన ఆవిష్కరణ. కానీ అప్పటి వాళ్లకు దాని విలువ తెలియదు. కానీ ఇప్పుడు కూడా న్యూటన్ లాస్ మనకు అక్కరకొస్తున్నాయి. నేను కూడా కొన్ని శతాబ్దాల పాటు ఉపయోగించుకోగలిగే అంశాలను ఆవిష్కరించాలని కోరుకుంటున్నాను. మా స్వస్థలం, బాపట్ల జిల్లా బేతంపూడి. నాన్న కుంచాల శ్రీనివాసరెడ్డి నిడదవోలు మండలంలోని సమిశ్రగూడెం సచివాలయంలో కార్యదర్శిగా పని చేస్తున్నారు. అమ్మ కుంచాల విజయలక్ష్మీ గృహిణి. ప్రస్తుతం, ఆస్ట్రానమీ కిడ్స్ క్లబ్ సహ వ్యవస్థాపకురాలిగా, స్పేస్‌పోర్ట్ ఇండియా ఫౌండేషన్ రాయబారిగా వ్యవహరిస్తున్నాను. జీరో గ్రావిటీ, పారాబొలిక్ ఫ్లైట్స్, స్కూబా డైవింగ్, ఈవా డైవింగ్, న్యూట్రల్ బోయన్సీ, హై-ఆల్టిట్యూడ్ స్కైడైవింగ్, ఎక్స్‌టెన్సివ్ మౌంటెన్ హైకింగ్ వంటి వాటిలో శిక్షణ పొందిన తర్వాత అభ్యర్థులందరం మా మా మిషన్ అసైన్‌మెంట్‌లను అందుకుని, అధునాత శిక్షణ దశలోకి ప్రవేశించడంతోపాటు శాస్త్రీయ ప్రయోగాలు చేపడతాం.
>
> \- కైవల్య

ఆకాశం వైపు చూసిన ప్రతి ఒక్కరికీ అక్కడ కనిపించే నక్షత్రాలు, చంద్రుడిని దగ్గరి నుంచి చూడాలనీ, వాటిని తాకాలని అనిపిస్తుంది. వాటి గురించి తెలుసుకోవాలనే ఆసక్తి ఉంటే, ఎంత తెలుసుకున్నా ఇంకా తెలుసుకోవలసింది మిగిలి ఉంటూనే ఉంటుంది. ఖగోళ అంశాలు అంతటి విస్తృతమైనవి. అందర్లాగే నాక్కూడా చిన్నప్పటి నుంచి ఖగోళం పట్ల ఆసక్తి ఉండేది. ఆ ఆసక్తి వయసుతో పాటు పెరిగింది. అంతరిక్షం పట్ల ఆసక్తి కలిగి ఉన్న ప్రతి ఒక్కరూ వ్యోమగామిగా ఎదగాలని కలలు కంటారు. అలాగే నేను కూడా రెండో తరగతి చదివే వయసు నుంచే వ్యోమగామిగా ఎదగాలని కల కన్నాను. ఫ్లోరిడాలోని టైటాన్స్ స్పేస్ ఇండస్ట్రీస్ చేపట్టబోతున్న వ్యోమగామి శిక్షణ కోసం 36 దేశాల నుంచి వేలాది మంది దరఖాస్తు చేసుకున్నారు. చివర్లో ఎంపికైన 150 మంది అభ్యర్థుల్లో నేనొకదాన్ని. ఎంపిక ప్రక్రియలో భాగంగా టైటాన్స్ స్పేస్ ఇండస్ట్రీ సిఇఒ ఎస్. లాచ్‌మాన్‌తో పాటు చీఫ్ ఆస్ట్రోనాట్ విలయం మెక్ ఆర్థర్, సీవోవో అండ్ చీఫ్ ఇంజనీర్ డా.వి.విజయ్ నన్ను గంట పాటు ఆన్‌లైన్‌లో ఇంటర్వ్యూ చేశారు. అంతరిక్షంలో అడుగుపెట్టబోయే అభ్యర్థిగా ఎంపికయ్యానని తెలిసినప్పుడు నా ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. కల నిజమవడం గొప్ప అనుభవం.

> కైవల్య విజయ పరంపర 6వ తరగతి నుంచే మొదలైంది. నాసా ఫెసిలిటీతో అలబామాలోని ఎక్సా అమెరికాలో నిర్వహించిన ఇంటర్నేషనల్ ఎయిర్ అండ్ స్పేస్ ప్రోగ్రాంను పూర్తి చేసిన అతి పిన్న వయస్కురాలైన భారతీయురాలిగా కైవల్య ఘనత సాధించింది. నాసా ఫెసిలిటీతో ఇఎక్స్‌ఎ నిర్వహించే అంతర్జాతీయ ఎయిర్ అండ్ స్పేస్ ప్రోగ్రాం-2023ను 15ఏళ్ల వయసులోనే పూర్తి చేసింది. 98 దేశాలు పాల్గొనే ఖగోళ, ఖగోళ భౌతిక శాస్త్ర పోటీల్లో సిల్వర్ హానర్ సర్టిఫికెట్ పొందింది. నాసా సిటిజెన్ సైంటిస్టుగా అంగారక, బృహస్పతి గ్రహాల మధ్య ఉండే ముఖ్యమైన ఆస్టరాయిడ్ బెల్ట్‌లోని 2020 పిఎస్24, 2021 సిఎం37 అనే రెండు ప్రివిజనల్ ఆస్టరాయిడ్స్‌ని కొనుగొంది. నాసా నిర్వహించే సైంటిస్ట్ ఫర్ ఎ డే-2021 వ్యాసరచన పోటీల్లో జాతీయ ఫైనలిస్ట్‌గా నిలిచింది. ఇస్రో నిర్వహించిన స్పేస్ క్విజ్, సైన్స్ ఫెయిర్, ఆస్ట్రోఫొటోగ్రఫీ, వక్తృత్వంతోపాటు ఇతర పోటీల్లో అనేక అవార్డులను అందుకొంది.

తల్లిదండ్రుల తోడ్పాటుతో...

కుటుంబ తోడ్పాటు ఉన్నప్పుడు ఏ కలనైనా నిజం చేసుకోగలుగుతాం! నా విషయంలో అదే జరిగింది. ఇది కఠినమైన రంగమనీ, ఈ రంగంలో మహిళలకు అవకాశాలు కష్టమనీ అంటూ ఉంటారు. అయినా మా పేరెంట్స్ నన్ను ప్రోత్సహించారు. రెండో తరగతిలో ఉన్నప్పుడు ఒక పుస్తకం అమ్మ దగ్గరకు తీసుకువెళ్లి ఆ పుస్తకం మీద కనిపిస్తున్న వ్యక్తులెవరు? అని అడిగాను. వాళ్లు సునీతా విలియమ్స్, మిగతా వ్యోమగాములనీ, వాళ్లందరూ అంతరిక్షంలోకి వెళ్లారనీ అమ్మ చెప్పింది. ఆ మాటలు విన్న తర్వాత ఏదో ఒకనాటికి అంతరిక్షంలోకి వెళ్లాలని అప్పుడే అనుకున్నాను. అప్పటి నుంచి అంతరిక్షం గురించి నేను అడిగే ప్రశ్నలకు పేరెంట్స్ సమాధానాలు చెప్తూ, పుస్తకాలు అందిస్తూ, నా ఆసక్తిని మరింత ప్రోత్సహించారు. భవిష్యత్తులో ఆస్ట్రో ఫిజిక్స్ చదవాలన్నది నా కల. ఈ రంగంలో అత్యంత ప్రతిష్ఠాత్మక పురస్కారం నోబెల్ బహుమతి. కాబట్టి నేను కూడా రీసెర్చ్ సైంటిస్ట్‌గా ఎదిగి, నోబెల్ బహుమతిని గెలవాలని భావిస్తున్నాను.



మానవాళికి ఉపయోగపడే పరిశోధనలు

టిఎస్‌ఎ శిక్షణ రెండేళ్ల పాటు కొనసాగుతుంది. జీరో గ్రావిటీ పారాబొలిక్ ఫ్లైట్స్‌లో భాగంగా స్కూబా డైవింగ్, స్కై డైవింగ్‌లలో శిక్షణ సాగుతుంది. మేం అంతరిక్షంలో భిన్నమైన పరిశోధనలు చేపట్టబోతున్నాం. అంతరిక్షంలో మానవ శరీరం కొన్ని మార్పులకు లోనవుతుంది. ఆ సమయంలో ఎలాంటి భౌతిక, మానసిక మార్పులు చోటుచేసుకోబోతున్నాయో తెలుసుకోబోతున్నాం. 2025 నాటికి గాల్లో ఎగిరే కార్లు అందుబాటులోకొస్తాయని 1990ల్లో అనుకున్నారు. మున్ముందు భూగ్రహం మీద కాకుండా అంతరిక్షంలో నివసించే అవకాశాలు ఉండొచ్చని ఇప్పుడు మనందరం అనుకుంటున్నాం. భవిష్యత్తులో అంతరిక్షంలో నివసించే అవసరం ఏర్పడ్డప్పుడు, అక్కడి పరిస్థితులకు తగ్గట్టు ఎలా అలవాటు పడాలో తెలియాలంటే అందుకు తోడ్పడే పరిశోధన సాగాలి. ఇప్పుడు నేను ఎంపికైన అంతరిక్ష యాత్ర కూడా ఆ పరిశోధనలో భాగమే!

• **రమేశ్ నాగేంద్ర పలసల,** రాజమండ్రి

డెబ్భయిల్లోనూ ఊళ్లు చుట్టేస్తున్నారు

వారిద్దరూ బాల్య స్నేహితులు. లోకమంతా చుట్టెయ్యాలనే ఆశ. కానీ అప్పట్లో అది తీరలేదు. వివాహం తరువాత దూరమైనా, కొన్నేళ్ళ తరువాత మళ్ళీ కలిశారు. ఒక విదేశంతో సహా... పదమూడు ప్రాంతాలు చూసొచ్చారు. "ఇప్పుడు మాకు డెబ్బై రెండేళ్ళు. ఆరోగ్యంగా ఉన్నంతకాలం పర్యటనలు కొనసాగిస్తూనే ఉంటాం" అంటున్న కేరళ మహిళలు **సరోజిని, పద్మావతి**... భ్రమణ కాంక్షకు వయసు అడ్డంకి కాదని నిరూపిస్తున్నారు.

సరోజిని, పద్మావతి... ఇద్దరిదీ కేరళలోని మాతమంగళం పట్టణం. ఒకటే వయసున్న ఇద్దరూ కలిసే బడికి వెళ్ళేవారు. దారిలో ఎన్నెన్నో కబుర్లు. కోల్‌కతా, ముంబయి, చెన్నై, హైదరాబాద్, ఢిల్లీ... ఇలా ఏ ఊరి పేరు విన్నా... ఆ ప్రాంతాల్లో ఉన్న విశేషాల గురించి చెప్పుకొనేవారు. ఆ ఊళ్ళన్నీ చూడాలని కలలు కనేవారు. అయితే ఆ బాల్య స్నేహితులకు తమ కలలను తీర్చుకొనే అవకాశం అప్పట్లో కలగలేదు. కొన్నేళ్ళకు సరోజినికి వివాహం కావడంతో ఆమె వేరే ప్రాంతానికి వెళ్ళిపోయారు. "ఆ రోజుల్లో టెలిఫోన్లు మాకు అందుబాటులో ఉండేవి కావు. ఏవైనా శుభకార్యాలకు లేదా వారి సొంత ఊళ్ళో ప్రసిద్ధమైన కలియట్టం పండుగకు సరోజిని వచ్చినప్పుడు మాత్రమే కలుసుకొనేవాళ్ళం. పద్మావతికి పొరుగు ఊరికి చెందిన వ్యక్తితో వివాహం కావడంతో ఆ ప్రాంతంలోనే స్థిరపడింది. నా భర్త సైన్యంలో పని చేయడంతో అనేక రాష్ట్రాల్లో నివసించడానికి, పలు ప్రదేశాలను సందర్శించడానికి నాకు అవకాశం కలిగింది" అని గుర్తు చేసుకున్నారు సరోజిని. ఆమె భర్త మరణించడంతో... కొన్నేళ్ళ క్రితం మాతమంగళానికి వచ్చి... అక్కడే స్థిరపడ్డారు. మళ్ళీ ఆ స్నేహితులిద్దరూ తరచుగా కలుసుకొనేవారు. కొత్త ప్రాంతాలకు కలిసి తిరగాలనే వారి చిన్ననాటి కోరిక మళ్ళీ బలపడింది.





పింఛన్ డబ్బు దాచుకొని...

"మా స్నేహం గురించి మా పిల్లలకు తెలుసు. ఇద్దరం కలిసి పర్యటనలు జరపాలనుకుంటున్నామని వారికి చెప్పగానే.... మా నిర్ణయాన్ని గట్టిగా బలపరచడమే కాదు... ఏర్పాట్లన్నీ చేయడానికి ఎంతో ఉత్సాహం చూపించారు. కానీ మరీ అవసరమైతే తప్ప వాళ్ళ దగ్గర డబ్బు తీసుకోవడం మాకు ఇష్టం లేదు. అందుకే మా పింఛన్ డబ్బులను దాచుకోవడం ప్రారంభించాం. ముందుగా దగ్గరలోని ప్రసిద్ధ దేవాలయాలకు వెళ్ళాలని ప్రణాళిక వేసుకున్నాం" అని వివరించారు సరోజిని, పద్మావతి. కేరళలోని శబరిమల, గురువాయూరు, తమిళనాడులోని రామేశ్వరం, మదురై, ధనుష్కోటి, పళని తదితర ఆలయాలను సందర్శించారు. ఆ పర్యటనల్లో... కొందరు టూరిస్ట్ ఆపరేటర్లు, పర్యాటక బృందాల సభ్యులు వారికి పరిచయమయ్యారు. వారితో కలిసి ఉత్తర భారతదేశ యాత్రలు చేపట్టారు. వారణాసి, బదరీనాథ్, కేదార్‌నాథ్, రాజస్థాన్, గుజరాత్, కశ్మీర్... ఇలా ఎన్నో ప్రాంతాలు చుట్టేశారు. "ఇప్పటివరకూ మేము చూసిన వాటన్నిటిలో అందమైన ప్రదేశం... కశ్మీర్. ఇక... కేదార్‌నాథ్‌కు గుర్రం మీద వెళ్ళాం. అది మరచిపోలేని అనువభవం. ఇటీవలే హైదరాబాద్ వెళ్ళొచ్చాం. మాకు బాగా నచ్చేసింది" అంటున్నారు పద్మావతి, సరోజిని.

జ్ఞాపకాల బహుమతి

"ఇప్పటివరకూ మేము సందర్శించిన విదేశం ఒక్కటే... మలేషియా. దానికోసం చాలా నెలలపాటు పింఛన్ డబ్బులు దాచుకున్నాం. వచ్చేనెలలో కోల్‌కతా వెళ్తున్నాం. ప్రతి పర్యటనకు ముందు... ఎక్కడికి వెళ్ళాలని నిర్ణయించుకోవడం, వాటికోసం ఏర్పాట్లు చేసుకోవడం మాకు ఎంతో ప్రత్యేకంగా అనిపిస్తుంది. ప్రతి పర్యటనా మాకు ఎన్నో జ్ఞాపకాలను బహుమతిగా ఇస్తోంది. ఎంతో సంతోషం కలిగిస్తోంది. అందుకే... ఆరోగ్యంగా ఉన్నంతవరకూ ప్రయాణాలు కొనసాగిస్తాం" అని చెబుతున్నారు ఈ బాల్యమిత్రులు.

పాదాలు పగులుతున్నాయా..?

శీతాకాలంలో చలిగాలుల వల్ల పాదాలమీద చర్మం పొడిబారి పగులుతుంటుంది. దీంతో తీవ్రమైన నొప్పి వేధిస్తుంటుంది. చిన్న చిట్కాలతో పాదాల పగుళ్లను తగ్గించుకోవచ్చు.



- చిన్న గిన్నెలో రెండు చెంచాల బియ్యప్పిండి, రెండు చెంచాల నిమ్మరసం, ఒక చెంచా బాడీ వాష్, రెండు చెంచాల కొబ్బరినూనె వేసి బాగా కలపాలి. శుభ్రం చేసుకున్న పాదాలమీద ఈ మిశ్రమాన్ని రాసి పావుగంటసేపు ఆరనివ్వాలి. తరువాత గోరువెచ్చని నీళ్లతో పాదాలను కడిగి పొడి గుడ్డతో తుడవాలి. ఆపైన ఏదైనా మాయిశ్చరైజర్ రాసుకోవాలి. ఇలా వారానికి రెండుసార్లు చేస్తూ ఉంటే పగుళ్లు తగ్గి పాదాలు మృదువుగా మారతాయి.
- పగుళ్ల మీద తేనె, కొబ్బరినూనె, షియా బటర్, ఆలివ్ ఆయిల్‌లలో ఒకటి రాసినా ప్రయోజనం కనిపిస్తుంది. ఇవి సహజ మాయిశ్చరైజర్‌లా పనిచేసి పాదాలకు తేమని అందిస్తాయి. దీంతో పాదాల పగుళ్లు త్వరగా తగ్గుతాయి.
- ఒక గిన్నెలో బాగా పండిన అరటి పండు గుజ్జు, అవకాడో గుజ్జు వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని పాదాలకు పట్టించాలి. అరగంటసేపు ఆరనిచ్చి తరువాత గోరువెచ్చని నీళ్లతో శుభ్రంచేసుకోవాలి. ఇలా వారానికి ఒకసారి చేస్తూ ఉంటే పాదాల పగుళ్లు మాయమవుతాయి.
- వెడల్పాటి టబ్‌లో సగానికిపైగా గోరువెచ్చని నీళ్లు పోయాలి. అందులో ఒక చెంచా ఉప్పు, రెండు చెంచాల గులాబి నీళ్లు, రెండు చెంచాల గ్లిసరిన్ వేసి బాగా కలపాలి. అందులో రెండు పాదాలు మునిగేలా ఉంచాలి. అరగంట తరువాత పాదాలను స్క్రబ్ చేసి మంచినీళ్లతో కడగాలి. రెండు రోజులకోసారి ఇలా చేస్తూ ఉంటే పాదాల పగుళ్లు తగ్గుతాయి.
- ఒక గిన్నెలో గుప్పెడు తులసి ఆకులను పేస్టులా చేసి వేయాలి. అందులో రెండు చెంచాల కలబంద గుజ్జు, ఒక చెంచా కర్పూరం పొడి వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని పాదాలకు పట్టించి పావుగంటసేపు మర్దన చేయాలి. తరువాత గోరువెచ్చని నీటితో కడిగితే పాదాల పగుళ్ల నుంచి ఉపశమనం కలుగుతుంది.
- వెడల్పాటి గిన్నెలో తొమ్మిది చెంచాల నువ్వుల నూనె, మూడు చెంచాల వేపనూనె, ఒక చెంచా కలబంద గుజ్జు, ఒక చెంచా పసుపు, ఒక చెంచా గంధం, ఒక చెంచా వేపాకుల పొడి వేసి బాగా కలపాలి. రాత్రి పడుకునేముందు ఈ మిశ్రమాన్ని పాదాలకు పట్టించి సాక్స్ వేసుకోవాలి. ఉదయాన్నే గోరువెచ్చని నీటితో శుభ్రం చేసుకోవాలి. ఇలా తరచూ చేస్తూ ఉంటే కాలి వేళ్ల, మడమల మీద ఏర్పడే పగుళ్లు తగ్గుతాయి.

ఈ పండ్లు తినవచ్చు...

మధుమేహం ఉన్నవారు పండ్లు తినకూడదని చాలా మంది చెబుతుంటారు. పండ్లలో సహజసిద్ధమైన చక్కెరలు ఉంటాయి కాబట్టి వాటిని తినడంవల్ల రక్తంలో చక్కెర స్థాయి పెరుగుతుందని భావిస్తుంటారు. చక్కెర వ్యాధి ఉన్నప్పటికీ గ్లైసెమిక్ ఇండెక్స్ తక్కువగా ఉండే పండ్లు తినవచ్చని నిపుణులు సూచిస్తున్నారు.



- నారింజ, బత్తాయి పండ్లను మధుమేహం ఉన్నవారు నిర్భయంగా తీసుకోవచ్చు. వీటిలో గ్లైసెమిక్ ఇండెక్స్ 40 నుంచి 43 మధ్య మాత్రమే ఉంటుంది. వీటిలోని సి విటమిన్, ఫోలేట్, పొటాషియం, పీచు పదార్థాలు రక్తనాళాలను ఆరోగ్యంగా ఉంచుతాయి. ఇవి నెమ్మదిగా జీర్ణమవుతాయి. రక్తంలో కలవడానికి అధిక సమయం తీసుకుంటాయి.
- చక్కెర వ్యాధి ఉన్నవారికి చెర్రీ పండ్లు మంచి ఔషధమని చెప్పవచ్చు. వీటి గ్లైసెమిక్ ఇండెక్స్ 20 మాత్రమే. వీటిలో అధికంగా ఉండే యాంటీ ఆక్సిడెంట్లు, పొటాషియం.. రక్తంలో చక్కెర స్థాయిని నియంత్రణలో ఉంచుతాయి. శరీరంలో రోగనిరోధక శక్తిని పెంచుతాయి.
- డయాబెటిక్ పేషెంట్లు.. స్ట్రాబెర్రీ, బ్లూబెర్రీ పండ్లను కూడా తినవచ్చు. వీటి గ్లైసెమిక్ ఇండెక్స్ 41. ఈ పండ్లలో అత్యధికంగా సి విటమిన్ ఉంటుంది. తరచూ బెర్రీలను తింటూ ఉంటే రక్తంలో చక్కెర చేరే ప్రక్రియ నెమ్మదిస్తుంది.
- యాపిల్ పండులో ఉండే పీచుపదార్థాలు, పాలీ ఫినోల్స్.. కార్బోహైడ్రేట్ల శోషణను తగ్గిస్తాయి. దీనివల్ల రక్తంలో చక్కెర స్థాయి నియంత్రణలో ఉంటుంది. యాపిల్ పండులో చక్కెర ఫ్రక్టోస్ రూపంలో ఉంటుంది. ఇది అంత ప్రభావవంతమైంది కాదు. రోజూ యాపిల్ పండు తినడం వల్ల ఇన్సులిన్ నిరోధకత తగ్గుతుంది.

పదేళ్లలోపు పిల్లలకు ఇవి చెప్పకూడదు

చిన్న చిన్న పనులు చెప్పి చేయించడం వల్ల పిల్లలు బాధ్యతాయుతంగా మెలగడం నేర్చుకుంటారు. కానీ పదేళ్లలోపు పిల్లలకు కొన్ని పనులు చెప్పకూడదని నిపుణులు సూచిస్తున్నారు. వాటి గురించి తెలుసుకుందాం...



- పదేళ్లలోపు పిల్లలకు గ్యాస్ స్టవ్ వెలిగించడం, కెటిల్ ఉపయోగించడం, ఇస్త్రీ చేయడం లాంటి పనులు చెప్పకూడదు.
- కూరగాయలు కోయడం, వేటినైనా కత్తిరించడం, మిక్సీ లేదా బ్లెండర్ వాడడం లాంటి పనులు చెప్పకూడదు.
- అటక మీద నుంచి వస్తువులు దించడం, బరువైన వస్తువులను ఎత్తడం, లగేజ్ బ్యాగ్‌లు పట్టుకుని మెట్లు ఎక్కడం లేదా దిగడం లాంటి పనులను పురమాయించకూడదు. నీళ్ల బిందెలు లేదా బకెట్లు మోయడంలాంటివి కూడా చెప్పకూడదు. ఇలాంటి పనులు చేయడం వల్ల పిల్లల్లో వెన్ను నొప్పి, కండరాలు పట్టేయడం లాంటి సమస్యలు వస్తాయి.
- చిన్న పిల్లలకు వ్యాక్యూమ్ క్లీనర్, రైస్ కుక్కర్, ఎలక్ట్రిక్ స్టవ్, ఓవెన్‌లతో చేసే పనులు చెప్పకూడదు.
- రకరకాల క్లీనర్స్, యాసిడ్, బ్లీచింగ్ పౌడర్‌లతో చేసే పనులను పిల్లలకు చెప్పకూడదు.
- గోడలకు మేకులు కొట్టడం, బజారు నుంచి మందులు తీసుకురమ్మనడం, నిచ్చెన ఎక్కడం లాంటి పనులను కూడా చిన్న పిల్లలకు చెప్పకూడదు.



భలే బ్లేజర్స్

ఫ్యాషన్

వదులుగా ఉండే ఓవర్‌సైజ్ బ్లేజర్స్ తాజా ఫ్యాషన్ ట్రెండ్. అలియా భట్, ప్రియాంకా చోప్రా లాంటి బాలీవుడ్ అగ్రతారలు అనుసరిస్తున్న ఈ తాజా ట్రెండ్ మీద ఓ లుక్కేద్దాం!



పవర్ డ్రస్సింగ్‌లో భాగంగా....

పవర్ డ్రస్సింగ్ కాలక్రమేణా ట్రెండ్‌గా మారిపోయింది. పొడవాటి స్కర్ట్, ట్రౌజర్స్, ఈవినింగ్ గౌన్‌లను ఓవర్‌సైజ్ బ్లేజర్స్‌తో కలిపి ధరించడం ఫ్యాషన్‌గా మారింది. అధికారికంగా, హుందాగా కనిపించే ఆధునిక దుస్తుల జాబితాలో ఇవి కూడా చేరిపోయాయి. సౌకర్యంగా ఉండడంతో పాటు, ఆకట్టుకునేలా కనిపిస్తూ ఉండడంతో ప్రత్యేకించి ఉద్యోగినులు వీటి మీద మక్కువ చూపుతున్నారు.

యాక్సెసరీస్ ఇలా...

షార్ట్స్, ట్రౌజర్స్, లాంగ్ గౌన్స్‌తో కలిపి ధరించే ఈ బ్లేజర్స్ హుందాగా, ఆధునికంగా కనిపిస్తాయి. వీటికి తోడుగా హీల్స్, బూట్స్ ధరించవచ్చు. చేతిలో హ్యాండ్ బ్యాగ్, బ్రీఫ్ కేస్ నిండుదనాన్ని అందిస్తాయి. ఈ రకం దుస్తులతో సింపుల్ జ్యువెలరీ చక్కగా మ్యాచ్ అవుతుంది.

మేకప్ ఇలా...

సాధ్యమైనంత తక్కువ మేకప్ వేసుకున్నా, లిప్‌స్టిక్ బోల్డ్‌గా ఉండేలా చూసుకోవాలి. మేకప్ ముంజేతుల ఛాయతో సరిపోలేలా ఉండాలి. స్కర్ట్, షార్ట్స్ వేసుకున్నప్పుడు చర్మంలో కలిసిపోయే స్టాకింగ్స్ వేసుకోవాలి, లేదా మేకప్‌తో చర్మపు రంగును మ్యాచ్ చేయాలి.




భారత్‌తో వాణిజ్య ఒప్పందానికి చేరువయ్యాం

(మొదటి పేజీ తరువాయి)

ఇష్టపడకపోయినా.. మమ్మల్ని ఇష్టపడతారు." అని సోమవారం ట్రంప్ వ్యాఖ్యానించారు. భారత్‌లో అమెరికా రాయబారిగా నియమితులైన సెర్గియో గార్‌తో ఓవల్ ఆఫీసులో అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ ప్రమాణస్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ట్రంప్.. ఇరు దేశాల వాణిజ్య ఒప్పందాల విషయంపై మాట్లాడుతూ.. భారత్-అమెరికాల మధ్య న్యాయపరమైన వాణిజ్య ఒప్పందాలు కుదుర్చుకుంటున్నామన్నారు. ఈ ఒప్పందాలకు ప్రతి ఒక్కరికీ మేలు చేస్తాయని వ్యాఖ్యానించారు. సెర్గియో కూడా విషయాలపై దృష్టి సారించాలని కోరారు. ఈ సందర్భంగా మాజీ అధ్యక్షుడు ఒబామాపై విమర్శలు గుప్పించారు. ఆయనకు భారత దేశం గురించి ఏమీ తెలియదని వ్యాఖ్యానించారు. ఇదే సమయంలో సుంకాల విషయాన్ని ప్రస్తావిస్తూ.. రష్యా నుంచి భారత్ చమురు కొనుగోళ్లను నిలిపివేసిందని, కాబట్టి సుంకాలను గణనీయంగా తగ్గిస్తామని ట్రంప్ చెప్పారు. ఇదిలా ఉండగా, తన ప్రసంగాన్ని తప్పుగా ఎడిట్ చేసిన వ్యవహారంలో బీబీసీపై బిలియన్ డాలర్ల(దాదాపు రూ.8,845 కోట్లు)కు పరువు నష్టం దావా వేస్తామని ట్రంప్ హెచ్చరించారు. ఈ మేరకు ట్రంప్ న్యాయవాదులు బీబీసీకి లేఖ రాశారు.

విదేశీ విద్యార్థులు అమెరికా వస్తే మంచిదే: ట్రంప్

వాషింగ్టన్, నవంబరు 11: విదేశీ విద్యార్థులు చదువుల నిమిత్తం అమెరికాకు రావడం మంచిదేనని అధ్యక్షుడు ట్రంప్ అభిప్రాయపడ్డారు. వారి సంఖ్యను తగ్గిస్తే ఉన్నత విద్యా సంస్థలకు ఆర్థికంగా నష్టం కలిగిస్తుందని పేర్కొన్నారు. విదేశీ విద్యార్థుల విషయంలో ఇటీవల కాలంలో ఆయన అనుసరిస్తున్న వైఖరికి భిన్నంగా ఈ వ్యాఖ్యలు ఉండడం ప్రాధాన్యతను సంతరించుకొంది. సోమవారం ఓ వార్తా ఛానెల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో.. విదేశీ విద్యార్థులు, ముఖ్యంగా చైనా వారి సంఖ్యను తగ్గిస్తారా? అలా చేస్తే అమెరికన్లకు సులువుగా సీట్లు వస్తాయి కదా అన్న ప్రశ్నకు ఆయన సమాధానం ఇచ్చారు. విదేశీ విద్యార్థులు రావడం మంచిదేనని, ఆ కారణంగా తాను ప్రపంచ పోకడలను తెలుసుకోగలుగుతున్నానని చెప్పారు. వారి రాకను తగ్గిస్తే కొన్ని విద్యాసంస్థలు, ముఖ్యంగా 'నల్ల సంస్థలు'గా పేరుపొందిన కళాశాలల కార్యకలాపాలు నిలిచిపోతాయని అన్నారు. విదేశీ విద్యార్థులు కోట్లాది డాలర్లు తీసుకొస్తున్నారని, రెట్టింపు ఫీజులు చెల్లిస్తున్నారని అన్నారు. విద్యా వ్యవస్థ వర్ధిల్లాలని ఆశిస్తున్నట్టు చెప్పారు. 'అంటే..నేను విదేశీ విద్యార్థులను కోరుకుంటున్నట్టు కాదు...దీన్ని వ్యాపారంగానే చూస్తున్నా' అని అన్నారు.

పాక్‌లో ఆత్మాహుతి దాడి..12మంది మృతి

ఇస్లామాబాద్, నవంబరు 11: పాకిస్థాన్ రాజధాని ఇస్లామాబాద్‌లో ఆత్మాహుతి బాంబు దాడి జరిగింది. ఘటనలో 12 మంది మృతి చెందగా, మరో 27 మంది గాయాలపాలయ్యారు. జిల్లా కోర్టు భవనాల సముదాయం వద్ద మంగళవారం మధ్యాహ్నం 12.39 గంటలకు ఈ దాడి జరిగింది. ఘటన స్థలంలో రోడ్డు పక్కన ఆత్మాహుతి బాంబర్ తల పడి ఉందని పాకిస్థాన్ ప్రభుత్వ టీవీచానల్ పీటీవీ తెలిపింది. బాంబు దాడి తమ పనేనని ఇంతవరకు ఏ ఉగ్రవాద సంస్థ కూడా ప్రకటించలేదు. భారత్ మద్దతు ఉన్న ఉగ్రవాద గ్రూపులే ఈ దాడికి పాల్పడ్డాయని పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ ఆరోపించారు.

రెండు రోజుల్లో.. మూడు దేశాల్లో..

ఇరుగుపొరుగు దేశాలైన భారత్, పాకిస్థాన్, బంగ్లాదేశ్‌లలో రెండు రోజుల్లోనే వరుసగా బాంబు దాడులు జరగడం గమనార్హం. సోమవారం ఢిల్లీలో భారీ పేలుడు సంభవించగా, పాకిస్థాన్‌లోని ఇస్లామాబాద్‌లో మంగళవారం ఆత్మాహుతి దాడి జరిగింది. మరోవైపు బంగ్లాదేశ్‌లోని ఢాకాలో సోమవారం తెల్లవారుజామున ఒక ప్రభుత్వ బస్సుకు, ప్రైవేటు కారుకు దుండగులు నిప్పుపెట్టారు. అదే సమయంలో గ్రామీణ్ బ్యాంకు ప్రధాన కార్యాలయం వద్ద పెట్రోల్ బాంబు వేశారు. మంగళవారం మరో నాలుగు చోట్ల పెట్రోల్ బాంబు దాడులు జరిగాయి. మూడు బస్సులు, ఒక కారుకు నిప్పు పెట్టారు.

బిహార్ మళ్లీ ఎన్డీయేదే!

(మొదటి పేజీ తరువాయి)

నేతృత్వంలోని ఎన్డీయే కూటమి భారీ మెజారిటీతో అధికారం చేపట్టే అవకాశాలు ఉన్నాయని 9 సంస్థల ఎగ్జిట్ పోల్స్ ఫలితాలు స్పష్టం చేశాయి. నితీశ్, మోదీ.. 'నిమో' ఫార్ములా ఎన్డీయేకు అనుకూలించిందని సర్వేలు అభిప్రాయపడ్డాయి. రాష్ట్రంలో ఈ నెల 6, 11న రెండు దశల్లో పోలింగ్ జరిగింది. ఈ ఎన్నికల్లో అధికార ఎన్డీయే, ప్రతిపక్ష ఎంజీబీ కూటములు హోరాహోరీగా ప్రచారం చేశాయి. ప్రస్తుత సీఎం, జేడీయూ చీఫ్ నితీశ్‌కుమార్‌కు ఇవే చివరి ఎన్నికలని భావిస్తున్నారు. ఆయన 19 ఏళ్లకు పైగా బిహార్ ముఖ్యమంత్రిగా విధులు నిర్వర్తించారు. ఇక లాలూ ప్రసాద్ ఆర్జేడీ బాధ్యతలను తన కుమారుడు తేజస్వి యాదవ్‌కు అప్పగించారు. ఆయన్ను ఎంజీబీ సీఎం అభ్యర్థిగా నిర్ణయించారు. ఎన్డీయే, ఎంజీబీ నేతలతో పాటు ప్రశాంత్ కిశోర్ జనసురాజ్ పార్టీ(జేఎస్పీ) తరఫున విస్తృత ప్రచారం నిర్వహించారు. బిహార్‌లో ఎన్నడూ లేనంత రికార్డు స్థాయిలో పోలింగ్ నమోదైంది. ఈ నెల 14న ఫలితాలు వెల్లడి కానున్నాయి. ఈ క్రమంలో మంగళవారం సాయంత్రం పోలింగ్ ముగిసిన తర్వాత వివిధ సంస్థలు ఎగ్జిట్‌పోల్స్‌ను విడుదల చేశాయి. అధికార ఎన్డీయేకు బిహారీలు మరోసారి పట్టం కట్టనున్నట్లు దాదాపు అన్ని ఎగ్జిట్‌పోల్స్ పేర్కొన్నాయి. అధికారం చేపట్టడానికి 122 సీట్లు అవసరం కాగా.. ఎన్డీయేకు 130కి పైగా సీట్లు వస్తాయని తెలిపాయి. ఎంజీబీకి గరిష్ఠంగా 108 సీట్లు వచ్చే అవకాశం ఉన్నట్లు వెల్లడించాయి. ప్రశాంత్ కిశోర్ నేతృత్వంలోని జేఎస్పీ ప్రభావం దాదాపు శూన్యమేనని పేర్కొన్నాయి. ఆ పార్టీకి సీట్లు కష్టమేనని తేల్చాయి. దాదాపుగా అన్ని సర్వే సంస్థలు ఎన్డీయే కూటమికి 130కి పైగా సీట్లు వస్తాయని తెలిపాయి. నితీశ్ కుమార్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు మహిళా రోజ్‌గార్ యోజన కింద 1.25 కోట్ల మంది మహిళలకు రూ.10 వేల నగదు పంపిణీ చేయడం ఎన్డీయే విజయానికి దోహదపడనుందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. అగ్రవర్ణాలు, ఎస్సీలు, ఎస్టీలు, ఈబీసీ వర్గాల మద్దతుతో ఎన్డీయే ఆధిక్యంలో ఉండగా.. ముస్లింలు, బౌద్ధులు, బీసీ సామాజిక వర్గాల్లో అధిక శాతం ఎంజీబీ వైపు నిలిచారని విశ్లేషిస్తున్నారు. రాహుల్ గాంధీ 'ఓట్ చోరీ' నినాదం బిహార్‌లో ఓట్లను రాబట్టలేకపోయిందని పేర్కొంటున్నారు. నిరుద్యోగం, వలసలు వంటి అంశాలను ఎంజీబీ ప్రచార అస్త్రాలుగా చేసుకున్నా యువత ఆదరించలేదని రాజకీయ పండితులు చెబుతున్నారు. ఈ సారి బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో 66.91% పోలింగ్ నమోదైంది. ఈ నెల 6న జరిగిన తొలి విడతలో 121 సీట్లకు, మంగళవారం మలి విడతలో 122 నియోజకవర్గాల్లో పోలింగ్ జరిగింది. రెండు విడతల్లో కలిపి 66.91% పోలింగ్ నమోదైందని ఈసీ తెలిపింది.



బిహార్‌లోని కథియాడ్‌లో ఓ పోలింగ్ కేంద్రం వద్ద మహిళా ఓటర్లు

ఎగ్జిట్‌పోల్స్ ఫలితాలు ఇలా..

సంస్థ	ఎన్డీయే	ఎంజీబీ	జేఎస్పీ	ఇతరులు
చాణక్య స్ట్రాటజీస్	130-138	100-108	0	3-5
దైనిక్ భాస్కర్	145-160	73-91	0-3	5-7
డీవీ రిసెర్చ్	137-152	83-98	2-4	1-8
జేవీసీ	135-150	88-103	0-1	3-6
మ్యాట్రిజ్	147-167	70-90	0-2	2-8
పీ-మార్క్	142-162	80-98	1-4	0-3
పీపుల్స్ ఇన్‌సైట్	133-148	87-102	0-2	3-6
పీపుల్స్ పల్స్	133-159	75-101	0-5	2-8
టీఐఎఫ్ రిసెర్చ్	145-163	76-95	0	3-6

ఓటెత్తిన బిహార్

రెండో దశలో భారీగా 68.79% పోలింగ్

పట్నా, నవంబరు 11: బిహార్లో ఓటర్లు పోటెత్తారు. మున్నెన్నడూ లేని విధంగా భారీ సంఖ్యలో ఓటు హక్కు వినియోగించుకున్నారు. 121 అసెంబ్లీ స్థానాలకు మంగళవారం జరిగిన రెండో దశ ఎన్నికల్లో ఏకంగా 68.79 శాతం పోలింగ్ నమోదైనట్లు ఎన్నికల కమిషన్(ఈసీ) ప్రకటించింది. గత ఎన్నికల్లో రెండో విడతలో 58.8 శాతం మాత్రమే పోలింగ్ జరుగగా.. ఈసారి 9.6 శాతం ఎక్కువ ఓటింగ్ నమోదైంది. మంగళవారం 3.7 కోట్ల మంది ఓటర్లు 1,302 మంది అభ్యర్థుల భవితవ్యాన్ని ఈవీఎంలలో నిక్షిప్తంచేశారు. రాష్ట్ర అసెంబ్లీలో 243 సీట్లు ఉండగా.. తొలివిడతలో 122 స్థానాలకు ఈ నెల 6న ఎన్నికలు జరిగాయి. 65.09% పోలింగ్ నమోదైంది. రెండు దశల్లో కలిపి సగటున 66.9% పోలింగ్ జరిగిందని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి (సీఈవో) వినోద్‌సింగ్ గుంజియాల్ వెల్లడించారు. రాష్ట్రంలో ఇంత ఓటింగ్ గతంలో ఎప్పుడూ లేదు. తొలి విడత(69.04%)లో మాదిరిగానే మంగళవారం కూడా మహిళలు భారీస్థాయిలో ఓటుహక్కు వినియోగించుకున్నారు. ఓటింగ్‌లో 74.03% వారిదే. మొత్తంగా రెండు దశల్లో కలిపి 71.6% మంది మహిళలు ఓటు హక్కు వినియోగించారు. కాగా, బిహార్ ఫలితాలను శుక్రవారం ప్రకటిస్తారు. కాగా, తెలంగాణ మినహా మిగిలిన అయిదు రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతమైన జమ్మూ-కశ్మీర్‌లలో ఏడు స్థానాలకు జరిగిన ఉప ఎన్నికల్లోనూ భారీగా పోలింగ్ నమోదైంది. దంపా(మిజోరాం)లో 82.34%, అంత(రాజస్థాన్)లో 80.32%, నువాపడా(ఒడిశా)లో 75.08%, ఘటశిల (ఝార్ఖండ్)లో 74.65% కాగా తరన్‌తారన్(పంజాబ్)లో కేవలం 50.02% ఓటింగ్ నమోదయింది. జమ్మూ-కశ్మీర్‌లోని నగ్రోటాలో 74.63%, బుడ్‌గాంలో 50.02శాతం ఓటింగ్ జరిగింది.

హంగేరియన్ బ్రిటీష్ రచయిత డేవిడ్ సలోయ్‌కు బుకర్ ప్రైజ్



లండన్, నవంబరు 11 : హంగేరియన్ బ్రిటీష్ రచయిత డేవిడ్ సలోయ్(51) ప్రతిష్ఠాత్మక బుకర్ ప్రైజ్-2025 విజేతగా నిలిచారు. ఆయన రాసిన నవల 'ఫ్లెష్'కుగాను ఈ పురస్కారాన్ని ప్రకటించారు. భారతీయ రచయిత కిరణ్ దేశాయి తన రచన 'ది లోన్లీనెస్ ఆఫ్ సోనియా అండ్ సన్నీ'తో సలోయ్‌తో బుకర్ ప్రైజ్‌కు చివరి వరకు పోటీ పడ్డారు. అయితే విజయం సలోయ్‌ను వరించింది. దీంతో సలోయ్‌కు సోమవారం రాత్రి నిర్వహించిన ఒక కార్యక్రమంలో గత ఏడాది బుకర్ ప్రైజ్ విజేత సమంత హార్వే 50,000 పౌండ్లతోపాటు ట్రోఫీ అందజేశారు. కిరణ్ దేశాయి 2006లో తన రచన 'ద ఇన్‌హెరిటెన్స్ ఆఫ్ లాస్'కుగాను బుకర్ ప్రైజ్ అందుకున్నారు.

అభ్యంతరాలపై స్పందించండి!

'సర్'పై ఈసీకి సుప్రీంకోర్టు నోటీసులు

న్యూఢిల్లీ, నవంబరు 11: తమిళనాడు, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్(సర్)ను సవాల్ చేస్తూ ఆయా రాష్ట్రాల అధికార పార్టీలు డీఎంకే, టీఎంసీలు దాఖలు చేసిన పిటిషన్లపై సుప్రీంకోర్టు విచారణ చేపట్టింది. ఈ రెండు రాష్ట్రాల అభ్యంతరాలపై స్పందించాలని కోరుతూ ఎన్నికల సంఘాని(ఈసీ)కి నోటీసులు జారీ చేసింది. రెండు వారాల్లోగా వేర్వేరుగా స్పందనలను తెలియజేయాలని కోరింది. ఇదే సమయంలో మద్రాస్, కలకత్తా హైకోర్టులలో దాఖలైన 'సర్' పిటిషన్లపై విచారణ ప్రక్రియను నిలిపివేయాలని ఆదేశించింది. అదేవిధంగా 'సర్'కు అనుకూలంగా తమిళనాడు విపక్షం ఏఐఏడీఎంకే దాఖలు చేసిన ఇంప్లీడ్ పిటిషన్‌ను ధర్మాసనం అనుమతించింది. సర్ పట్ల రాజకీయ పార్టీలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, దీనికి సంబంధించిన అన్ని వివరాలను ఈసీ అందిస్తుందని తెలిపింది. ఒక వేళ ఈ ప్రక్రియలో తప్పు జరిగిందని కోర్టు నిర్ధారణకు వస్తే మొత్తం ప్రక్రియను రద్దు చేస్తామని జడ్జిలు స్పష్టం చేశారు.



ఆశీష్ మోదీ భారతీ దీక్షిత్

ఐఏఎస్ భర్తపై ఐఏఎస్ భార్య కేసు

తనను కొట్టి, వేధిస్తున్నారని ఫిర్యాదు

జైపూర్, నవంబరు 11: రాజస్థాన్‌కు చెందిన ఓ ఐఏఎస్ దంపతుల మధ్య తలెత్తిన కుటుంబ వివాదం పోలీసు స్టేషన్ వరకు వెళ్లింది. చాలా కాలంగా భర్త తనను శారీరకంగా, మానసికంగా వేధిస్తున్నారని ఆరోపిస్తూ ఆమె ఈ నెల 7న పోలీసులకు ఫిర్యాదు చేశారు. తన భర్త అయిన రాష్ట్ర సామాజిక న్యాయం, సాధికారిత శాఖ డైరెక్టర్ ఆశీష్ మోదీ గృహహింసకు పాల్పడుతున్నారని పేర్కొంటూ ఆర్థిక శాఖ సంయుక్త కార్యదర్శి భారతీ దీక్షిత్ కేసు పెట్టారు. ఇద్దరూ 2014 బ్యాచ్‌కు చెందిన రాజస్థాన్ కేడర్ అధికారులు. తనకు మాయమాటలు చెప్పి 2014లో వివాహం చేసుకున్నారని ఆమె ఆరోపించారు. తన తండ్రి క్యాన్సర్‌కు గురవడంతో తాను నిస్సహాయంగా ఉన్నానని, ఆ సమయంలో అబద్ధాలు చెప్పి పెళ్లి చేసుకున్నారని పేర్కొన్నారు. తరచూ మద్యం సేవిస్తారని, క్రిమినల్ వ్యక్తులతో సంబంధాలు ఉన్నాయని తెలిపారు. దీన్ని ప్రశ్నించినందుకు తనను నిత్యం కొట్టేవారని చెప్పారు. 2018లో కుమార్తె పుట్టిన తరువాత వేధింపులు ఎక్కువయ్యాయని తెలిపారు. విడాకులు ఇవ్వకపోతే తనను, కుటుంబ సభ్యులను హత్య చేస్తానని గత నెలలో బెదిరించారని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. కొందరి సహకారంతో తనను ప్రభుత్వ వాహనంలో బలవంతంగా తీసుకొని వెళ్లి వేరే చోట కొన్ని గంటల పాటు నిర్బంధించారని ఆరోపించారు. అక్కడ తుపాకీతో బెదిరించారన్నారు.

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★

ధైర్యవంతుడి కథ



సందీప్‌కిషన్ కథానాయకుడిగా విజయ్ తనయుడు జేసన్ సంజయ్ ఓ చిత్రాన్ని తెరకెక్కిస్తున్న సంగతి తెలిసిందే. లైకా ప్రొడక్షన్స్ బేనర్‌పై సుభాస్కరన్ నిర్మిస్తున్నారు. తాజాగా ఈ సినిమా టైటిల్‌ను ఖరారు చేసి ఫస్ట్ లుక్ పోస్టర్ విడుదల చేశారు. 'సిగ్మా' అనేది చిత్ర టైటిల్. 'స్వతంత్ర, ధైర్యవంతమైన వ్యక్తిత్వం గల ఓ వ్యక్తి కథే ఇది. నిధి అన్వేషణ నేపథ్యంలో సాగుతుంది. అద్భుతమైన టేకింగ్‌తో రూపొందుతున్న ఈ చిత్రం ప్రేక్షకులకు థ్రిల్లింగ్ అనుభూతిని ఇస్తుంది' అని పేర్కొన్నారు. ఒక్క పాట మినహా చిత్రీకరణ పూర్తయినట్లు తెలిపారు. వేసవిలో చిత్రాన్ని విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు మేకర్స్. ఈ చిత్రానికి ఎడిటర్: ప్రవీణ్ కేఎల్, సినిమాటోగ్రాఫర్: కృష్ణన్ వసంత్, సంగీతం: థమన్.ఎస్.

అబ్బాయిలు క్లాప్స్ కొడుతున్నారు

అనూ ఇమ్మాన్యుయేల్



'ది గర్ల్‌ఫ్రెండ్' సినిమాలో నా పాత్ర కన్నా కథే నన్ను ఎక్కువగా ప్రభావితం చేసింది. ఈతరం అమ్మాయిలు ఎదుర్కొంటున్న సమస్యల గురించి చర్చించే మంచి చిత్రమిది. అందుకే హీరోయిన్ పాత్ర కాకపోయినా అంగీకరించాను. కొన్ని సన్నివేశాల్లో నా నటనకు అబ్బాయిలు క్లాప్స్ కొడుతుండడం సంతోషాన్నిస్తోంది' అని అనూ ఇమ్మాన్యుయేల్ అన్నారు. రష్మిక మందన్న లీడ్‌రోల్‌లో నటించిన చిత్రమిది. రాహుల్ రవీంద్రన్ దర్శకుడు. ఇటీవలే విడుదలై చక్కటి ఆదరణతో కొనసాగుతోంది. ఈ చిత్రంలో కీలక పాత్ర పోషించిన అనూ ఇమ్మాన్యుయేల్ మీడియాతో మాట్లాడారు. ఒక మంచి సినిమాలో భాగమవ్వాలనే ఈ చిత్రంలో నటించాను. ఈ సినిమాను మంచి హిట్‌గా నిలిపిన ప్రేక్షకులకు ధన్యవాదాలు. ఇందులో దుర్గ అనే పాత్రలో నటించాను. నా వ్యక్తిత్వానికి పూర్తి భిన్నంగా ఉండే పాత్ర కావడంతో ప్రేక్షకులు ఎలా స్పందిస్తారో అని కంగారు పడ్డాను. రాహుల్ నా పాత్రను ప్రత్యేక శ్రద్ధతో తీర్చిదిద్దారు. ఇకపై నటనకు ఆస్కారమున్న కథానాయికల పాత్రలే చేయాలనుకుంటున్నాను' అని ఆమె చెప్పారు.



కుమారి పాత్ర దక్కడం నా అదృష్టం

'కాంత' చిత్రంలో కుమారి పాత్ర చేయడం నా అదృష్టం. ఇది నా కెరీర్‌లో చాలా ప్రత్యేకమైన చిత్రం. రెగ్యులర్ హీరోయిన్ తరహాలో కాకుండా ఇందులో నటనా ప్రాధాన్యమైన పాత్ర దక్కింది' అని కథానాయిక భాగ్యశ్రీ బోర్సే అన్నారు. దుల్కర్ సల్మాన్, భాగ్యశ్రీ బోర్సే జంటగా నటించిన చిత్రమిది. సెల్వమణి సెల్వరాజ్ దర్శకత్వంలో దుల్కర్ సల్మాన్‌తో కలసి రానా నిర్మించారు. ఈ నెల 14న విడుదలవుతోంది. ఈ సందర్భంగా సినిమా విశేషాలను భాగ్యశ్రీ బోర్సే మీడియాతో పంచుకున్నారు.

● కెరీర్ ఆరంభంలోనే నాకు కుమారి లాంటి మంచి పాత్ర దొరికినందుకు ఆనందంగా ఉంది.'కాంత' చిత్రంలో నటిగా నాకు సవాల్ విసిరే పాత్రను పోషించాను. 1960ల నాటి నేపథ్యం కావడంతో నా పాత్ర కోసం చాలా సన్నద్ధమవ్వాల్సి వచ్చింది. చాలా కష్టమనిపించింది. శ్రీదేవి, సావిత్రి నటించిన పాత సినిమాలు చూశాను. వారి నటన స్ఫూర్తిగా కుమారి పాత్రను నాదైన శైలిలో ఆవిష్కరించేందుకు ప్రయత్నించాను.

● నేను ఇండస్ట్రీలోకి వచ్చాక తొలిసారి విన్న కథ ఇదే. అయితే చిత్రీకరణలో జాప్యం వల్ల నేను నటించిన ఇతర చిత్రాలు ముందు విడుదలయ్యాయి. దుల్కర్ సల్మాన్, రానాతో నటించడం మరింత ఆనందాన్నిచ్చింది. దర్శకుడు సెల్వ నా పాత్రను తీర్చిదిద్దిన విధానం అద్భుతం.

మా నాన్న బతికే ఉన్నాడు..

-ఈషా డియోల్



బాలీవుడ్ నటుడు ధర్మేంద్ర మరణించారంటూ మంగళవారం వార్తలొచ్చాయి. వీటిని ఆయన కుమార్తె ఈషా డియోల్ ఖండించారు. ఆ వార్తలు అవాస్తవం అని తెలిపారు. తమ కుటుంబం చెప్పేవరకూ ఎలాంటి వదంతులు వ్యాప్తి చేయొద్దని కోరారు. ధర్మేంద్రకు ముంబైలోని బ్రీచ్ క్యాండీ ఆస్పత్రిలో చికిత్స జరుగుతోందని, ప్రస్తుతం ఆయన ఆరోగ్యం బాగానే ఉందన్నారు. ఈ మేరకు ఓ పోస్ట్ పెట్టారు. 'మా నాన్న క్షేమంగానే ఉన్నారు. మేము ప్రస్తుతం ప్రైవసీని కోరుకుంటున్నాం. ఆయన కోలుకోవాలని కోరుకున్నవారందరికీ కృతజ్ఞతలు' అని పేర్కొన్నారు.ఈ ఫేక్ వార్తలపై ధర్మేంద్ర సతీమణి హేమమాలిని స్పందించారు. 'చికిత్స పొందుతూ కోలుకుంటున్న వ్యక్తి గురించి ఇలాంటి వార్తలు రాయడం క్షమించరానిది. బాధ్యత గల మీడియా ఛానళ్లు ఇలాంటి తప్పుడు వార్తలని ఎలా ప్రచారం చేస్తాయి. ఇది అత్యంత అవమానకరమైన, నిర్లక్ష్యమైన చర్య' అని అసహనం వ్యక్తం చేశారు.

భారీ యాక్షన్ డ్రాప్‌లో



కొత్త తరహా కథాంశంతో తెరకెక్కిన క్రైమ్ థ్రిల్లర్ 'రాబందు'. జయశేఖర్ కల్లు దర్శకత్వంలో పులిజాల సురేశ్ నిర్మించారు. త్వరలో ప్రేక్షకుల ముందుకు రానుంది. మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో తెలంగాణ సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ట్రైలర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ నేటి సమాజంలో చర్చనీయాంశంగా మారిన కొన్ని అంశాల ఆధారంగా రాసుకున్న కథతో ఈ చిత్రాన్ని భారీ యాక్షన్ డ్రాప్‌లో తెరకెక్కించాం' అని చెప్పారు. 'చిత్ర నిర్మాణంలో రాజీ పడకుండా భారీ వ్యయంతో నిర్మించాం' అని నిర్మాత చెప్పారు.

నాన్‌స్టాప్ ఎంటర్‌టైన్‌మెంట్



రోడ్ ట్రిప్ నేపథ్యంలో తెరకెక్కిన చిత్రం గోపీ గాళ్ల గోవా ట్రిప్'. రోహిత్, శశి దర్శకత్వం వహించారు. సాయికుమార్, సీతారామరాజు, రమణారెడ్డి నిర్మించారు. అజిత్ మోహన్, రాజు శివరాత్రి తదితరులు కీలకపాత్రలు పోషించారు. ఈ నెల 14న విడుదలవుతోంది. మంగళవారం చిత్రబృందం ప్రీ రిలీజ్ వేడుకను నిర్వహించింది. ఈ సందర్భంగా రోహిత్ మాట్లాడుతూ'గతంలో మేము తెరకెక్కించిన లఘు చిత్రాలకు మంచి పేరు వచ్చింది. యువతకు చక్కని సందేశంతోపాటు నాన్‌స్టాప్ ఎంటర్‌టైన్‌మెంట్‌ను అందించాలనే లక్ష్యంతో ఈ చిత్రం చేశాం. హాలీవుడ్ తరహా మేకింగ్‌తో ఎంతో కష్టపడి తెరకెక్కించాం' అని చెప్పారు.'కథలో ఊహించని మలుపులు ప్రేక్షకులను ఉత్కంఠకు గురిచేస్తాయి, కొన్నాళ్లపాటు ప్రేక్షకులను వెంటాడే సినిమా ఇది. అన్ని విభాగాలు ఎంతో శ్రమకోర్చి పనిచేసి మంచి అవుట్‌పుట్‌ను రాబట్టాయి' అని నిర్మాతలు చెప్పారు.

ఆస్పత్రిలో చేరిన బాలీవుడ్ విలన్



బాలీవుడ్ సీనియర్ నటుడు, విలన్ పాత్రల పోషణలో తనకంటూ ఓ ప్రత్యేకత ఏర్పరచుకున్న ప్రేమ్ చోప్రా(92) అనారోగ్య కారణాలతో సోమవారం ముంబైలోని లీలావతి ఆస్పత్రిలో చేరారు. వైరల్ ఇన్‌ఫెక్షన్, వయసు రీత్యా వచ్చే ఇబ్బందుల వల్ల ప్రేమ్‌చోప్రా అస్వస్థతకు గురయ్యారనీ, త్వరలోనే ఆయన కోలుకుంటారనీ చికిత్స చేస్తున్న డాక్టర్లు చెప్పారు. 1960-70ల దశకంలో విలన్‌గా ఓ వెలుగు వెలిగారు ప్రేమ్‌చోప్రా. ఆరు పదుల తన నట జీవితంలో ఆయన 380 చిత్రాల్లో నటించారు. సంభాషణలు పలికే తీరు, ఎక్స్‌ప్రెషన్స్‌తో నటుడిగా తన ప్రత్యేకతను చాటుకున్న ప్రేమ్‌చోప్రా బాలీవుడ్‌లోని ప్రముఖ విలన్లలో ఒకరిగా వెలిగారు. 'ఓ కౌన్ థీ'(1954), 'ఉపాకర్'(1967), దో రాస్తే (1969), 'కటీ పతంగ్'(1970), బాబీ (1973), దో అంజానే (1976), త్రిశూల్ (1978), దోస్తానా (1980) తదితర చిత్రాల్లో ప్రేమ్‌చోప్రా అభినయం ఇప్పటికీ గుర్తుంటుంది.

నాలుగు తరాల కథ ఇది

- అక్కినేని నాగార్జున



'నాకు పూర్వ జన్మల నేపథ్యంలో తీసిన సినిమాలు చాలా ఇష్టం. అదే సబ్జెక్టుతో వచ్చిన నాన్నగారి 'మూగ మనసులు', నేను నటించిన 'జానకి రాముడు' సూపర్ హిట్ అయ్యాయి. 'గత వైభవం' కూడా నాలుగు తరాల కథ. ఈ సినిమా తీయడానికి ఎంత కష్టపడ్డారో ట్రైలర్ చూస్తుంటే అర్థమవుతోంది. సన్నివేశాలు అద్భుతంగా ఉన్నాయి. సినిమా పెద్ద బ్లాక్‌బస్టర్ కావాలి' అని హీరో నాగార్జున ఆకాంక్షించారు. ఎస్ఎస్ దుష్యంత్, ఆషికా రంగనాథ్ ప్రధాన పాత్రధారులుగా సింపుల్ సుని దర్శకత్వంలో తెరకెక్కించిన చిత్రం 'గత వైభవం'. సర్వగర సిల్వర్ స్క్రీన్స్, సుని సినిమాస్ బేనర్లపై దీపక్ తిమ్మప్ప, సుని నిర్మించారు. సినిమా ఈనెల 14న విడుదలవుతున్న సందర్భంగా చిత్రబృందం ప్రీ రిలీజ్ వేడుకను నిర్వహించింది. ఈ కార్యక్రమానికి నాగార్జున ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా హీరో దుష్యంత్ మాట్లాడుతూ 'నాలుగు జన్మలకు సంబంధించిన చిత్రమిది. స్క్రీన్‌ప్లే చాలా కొత్తగా ఉంటుంది' అని తెలిపారు. చిత్రదర్శకుడు సింపుల్ సుని మాట్లాడుతూ 'ఇదొక డిఫరెంట్ జానర్ సినిమా. అన్ని వ్యాపారాంశాలు ఉన్న ప్రయోగాత్మక చిత్రం. ప్రేక్షకులు తప్పకుండా ఆదరిస్తారనే నమ్మకం మాకుంది' అని అన్నారు.

సంతాన ప్రాప్తిరస్తు విజయం ఖాయం



విక్రాంత్, చాందినీ చౌదరి జంటగా సంజీవ్ రెడ్డి తెరకెక్కించిన చిత్రం 'సంతాన ప్రాప్తిరస్తు' మధుర ఎంటర్‌టైన్‌మెంట్, నిర్వి ఆర్ట్స్ బేనర్‌పై మధుర శ్రీధర్ రెడ్డి, నిర్వి హరిప్రసాద్ రెడ్డి నిర్మించారు. సినిమా ఈనెల 14న విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్ర బృందం ప్రీ రిలీజ్ వేడుక నిర్వహించింది. దర్శకులు బాబీ, సందీప్ రాజ్, శైలేశ్ కొలను, బీవీఎస్ రవి, నిర్మాత లగడపాటి శ్రీధర్ తదితరులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా బాబీ మాట్లాడుతూ "సంతాన ప్రాప్తిరస్తు' ట్రైలర్ బాగుంది. ఇలాంటి సున్నిత కథాంశాన్ని అందరికీ నచ్చేలా చెప్పే ప్రయత్నం చేశారు. తప్పకుండా సినిమా మంచి విజయం సాధిస్తుంది' అని అన్నారు. సందీప్‌రాజ్ మాట్లాడుతూ 'నా తొలి సినిమాకు హీరోయిన్ చాందినీ. ఆమె ఒక సినిమా చేస్తుందంటే అందులో కంటెంట్ ఉంటుందనే పేరు తెచ్చుకున్నారు' అని అన్నారు. శైలేష్ కొలను మాట్లాడుతూ 'ఒక సున్నిత కథాంశంతో వినోదాన్ని కలిపి తీసిన చిత్రమిది. గతంలో ఇలాంటి సినిమాలు మంచి విజయం సాధించాయి. ఈ మూవీ కూడా పెద్ద హిట్ అవుతుంది' అని పేర్కొన్నారు. చిత్ర దర్శకుడు సంజీవ్ రెడ్డి మాట్లాడుతూ 'సంతాన సమస్యలు ఉన్న వారు చికిత్స తీసుకోవచ్చు. కానీ అన్నీ బాగుండి లైఫ్ స్టయిల్ వల్ల సంతాన లేమితో బాధపడేవారి గురించి ఈ సినిమాలో చర్చించాం. మంచి ప్రేమ కథ, వినోదంతో పాటు గొప్ప సందేశమూ ఉంటుంది' అని వివరించారు. నిర్మాత మధుర శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ 'ఈ చిత్రంతో ఒక మంచి ప్రయత్నం చేశాం. విడుదలకు ముందు చిన్న చిత్రం గురించి చెప్పేందుకు ఏమీ ఉండదు, రిలీజ్ అయ్యాక అది సాధించే విజయాలకు అడ్డు ఉండదు' అని అన్నారు.

ముక్కోణపు ప్రేమకథ



గ్రామీణ నేపథ్యంలో తెరకెక్కిన ఎమోషనల్ డ్రామా రోలుగుంట సూరి'. అనిల్ కుమార్ పల్లా దర్శకుడు. నాగార్జున పల్లా, ఆధ్యారెడ్డి, భావన నీలప్ హీరో హీరోయిన్లుగా నటించారు. సౌమ్యా చాందిని నిర్మించారు. ఈనెల 14న విడుదలవుతోంది. ఈ సందర్భంగా మంగళవారం చిత్రబృందం నిర్వహించిన ప్రీ రిలీజ్ ఈవెంట్లో అనిల్ కుమార్ మాట్లాడుతూ 'గ్రామీణ నేపథ్యంలో తెరకెక్కిన ముక్కోణపు ప్రేమకథా చిత్రమిది. మాస్ అంశాలతో పాటు కట్టిపడేసే భావోద్వేగాలు ప్రేక్షకులను ఆకట్టుకుంటాయి' అని అన్నారు. వాస్తవ ఘటనల ఆధారంగా తెరకెక్కిన చిత్రమిది అని సౌమ్యా చాందిని తెలిపారు. తెలుగులో అరుదైన, అద్భుతమైన సినిమాగా 'రోలుగుంట సూరి' మిగిలిపోవడం ఖాయం అని నాగార్జున పల్లా చెప్పారు.

స్పోర్ట్స్

వరంగల్ ● బుధవారం 12 నవంబరు 2025



పిచ్‌ను పరిశీలిస్తున్న గిల్

పిచ్‌పై అసంతృప్తి

తొలి టెస్టు జరిగే ఈడెన్ పిచ్‌పై భారత జట్టు కోచ్ గంభీర్, కెప్టెన్ గిల్ అసంతృప్తితో ఉన్నట్టు సమాచారం. మంగళవారం జరిగిన నెట్ సెషన్‌కు ముందు పిచ్‌ను పరిశీలించిన గంభీర్, క్యూరేటర్ సుజన్ ముఖర్జీతో చాలాసేపు మాట్లాడడం కనిపించింది. అతడితో పాటు కెప్టెన్ గిల్, సహాయక కోచ్‌లు సితాంశు కోటక్, మోర్నీ మోర్కెల్ కూడా ఉన్నారు. పిచ్ గోధుమ రంగులో ఉండగా అక్కడక్కడా గడ్డి కనిపించింది. మరోవైపు టీమ్ మేనేజ్‌మెంట్ తమకు టర్నింగ్ వికెట్ కావాలనేమీ అడగలేదని బెంగాల్ క్రికెట్ సంఘం (క్యాబ్) అధ్యక్షుడు గంగూలీ తేల్చాడు.

పకడ్బందీగా..

భద్రత నడుమ జట్ల ప్రాక్టీస్

- తొలి టెస్టు కోసం భారత్ సన్నాహకాలు
- 14 నుంచి దక్షిణాఫ్రికాతో మ్యాచ్

కోల్‌కతా: దక్షిణాఫ్రికాతో ఈనెల 14 నుంచి జరిగే తొలి టెస్టు కోసం టీమిండియా తమ సన్నాహకాలను ఆరంభించింది. మంగళవారం స్థానిక ఈడెన్ గార్డెన్స్‌లో భారత ఆటగాళ్లు నెట్స్‌లో చెమటోడ్చారు. ఆప్షనల్ అయినప్పటికీ కెప్టెన్ గిల్‌తో పాటు జైస్వాల్, సాయి సుదర్శన్, బుమ్రా, జడేజా, సుందర్, నితీశ్ ప్రాక్టీస్‌లో కనిపించారు. ముందుగా కోచ్ గంభీర్, సహాయక కోచ్‌లు కోటక్, మోర్కెల్ పిచ్‌ను పరిశీలించారు. ఇక ఇటీవల పరిమిత ఓవర్ల ఫార్మాట్లలో రాణించలేకపోయిన గిల్ గంటన్నర పాటు మైదానంలోనే గడిపి తన టెక్నిక్‌పై దృష్టి సారించాడు. అలాగే సెంటర్ వికెట్‌పై సాయి సుదర్శన్ ఎక్కువగా లెగ్ సైడ్ బ్యాటింగ్ ప్రాక్టీస్ చేశాడు. దీంతో అతడిని వన్‌డౌన్‌లో ఆడించడం ఖాయమనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. మరో ఓపెనర్ జైస్వాల్‌కు స్పిన్నర్లు సుందర్, జడేజా బౌలింగ్ చేశారు. అయితే పేసర్ బుమ్రా మాత్రం ఎక్కువ సమయం నెట్స్‌లో గడపలేదు. మైదానంలోకి వచ్చాక అర్ధ గంట వామప్, తర్వాత కాసేపు బౌలింగ్ ప్రాక్టీస్ చేసి డ్రెస్సింగ్ రూమ్‌కు వెళ్లిపోయాడు. ఈ సమయంలో తన కుడి మోకాలికి పట్టీ వేసుకుని కనిపించాడు.

పోలీసుల పర్యవేక్షణలో..

ఢిల్లీ పేలుళ్ల నేపథ్యంలో తొలి టెస్టు వేదిక ఈడెన్ గార్డెన్స్ వద్ద భద్రతను కట్టుదిట్టం చేశారు. అలాగే కోల్‌కతాలోనే ఉన్న భారత్-దక్షిణాఫ్రికా ఆటగాళ్లకు స్థానిక పోలీసులు పకడ్బందీగా రక్షణ ఏర్పాట్లు చేశారు. హోటల్ నుంచి స్టేడియానికి వెళ్లే సమయంలో..అలాగే మ్యాచ్ జరిగే సందర్భంలోనూ నిరంతరం వీరి సెక్యూరిటీని పర్యవేక్షించనున్నారు. అటు మంగళవారం జరిగిన ప్రాక్టీస్ సెషన్ కూడా పోలీసుల భద్రత మధ్యే సాగింది. కోల్‌కతా పోలీస్ కమిషనర్ మనోజ్ వర్మ ఈడెన్ గార్డెన్స్‌లో ఏర్పాట్లను తనిఖీ చేశారు.

టాస్ కోసం బంగారు నాణెం

భారత్-దక్షిణాఫ్రికా జట్ల మధ్య జరిగే టెస్టు సిరీస్‌లను ఫ్రీడమ్ ట్రోఫీగా పిలుచుకుంటారు. ఈ నేపథ్యంలో తొలి టెస్టు కోసం బెంగాల్ క్రికెట్ సంఘం (క్యాబ్) గాంధీ-నెల్సన్ మండేలా ముఖచిత్రాలతో కూడిన బంగారు నాణేన్ని తయారు చేయించింది. శుక్రవారం టాస్ వేసేందుకు ఈ నాణేన్నే వాడుతామని క్యాబ్ అధ్యక్షుడు సౌరవ్ గంగూలీ తెలిపాడు.



రబాడ

స్పిన్‌పై సఫారీల దృష్టి

భారత్‌తో పాటు దక్షిణాఫ్రికా ఆటగాళ్లు కూడా మంగళవారం ప్రాక్టీస్‌ను ఆరంభించారు. ఇటీవలే పాక్‌తో టెస్టు సిరీస్‌ను 1-1తో డ్రాగా ముగించి భారత్‌కు వచ్చిన ఈ జట్టు ఆత్మవిశ్వాసంతో ఉంది. నెట్స్‌లో మొత్తం జట్టు ఆటగాళ్లంతా పాల్గొన్నారు. అయితే బ్యాటర్లు కెప్టెన్ బవుమా, మార్‌క్రమ్, రికెల్టన్, స్టబ్స్ స్పిన్‌ను దీటుగా ఎదుర్కోవడం పైనే దృష్టి సారించారు.



ఇషా జోడీకి రజతం

వరల్డ్ షూటింగ్ చాంపియన్‌షిప్

కైరో: ఐఎస్‌ఎస్‌ఎఫ్ వరల్డ్ షూటింగ్ చాంపియన్‌షిప్‌లో ఇషా సింగ్ జంట, ఒలింపియన్ ఐశ్వరి ప్రతాప్ సింగ్ తోమర్ రజతాలు దక్కించుకొన్నారు. మంగళవారం జరిగిన 10 మీ. ఎయిర్ పిస్టల్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్ స్వర్ణ పోరులో ఇషా-సమ్రాట్ రాణా జంట 10-16తో చైనాకు చెందిన కియాంగ్జిన్ యో-కైహు చేతిలో పరాజయం పాలయ్యారు. కొరియా ద్వయం ఇజిన్ హో-సుహియాన్ హోంగ్ కాంస్యం దక్కించుకొంది. క్వాలిఫికేషన్ రౌండ్‌లో ఇషా-సమ్రాట్ జోడీ 586 పాయింట్లతో టాప్ లేపింది. అయితే, సురుచి-శ్రవణ్ కుమార్ జంట 579 పాయింట్లతో ఎనిమిదో స్థానంలో నిలిచి ఫైనల్‌కు అర్హత సాధించలేక పోయింది. కాగా, పురుషుల 50 మీ. రైఫిల్ త్రీ పొజిషన్స్ ఫైనల్లో ఐశ్వరి ప్రతాప్ 466.9 పాయింట్లతో రెండో స్థానంలో, నీరజ్ కుమార్ 432.6 పాయింట్లతో ఐదో స్థానంలో నిలిచారు. చైనా షూటర్ యుకిన్ లియు స్వర్ణం, ఫ్రాన్స్ ప్లేయర్ రొమెయిన్ కాంస్యం సాధించారు. అయితే, క్వాలిఫయింగ్ రౌండ్‌లో 597 పాయింట్లు సాధించిన ఐశ్వరి ప్రపంచ రికార్డును సమం చేశాడు.

సెమీస్‌లో ధీరజ్, సురేఖ


ఆసియా ఆర్చరీ

ఢాకా: ఆసియా ఆర్చరీ చాంపియన్‌షిప్స్‌లో ధీరజ్ బొమ్మదేవర, వెన్నం జ్యోతిసురేఖ సెమీస్‌కు చేరుకొన్నారు. పురుషుల కాంపౌండ్ జట్టు ఫైనల్‌కు దూసుకెళ్లగా.. చికిత తానిపర్తికి క్వార్టర్స్‌లో చుక్కెదురైంది. మంగళవారం జరిగిన పురుషుల రికర్వ్ వ్యక్తిగత విభాగం క్వార్టర్స్‌లో ధీరజ్ 6-5తో అమ్రిఖోన్ సడికోవ్ (ఉజ్బెకిస్థాన్)పై, రాహుల్ 6-2తో లిన్ జిన్ సంగ్ (చైనీస్ తైపీ)పై గెలిచి ముందంజ వేశారు. మహిళల్లో దీపిక కుమారి 7-3తో వరల్డ్ కప్ స్వర్ణ పతక విజేత లి గహ్యాన్ (కొరియా)కు షాకిచ్చింది. అంకిత భక్త్ 6-4తో జాంగ్ మిన్హె (జపాన్)పై, సంగీత 7-1తో జరీ రెహానె (ఇరాన్)పై గెలిచి ఫైనల్ ఫోర్‌కు చేరుకొన్నారు. కాగా, అంకిత, సంగీత, అన్షికల టీమ్ క్వార్టర్స్‌లోనే ఓడింది. మహిళల కాంపౌండ్ వ్యక్తిగత విభాగం క్వార్టర్స్‌లో సురేఖ 147-145తో ఒ యుహయున్ (కొరియా)పై, ప్రతీక ప్రదీప్ 148-146తో చికితపై గెలిచారు. కాగా, అభిషేక్ వర్మ, ప్రథమేష్, రాజేష్ జాదవ్‌లతో కూడిన భారత పురుషుల జట్టు ఫైనల్‌కు చేరుకొంది. సెమీస్‌లో భారత్ షూటాఫ్‌లో థాయ్‌లాండ్‌పై గెలిచింది.

అర్జున్, హరి గేమ్‌లు డ్రా

పనాజీ: తెలుగు గ్రాండ్‌మాస్టర్లు ఇరిగేసి అర్జున్, పెంటేల హరికృష్ణ, కార్తీక్ వెంకటరామన్ ఫిడే వరల్డ్‌కప్ నాలుగో రౌండ్ తొలి గేమ్‌ను డ్రా చేసుకున్నారు. వీరితో పాటు ప్రజ్ఞానంద కూడా ఓటమి అంచుల్లో నిలిచిన గేమ్‌ను కష్టపడి డ్రాగా ముగించాడు. మంగళవారం జరిగిన నాలుగో రౌండ్ తొలి గేమ్‌లో నల్లపావులతో బరిలోకి దిగిన రెండో సీడ్ అర్జున్ 20 ఎత్తులకే హంగేరి జీఎం పీటర్ లీకోతో తన గేమ్‌ను డ్రా చేసుకున్నాడు. స్వీడన్ జీఎం గ్రాండెలియస్‌తో తలపడిన హరికృష్ణ 32వ ఎత్తు వద్ద డ్రా చేసుకోగా, వియత్నాం జీఎం లి క్వాంగ్ లైమ్‌తో ఆడిన కార్తీక్ 36వ ఎత్తు దగ్గర డ్రాకు అంగీకరించాడు.

నగల్‌కు చైనా వీసా తిరస్కరణ



న్యూఢిల్లీ: భారత నెంబర్‌వన్ టెన్నిస్ ప్లేయర్ సుమీత్ నగల్‌కు ఊహించని షాక్ తలిగింది. చైనాలోని చెంగ్డూలో ఈ నెల 24 నుంచి జరగనున్న ఆస్ట్రేలియన్ ఓపెన్ ఆసియా-పసిఫిక్ వైల్డ్‌కార్డ్ ప్లే ఆఫ్ టోర్నీలో పాల్గొనేందుకు అతడికి వీసా లభించలేదు. తన వీసా దరఖాస్తును చైనా తిరస్కరించినట్టు నగల్ ఎక్స్‌లో పోస్టు చేశాడు. టాప్-100లో చోటు కోల్పోయిన సుమీత్.. ఈ టోర్నీలో నెగ్గితే వచ్చే ఏడాది జరిగే ఆస్ట్రేలియన్ ఓపెన్ మెయిన్ డ్రాకు నేరుగా అర్హత సాధిస్తాడు. కాగా, తన వీసా ఎందుకు తిరస్కరణకు గురైందో సమాచారం లేదని నగల్ చెప్పాడు. చైనా సహా ఎన్నో దేశాల్లో జరిగిన టోర్నీల్లో పాల్గొన్నా.. తొలిసారి తనకు ఇలాంటి అనుభవం ఎదురైందని వాపోయాడు. వీలైనంత తొందరగా వీసా వచ్చేలా చొరవ తీసుకోవాలని చైనాలోని భారత దౌత్యకార్యాలయానికి విజ్ఞప్తి చేశాడు.

ఐర్లాండ్ 270/8

బంగ్లాదేశ్‌తో తొలి టెస్టు

సిల్హెట్: బంగ్లాదేశ్‌తో జరుగుతున్న తొలి టెస్టులో స్పిన్నర్లను ఎదుర్కోవడంలో ఐర్లాండ్ బ్యాటర్లు తడబడ్డారు. మంగళవారం మొదలైన ఈ టెస్టులో తొలి రోజు ఆట ముగిసే సమయానికి మొదటి ఇన్నింగ్స్‌లో ఐర్లాండ్ 8 వికెట్లకు 270 పరుగులు సాధించింది. పాల్ స్టిర్లింగ్ (60), కార్మికేల్ (59) అర్ధసెంచరీలతో రాణించారు. కాంఫెర్ (44), టక్కర్ (41), జోర్డాన్ నీల్ (30) ఫర్వాలేదనిపించారు. క్రీజులో మెక్‌కార్తి (21) ఉన్నాడు. స్పిన్నర్లు మెహిదీ హసన్‌కు మూడు, హసన్ మురాద్‌కు రెండు వికెట్లు దక్కాయి. అయితే ఫీల్డింగ్‌లో విఫలమైన బంగ్లా క్రికెటర్లు ఐదు క్యాచ్‌లను వదిలేయడం గమనార్హం.



వన్డే సిరీస్‌కు శ్రేయాస్ దూరం!

న్యూఢిల్లీ: దక్షిణాఫ్రికాతో జరుగబోయే మూడు వన్డేల సిరీస్‌కు భారత బ్యాటర్ శ్రేయాస్ అయ్యర్ దూరమయ్యే అవకాశం ఉంది. ఇటీవలి ఆస్ట్రేలియా పర్యటనలో శ్రేయాస్ పక్కటెముకల గాయానికి గురయ్యాడు. దీంతో సిడ్నీలోని ఆస్పత్రిలోనే అతడిని ఐసీయూలో ఉంచి చికిత్స అందించాల్సి వచ్చింది. ప్రస్తుతం అతను ఆస్ట్రేలియాలోనే ఉంటూ కోలుకుంటున్నాడు. దీంతో ఈనెల 30 నుంచి సఫారీలతో జరిగే వన్డే సిరీస్‌లో అయ్యర్‌ను ఆడించాలని బీసీసీఐ, సెలెక్టర్లు భావించడం లేదు. అతడు పూర్తిగా కోలుకుని మ్యాచ్ ఫిట్‌నెస్ సాధించాకే ఓ నిర్ణయం తీసుకోవాలన్న ఆలోచనలో ఉన్నారు.

హైదరాబాద్‌కు మరో డ్రా

రాజస్థాన్‌తో రంజీ

హైదరాబాద్: గ్రూప్-డిలో రాజస్థాన్‌తో రంజీ మ్యాచ్‌ను హైదరాబాద్ డ్రాగా ముగించింది. అయితే, తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం కారణంగా హైదరాబాద్‌కు 3 పాయింట్లు, రాజస్థాన్‌కు ఓ పాయింట్ లభించాయి. హైదరాబాద్ నిర్దేశించిన 340 పరుగుల లక్ష్య ఛేదనలో ఆటకు నాలుగో, ఆఖరి రోజైన మంగళవారం రాజస్థాన్ రెండో ఇన్నింగ్స్‌లో 207/3 స్కోరు చేసింది. ఫలితం తేలే అవకాశం లేకపోవడంతో కెప్టెన్లు డ్రాకు అంగీకరించారు. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 198/7తో రెండో ఇన్నింగ్స్‌ను కొనసాగించిన హైదరాబాద్ 244/9 వద్ద డిక్లేర్ చేసింది. తొలి ఇన్నింగ్స్‌లో హైదరాబాద్ 364, రాజస్థాన్ 269 రన్స్ చేశాయి.

జమ్మూ సంచలనం

ఇదే గ్రూప్‌లో జరిగిన మరో మ్యాచ్‌లో జమ్మూ కశ్మీర్ సంచలనం సృష్టించింది. గత 65 ఏళ్లలో ఢిల్లీపై తొలిసారి నెగ్గింది. కమ్రాన్ ఇక్బాల్ (133 నాటౌట్) సెంచరీతో రాణించడంతో.. జమ్మూ 7 వికెట్లతో ఢిల్లీని చిత్తు చేసింది. 179 పరుగుల ఛేదనలో ఆటకు నాలుగో, ఆఖరి రోజు ఓవర్‌నైట్ స్కోరు 55/2తో రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన జమ్మూ 179/3 స్కోరు చేసి గెలిచింది. ఢిల్లీ 211, 277 స్కోర్లు చేయగా.. జమ్మూ కశ్మీర్ తొలి ఇన్నింగ్స్‌లో 310 పరుగులు సాధించింది.

ఇండియా-బి కెప్టెన్ ఆరోన్

ముంబై: ముక్కోణపు సిరీస్‌లో భాగంగా అఫ్ఘానిస్థాన్ అండర్-19 జట్టుతో ఆడే ఇండియా-ఎ, బి జట్లను బీసీసీఐ మంగళవారం ప్రకటించింది. ఇందులో ఇండియా-బి జట్టుకు హైదరాబాదీ ఆరోన్ జార్జ్ కెప్టెన్‌గా నియమితుడయ్యాడు. బెంగళూరులోని బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో ఈనెల 17 నుంచి 30 వరకు ఈ సిరీస్ జరగనుంది. ఈ రెండు జట్లలో కలిపి నలుగురు హైదరాబాద్ క్రికెటర్లకు చోటు లభించడం విశేషం. ఇండియా-ఎ జట్టుకు వాఫీ డైమండ్, అలంక్రిత్ రాపోలు, మొహమ్మద్ మాలిక్, ఇండియా-బి జట్టుకు ఆరోన్ జార్జ్ ఎంపికయ్యారు. ఏసీసీ రైజింగ్ స్టార్స్ ఆసియా కప్‌లో ఆడుతున్న ఇండియా-ఎ జట్టులో సభ్యుడిగా ఉన్నందున వైభవ్ సూర్యవంశీని, రంజీ ట్రోఫీలో ఆడుతున్నందున ఆయుష్ మాత్రేను ఈ సిరీస్ పరిగణనలోనికి తీసుకోలేదు.

బిజినెస్

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,26,280 ▲	1,15,750 ▲	1,70,000 ▲
విజయవాడ	1,28,000 ▲	1,20,000 ▲	1,59,200 ▲
విశాఖపట్నం	1,27,930 ▲	1,13,000 ▲	1,70,000 ▲
రాజమండ్రి	1,26,270 ▲	1,15,750 ▲	1,55,000 ▲
ప్రొద్దుటూరు	1,24,300 ▲	1,14,360 ▲	1,57,600 ▲
ముంబై	1,24,150 ▲	1,13,720 ▲	1,54,760 ▲

చైనాకి భారత జనరిక్ ఔషధాలు

నాట్కో, హెటెరో, రెడ్డీస్‌కీ అవకాశం

ఫలిస్తున్న ప్రభుత్వ ఒత్తిడి

బీజింగ్: ఇన్నాళ్లూ భారత ఔషధ కంపెనీలకు ప్రవేశం నిరాకరించిన చైనా క్రమంగా నిబంధనలు సడలిస్తోంది. భారత ఔషధాలకు ముఖ్యంగా జనరిక్ ఔషధాలకు తలుపులు తెరుస్తోంది. అయితే ఈ అవకాశాన్ని భారత ఫార్మా కంపెనీలకు చెందిన చైనా అనుబంధ కంపెనీలకు మాత్రమే ప్రస్తుతం పరిమితం చేసింది. గత నెల చైనా ఆరోగ్య మంత్రిత్వ శాఖ నిర్వహించిన ఒక టెండర్‌లో చైనాలోని సిప్లా, నాట్కో ఫార్మా, హెటెరో ల్యాబ్స్, అన్నోర ఫార్మా, డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్స్ వంటి భారత ఔషధ కంపెనీల అనుబంధ సంస్థలు ప్రభుత్వ నిర్వహణలోని ఆస్పత్రులకు తమ జనరిక్ ఔషధాలను సరఫరా చేసే కాంట్రాక్టు దక్కించుకున్నాయి. ఇందులో భాగంగా సిప్లాతో పాటు హైదరాబాద్ కేంద్రంగా పనిచేసే నాట్కో ఫార్మా, అన్నోర ఫార్మా, హెటరో ల్యాబ్స్ వంటి ఏడు భారత ఫార్మా కంపెనీల అనుబంధ సంస్థలు మధుమేహ నియంత్రణకు వాడే 'డపాగ్లిఫ్లోజిన్' అనే జనరిక్ టాబ్లెట్లను 100 కోట్ల వరకు చైనాలోని ప్రభుత్వ ఆస్పత్రులకు సరఫరా చేయబోతున్నాయి.

వీబీపీ పద్ధతిలో : చైనా ప్రభుత్వం వాల్యూమ్ బేస్డ్ ప్రొక్యూర్‌మెంట్ (వీబీపీ) పద్ధతిలో ఈ ఔషధాలను కొనుగోలు చేస్తోంది. ఈ పద్ధతిలో తక్కువ ధర కోట్ చేసి ఎంపికైన ఫార్మా కంపెనీలు చైనాలోని నిర్దేశిత రాష్ట్రాల్లోని ప్రభుత్వ ఆస్పత్రులకు తమ జనరిక్ ఔషధాలను సరఫరా చేయాల్సి ఉంటుంది. హైదరాబాద్ కేంద్రంగా పనిచేసే అన్నోరా ఫార్మా, నాట్కో ఫార్మా కంపెనీల చైనా అనుబంధ కంపెనీలు కూడా ఈ బిడ్‌లో పాల్గొని ఆక్స్‌కార్బాజెపైన్, ఒలాపారిబ్ టాబ్లెట్లు సరఫరా చేసే కాంట్రాక్టు సంపాదించాయి. ఈ రెండు టాబ్లెట్లను మూర్ఛ వ్యాధి, కొన్ని రకాల కేన్సర్ చికిత్సలో ఉపయోగిస్తారు. చైనాలోని డాక్టర్ రెడ్డీస్ లాబ్స్ అనుబంధ సంస్థ కున్షన్ రోటం రెడ్డి ఫార్మాస్యూటికల్ కంపెనీ కూడా నాలుగు రకాల జనరిక్ ఔషధాలకు చైనాలోని ప్రభుత్వ ఆస్పత్రులకు సరఫరా చేయనుంది. ఇన్ఫెక్షన్లు, ట్యూమర్లు, అలెర్జీల వంటి రుగ్మతల చికిత్సలో ఈ ఔషధాలను ఉపయోగిస్తారు.



ఫలిస్తున్న ఒత్తిడి: గత ఏడాది చైనా ఔషధ మార్కెట్ 25,237 కోట్ల డాలర్లుగా (సుమారు రూ.22.37 లక్షల కోట్లు) నమోదైంది. ఇందులో బహుళజాతి కంపెనీలు, స్థానిక కంపెనీలదే హవా. దీనికి తోడు వీబీపీ పద్ధతిలో కొనే ఔషధాలకు చైనా ప్రభుత్వం అతి తక్కువ ధర నిర్ణయిస్తోంది. దీంతో ఇప్పటి వరకు భారత ఫార్మా కంపెనీలు చైనా మార్కెట్‌ను పెద్దగా పట్టించుకోలేదు. చైనా అనుసరిస్తున్న వాణిజ్యేతర రక్షణ విధానాలు కూడా ఇందుకు దోహదం చేస్తున్నాయి. అయితే వీబీపీ పద్ధతిలో చైనా ప్రభుత్వం పెద్ద మొత్తంలో ఔషధాలు కొనుగోలు చేయడం భారత ఫార్మా కంపెనీలను ఆకర్షిస్తోంది. ద్వైపాక్షిక వాణిజ్యంలో చైనాకు పెరిగిపోతున్న మిగులు కేంద్ర ప్రభుత్వాన్ని ఆందోళనకు గురి చేస్తోంది. దీంతో మీ ఫార్మా మార్కెట్‌ను మా కంపెనీలకు తెరుస్తారా...లేదా లేకపోతే మేము కూడా మీ కంపెనీలకు దడి కట్టాల్సి వస్తుందని కేంద్రప్రభుత్వం చైనాను హెచ్చరిస్తోంది. దీంతో చైనా తన దేశంలోని భారత ఫార్మా అనుబంధ కంపెనీలను మాత్రమే తన ప్రభుత్వ ఆస్పత్రులకు జనరిక్ ఔషధాలు సరఫరా చేసేందుకు పాక్షికంగా అనుమతించిందని భావిస్తున్నారు.

రూ.10,096 కోట్ల మార్కెట్

వీబీపీ పద్ధతిలో చైనా ప్రభుత్వం ఏడు రకాల జనరిక్ ఔషధాలను కొనుగోలు చేయనుంది. ఇందులో మధుమేహ నియంత్రణకు వాడే 'డపాగ్లిఫ్లోజిన్' జనరిక్ టాబ్లెట్ల మార్కెట్టే 114 కోట్ల డాలర్ల (సుమారు రూ.10,096 కోట్లు) వరకు ఉంది. ఇందులో గత ఏడాది 70 కోట్ల డాలర్ల విలువైన టాబ్లెట్లను చైనాలోని ప్రభుత్వ ఆస్పత్రులే కొనుగోలు చేశాయి.

టఫే కొత్త ఎలక్ట్రిక్ హైబ్రిడ్ ట్రాక్టర్

న్యూఢిల్లీ: భారత వ్యవసాయయంత్రాల తయారీ దిగ్గజం ట్రాక్టర్స్ అండ్ ఫార్మ్ ఎక్విప్‌మెంట్ లిమిటెడ్ (టఫే) కొత్త తరం ఎలక్ట్రిక్ హైబ్రిడ్ ట్రాక్టర్ 'ఈవీఎక్స్ 75'ను విడుదల చేసింది. జర్మనీలో జరుగుతున్న అగ్రిటెక్నికా-2025 ప్రదర్శనలో ఈ కొత్త మోడల్‌ను కంపెనీ ఆవిష్కరించింది. 75 హెచ్‌పీ హైబ్రిడ్ పవర్‌ట్రెయిన్, ఈయూ స్టేజ్-5 డీజిల్ ఇంజన్, 400 వోల్ట్ ఎలక్ట్రిక్ బ్యాటరీ సిస్టమ్‌తో రూపొందించినట్లు టఫే తెలిపింది. లిక్విడ్ కూల్డ్ హై-వోల్టేజ్ సిస్టమ్, 3-స్పీడ్ ట్రాన్స్‌మిషన్ (గరిష్ట వేగం గంటకి 40 కి.మీ), ఫుల్ హెచ్‌వీఏసీ క్యాబిన్, ఎలక్ట్రో-హైడ్రాలిక్ రియర్ లిఫ్ట్, ఇండిపెండెంట్ పీటీవో వంటి ఫీచర్లతో ఈ కొత్త ట్రాక్టర్ వస్తున్నట్టు కంపెనీ వైస్ ఛైర్మన్ డా. లక్ష్మీ వేణు తెలిపారు.

కొత్త బిజినెస్ ప్రీమియంలో 12% వృద్ధి

కోల్‌కతా: జీవిత బీమా (లైఫ్ ఇన్సూరెన్స్) రంగం.. అక్టోబర్ నెలలోనూ గణనీయమైన వృద్ధిని సాధించింది. ఈ నెలలో దేశీయ బీమా సంస్థల కొత్త బిజినెస్ ప్రీమియం 12.1% పెరిగి రూ.34,007 కోట్లకు చేరిందని లైఫ్‌ఇన్సూరెన్స్ కౌన్సిల్, ఐఆర్‌డీఏఐ విడుదల చేసిన తాజా గణాంకాలను ఉటంకిస్తూ.. కేర్‌ఎడ్జ్ రేటింగ్స్ ఓ నివేదికలో వెల్లడించింది. వ్యక్తిగత విభాగం నుంచి వచ్చిన బలమైన డిమాండ్, నాన్-సింగిల్ పాలసీల విక్రయాల సహకారంతో ఈ వృద్ధి నమోదైందని కేర్‌ఎడ్జ్ రేటింగ్స్ సీనియర్ డైరెక్టర్ సంజయ్ అగర్వాల్ అన్నారు. జీఎస్‌టీ తగ్గింపుతో జీవిత బీమా పరిశ్రమ వేగంగా పుంజుకుంటోందన్నారు.

పన్ను వసూళ్లు రూ.12.92 లక్షల కోట్లు

న్యూఢిల్లీ: వర్తమాన ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు (ఈ నెల 10 నాటికి) నికర ప్రత్యక్ష పన్ను వసూళ్లు వార్షిక ప్రాతిపదికన 7% వృద్ధితో రూ.12.92 లక్షల కోట్లు దాటాయి. కార్పొరేట్ పన్ను వసూళ్లు పుంజుకోవడంతోపాటు రిఫండ్లు నెమ్మదించడం ఇందుకు దోహదపడింది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో ఇదే కాలానికి నికర ప్రత్యక్ష పన్ను వసూళ్లు రూ.12.08 లక్షల కోట్లుగా నమోదయ్యాయి. మరిన్ని విషయాలు..



- ఈ ఏప్రిల్ 1- నవంబరు 10 మధ్యకాలంలో రిఫండ్ల జారీ వార్షికంగా 18% తగ్గి రూ.2.42 లక్షల కోట్లకు పరిమితమైంది. నికర కార్పొరేట్ పన్ను వసూళ్లు రూ.5.37 లక్షల కోట్లకు పెరిగాయి.
- వ్యక్తులు, హిందూ అవిభాజ్య కుటుంబాలు సహా కార్పొరేటేతర పన్ను నికర వసూళ్లు రూ.7.19 లక్షల కోట్లకు ఎగబాకాయి. 2024-25లో ఇదే కాలానికి కార్పొరేట్ పన్ను వసూళ్లు రూ.5.08 లక్షల కోట్లు, కార్పొరేటేతర పన్ను వసూళ్లు రూ.6.62 లక్షల కోట్లుగా నమోదయ్యాయి.
- ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు సెక్యూరిటీ లావాదేవీల పన్ను (ఎస్‌టీటీ) వసూళ్లు రూ.35,682 కోట్లుగా ఉన్నాయి. 2024-25లో ఇదే సమయానికి నమోదైన రూ.35,923 కోట్ల వసూళ్లతో పోలిస్తే స్వల్పంగా తగ్గాయి.
- రిఫండ్లు మినహాయించకముందు, స్థూల ప్రత్యక్ష పన్ను వసూళ్లు వార్షిక ప్రాతిపదికన 2.5 శాతం వృద్ధితో రూ.15.35 లక్షల కోట్లకు చేరాయి. - 2024-25 ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే 2025-26లో ప్రత్యక్ష పన్ను వసూళ్లు 12.7 శాతం పెరిగి రూ.25.20 లక్షల కోట్ల చేరుకోవచ్చని కేంద్ర ప్రభుత్వం ఈసారి బడ్జెట్లో అంచనా వేసింది. అందులో ఎస్‌టీటీ వసూళ్లు రూ.78,000 కోట్లుగా ఉండవచ్చని అంచనా.

బ్యాటరీ ఎనర్జీ స్టోరేజీ రంగంలోకి అదానీ

దేశంలో అతిపెద్ద బీఈఎస్‌ఎస్ ప్రాజెక్టు నిర్మాణం

న్యూఢిల్లీ: బ్యాటరీ ఎనర్జీ స్టోరేజీ రంగంలోకి ప్రవేశిస్తున్నట్టు అదానీ గ్రూప్ మంగళవారం ప్రకటించింది. గుజరాత్‌లోని ఖావ్డాలో 1,126 మెగావాట్ల విద్యుత్ సామర్థ్యం; 3,530 మెగావాట్-హవర్ ఇంధన స్టోరేజీ సామర్థ్యం కలిగిన బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్ (బీఈఎస్‌ఎస్) ప్రాజెక్టును నిర్మించాలనుకుంటున్నట్లు తెలిపింది. దేశంలో ఇదే అతి పెద్ద బీఈఎస్‌ఎస్ ప్రాజెక్టు కానుంది. ప్రపంచంలోని అతి పెద్ద ప్రాజెక్టుల్లోనూ ఒకటిగా నిలవనుంది. 700కు పైగా బీఈఎస్‌ఎస్ కంటైనర్లను కలిగి ఉండనున్న ఈ ప్రాజెక్టు 2026 మార్చి నాటికి ప్రారంభం కావచ్చని అదానీ గ్రూప్ వెల్లడించింది. ప్రపంచంలోనే అతిపెద్ద రెన్యువల్ ఎనర్జీ ప్లాంట్ అయిన ఖావ్డా రెన్యువబుల్ ఎనర్జీ కాంప్లెక్స్‌లో భాగంగా ఉందనుందని ప్రకటనలో పేర్కొంది.

పునరుత్పాదక ఇంధనాన్ని మరింత నమ్మదగినదిగా మార్చడంతో పాటు బ్యాకప్ పవర్ కల్పించేందుకు, గ్రిడ్ స్థిరత్వాన్ని మెరుగుపరిచేందుకు బ్యాటరీ స్టోరేజీ అవసరం. సోలార్, పవన విద్యుత్ ప్లాంట్ల నుంచి ఉత్పత్తి చేసే విద్యుత్‌ను నిక్షిప్తం చేసి, అవసరమైనప్పుడు వినియోగించుకునేందుకు బ్యాటరీ స్టోరేజీ ప్రాజెక్టు ఉపయోగపడుతుంది.


మరిన్ని అదానీ వ్యాపారాల లిస్టింగ్: అదానీ గ్రూప్ మరిన్ని వ్యాపారాలను లిస్ట్ చేయాలనుకుంటోంది. ఎయిర్‌పోర్టులు, రోడ్లు, మెటల్స్, డేటా సెంటర్ అనుబంధ విభాగాలు ఈ జాబితాలో ఉన్నట్లు తెలిసింది. 2027-31 మధ్యకాలంలో వీటి లిస్టింగ్ జరగవచ్చని అంటున్నారు.

పడి లేచిన మార్కెట్

సెన్సెక్స్ 336 పాయింట్లు అప్

ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్‌లో మంగళవారం సైతం లాభాలు కొనసాగాయి. సెన్సెక్స్ 335.97 పాయింట్ల లాభంతో 83,871.32 వద్ద ముగియగా, నిఫ్టీ 120.60 పాయింట్ల లాభంతో 25,694.95 వద్ద ముగిసింది. ఉదయం అమ్మకాలతో ఒక దశలో సెన్సెక్స్ 411.32 పాయింట్లు, నిఫ్టీ 125.1 పాయింట్ల వరకు నష్టపోయాయి. ఆ సమయంలో తక్కువ ధరలో లభిస్తున్న ఐటీ, సర్వీసెస్, టెలికం షేర్ల కోసం మదుపరులు ఎగబడడంతో సూచీలు లాభాల బాట పట్టాయి. మార్కెట్ లాభాల బాట పట్టడానికి ఐటీ, ఆటో, మెటల్, ఎఫ్‌ఎంసీజీ కంపెనీల షేర్లు ప్రధానంగా దోహదం చేశాయని నిపుణులంటున్నారు.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



12వ తేదీ			
హైదరాబాద్	590	విజయవాడ	600
వరంగల్	592	గోదావరి	600
చిత్తూరు	633	విశాఖపట్నం	585
		దజను గుడ్లు రూ. 84	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	107	విజయవాడ	109
వరంగల్	107	గుంటూరు	111
కరీంనగర్	107	ఒంగోలు	111
మహబూబ్‌నగర్	107	చిత్తూరు	110
కర్నూలు	107	నెల్లూరు	115
విశాఖపట్నం	108	అనంతపురం	115
గోదావరి	109		

వొడాఫోన్ ఐడియాకు భారీ ఊరట ప్యాకేజీ!

న్యూఢిల్లీ: లక్షల కోట్ల అప్పులు, వేల కోట్ల నష్టాలతో సతమతం అవుతున్న ప్రైవేట్ టెలికాం కంపెనీ వొడాఫోన్ ఐడియాకు త్వరలో భారీ ఊరట లభించే అవకాశం కనిపిస్తోంది. ఏజీఆర్ బకాయిలపై సుప్రీంకోర్టు తాజా తీర్పు నేపథ్యంలో కంపెనీ కోసం కేంద్ర ప్రభుత్వం ఊరట ప్యాకేజీ రూపకల్పనను ప్రారంభించినట్లు తెలిసింది. సవరించిన ఏజీఆర్ బకాయిలతోపాటు వడ్డీ, పెనాల్టీపైనా మినహాయింపులతో కలిపి సమగ్ర ప్యాకేజీని ప్రకటించే అవకాశాలున్నట్లు సమాచారం. ఈ మార్చి చివరినాటికి వొడాఫోన్ ఐడియా ఏజీఆర్ బకాయిలు రూ.83,400 కోట్లకు పెరిగాయి. కాగా, ఈ సెప్టెంబరు త్రైమాసికంలో కంపెనీ నష్టం 19 క్వార్టర్ల కనిష్ఠ స్థాయి రూ.5,524 కోట్లకు తగ్గింది. ఆదాయం రూ.11,195 కోట్లకు చేరింది. ఒక్కో వినియోగదారు నుంచి సగటు ఆదాయం (ఆర్పూ) కూడా 8.7 శాతం వృద్ధితో రూ.180కి పెరిగింది. ఈ సెప్టెంబరు చివరినాటికి కంపెనీ మొత్తం రుణభారం రూ.2,02,951 కోట్లుగా నమోదైంది. కంపెనీ ఆర్థిక పనితీరు మెరుగుపడటంతోపాటు రిలీఫ్ ప్యాకేజీపై అంచనాలతో మంగళవారం వొడాఫోన్ ఐడియా షేరు 7.68% పెరిగి రూ.10.24కు చేరింది.

వరద బాధితులకు
12.99 కోట్ల తక్షణ సాయం

హైదరాబాద్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాను ప్రభావంతో ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వరదల వల్ల నష్టపోయిన కుటుంబాలకు ప్రభుత్వం తక్షణ సాయం కింద రూ.12.99 కోట్ల నిధులు విడుదల చేసింది. ఈ మేరకు విపత్తుల నిర్వహణ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అరవింద్‌కుమార్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. కలెక్టర్లు పంపిన నివేదికల ప్రకారం 16 జిల్లాల పరిధిలో 8662 ఇళ్లు దెబ్బతిన్నాయని, వీరికి తక్షణ సహాయం కింద రూ.12.99 కోట్లు విడుదల చేసినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ నిధులు బాధితుల ఖాతాల్లో నేరుగా జమ చేయనున్నట్లు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా వరదల్లో మృతి చెందిన వారికి రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా, పశువులు కోల్పోతే ఒక్కోదానికి రూ.50 వేలు, గొర్రెలు, మేకలకు రూ.5000, పాక్షికంగా దెబ్బతిన్న ఇళ్లకు రూ.15 వేల చొప్పున సహాయం అందించనున్నట్లు పేర్కొన్నారు.

ఫార్మసీ పరీక్షలు మళ్లీ నిర్వహించలేం!

- సప్లిమెంటరీ రాసుకోండి.. స్పష్టం చేసిన విద్యాశాఖ కార్యదర్శి
- ప్రైవేటు కాలేజీల సమ్మెతో గైర్హాజరైన 7 వేల మంది విద్యార్థులు
- విద్యార్థుల్లో ఆందోళన.. సీఎంను కోరుతామన్న 'ఫాతి'

హైదరాబాద్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రైవేటు కాలేజీల సమ్మెతో పరీక్షలకు దూరమైన ఫార్మసీ విద్యార్థుల్లో ఆందోళన నెలకొంది. సమ్మె సమయంలో నిర్వహించిన పరీక్షలను మళ్లీ నిర్వహించలేమని, సప్లిమెంటరీ పరీక్షలు రాసుకోవాలని విద్యార్థులకు విద్యా శాఖ స్పష్టం చేసింది. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల విడుదల డిమాండ్‌తో ప్రైవేటు ఉన్నత విద్యా సంస్థలు ఈ నెల 3 నుంచి నాలుగు రోజుల పాటు సమ్మె చేసిన విషయం తెలిసిందే. మరోవైపు ఈనెల 4వ తేదీ నుంచే బీ-ఫార్మసీ ప్రథమ సంవత్సరం రెండో సెమిస్టర్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. జేఎన్టీయూ పరిధిలో మొత్తం 63 ఫార్మసీ కాలేజీలు ఉండగా.. ఏడున్నర వేల మందికిపైగా విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉంది. కానీ కాలేజీల సమ్మె నేపథ్యంలో జేఎన్టీయూ క్యాంపస్‌కు చెందిన రెండు కాలేజీలు, మరో ఏడు ప్రైవేటు కాలేజీలు మాత్రమే పరీక్షలు నిర్వహించాయి. మొత్తం విద్యార్థుల్లో 9శాతం మంది మాత్రమే రాశారు. సమ్మె ఈనెల 7న ముగిసినా.. అప్పటికే అనాటమీ-ఫిజియాలజీ, ఆర్గానిక్ కెమిస్ట్రీ పరీక్షలు పూర్తయ్యాయి. వీటికి గైర్హాజరైన విద్యార్థులకు ఆ పరీక్షలు మళ్లీ నిర్వహించాలని కాలేజీలు జేఎన్టీయూను అభ్యర్థించాయి. కానీ దీనికి విద్యాశాఖ కార్యదర్శి అంగీకరించలేదని తెలిసింది. పరీక్షలు మళ్లీ నిర్వహించలేమని, విద్యార్థులు సప్లిమెంటరీ రాసుకోవాలని స్పష్టం చేసినట్టు సమాచారం. దీనితో విద్యార్థుల్లో ఆందోళన నెలకొంది. పరీక్షలు మళ్లీ నిర్వహించాలని ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేస్తామని ప్రైవేటు కాలేజీల యాజమాన్యాల సంఘాల సమాఖ్య (ఫాతి) తెలిపింది.

అవినీతిలో నంబర్‌వన్ మంత్రి ఉత్తమ్: అర్వింద్

జగిత్యాల, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): అవినీతిలో నంబర్‌వన్ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి అని ఎంపీ ధర్మపురి అర్వింద్ విమర్శించారు. ఇటీవల పౌరసరఫరాల శాఖ పంపిణీ చేసిన సంచులపై మంత్రి ఉత్తమ్ ఫొటో ముద్రించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. జగిత్యాలలో మంగళవారం పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొనడానికి వచ్చిన అర్వింద్ మీడియాతో మాట్లాడారు. జగిత్యాలకు మంజూరైన కేంద్రీయ విద్యాలయ భవనాన్ని నిరుపయోగంగా ఉన్న నీటిపారుదల శాఖ స్థలంలో నిర్మించేందుకు అధికారులు ప్రతిపాదనలు పంపగా, మంత్రి ఉత్తమ్ అడ్డుపడుతున్నారని ఆరోపించారు. స్థలం కేటాయించాలంటే ఆయనకు కమీషన్ కావాలేమో? అని వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు.

సామినేని హంతకులను అరెస్టు చేయాలి:సీపీఎం

హైదరాబాద్/ ఖమ్మం అర్బన్/ చింతకాని, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం జిల్లా చింతకాని మండలం పాతర్లపాడు గ్రామానికి చెందిన సీపీఎం రాష్ట్ర నాయకుడు సామినేని రామారావును హత్య చేసిన దుండగులను వెంటనే అరెస్టు చేయాలని సీపీఎం రాష్ట్ర నాయకులు విన్నవించారు. ఈ మేరకు మంగళవారం హైదరాబాద్‌లో డీజీపీ బి.శివధర్ రెడ్డి సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి, పోతినేని సుదర్శన్‌రావు, తదితరులు వినతి పత్రం సమర్పించారు. హత్య జరిగి 12 రోజులవుతున్నా నిందితులను పట్టుకోవడంలో పోలీస్ శాఖ నిర్లక్ష్యం వహిస్తోందని ఆరోపించారు.

గుండెపోటు రోగుల రికవరీలో
రోబోటిక్ రిహాబిలిటేషన్ కీలకం

- అడ్వాన్స్ రోబోటిక్స్ ఇన్ రిహాబ్ రికవరీపై చర్చాగోష్ఠిలో వైద్య నిపుణులు

హైదరాబాద్ సిటీ, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): గుండెపోటు అనంతరం రోగులు తక్కువ ఖర్చుతో కోలుకోవడానికి అధునాతన రోబోటిక్ రిహాబిలిటేషన్‌ను మిళితం చేయాల్సిన అవసరం ఉందని వైద్య నిపుణులు తెలిపారు. హైదరాబాద్‌లోని సోమాజిగూడలో హెచ్‌సీఏహెచ్ సెంటర్‌లో 'అడ్వాన్స్ రోబోటిక్స్ ఇన్ రిహాబ్ రికవరీ' అనే అంశంపై జరిగిన చర్చాగోష్ఠిలో పలువురు వైద్య నిపుణులు మాట్లాడుతూ.. ఆరోగ్య సంరక్షణలో అత్యంత నిర్లక్ష్యం ఉన్నా.. చికిత్స అనంతర కీలకాంశాల్లో పోస్ట్- స్ట్రోక్ రిహాబిలిటేషన్ ఒకటని తెలిపారు. 50 మందికి పైగా ప్రముఖ న్యూరాలజిస్టులు, న్యూరో సర్జన్లు, రిహాబిలిటేషన్ నిపుణులు చర్చాగోష్ఠిలో పాల్గొన్నారు. వృద్ధుల వైకల్యానికి ప్రధాన కారణాల్లో ఒకటైన గుండెపోటు రోగులు ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ అయిన తర్వాత వైద్యుల జోక్యం, పర్యవేక్షణ ముగుస్తుందన్న నిపుణులు.. ఆయా అవయవాల పనితీరులో రికవరీ ప్రక్రియ చికిత్స అనంతరమే ప్రారంభమవుతుందని చెప్పారు. యశోదా ఆస్పత్రి సీనియర్ కన్సల్టెంట్ న్యూరో సర్జన్ డాక్టర్ బీఎస్‌వీ రాజు మాట్లాడుతూ 'అత్యవసర చికిత్సలో భారత ఆరోగ్య సంరక్షణ వ్యవస్థ ప్రావీణ్యం సంపాదించింది. కానీ రిహాబిలిటేషన్ అంటే జీవితాలను నిజంగా పునర్నిర్మించే ప్రదేశమని గుర్తించాల్సిన ఆవశ్యకత ఉంది' అని చెప్పారు. గుండెపోటుకు గురైన రోగి కోలుకోవడంలో ప్రతి రోజూ కీలకమేనని.. త్వరితగతిన గైడెడ్ రిహాబిలిటేషన్ ప్రారంభంతో రోగి సాధారణ జీవన స్థితికి వచ్చే అవకాశాలు ఎక్కువని పేర్కొన్నారు. చికిత్సకు ఖచ్చితత్వాన్ని, తీవ్రతను రోబోటిక్ రిహాబిలిటేషన్ జోడిస్తుందని బీఎస్‌వీ రాజు చెప్పారు. హెచ్‌సీఏహెచ్ సహ వ్యవస్థాపకుడు డాక్టర్ గౌరవ్ తుక్రాల్ మాట్లాడుతూ.. ఇటీవలే తాము తెలంగాణలో అత్యంత అధునాతన రోబోటిక్ రిహాబిలిటేషన్ ల్యాబ్‌ను ప్రారంభించినట్లు చెప్పారు. ఇందులో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) శక్తితో పని చేసే ఎక్సోస్కెలిటన్లు, మోషన్ ట్రాకింగ్ వ్యవస్థలు ఉన్నాయని తెలిపారు. ముందుగా చికిత్సను ప్రారంభిస్తే రోగులు వేగంగా కోలుకుంటారన్న డాక్టర్ గౌరవ్ తుక్రాల్.. గుండెపోటు రోగులకు అందించే చికిత్సలో పోస్ట్ స్ట్రోక్ రిహాబిలిటేషన్‌ను ప్రామాణికంగా మార్చాలని హితవు చెప్పారు.

సులభతర వాణిజ్య సంస్కరణలలో
రాష్ట్రానికి అగ్రస్థానం

(మొదటిపేజీ తరువాయి)

అవార్డును తెలంగాణ రాష్ట్ర ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సంజయ్ కుమార్ న్యూఢిల్లీలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పియూష్ గోయల్ చేతులమీదుగా స్వీకరించారు. బిజినెస్ ఎంట్రీ, నిర్మాణ అనుమతుల ప్రక్రియ(కన్‌స్ట్రక్షన్ పర్మిట్ ఎనేబ్లర్స్), సేవారంగం, భూపరిపాలన విభాగాల్లో అమలు చేసిన సంస్కరణలకు గాను రాష్ట్రానికి ఈ అవార్డు దక్కింది. దేశంలో సులభతర వాణిజ్యాన్ని ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వ పరిశ్రమలు, అంతర్గత వాణిజ్య ప్రోత్సాహక విభాగం (డీపీఐఐటీ).. బీఆర్‌ఏపీ-2024 ఏడో ఎడిషన్ కార్యక్రమాన్ని ప్రారంభించింది. కార్మిక చట్టాలు, భూపరిపాలన, ఆస్తుల రిజిస్ట్రేషన్, పెట్టుబడి అవకాశాలు, పర్యావరణ అనుమతులు వంటి 434 అంశాలకు సంబంధించిన సంస్కరణలను ఈ కార్యక్రమంలో భాగం చేసింది. బీఆర్‌ఏపీ-2024 మార్గదర్శకాల ప్రకారం తెలంగాణ ప్రభుత్వం అన్ని సంస్కరణలను విజయవంతంగా అమలు చేసింది. బిజినెస్ ఎంట్రీ, నిర్మాణ అనుమతుల ప్రక్రియ, సేవా రంగం, భూపరిపాలన విభాగాల్లో అగ్రగామిగా నిలిచి అవార్డు సాధించింది.

బ్యారేజీలకు మరమ్మతులు చేయండి



- లేదంటే టెండర్లకు వెళ్లకుండా బ్లాక్‌లిస్ట్‌లో పెడతాం
- ఈ-ప్రొక్యూర్‌మెంట్‌లో పాల్గొననివ్వం
- అన్నారం, సుందిళ్ల బ్యారేజీల నిర్మాణ సంస్థలకు సర్కార్ హెచ్చరిక

హైదరాబాద్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): 'కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన అన్నారం, సుందిళ్ల బ్యారేజీల పునరుద్ధరణ/మరమ్మతులపై వారం రోజుల్లోపు సానుకూలంగా స్పందించాలి. లేదంటే ఈ-ప్రొక్యూర్‌మెంట్‌తో పాటు ఇతర వేదికల్లో తదుపరి టెండర్లు వేయకుండా బ్లాక్‌లిస్ట్‌లో పెడతాం' అని అన్నారం నిర్మాణ సంస్థ ఆఫ్కాన్స్-విజేత-పీఈఎస్ జాయింట్ వెంచర్‌ను, సుందిళ్ల నిర్మాణ సంస్థ నవయుగను రాష్ట్ర ప్రభుత్వం హెచ్చరించింది. టెండర్ ఒప్పందం ప్రకారం బ్యారేజీల మరమ్మతులు/పునరుద్ధరణ బాధ్యత నిర్మాణ సంస్థదేనని, దీనికి సిద్ధం కాకపోతే ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఆయా సంస్థలు సమర్పించిన డిపాజిట్లు(టెండర్ల కోసం దాఖలు చేసిన ఈఎండీ), రావాల్సిన పెండింగ్ బిల్లులను జప్తు చేస్తామని పేర్కొంది. వెంటనే బ్యారేజీల వద్ద పరీక్షలు చేస్తున్న కేంద్ర నీటి, విద్యుత్ పరిశోధన సంస్థ (సీడబ్ల్యూపీఆర్ఎస్-పుణె)తో పాటు శాఖకు అవసరమైన సహకారం, యంత్రాలు, సిబ్బందిని సమకూర్చాలని, లేనిపక్షంలో కఠిన చర్యలకు ఉపక్రమిస్తామని తెలిపింది. ఈ మేరకు మంగళవారం ఒక్కో సంస్థకు 13 పేజీలతో కూడిన లేఖను రామగుండం ఇరిగేషన్ సర్కిల్ సూపరింటెండింగ్ మహ్మద్ దస్తగిర్ పంపించారు. 2019 వరదల అనంతరం అన్నారం బ్యారేజీ గేట్లను మూసివేయగా.. దిగువ భాగంలో సీసీ బ్లాకులన్నీ చెల్లాచెదురు అయ్యాయని, 2020 వరదలకు వేరింగ్ కోట్ దెబ్బతిన్నదని, 2020 ఏప్రిల్‌లో 35, 44 గేట్ల కింద సీపేజీలు గుర్తించామని పేర్కొన్నారు. ఆ తర్వాత 2021 జనవరి 28, 38 గేట్ల దగ్గర, 2024 జనవరిలో 35వ నెంబర్‌గేటు దిగువ భాగంలో సీపేజీలు ఏర్పడ్డాయని వెల్లడించారు. వీటిపై ఆరు నోటీసులు సంబంధిత ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఇచ్చారని తెలిపారు. బ్యారేజీల్లో లోపాలన్నీ కూడా డిఫెక్ట్ లయబులిటీ కాలంలోనే బయటపడ్డాయని, దీనివల్ల డిఫెక్ట్ లయబులిటీ కాలం కూడా దానంతటదే పెరిగినట్లు పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుందన్నారు. ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ మూడేళ్లకాలం ఉండగా.. అనంతరం బ్యారేజీని యాజమానికి ఒప్పందం ప్రకారం లోపాల్లేకుండా అప్పగించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. ఒప్పందం ప్రకారం బ్యారేజీ దిగువ భాగంలో వరద ప్రవాహ ఉధృతిని నియంత్రించే వ్యవస్థలు ఏర్పాటు చేయాలని, చెల్లాచెదురైన సిమెంట్ కాంక్రీట్ బ్లాకులను సరి చేయాల్సి ఉంటుందని, సీపేజీలను శాశ్వతంగా కట్టడి చేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై వేలాది మంది రైతుల జీవితాలు ఆధారపడి ఉన్నాయని, ఇంతటి కీలక ప్రాజెక్టు విషయంలో సహాయ నిరాకరణ చేస్తే ఉపేక్షించబోమని హెచ్చరించారు. ఇక సుందిళ్ల బ్యారేజీ విషయంలోనూ ఇవే అంశాలతో లేఖ రాశారు. వారంలోగా సానుకూలంగా ముందుకు రావాలని గుర్తు చేశారు. లేనిపక్షంలో కఠిన చర్యలకు ఉపక్రమిస్తామని హెచ్చరించారు.

కాంగ్రెస్‌లో గెలుపు ధీమా!

పోల్ మేనేజ్‌మెంట్‌లో అధికార పార్టీ సక్సెస్ .. పోలింగ్ సరళిపై ఎప్పటికప్పుడు సీఎం రేవంత్ ఆరా

- అంచనాలకు మించి మెజారిటీ రావచ్చంటున్న నేతలు
- సైలెంట్ ఓటింగ్‌పై బీఆర్ఎస్ ఆశలు
- బీజేపీ డీలా..నిరుత్సాహంలో కేడర్



హైదరాబాద్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా తీవ్ర ఉత్కంఠ రేపిన జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక పోలింగ్ ముగిసింది. అభ్యర్థుల భవితవ్యం ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల్లో నిక్షిప్తమై ఉంది. అది 14న వెల్లడి కానుంది. అయితే గెలుపు తమదేనంటూ కాంగ్రెస్ ధీమా ప్రదర్శిస్తుండగా.. సైలెంట్ ఓటింగ్ తమను గెలిపిస్తుందన్న ఆశల్లో బీఆర్ఎస్ నేతలు ఉన్నారు. బీజేపీ అభ్యర్థికి 8 శాతం కంటే తక్కువగా ఓట్లు వస్తాయంటూ దాదాపు అన్ని ఎగ్జిట్ పోల్స్ సర్వేలు తేల్చడంతో ఆ పార్టీ నేతలు, కార్యకర్తల్లో నిరుత్సాహం అలముకుంది. ఓటింగ్ సరళిని ప్రధాన పార్టీల నేతలంతా నిశితంగా పరిశీలించి ఒక అంచనాకు వచ్చారు. కాగా, పోలింగ్ సరళి.. కాంగ్రెస్ పార్టీలో ఉత్సాహాన్ని నింపింది. మైనారిటీలు, బీసీలు, ఎస్సీలు, తటస్థ ఓటర్లలో అత్యధికులు తమ అభ్యర్థి వైపే మొగ్గు చూపారని కాంగ్రెస్ నేతలు అంటున్నారు. గెలుపుపై వారు గట్టి ధీమా వ్యక్తం చేస్తున్నారు. గతంతో పోలిస్తే పోలింగ్ శాతమూ పెరిగిందని, ఇది కూడా తమకు అనుకూలించే అంశమని చెబుతున్నారు. దశాబ్ద కాలం తర్వాత జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించబోతోందని, హైదరాబాద్ నగరంలో మరో బీఆర్ఎస్ సిటింగ్ సీటు తమ వశం కానుందని అంటున్నారు. సర్వే సంస్థల ఎగ్జిట్ పోల్స్‌ను మించి.. కాంగ్రెస్ అభ్యర్థి 20 వేలకు పైగా ఓట్ల ఆధిక్యంతో విజయం సాధించబోతున్నారని అంచనా వేస్తున్నారు.

పకడ్బందీ కార్యాచరణ..

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికను ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న సీఎం రేవంత్‌రెడ్డి.. గత కొద్ది నెలలుగా పకడ్బందీ కార్యాచరణ అమలు చేశారు. డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క, టీపీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్, మంత్రులు, ముఖ్యనాయకులు అందరూ నియోజకవర్గంపై ప్రత్యేకంగా దృష్టి పెట్టి పనిచేశారు. సీఎం రేవంత్‌రెడ్డి.. పోలింగ్ సరళి ఎలా ఉందని ఎప్పటికప్పుడు ఆరా తీశారు. పార్టీ నేతలకు అవసరమైన సూచనలు చేశారు. అధికార పార్టీ కావడంతో నియోజకవర్గ అభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని తటస్థ ఓటర్లు పెద్ద ఎత్తున కాంగ్రెస్ అభ్యర్థికి ఓట్లు వేశారని ఆ పార్టీ వర్గాలు చెబుతున్నాయి. దీనికితోడు పోల్ మేనేజ్‌మెంట్‌లోనూ బీఆర్ఎస్‌తో పోలిస్తే తాము సక్సెస్ అయ్యామని అంటున్నాయి. పార్టీ గెలుపు కోసం ఏ ఒక్క అవకాశాన్నీ వదులుకోకుండా చేయాల్సినవన్నీ చేశామని పేర్కొంటున్నాయి. ఇక దాదాపు అన్ని సర్వే సంస్థలూ ఎగ్జిట్ పోల్స్‌లో బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీత వెనుకబడి ఉన్నట్లు చెబుతున్నా.. ఆ పార్టీ నేతలు మాత్రం సైలెంట్ ఓటింగ్‌పై ఆశలు పెట్టుకున్నారు. ప్రభుత్వ పనితీరుపై అసంతృప్తితో ఉన్న ఓటర్లు బీఆర్ఎస్‌కు ఓట్లు వేసినా.. బయటికి మాత్రం గుంభనంగా ఉన్నారని చెబుతున్నారు. స్వల్ప మెజారిటీతోనైనా సిటింగ్ సీటును నిలబెట్టుకుంటామన్న అంచనాలో ఉన్నారు. వాస్తవానికి బీఆర్ఎస్ మొదట్లో అధికార పార్టీకి గట్టి పోటీ ఇస్తున్నట్లు కనిపించినా.. పోలింగ్ వరకు వచ్చేసరికి ప్రచారంలోగానీ, పోల్ మేనేజ్‌మెంట్‌లో గానీ కాంగ్రెస్‌తో పోటీ పడలేకపోయింది. మాగంటి గోపీనాథ్ మరణంతో సెంటిమెంట్‌నే ప్రధానంగా నమ్ముకుని దిగిన బీఆర్ఎస్‌కు.. పోలింగ్‌కు కొద్దిరోజుల ముందు ఆ కుటుంబంలో తలెత్తిన వివాదం ఇబ్బందికరంగా మారింది.

బీజేపీ డీలా!

ఎగ్జిట్ పోల్స్ వెల్లడితో బీజేపీ డీలా పడింది. పార్టీ నేతలు, కార్యకర్తల్లోనూ ఒక రకమైన నిరుత్సాహం నెలకొందని అంటున్నారు. కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు తదితరులు విస్తృతంగా ప్రచారం చేసినా.. ఆశించిన ఫలితం దక్కదన్న అంచనాకు ఆ పార్టీ నేతలే వచ్చారు. సర్వే సంస్థలన్నీ బీజేపీ అభ్యర్థికి 8 శాతం కంటే తక్కువగానే ఓట్లు వస్తాయని స్పష్టం చేశాయి. 2023 ఎన్నికల్లో ఈ నియోజకవర్గంలో బీజేపీ అభ్యర్థికి 25,886 ఓట్లు వచ్చాయి. తాజా ఎన్నికలో ఆ మార్కును దాటి ఓట్లు సాధించడం అటుంచి.. అంతకన్నా తగ్గుతాయని సర్వే సంస్థలు తేల్చడం ఆ పార్టీ వర్గాలను కలవరపెడుతోంది. వాస్తవానికి 2023 ఎన్నికల్లో బీజేపీ గట్టిపోటీ ఇవ్వని చోట్ల ఆ పార్టీ సానుభూతిపరులు.. బీఆర్ఎస్‌ను ఓడించే లక్ష్యంతో కాంగ్రెస్ అభ్యర్థుల వైపు మొగ్గు చూపినట్లు విశ్లేషణలు వెలువడ్డాయి. అయితే జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో ఎంఐఎం పార్టీ.. కాంగ్రెస్ అభ్యర్థికి బహిరంగంగా మద్దతు ప్రకటించడంతో గతంలో బీజేపీ వెంట ఉన్న ఓటర్లు ఈసారి బీఆర్ఎస్‌కు మద్దతు పలికి ఉంటారన్న అభిప్రాయాన్ని కాంగ్రెస్ నేతలు వ్యక్తం చేస్తున్నారు. కాంగ్రెస్ అభ్యర్థికి మెజారిటీ తగ్గితే.. అందుకు ఇదే కారణమవుతుందనీ అంటున్నారు.

ప్రజల మద్దతు నవీన్‌యాదవ్‌కే..!

- ఎన్నికల్లో కష్టపడ్డ ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు
- టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్

హైదరాబాద్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్‌కు ప్రజల నుంచి పెద్దఎత్తున మద్దతు లభించినట్లు క్షేత్రస్థాయి పరిస్థితులు స్పష్టం చేస్తున్నాయని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. నవీన్ యాదవ్ గెలుపు కోసం కష్టపడిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలుపుకుంటున్నానన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి సలహాలు, సూచనలు ఇస్తూ నిరంతరం ముందుకు నడిపించారన్నారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు, పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ చైర్మన్లు ప్రభుత్వ పథకాలను విజయవంతంగా ప్రజల్లోకి తీసుకెళ్లారని ఆయన మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

అనర్హత పిటిషన్లపై నేడు, రేపు స్పీకర్ విచారణ

బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలంటూ దాఖలు చేసిన పిటిషన్లపై స్పీకర్ ప్రసాద్ కుమార్ బుధ, గురువారాల్లో విచారణ కొనసాగించనున్నారు. వీరిపైన పిటిషన్లు దాఖలు చేసిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు వివేకానంద, జగదీశ్ రెడ్డి, కల్వకుంట్ల సంజయ్‌లను స్పీకర్ సమక్షంలో ఈ నెల 7, 8 తేదీల్లో ప్రతివాదుల తరపు అడ్వకేట్లు క్రాస్ ఎగ్జామిన్ చేశారు. బుధవారం తెల్లం వెంకట్రావు, డాక్టర్ సంజయ్‌లను.. గురువారం పోచారం శ్రీనివాస్‌రెడ్డి, అరికెపూడి గాంధీలను పిటిషనర్ల తరపు లాయర్లు విచారించనున్నారు.

హాస్టళ్ల నిర్వహణకు ఒకే సాఫ్ట్‌వేర్

రాష్ట్రంలోని అన్ని సంక్షేమ హాస్టళ్ల నిర్వహణ కోసం ఒకే ఇంటిగ్రేటెడ్ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్‌ను రూపొందించేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. అందులో భాగంగా మంగళవారం సచివాలయంలో ఉన్నతాధికారుల సమావేశం జరిగింది. సంక్షేమ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సబ్యసాచి ఘోష్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో విద్యార్థుల సంక్షేమం, ఆహార సరఫరా, వైద్య అత్యవసర పరిస్థితులు, తనిఖీలు, నివేదికల వంటి కీలక అంశాలకు ప్రాధాన్యమిస్తూ సాఫ్ట్‌వేర్‌ను అభివృద్ధి చేయాలని నిర్ణయించారు.

బిర్యానీ పొట్లాల్లో పెట్టి డబ్బులు పంచారు

- కాంగ్రెస్‌పై సీఈవోకు ఫిర్యాదు చేసిన బీఆర్ఎస్ నేతలు
- పార్టీ శ్రేణులకు కేటీఆర్ కృతజ్ఞతలు

హైదరాబాద్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ అధికార దుర్వినియోగానికి పాల్పడిందని.. మంత్రులు, ముఖ్యనేతలు బహిరంగంగానే.. ఓటర్లకు డబ్బులు, తాయిలాలు పంపిణీ చేశారని బీఆర్ఎస్ నేతలు ఆరోపించారు. రూ.5 వేల చొప్పున బిర్యానీ పొట్లాల్లో పెట్టి.. ఓటర్లకు అందించారని.. కాంగ్రెస్‌పై తక్షణం చర్యలు చేపట్టాలని తెలంగాణ ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్‌రెడ్డికి ఆయన కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నేతలు బొల్లం మల్లయ్య యాదవ్ తదితరులు మీడియాతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఇతరులపై ఎన్నికల నియమావళి ఉల్లంఘించినందుకు తక్షణం చర్యలు చేపట్టాలని సీఈవోను కోరామన్నారు. ఎన్నికల నియమావళికి విరుద్ధంగా స్థానికేతర కాంగ్రెస్ నేతలు తిష్ఠ వేసి ఓటర్లను ప్రభావితం చేశారని ఆరోపించారు. ప్రభుత్వ విప్‌లు బీర్ల అయిలయ్య, రాంచంద్రనాయక్, ఎమ్మెల్సీ శంకర్‌నాయక్ పోలింగ్ కేంద్రాల దగ్గర ఓటర్లను ప్రలోభ పెట్టిన సాక్ష్యాలను సీఈవోకు అందజేసినట్లు బీఆర్ఎస్ నేతలు వెల్లడించారు. కాగా కాంగ్రెస్ దురాగతాలను ఎదుర్కొంటూనే.. నెల రోజులు జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో బీఆర్ఎస్ అభ్యర్థి కోసం నిరంతరం కృషి చేసినందుకుగాను పార్టీ శ్రేణులకు వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మంగళవారం 'ఎక్స్' వేదికగా కృతజ్ఞతలు తెలిపారు. మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లు, కార్పొరేషన్ల మాజీ చైర్మన్లు, ముఖ్యనేతలు ప్రధానంగా కార్యకర్తలు పార్టీ దిశానిర్దేశానికి అనుగుణంగా శక్తివంచన లేకుండా పని చేశారన్నారు. అధికార పార్టీ ఎన్ని దౌర్జన్యాలకు పాల్పడినా, భయభ్రాంతులకు గురి చేసినా బయటకు వచ్చి ఓటు వేసిన జూబ్లీహిల్స్ ప్రజలు ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలియజేస్తున్నామన్నారు.

సునీత ప్రెస్‌మీట్ కోడ్ ఉల్లంఘనే!

- సీఈవోకు కాంగ్రెస్ నేతల ఫిర్యాదు

హైదరాబాద్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : ఒకవైపు పోలింగ్ ప్రక్రియ జరుగుతుండగానే.. బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీత ప్రెస్‌మీట్ పెట్టి మాట్లాడటం ఎన్నికల కోడ్ ఉల్లంఘన కిందకు వస్తుందని.. ఆమెపై చర్యలు తీసుకోవాలంటూ కాంగ్రెస్ నేతలు సీఈవో సుదర్శన్‌రెడ్డికి మంగళవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా టీపీసీసీ ఎన్నికల సమన్వయ కమిటీ ప్రతినిధులు పి.రాజేశ్‌కుమార్, వాజిద్ హుస్సేన్, జి.రాఘవేందర్, బి.లింగంయాదవ్ మాట్లాడుతూ.. పోలింగ్ జరిగే సమయానికి 48 గంటల ముందు నుంచే సమావేశాలు, ప్రచారాలు, మీడియాతో ప్రెస్‌మీట్లు వంటివి పెట్టకూడదన్న ఈసీఐ నిబంధనను సునీత అతిక్రమించారని వారు పేర్కొన్నారు. ఇందుకు సంబంధించిన ఆధారాలు సమర్పించామని తెలిపారు.

కాంగ్రెస్, బీఆర్ఎస్ శ్రేణుల బాహాబాహీ

- జూబ్లీహిల్స్ నియోజకవర్గ పరిధిలోని పలు ప్రాంతాల్లో బీఆర్ఎస్ నేతల ఆందోళన
- యూసుఫ్‌గూడలో తీవ్ర ఉద్రిక్తత, భారీగా ట్రాఫిక్ జామ్
- షేక్‌పేటలో ఎదురుపడ్డ కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలు.. ఘర్షణ



యూసుఫ్‌గూడలో పోలీసులు, కార్యకర్తల మధ్య ఉద్రిక్తత

హైదరాబాద్ సిటీ, బంజారాహిల్స్, కార్వాన్, యూసుఫ్‌గూడ, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక నేపథ్యంలో.. బోరబండ, షేక్‌పేట, ఎర్రగడ్డల, యూసఫ్‌గూడ తదితర ప్రాంతాల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్ శ్రేణులు బాహాబాహీకి దిగాయి. పోలీసులు రంగంలోకి దిగడంతో ఉద్రిక్తతలు సద్దుమణిగాయి. మంగళవారం సాయంత్రం మరో అరగంటలో పోలింగ్ ముగుస్తుందనగా.. కొంత మంది ప్రైవేటు వ్యక్తులు దొంగ ఓట్లు వేసేందుకు సిద్ధమై, యూసుఫ్‌గూడలో మొహమూద్ ఫంక్షన్ హాల్‌లో ఉన్నారనే సమాచారం రావడంతో బీఆర్ఎస్ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి, ఆ పార్టీ అభ్యర్థి మాగంటి సునీత, ఆమె కుటుంబ సభ్యులు అక్కడకు చేరుకున్నారు. అయితే తామంతా కళాకారులమని ఎన్నికల్లో కాంగ్రెస్ కోసం ప్రచారం చేశామని.. తమకు అక్కడ భోజనం, వసతి ఏర్పాట్లు చేశారని అక్కడున్నవారు తెలిపారు. అయితే.. వారు ఓటు వేశారేమోనన్న అనుమానంతో బీఆర్ఎస్ నేతలు వారి వేళ్లను పరిశీలించారు. విషయం తెలిసి.. ఆ ప్రాంతంలో బందోబస్తు నిర్వహిస్తున్న అదనపు పోలీసు కమిషనర్ జోయల్ డేవిడ్ తన సిబ్బందితో అక్కడకు చేరుకున్నారు. ఎంపీ రవిచంద్ర, ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి, ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డిలను బలవంతంగా అదుపులోకి తీసుకొని అక్కడి నుంచి పంపిచేశారు. ఈ క్రమంలో సుదర్శన్‌రెడ్డికి గాయాలయ్యాయి. దీంతో మాగంటి సునీత, ఆమె కుటుంబ సభ్యులు ఫంక్షన్ హాల్ వద్ద బైఠాయించారు. కాంగ్రెస్‌కు, పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అక్కడే ఉన్న కాంగ్రెస్ నాయకులు, కళాకారులు సైతం బైఠాయించి బీఆర్ఎస్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఫంక్షన్ హాల్‌ను పార్టీ కార్యాలయంగా ఉపయోగించుకునేందుకు ఎన్నికల అధికారి అనుమతి కూడా ఉందంటూ కాంగ్రెస్ నాయకులు పోలీసులకు పత్రాలు చూపించారు. దీంతో పోలీసులు సునీతతో పాటు మిగతా వారిని బయటకు పంపించారు. వారు యూసుఫ్‌గూడ చౌరస్తా వైపు వెళుతుండగా కాంగ్రెస్ కార్యాలయం వద్ద నవీన్‌యాదవ్‌కు చెందిన కొందరు మనుషులు అసభ్య పదజాలంతో మాట్లాడారు. దీంతో మాగంటి సునీత.. 'ఇదేం రౌడీయిజం?' అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోసారి పోలీసులు వారిని అక్కడి నుంచి పంపించేశారు. విషయం తెలిసి.. నవీన్‌యాదవ్ తండ్రి చిన్న శ్రీశైలం యాదవ్ కార్యకర్తలతో సహా కాంగ్రెస్ కార్యాలయం వద్దకు చేరుకోవడంతో అక్కడ ఉద్రిక్త వాతావరణం నెలకొంది. చిన్న శ్రీశైలంయాదవ్‌ను పోలీసులు ఇంటికి పంపించేయడంతో పరిస్థితి సద్దుమణిగింది.

ఓటర్లను భయపెడుతున్నారు: సునీత

పోలింగ్ నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ విచ్చలవిడిగా డబ్బులు పంచిందని.. ఓటర్లను భయపెట్టిందని బీఆర్ఎస్ అభ్యర్థి సునీత ఆరోపించారు. నవీన్‌యాదవ్ అనుచరుడు సురేష్‌యాదవ్ తన వైపు వేలు చూపిస్తూ.. 'నీ అంతు చూస్తాం' అని బెదిరించాడని.. 14వ తేదీ తర్వాత అందరి పనీ చెప్తామంటూ హెచ్చరించాడని ఆరోపించారు. వందల మంది ప్రైవేటు సైన్యాన్ని దింపి దొంగ ఓట్లు వేయిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బిర్యానీ పొట్లాలలో డబ్బు పెట్టి ఇస్తున్నారని, నవీన్‌యాదవ్ సోదరుడు వెంకట్ స్వయంగా డబ్బులు పంపిణీ చేశారని ఆరోపించారు. మరోవైపు.. మంగళవారం సాయంత్రం 5 గంటల సమయంలో బీఆర్ఎస్ పార్టీకి చెందిన ఎమ్మెల్సీ శ్రావణ్‌కుమార్, పలువురు బీఆర్ఎస్ నాయకులు.. కాంగ్రెస్ నాయకులు షేక్‌పేట డివిజన్‌లోని అపెక్స్ హైస్కూల్ పోలింగ్ స్టేషన్ వద్ద ఎదురు పడ్డారు. దీంతో ఒక్కసారిగా ఘర్షణ వాతావరణం నెలకొంది. వెంటనే పోలీసులు, కేంద్రబలగాలు లాఠీచార్జ్ చేసి వారిని అక్కణ్నుంచీ తరిమివేశారు. పోలింగ్ సమయం ముగుస్తుండడంతో ఇరు వర్గాలకు చెందిన టేబుళ్లను కూడా తొలగించారు. కాగా.. మంగళవారం సాయంత్రం వరకు పోలింగ్ మందకొడిగా సాగుతుండడంతో ఎంఐఎం నాయకులు ఇంటింటికీ వెళ్లి ప్రతి ఒక్కరూ ఓటు వేయాలంటూ పెద్దఎత్తున జనాలను తీసుకురావడంతో బూత్‌ల వద్ద హడావుడి నెలకొంది. దీంతో రిగ్గింగ్ జరిగిందంటూ కొంతమంది అభ్యంతరం వ్యక్తం చేశారు. అయితే ఎలాంటి రిగ్గింగ్ జరగలేదని.. పోలింగ్ బూత్‌లకు జనం ఒక్కసారిగా రావడంతో హడావుడి నెలకొందని మజ్లిస్ నేతలు తెలిపారు.



నిరసన తెలియజేస్తున్న బీఆర్ఎస్ అభ్యర్థి సునీత

పలువురిపై కేసులు..

ఎన్నికల నియమావళి ఉల్లంఘించి ఓటర్లను ప్రభావితం చేశారనే ఆరోపణలతో మధురానగర్, బోరబండ పోలీస్ స్టేషన్ల పరిధిలో పోలీసులు కేసులు నమోదు చేశారు. ఓటింగ్ రోజు ప్రచారం చేయడంతో వైరా ఎమ్మెల్యే రాందాస్‌పై మధురానగర్ పోలీసులు సుమోటోగా కేసు నమోదు చేశారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సుధీర్‌రెడ్డి, ఎర్రబెల్లి దయాకర్ రావు నిబంధనలకువిరుద్ధంగా ప్రచారం చేయడంతో పోలీసులు సుమోటోగా కేసులు నమోదు చేశారు. కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ బైక్‌లపై తిరుగుతూ ప్రచారం నిర్వహిస్తున్నాడని ఏఆర్‌వో అజారుద్దీన్ చేసిన ఫిర్యాదు మేరకు మధురానగర్ పోలీసులు నవీన్ యాదవ్‌పై కేసు నమోదు చేశారు. బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీత, వద్దిరాజు రవి చంద్ర, పాడి కౌశిక్‌రెడ్డి, పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి తదితరులు మహమూద్ ఫంక్షన్ హాల్ వద్ద రోడ్డుపై కూర్చొని ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించిన నేపథ్యంలో వారిపై కేసులు నమోదు చేశారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు బీర్ల ఐలయ్య, రామచంద్రనాయక్‌లు పోలింగ్ బూత్‌ల వద్ద ఓటర్లను ప్రభావితం చేసేలా ప్రచారం చేస్తున్నారంటూ దినకరపాల్ అనే వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. మాజీ ఎమ్మెల్యేలు దాస్యం వినయ్ భాస్కర్, మెతుకు ఆనంద్‌పై బోరబండ పోలీస్ స్టేషన్‌లో ఒక కేసు నమోదైంది. కాగా.. తమ పార్టీ నాయకులు పాపారావు, అనంతకృష్ణలను పంజగుట్ట పోలీసులు అక్రమంగా అరెస్టు చేసి, వారి ఫోన్లను లాక్కున్నారని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎన్.గౌతంరావు ఆరోపించారు.

హోరాహోరీ!

3,4 డివిజన్లలో కాంగ్రెస్, బీఆర్‌ఎస్ మధ్య నువ్వానేనా అన్నట్లు పోటీ

మెజారిటీలపై పార్టీ నేతల అంచనాలు



హైదరాబాద్ సిటీ, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలు ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్న జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఉప ఎన్నిక పోలింగ్ ప్రక్రియ ముగిసింది. జూబ్లీహిల్స్ పరిధిలో ఆరు డివిజన్లు ఉండగా.. మూడు, నాలుగు డివిజన్లలో ప్రధాన పార్టీల అభ్యర్థుల నడుమ హోరాహోరీ పోరు సాగినట్లు తెలుస్తోంది. ఎర్రగడ్డ, బోరబండ, వెంగళ్‌రావునగర్, షేక్‌పేట్‌లో కాంగ్రెస్, బీఆర్‌ఎస్ మధ్య నువ్వా.. నేనా.. అన్నట్లుగా పోటీ సాగినట్లు కనిపించింది. ఆయా డివిజన్లలో ఓటర్లు సైతం అభ్యర్థులవారీగా విడిపోయి ఓట్లు వేసినట్లు ప్రచారం జరిగింది. తమకు అనుకూలంగా ఉన్న పార్టీకి ఓటేసిన కొందరు నేరుగా చెప్పడంతో అక్కడ ఆ పార్టీకి ఎంత మెజార్టీ వస్తుందనే దానిపై ముఖ్య నాయకులు లెక్కలు వేసుకుంటున్నారు. ఆయా పార్టీల నాయకులు పోలింగ్ బూత్‌ల వద్ద తమ అనుచరులతో రహస్యంగా సర్వే నిర్వహించినా.. ఎవరికి ఓటు వేశామనే విషయాన్ని చాలామంది వెల్లడించలేదు. కొంతమంది నచ్చిన వారికి వేశామని చెప్పడం ఆసక్తికరంగా మారింది. కొందరు మాత్రం ఫలానా అభ్యర్థి ఎమ్మెల్యేగా గెలిస్తే తమ ప్రాంతంలో అభివృద్ధి జరుగుతుందని స్పష్టంగా తెలియజేసిన పరిస్థితి కనిపించింది. ఇప్పుడు ఇక ఓటర్ల పని ముగిసింది. ఇప్పుడు అభ్యర్థుల్లో ఆందోళన 14 తేదీ వరకూ కొనసాగనుంది. బస్తీలు, కాలనీలవారీగా జరిగిన ఓటింగ్ సరళిని అంచనా వేసుకుంటున్న కొంతమంది గెలుస్తామా.. లేదోననే టెన్షన్‌తో సతమతమవుతున్నారు. ఫలానా చోట మనకు మంచి స్పందన ఉందని.. అక్కడ మెజార్టీ ఎక్కువే వస్తుందని అంచనాలు వేసుకుంటున్నారు. ఇతర ప్రాంతాల్లో తగ్గే అవకాశం ఉందని అనుచరులు చెబుతున్న మాటలతో ఆందోళన పడుతున్నారు.

డీఆర్‌సీకి ఈవీఎంలు..

14న కౌంటింగ్

యూసుఫ్‌గూడ కోట్ల విజయభాస్కర్ రెడ్డి స్టేడియంలోని డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్, కౌంటింగ్ (డీఆర్‌సీ) కేంద్రాలకు ఈవీఎంలు చేరాయి. పోలింగ్ ముగిసిన అనంతరం సిబ్బంది కంట్రోల్, బ్యాలెట్ యూనిట్లు, వీవీ ప్యాట్ యంత్రాలను డీఆర్‌సీ కేంద్రాల్లో అందజేశారు. ఈనెల 14వ తేదీన ఉదయం 8 గంటలకు ఓట్ల లెక్కింపు ప్రారంభం కానుంది. 14 టేబుళ్లపై కౌంటింగ్ జరగనుంది.



పోలింగ్ అనంతరం ఈవీఎంలు భద్రపరిచిన యూసుఫ్‌గూడ స్టేడియం వద్ద సందడి..



షేక్‌పేటలో ఓ పోలింగ్ బూత్ వద్ద ఓటు వేసేందుకు క్యూలైన్‌లో నిల్చున్న ఓటర్లు..

పోలింగ్ 50% లోపే

(మొదటిపేజీ తరువాయి)

నమోదైంది. తుది లెక్కల అనంతరం పోలింగ్ శాతంలో మార్పు ఉంటుందని ఎన్నికల విభాగం వర్గాలు చెబుతున్నాయి. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో 47.58 శాతం పోలింగ్ నమోదు కాగా.. ఈసారి దాదాపు ఒక్క శాతం మాత్రమే పెరిగింది. ఉదయం 9 గంటల వరకు మందకొడిగా సాగిన పోలింగ్ అనంతరం కాస్త పుంజుకుంది. ప్రధాన పార్టీల కార్యకర్తలు ఓటర్ల ఇళ్లకు వెళ్లి పోలింగ్‌కు రావాలని కోరడం పలుచోట్ల కనిపించింది. కొన్ని కేంద్రాల్లో మాత్రం నూతన ఓటర్లు, యువత ఓట్లు వేసేందుకు రావడం కనిపించింది. కొన్నిచోట్ల వయోధికులు, దివ్యాంగులు ఓటు వేసేందుకు తరలి వచ్చారు. వారి కోసం పోలింగ్ కేంద్రాల వద్ద వీల్ చెయిర్లు, ఎన్‌సీసీ క్యాడెట్లు, వలంటీర్లను ఏర్పాటు చేశారు. దాదాపు 100 ఆటోలు ఉచిత సేవలందించాయి. వయోధికులు, దివ్యాంగులను ఉచితంగా పోలింగ్ కేంద్రాలకు తీసుకురావడంతోపాటు తిరిగి ఇళ్ల వద్ద వదిలేశారు. పోలింగ్ కేంద్రాలను జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్ సందర్శించారు. పోలింగ్ సరళి, ఏర్పాట్లపై ఆరా తీశారు. డ్రోన్‌ల పనితీరును ప్రత్యక్షంగా పరిశీలించారు. కంట్రోల్ రూమ్‌లో వెబ్ కాస్టింగ్‌ను వీక్షించారు. కేంద్ర ఎన్నికల సంఘం పరిశీలకులూ పోలింగ్ సరళిని పరిశీలించారు. 4.01 లక్షల ఓటర్లున్న జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గంలో 58 మంది అభ్యర్థులు బరిలో నిలిచిన విషయం తెలిసిందే. కాంగ్రెస్ అభ్యర్థిగా నవీన్ యాదవ్, బీఆర్‌ఎస్ తరఫున మాగంటి సునీతా గోపీనాథ్, బీజేపీ అభ్యర్థిగా లంకల దీపక్ రెడ్డి పోటీ చేశారు. అయితే, పోలింగ్ రోజు పరిణామాలను గమనించినా.. పలు సంస్థల ఎగ్జిట్ పోల్స్ పరిశీలించినా.. ప్రధాన పోటీ కాంగ్రెస్, బీఆర్‌ఎస్ మధ్యే ఉన్నట్టు స్పష్టమవుతోంది. ఎన్నికల ఫలితాలు ఈనెల 14వ తేదీన వెలువడనున్నాయి.

నిరసనలు.. ఉద్రిక్తతలు..

కాంగ్రెస్ కార్యకర్తలు దొంగ ఓట్లు వేస్తున్నారంటూ పలు చోట్ల బీఆర్‌ఎస్ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. దీంతో పలు చోట్ల పోలీసులు లాఠీచార్జీ చేశారు. పలువురిని అరెస్టు చేశారు. యూసుఫ్‌గూడలోని మహ్మద్ ఫంక్షన్ హాల్‌లో బయటి వ్యక్తులు ఉన్నారంటూ బీఆర్‌ఎస్ అభ్యర్థి మాగంటి సునీతతోపాటు ఆ పార్టీ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి తదితరులు రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు అక్కడకు చేరుకోవడంతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. దీంతో కౌశిక్ రెడ్డి, సుదర్శన్ రెడ్డి, ఎర్రోళ్ల శ్రీనివాస్, ఇతర నేతలను పోలీసులు అరెస్టు చేశారు. ఇరు వర్గాలను చెదరగొట్టారు. షేక్‌పేట అల్ ఫరాహ్ స్కూల్లోని 66, 67 నంబరు పోలింగ్ కేంద్రాల్లో బూత్ ఏజెంట్లను కాంగ్రెస్ నేతలు బెదిరిస్తున్నారని, పోలీసుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ ఆరోపించారు. ఎర్రగడ్డ డివిజన్ డాన్ బాస్కో స్కూల్‌లోని పోలింగ్ కేంద్రంలో బీఆర్‌ఎస్ ఏజెంట్లను బెదిరించి కొందరు రిగ్గింగ్ చేశారని, రీ పోలింగ్ నిర్వహించాలని బీఆర్‌ఎస్ నేతలు రాగిడి లక్ష్మారెడ్డి, రావుల శ్రీధర్‌రెడ్డి డిమాండ్ చేశారు. షేక్‌పేట అపెక్స్ స్కూల్‌లోని పోలింగ్ కేంద్రాలు 4, 5, 6, 7, 8లో రిగ్గింగ్ చేస్తున్నారంటూ బీఆర్‌ఎస్ నేతలు నిరసన తెలపగా.. పోలీసులు లాఠీచార్జీ చేసి వారిని పంపించేశారు. కృష్ణానగర్‌లోని ఓ పోలింగ్ కేంద్రం వద్ద దొంగ ఓట్లు వేస్తున్నారంటూ బీఆర్‌ఎస్ అభ్యర్థి మాగంటి సునీత ఆందోళన చేశారు. అంతకుముందు ఓ పోలింగ్ బూత్ వద్ద ఆమెను పోలీసులు అడ్డుకున్నారు. దీంతో అభ్యర్థిని లోనికి వెళ్లనివ్వరా..? అంటూ ఆమె వారితో వాగ్వాదానికి దిగారు. అలాగే, పోలింగ్ రోజు జూబ్లీహిల్స్ పరిధిలో ఉన్నారంటూ ఎమ్మెల్యేలు బీర్ల ఐలయ్య, రాంచందర్ నాయక్, మాజీ ఎమ్మెల్యేలు దాస్యం వినయ్‌భాస్కర్, డాక్టర్ మెతుకు ఆనంద్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. తాను జూబ్లీహిల్స్‌లో లేనని, అయినా తనపై కేసు నమోదు చేశారని ఆనంద్ ఆరోపించారు.



ఓటు హక్కు వినియోగించుకున్న కాంగ్రెస్, బీఆర్‌ఎస్, బీజేపీ అభ్యర్థులు

ఓటేసిన ప్రముఖులు

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో ప్రధాన పార్టీల అభ్యర్థులు, పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. వెంకటగిరి ఆల్ఫాన్సొ స్కూల్‌లో కుటుంబ సభ్యులతో కలిసి కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ ఓటు వేశారు. కృష్ణదేవరాయనగర్ పోలింగ్ కేంద్రంలో బీఆర్‌ఎస్ అభ్యర్థి మాగంటి సునీత, కుటుంబ సభ్యులు ఓటు హక్కు వినియోగించుకున్నారు. శ్రీనగర్ కాలనీ శాలివాహనగర్‌లో బీజేపీ అభ్యర్థి లంకల దీపక్‌రెడ్డి ఓటు వేశారు. షేక్‌పేట ఇంటర్నేషనల్ స్కూల్ పోలింగ్ కేంద్రంలో దర్శకుడు రాజమౌళి, మధురానగర్‌లోని శ్రీనిధి విశ్వభారతి స్కూల్ పోలింగ్ కేంద్రంలో హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్, శ్రీనగర్‌కాలనీ మహిళా సమాజం పోలింగ్ కేంద్రంలో సినీ నటుడు గోపీచంద్, బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ భాను ప్రసాద్‌రావు, యూసుఫ్‌గూడ ప్రభుత్వ పాఠశాలలో నటుడు తనికెళ్ల భరణి ఓటు వేశారు. మధురానగర్‌లో ఐపీఎస్ బెన్హర్ దత్, ఐపీఎస్ స్వాతి లక్రా, సినీ దర్శకుడు రేలంగి నర్సింహారావు, వెంగళ్‌రావు నగర్‌లో సినీ రచయిత డాక్టర్ వెనిగళ్ల రాంబాబు దంపతులు ఓటు హక్కు వినియోగించుకున్నారు.



షేక్‌పేటలో ఓటు వేస్తున్న రాజమౌళి

ఓటుకు సిత్రాలెన్నో..



జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో 'ఓటు' సిత్రాలెన్నో చూపింది. ఇంట్లో గొడవల నుంచి అంత కష్టపడి ఓటెందుకు వెయ్యాలనే దాకా ఎన్నో ఘటనలకు వేదికైంది. ఎన్నికల సరళి, ఓటరు నాడిని పరిశీలించేందుకు మంగళవారం జూబ్లీహిల్స్ నియోజకవర్గం పరిధిలో ఆంధ్రజ్యోతి ప్రతినిధి బృందం చేసిన సర్వేలో ఆసక్తికర అంశాలు వెలుగులోకి వచ్చాయి.

భార్యాభర్తల మధ్య ఓటు చిచ్చు..

బోరబండలో ఒక ఓటరును పలకరించగా.. "నేను అధికార పార్టీకి ఓటేశా. నా భార్యను కూడా అదే పార్టీకి వేయాలని అడిగా. ఆమె తాను ప్రతిపక్ష పార్టీకే ఓటు వేస్తానని పట్టుబట్టింది. ఇద్దరి మధ్య గొడవ జరగడంతో.. ఆమె ఓటెయ్యకుండానే, పిల్లలను తీసుకుని తల్లిగారింటికి వెళ్లిపోయింది" అని వాపోయారు.

రెండు పార్టీల దగ్గర డబ్బు తీసుకుని మూడో పార్టీకి ఓటేశా..

తనకు ఒక పార్టీ రూ.2,500, మరొక పార్టీ వాళ్లు రూ.1,000 ఇచ్చారని.. తాను ఆ రెండు పార్టీల దగ్గర డబ్బులు తీసుకుని, మూడో పార్టీకి ఓటేశానని ఒక యువ ఓటరు చెప్పారు. ఓటు కొనేందుకు డబ్బులు ఖర్చు చేసిన నేత తర్వాత అంతకు రెండింతలు సంపాదించాలనే ఉద్దేశంతో అవినీతికి పాల్పడతారని, అందుకే ఇలా చేశానని పేర్కొన్నారు.

మాకు డబ్బులివ్వలే.. ఓటేయలే..

"మా చుట్టుపక్కల వారందరికీ అన్ని పార్టీల వాళ్లు డబ్బులు పంచారు. మాకు ఇవ్వలేదు. రెక్కాడితే గానీ.. డొక్కాడని బతుకులు మావి. అందుకే మా కుటుంబంలోని వాళ్లంతా ఓటు కోసం లైన్లలో నిలబడకుండా పనికి వెళ్లారు" అని పెద్ద వయసున్న ఒక ఓటరు పేర్కొన్నారు.

చీర ఇవ్వలేదని వేరే పార్టీకి..

ఒక మహిళా ఓటరు స్పందిస్తూ.. "నాకు 2 పార్టీల వాళ్లు డబ్బులిచ్చారు. కానీ ఒక పార్టీ వాళ్లు మా పొరుగింటి వారికి చీర కూడా ఇచ్చారు. నాకు ఇవ్వలేదు. దాంతో రెండో పార్టీకి ఓటు వేశా.." అని పేర్కొన్నారు.

వెల్లివిరిసిన మత సామరస్యం!

హనుమాన్ ఆలయంలోని కమ్యూనిటీ హాల్‌లో పోలింగ్ బూత్

ఆలయం బయటే చెప్పులు వదిలి వెళ్లి ఓట్లేసిన ముస్లింలు



హైదరాబాద్, నవంబరు11 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ ఉపఎన్నిక వేళ బోరబండ ప్రాంతంలో మతసామరస్యం వెల్లివిరిసింది. బోరబండ డివిజన్‌లోని కొమరం భీం కమ్యూనిటీ హాల్‌లో అధికారులు ఓ పోలింగ్ బూత్ ఏర్పాటు చేశారు. ఆ బూత్‌కు చేరుకునేందుకు పక్కనే ఉన్న భక్త ఆంజనేయ స్వామి ఆలయం ముఖద్వారం నుంచే వెళ్లాలి. ముఖద్వారం నుంచి లోపలికి వెళ్లి ఆలయం మెట్లు కొన్ని ఎక్కిన తర్వాత ఎడమవైపున ఆ కమ్యూనిటీ హాల్ ఉంటుంది. ఈ పోలింగ్ బూత్‌లో ఓటు ఉన్న వారిలా ముస్లింలు పెద్ద సంఖ్యలో ఉన్నారు. ఓటు వేసేందుకు హనుమాన్ గుడి లోపలికి వెళ్లడం తప్పనిసరి కాగా.. ముస్లింలు ఆలయం ముఖద్వారం వద్దే తమ పాదరక్షలను విడిచి లోపలికి వెళ్లి ఓటు వేసి వచ్చారు. ఇక, కొమరం భీం కమ్యూనిటీ హాల్, పక్కనే ఉన్న జీహెచ్‌ఎంసీ బంజారా నగర్ కమ్యూనిటీ హాల్ పోలింగ్ బూత్‌లకు సంబంధించి ఆలయం ఎదురుగా ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో క్రైస్తవ మహిళలు సేవలు అందించారు. ఈ రెండు ఘటనలు స్థానికుల దృష్టిని ఆకర్షించాయి.

ఓటుందా.. నోటు పట్టు!

పోలింగ్ కేంద్రాల సమీపంలోనే జోరుగా డబ్బుల పంపిణీ

హైదరాబాద్ సిటీ, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): 'ఓటుందా.. నోటు పట్టు.. కచ్చితంగా మా అభ్యర్థికే ఓటెయ్యి..' జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో ఓటేసేందుకు పోలింగ్ కేంద్రానికి బయలుదేరిన వారికి మధ్యలోనే ఎదురైన అనుభవమిది. పలు డివిజన్లలో కొందరు వివిధ పార్టీల నాయకులు పోలింగ్ రోజున కూడా పెద్ద ఎత్తున డబ్బు పంపిణీ చేశారు. పోలింగ్ కేంద్రాలకు సమీపంలో షామియానాలు ఏర్పాటు చేసుకుని కూర్చున్న ప్రధాన పార్టీల అభ్యర్థుల అనుచరులు ఓటర్లతో మాటలు కలిపారు. తమకు ఇప్పటివరకు ఎవరూ డబ్బులు ఇవ్వలేదని కొందరు ఓటర్లు చెప్పడంతో.. కాస్త దూరంలో ఉన్న తమపార్టీ వారి వద్దకు పంపి, ఒక్కో ఓటుకు రూ.3 వేల వరకు అందించడం కనిపించింది. ముఖ్యంగా వెంగళరావునగర్, బోరబండ, ఎర్రగడ్డ, రహమత్‌నగర్, షేక్‌పేట్‌లో ఉదయం 7 నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఇలా డబ్బు పంపిణీ జరిగింది.

ఈ సారే.. మొదటిసారి!

పలు అంశాల్లో జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక రికార్డు

హైదరాబాద్ సిటీ, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ఎన్నికల సంఘం తీసుకున్న కొన్ని నిర్ణయాలు.. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికతోనే తొలిసారిగా అమల్లోకి వచ్చాయి. ఈవీఎంలపై అభ్యర్థుల కలర్ ఫొటోలను మొదటిసారి వినియోగించారు. గతంలో అభ్యర్థుల ఫొటోలు నలుపు, తెలుపు (బ్లాక్ అండ్ వైట్)లోనే ఉండేవి. ఇక రాష్ట్రంలో తొలిసారిగా ఈసారి పోలింగ్ కేంద్రాల వద్ద డ్రోన్ల ద్వారా నిఘా పెట్టారు. జూబ్లీహిల్స్‌లోని 139 ప్రాంతాల్లో 150 డ్రోన్లను వినియోగించి వీడియో రికార్డింగ్ చేశారు. కమాండ్ కంట్రోల్ సెంటర్, జీహెచ్‌ఎంసీ కార్యాలయంలోని కంట్రోల్ రూమ్‌లకు డ్రోన్లను అనుసంధానం చేసి పరిస్థితిని పర్యవేక్షించారు. ఓటర్ల సందేహాల నివృత్తి కోసం ఓటర్ అసిస్టెన్స్ బూత్‌లను ఏర్పాటు చేశారు. ఫోన్లను అక్కడ డిపాజిట్ చేసే అవకాశం కల్పించారు. గతంలో ఓటర్లు బయట తెలిసిన వ్యక్తులకో, సిబ్బందికో ఫోన్లు ఇచ్చి లోనికి వెళ్లాల్సి వచ్చేది.



జూబ్లీహిల్స్ కాంగ్రెస్‌దే!

- హస్తం పార్టీకి 6-8 శాతం ఓట్ల ఆధిక్యం
- తేల్చి చెప్పిన ఎగ్జిట్ పోల్స్

హైదరాబాద్/హైదరాబాద్ సిటీ/పంజాగుట్ట, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో అధికార కాంగ్రెస్ పార్టీకే ఓటర్లు పట్టం కట్టనున్నట్లు ఎగ్జిట్ పోల్స్ సర్వేలు తేల్చాయి. కాంగ్రెస్ అభ్యర్థి నవీన్‌యాదవ్ 6 నుంచి 8 శాతం ఓట్ల ఆధిక్యంతో బీఆర్‌ఎస్ అభ్యర్థిపై విజయం సాధించే అవకాశమున్నట్లు పేర్కొన్నాయి. మంగళవారం సాయంత్రం 6 గంటలకు పోలింగ్ ముగియగానే పలు సర్వే సంస్థలు ఎగ్జిట్ పోల్స్ వివరాలను వెల్లడించాయి. దాదాపు అన్ని సంస్థలు కాంగ్రెస్‌కే జై కొట్టాయి. ప్రముఖ సర్వే సంస్థ ఆరా.. కాంగ్రెస్ పార్టీకి 47.49 శాతం ఓట్లు పోలైనట్లు తెలిపింది. బీఆర్‌ఎస్‌కు 39.25 శాతం ఓట్లు పోలైనట్లు పేర్కొంది. బీజేపీకి 9.31 శాతం, ఇతరులకు 3.95 శాతం ఓట్లు పోలైనట్లు వెల్లడించింది. కాగా, ఆపరేషన్ చాణక్య సంస్థ.. కాంగ్రెస్‌కు 41.1 శాతం ఓట్లు, బీఆర్‌ఎస్‌కు 37.7 శాతం, బీజేపీకి 13.3 శాతం ఓట్లు వస్తాయని పేర్కొంది. పల్స్ టుడే అనే మరో సంస్థ ఎగ్జిట్ పోల్‌లో కాంగ్రెస్‌కు 47 శాతం, బీఆర్‌ఎస్‌కు 44 శాతం ఓట్లు వస్తాయని వెల్లడించింది. కౌటిల్య సంస్థ స్పష్టంగా కాంగ్రెస్సే విజయం సాధిస్తుందని, బీఆర్‌ఎస్ కంటే 6 శాతం ఓట్లు అధికంగా సాధిస్తుందని తెలిపింది. ఇక పబ్లిక్స్ పల్స్ సర్వే సంస్థ కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్‌కు 48.5 శాతం ఓట్లు వస్తాయని, బీఆర్‌ఎస్ అభ్యర్థి మాగంటి సునీతకు 41.8 శాతం వస్తాయని పేర్కొంది. బీజేపీ అభ్యర్థి లంకల దీపక్‌రెడ్డికి 6.5 శాతం ఓట్లు మాత్రమే వస్తాయని తెలిపింది. చాణక్య స్ట్రాటజీస్ కూడా కాంగ్రెస్‌కు 46 శాతం, బీఆర్‌ఎస్‌కు 43 శాతం ఓట్లు పోలైనట్లు, బీజేపీకి 6 శాతం మాత్రమే పోలైనట్లు పేర్కొంది. కాగా, కాంగ్రెస్ 48.31 శాతం, బీఆర్‌ఎస్ 43.18 శాతం, బీజేపీ 5.84 శాతం ఓట్లు వస్తాయని హెచ్‌ఎంఆర్ సర్వే తెలిపింది. అయితే మిషన్ చాణక్య సంస్థ ఒక్కటే బీఆర్‌ఎస్ ఒక శాతం ఓట్ల తేడాతో అధికార కాంగ్రెస్‌పై విజయం సాధిస్తుందని పేర్కొంది. బీఆర్‌ఎస్‌కు 41.60 శాతం ఓటు వస్తాయని, కాంగ్రెస్‌కు 39.43 శాతం ఓట్లు, బీజేపీకి 18.97 శాతం మాత్రమే వస్తాయని తెలిపింది. వాస్తవానికి మొదట్లో కొన్ని సంస్థలు నిర్వహించిన సర్వేల్లో బీఆర్‌ఎస్‌కు ఆధిక్యం ఉంటుందని తేలగా, మరికొన్ని సంస్థలు కాంగ్రెస్‌ది పైచేయి అవుతుందని పేర్కొన్నాయి. అయితే పోలింగ్‌కు రెండు రోజుల ముందు పరిస్థితులు మారిపోయాయని సర్వే సంస్థలు అంచనాకు వచ్చాయి.

పైసలు తీసుకున్నరు.. పత్తాలేరు!

ఓటేసేందుకు గడప దాటని సగంమంది ఓటర్లు.. బస్తీవాసులు ఓటేసినా దిగిరాని అపార్టుమెంట్‌వాసులు

- జూబ్లీహిల్స్‌లో మందకొడిగా పోలింగ్
- ఓటర్లను రప్పించేందుకు బస్తీ, కాలనీ, అపార్టుమెంట్ ముఖ్యుల ఆపసోపాలు
- ఓటేయకపోతే డబ్బు తిరిగివ్వాల్సిందే
- ఆయా పార్టీల బూత్ ఇన్‌చార్జుల హుకుం

హైదరాబాద్, హైదరాబాద్ సిటీ, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): బోరబండ సైట్-3లోని ఓ పోలింగ్ బూత్‌లో దాదాపు వెయ్యి మంది ఓటర్లున్నారు. కానీ, సాయంత్రం 4 గంటల వరకూ 300 ఓట్లు కూడా పోలవ్వలేదు. ఆ పోలింగ్ బూత్ పరిధిలో ఓ పార్టీ 600 మంది ఓటర్లకుపైగా డబ్బులు పంచితే.. మరో పార్టీ కూడా బాగానే పంపిణీ చేసింది. దాంతో, బూత్ ఇన్‌చార్జులు రంగంలోకి దిగారు. పోలైన ఓట్ల జాబితాను ఏజెంట్ ద్వారా తెలుసుకొని డబ్బులు తీసుకున్నవారు అత్యధికులు ఓటేసేందుకు రాలేదని గుర్తించారు. డబ్బులిప్పించిన బస్తీ ముఖ్యులకు ఫోన్ చేసి ఓటర్లు రాలేదని, ఓటు వేయకపోతే తీసుకున్న డబ్బులు తిరిగి ఇవ్వాల్సి వస్తుందని హెచ్చరించారు. వారితో తొందరగా ఓటు వేయించాలని హుకుం జారీ చేశారు. మధుర నగర్‌లో పార్టీలు అపార్టుమెంట్లవారీగా డబ్బులు పంపిణీ చేశాయి. అక్కడి పోలింగ్ బూత్‌ల్లో మధ్యాహ్నం మూడు గంటల వరకూ 30 శాతమే పోలింగ్ జరిగింది. దాంతో, ఆయా పార్టీల బూత్ ఇన్‌చార్జులు డబ్బులు పంపిణీ చేసిన అపార్ట్‌మెంట్ల ముఖ్యులకు ఫోన్లు చేశారు. డబ్బులు తీసుకున్న వారంతా ఓటేసేలా చూడాలని, ఓటు వేయించే బాధ్యత మీదేనని స్పష్టం చేశారు. దాంతో వారు అపార్టుమెంట్లలోని వారికి ఫోన్లు చేసి.. ఓటేసి రావాలని, లేకుంటే ముందుముందు ఇబ్బంది ఉంటుందని హెచ్చరించారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికను అన్ని పార్టీలూ ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నాయి. ఆయా పార్టీల నాయకులు దీనిపైనే పూర్తిస్థాయిలో దృష్టి పెట్టి పని చేశారు. ఇతర జిల్లాల నుంచి నాయకులను రప్పించారు. లిఫ్టులు లేకపోవడం.. పని చేయకపోవడంతో కొన్నిచోట్ల ఆయా పార్టీల నాయకుల ఐదంతస్తులను కూడా ఎక్కి.. దిగి.. ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. ఓటు హక్కును వినియోగించుకోవాలని ఎన్నికల సంఘమూ కోరింది. మొబైల్స్ భద్రపరిచేందుకు ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేసింది. ఓటింగ్ శాతం పెంచడానికి మరో గంట సమయం అదనంగా పెంచారు. కొందరు ఉచిత ఆటోలు పెట్టారు. చివరికి, మూడు పార్టీలూ ఓటర్లలో 80 శాతం మందికి రూ.500 నుంచి రూ.5000 వరకూ పంపిణీ చేశాయి. ఎన్నికను పార్టీలు, నాయకులు ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నా.. ఎవరెన్ని ఆపసోపాలు పడినా.. ఇక్కడి ఓటర్లు మాత్రం ఎప్పట్లాగే పట్టించుకోలేదు. గడప కూడా దాటలేదు. ఉప ఎన్నిక కనక పోలింగ్ 70-80 శాతం అవుతుందని భావించినా.. చివరకు 50 శాతం కూడా దాటలేదు. 2023 అసెంబ్లీ ఎన్నికలతో పోల్చి చూసినా.. కేవలం 1.2 శాతం మాత్రమే ఓటింగ్ పెరిగింది. అంతేనా.. దేశవ్యాప్తంగా మంగళవారం ఏడుచోట్ల ఉప ఎన్నికలు జరిగితే.. జూబ్లీహిల్స్‌లోనే అత్యల్ప పోలింగ్ శాతం నమోదైంది. నియోజకవర్గంలో నాలుగు లక్షల మందికిపైగా ఓటర్లుంటే.. సగం మంది కూడా పోలింగ్ బూత్‌లకు రాలేదు. బస్తీల్లో మినహా మిగిలిన అన్నిచోట్లా పోలింగ్ మందకొడిగానే సాగింది. గతంలో ఎప్పుడూ లేని విధంగా ఈసారి ఉప ఎన్నికల్లో రూ.100 కోట్లు పంపిణీ చేశాయని కథనాలూ వచ్చాయి. సాధారణంగా ఓటుకు డబ్బులు తీసుకున్న వాళ్లు పోలింగ్ బూత్‌కు తరలి వస్తారని, జూబ్లీహిల్స్ ఓటర్లు కాస్త భిన్నమని, పైసలు తీసుకున్న వారిలో అత్యధికులు కూడా పత్తా లేకుండా పోయారని ఆయా పార్టీల నాయకులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేసిన పరిస్థితి. పట్టు చీరలు తీసుకెళ్లిన మహిళలు కూడా ఓటు వేసేందుకు రాలేదని కొన్నిచోట్ల బూత్ ఇన్‌చార్జులు ఆవేదన వ్యక్తం చేశారు.



బోరబండలోని ఓ పోలింగ్‌బూత్‌లో ఓటు వేసేందుకు క్యూలైన్‌లో మహిళలు

బాబ్బాబు... ఓటేద్దురు రండి!

మంగళవారం మధ్యాహ్నం 12 గంటలు అయినా ఓటర్లు ఓటు వేసేందుకు రాకపోవడాన్ని గుర్తించిన బూత్ ఇన్‌చార్జులు బస్తీ, అపార్టుమెంట్ ముఖ్యులకు ఫోన్లు చేశారు. దాంతో వారంతా అపార్టుమెంట్లు, ఇండ్ల బాట పట్టారు. 'అమ్మా... ఓటేయటానికి రండి! అన్నా.. ఓటేద్దురు రండి!' అంటూ బతిమాలిన దృశ్యాలు వెంగళరావునగర్, రహమత్‌నగర్, షేక్‌పేట్, యూసుఫ్‌గూడ, బోరబండ, ఎర్రగడ్డ డివిజన్లలో కనిపించాయి. ఓటర్లను పోలింగ్ బూత్‌లకు తీసుకురావడానికి బస్తీ, కాలనీ, అపార్ట్‌మెంట్ల ముఖ్యులు ఆపసోపాలు పడ్డారు. చివరికి, బస్తీల్లో 60-70 శాతం ఓటింగ్ జరిగినా.. మధ్యతరగతి ఎక్కువగా ఉండే అపార్టుమెంట్లలో మాత్రం 35 శాతం కూడా దాటలేదని చెబుతున్నారు. నిజానికి, డబ్బులు, పట్టు చీరలు పంపిణీ చేసే సమయంలో బూత్‌లవారీగా ఓటరు ఐడీ, పోలింగ్ చిట్టీ పరిశీలించి పంపిణీ చేశారు. దాంతో, డబ్బులు తీసుకున్నవారు రాలేదని గుర్తించారు. ఉదాహరణకు, రాజీవ్‌గాంధీ నగర్‌లోని ఓ అపార్ట్‌మెంట్‌లో 30 కుటుంబాలున్నాయి. వాటిలో 25 కుటుంబాలు డబ్బులు తీసుకున్నాయి. కానీ, 12 కుటుంబాలు మాత్రమే ఓటేసినట్లు తేల్చారు. 'పైసలైతే తీసుకున్నరు.. పోలింగ్ బూత్‌లకు రమ్మంటే పత్తాలేరు' అని బూత్ ఇన్‌చార్జులు వాపోయారు. డబ్బులు తీసుకొని ఓటెయ్యని వారి నుంచి తిరిగి వసూలు చేస్తామని, ఆ వివరాలు తమ దగ్గర ఉన్నాయని ఎర్రగడ్డలోని ఓ బూత్ ఇన్‌చార్జి 'ఆంధ్రజ్యోతి'తో అన్నారు.

ఆఫీసులకు సెలవు లేకపోవడం కూడా..

ఉప ఎన్నిక సందర్భంగా నియోజకవర్గంలోని ప్రభుత్వ, ప్రైవేటు ఆఫీసులకు, విద్యా సంస్థలకు మాత్రమే సెలవిచ్చారు. కానీ, ఇక్కడ నివసించే చాలామంది ఉద్యోగులు నగరంలోని ఇతర ప్రాంతాల్లో పని చేస్తున్నారు. దాంతో, వారు యథావిధిగా ఆఫీసులకు వెళ్లారు. ఓటింగ్ శాతం పెరగకపోవడానికి ఇదొక కారణంగా చెబుతున్నారు. యూసుఫ్‌గూడలో నివసించే ఆరుగురు కార్మికులు ఐడీఎల్ బొల్లారంలోని ఓ పరిశ్రమలో పని చేస్తారు. మంగళవారం జనరల్ షిఫ్టు కావడం ఉదయం ఓటేసేందుకు సమయం లేక, సాయంత్రం వచ్చి వేద్దామని అనుకున్నారు. అయితే, వచ్చేసరికి సమయం అయిపోయిందని పలువురు వాపోయారు. విచిత్రమేమిటంటే..ఇక్కడి ఓటర్లలో స్పందన లేకపోయినా.. స్థానికేతరుల హవా చివరి రోజు కూడా కనిపించింది.

జూబ్లీహిల్స్ అసెంబ్లీ ఎన్నికల్లో పోలింగ్ శాతం ఇలా..

2009	2014	2018	2023	2025
52.78	50.18	45.59	47.49	48.42



వాహనం బోల్తా పడటంతో చెల్లాచెదురైన పాఠ్యపుస్తకాలు

వాహనం బోల్తా పడి విద్యార్థులకు తీవ్ర గాయాలు

- పాఠ్యపుస్తకాలు తీసుకొచ్చేందుకు వెళ్లిన విద్యార్థులు
- ప్రధానోపాధ్యాయుడి సస్పెన్షన్ : డీఈవో

నాగర్‌కర్నూల్/పెద్దకొత్తపల్లి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): పాఠ్యపుస్తకాలను తరలిస్తున్న బొలేరో వాహనం బోల్తా పడి నలుగురు విద్యార్థులు తీవ్రంగా గాయపడగా, వారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. ఈ ఘటన నాగర్‌కర్నూల్ జిల్లా పెద్ద కొత్తపల్లి మండలంలో మంగళవారం చోటుచేసుకుంది. సాతాపూర్ జిల్లా ఉన్నత పాఠశాలకు చెందిన ఐదుగురు విద్యార్థులు ప్రధానోపాధ్యాయుడు శ్రీశైలం ఆదేశాల మేరకు పుస్తకాలను తరలించడానికి పెద్దకొత్తపల్లిలోని మండల విద్యా వనరుల కేంద్రానికి వెళ్లారు. తిరిగి వస్తున్న క్రమంలో జొన్నల బొగడ-బాచారం బస్సు స్టేజీ మధ్య వారు ప్రయాణిస్తున్న వాహనం బోల్తా పడగా, అందు లో ఉన్న నలుగురు విద్యార్థులు గాయపడ్డారు. శివ అనే విద్యార్థి పరిస్థితి విషమంగా ఉండటంతో హైదరాబాద్‌లోని నిమ్స్‌కు తరలించారు. మిగతావారిని చికిత్స నిమిత్తం నాగర్‌కర్నూల్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. విద్యార్థులతో పనులు చేయిస్తూ ప్రమాదానికి కారణమైన ప్రధానోపాధ్యాయుడు శ్రీశైలంను సస్పెండ్ చేసినట్లు డీఈవో రమేష్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు.

గొడుగుపల్లి అడవిలో చిరుత మృతి

- న్యూమోనియాతో మరణించినట్టు అనుమానం



మృతి చెందిన చిరుత పులి

దౌల్తాబాద్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట జిల్లా దౌల్తాబాద్ మండలంలోని గొడుగుపల్లి అటవీ ప్రాంతంలో అనారోగ్యంతో కదల్లేని స్థితిలో కనిపించిన చిరుతపులి మంగళవారం మృతి చెందింది. సోమవారం మధ్యాహ్నం గొడుగుపల్లికి చెందిన భిక్షపతి అనే రైతు తన పొలం వద్దకు పశువులను మేపడానికి తీసుకెళ్తుండగా, పొదల్లో దాగి ఉన్న చిరుతపులి ఒక్కసారిగా దాడికి యత్నించింది. రైతు భయంతో కేకలు వేయడంతో పొదల్లోకి చేరింది. సమాచారం అందుకున్న అటవీ అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని చిరుతను పరిశీలించారు. ఆ సమయంలో చిరుత అటూ ఇటూ కదలడం తప్ప లేచి పరుగు పెట్టలేని స్థితిలో ఉన్నట్లు గుర్తించారు. అయితే, మంగళవారం ఉదయం 7:30 గంటల సమయంలో ఆ చిరుత మృతిచెంది కనిపించింది. జిల్లా వెటర్నరీ అధికారి సంఘటనా స్థలానికి చేరుకుని శవపరీక్షలు నిర్వహించారు. న్యుమోనియా సోకడం వల్లే చిరుత మృతి చెంది ఉండవచ్చని డీఎఫ్‌వో కంప శ్రీనివాస్ అనుమానం వ్యక్తం చేశారు. మృతికి గల కచ్చితమైన కారణాలు తెలుసుకోవడానికి చిరుతపులి కళేబరంలోని కొన్ని కీలక భాగాలను ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపినట్లు ఆయన చెప్పారు.

ఆస్తులు పంచుకున్నారు కానీ.. తల్లిదండ్రులకు తిండి పెట్టడంలేదు

- ఇదేమిటని అడిగితే తండ్రిపై కొడుకుల దాడి
- న్యాయం చేయాలని వృద్ధ దంపతుల వేడుకోలు



వృద్ధ దంపతులు మిట్టపల్లి లక్ష్మి-వెంకటయ్య

అక్కన్నపేట, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): వృద్ధాప్యంలో ఆదరవుగా ఉంటారని నమ్మి ఆస్తి పంచి ఇస్తే, నేడు తమ బిడ్డలు కనీసం పట్టించుకోవడంలేదని సిద్దిపేట జిల్లాకు చెందిన వృద్ధ దంపతులు వాపోయారు. తిండిపెట్టకుండా ఇబ్బందులకు గురిచేస్తూ, ఇదేంటని ప్రశ్నిస్తే తండ్రిపైనే దాడి చేసిన ఘటన సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండల కేంద్రంలో ఆలస్యంగా వెలుగు చూసింది. మండల కేంద్రానికి చెందిన మిట్టపల్లి లక్ష్మి-వెంకటయ్య దంపతులకు సత్యనారాయణ, సదయ్య అనే ఇద్దరు కుమారులు ఉన్నారు. ఎంతో కష్టపడి వారిని ప్రయోజకుల్ని చేసి పెళ్లిళ్లు జరిపించిన తండ్రి, తను సంపాదించిన 8 ఎకరాల వ్యవసాయ భూమిని ఇద్దరికీ మూడు ఎకరాల చొప్పున పంచాడు. మిగతా రెండు ఎకరాలు తన పేరు మీద ఉంచుకున్నప్పటికీ, ఆ భూమిని సైతం కుమారులు అమ్మేశారు. తనకు తుంటి విరిగి అనారోగ్యం బారిన పడినా పట్టించుకోలేదని, చివరకు చేసేది లేక భార్య మెడలో బంగారం తాకట్టు పెట్టి ఆపరేషన్ చేయించాల్సిన దుస్థితి వచ్చిందని వెంకటయ్య ఆవేదన వ్యక్తం చేశాడు. చిన్న కుమారుడు పోస్టాఫీసులో ఉద్యోగం చేస్తుండడంతో ప్రభుత్వం నుంచి పింఛను కూడా రావడం లేదన్నాడు. కొడుకులు పంచుకున్న భూమిని తిరిగి తమ పేర్ల మీదకు మార్చాలని హుస్నాబాద్ ఆర్డీవో నుంచి నోటీసులు అందించినా పట్టించుకోవలేదని, ఇప్పటికైనా అధికారులు స్పందించి న్యాయం చేయాలని వృద్ధ దంపతులు కోరుతున్నారు.

భద్రాద్రిలో 'జై శ్రీరామ్' ఇటుకలు

- భక్తుల చేతుల మీదుగా తయారీకి చర్యలు



జైశ్రీరామ్ అచ్చుతో తయారు చేసిన ఇటుకలు

భద్రాచలం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): దక్షిణ అయోధ్య భద్రాచలంలో 'జై శ్రీరామ్' నామం అచ్చు కలిగిన ఇటుకల తయారీకి అధికారులు ఏర్పాట్లు చేశారు. ఇందుకోసం బెంగళూరు నుంచి ప్రత్యేకంగా మోల్డ్‌లను తెప్పించారు. భద్రాద్రి కొత్తగూడెం కలెక్టర్ జితేష్ వి పాటిల్ మంగళవారం ఆ మోల్డ్‌లను పరిశీలించి నమూనా ఇటుకలను భక్తులతో తయారు చేయించారు. శ్రీరాముడి దర్శనానికి వచ్చే భక్తుల్లో ఆసక్తి కలిగిన వారితో, ఇటుకలను కొనుగోలు చేసే భక్తులతో ఈ ఇటుకలను తయారు చేయించేలా కార్యాచరణ రూపొందించడంపై దేవస్థానం ఈవో దామోదర్‌రావుతో చర్చించారు.

ప్రైవేటు ట్రావెల్స్ బస్సు దగ్ధం

హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై ఘటన.. షార్ట్ సర్క్యూట్ వల్లే ప్రమాదం

- డ్రైవర్ అప్రమత్తతతో తప్పిన భారీ ప్రాణనష్టం
- భావోద్వేగంతో ప్రయాణికులు కన్నీటి పర్యంతం
- చౌటుప్పల్ నుంచి వచ్చిన మంటలార్పిన ఫైరింజన్లు



దగ్ధమవుతున్న ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులో మంటలార్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

చిట్యాల రూరల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): వికారాబాద్ జిల్లాలో బస్సును ఢీకొట్టిన టిప్పర్.. ఏపీలో బస్సు దగ్ధం ఘటనలు మరువక ముందే హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై నల్లగొండ జిల్లా చిట్యాల మండలం వెలిమినేడు శివారులో సోమవారం అర్ధరాత్రి తర్వాత జరిగిన బస్సు ప్రమాదం గుగుర్పాటుకు గురి చేసింది. హైదరాబాద్ నుంచి నెల్లూరు జిల్లా కొండాపురానికి వెళుతున్న ప్రైవేటు ట్రావెల్స్ బస్సులో షార్ట్ సర్క్యూట్‌తో ఇంజన్‌లో మంటలు చెలరేగాయి. ప్రమాదాన్ని గుర్తించిన బస్సు డ్రైవర్ కృష్ణ కేకలేసి ప్రయాణికులను అప్రమత్తం చేశారు. నాన్ ఏసీ బస్సు కావడంతోపాటు తెరిచిన కిటికీల నుంచి, వెనుకవైపు డోర్ నుంచి ప్రయాణికులు త్వరత్వరగా బయటకు రావడంతో ప్రాణాలు దక్కించుకున్నారు. వారు చూస్తుండగానే బస్సు పూర్తిగా దగ్ధమైంది. ఇంజన్‌లో షార్ట్ సర్క్యూట్ అయినా డీజిల్ ట్యాంకుకు మంటలంటుకోకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. హైదరాబాద్‌లోని బీరంగూడ నుంచి ఇద్దరు డ్రైవర్లు, 29 మంది ప్రయాణికులతో ఎన్ఎల్01బీ 3250 నంబరు బస్సు సోమవారం రాత్రి 11 గంటలకు బయలుదేరింది. రాత్రి వేళ కావడంతో డ్రైవర్ కృష్ణ యాదాద్రి-భువనగిరి జిల్లా చౌటుప్పల్ శివారులో 20 నిమిషాలు బస్సును నిలిపాడు. ఆయనతోపాటు కొందరు ప్రయాణికులు టీ తాగాక బస్సు బయలు దేరింది. చిట్యాల మండలం వెలిమినేడు శివారులోని పిట్టంపల్లి క్రాస్ రోడ్డు వద్ద ఇంజన్ నుంచి పొగ, మంటలు వస్తుండటంతో డ్రైవర్ అప్రమత్తమయ్యాడు. బస్సులో మంటలొస్తున్నాయని ప్రయాణికులంతా కిందకు దిగాలని కేకలేశాడు. అంతకు ముందే టీ తాగడానికి బస్సు ఆపడంతో మెళకువగా ఉన్న ప్రయాణికులు.. డ్రైవర్ కేకలతో 2 నిమిషాల్లో వెనుక ద్వారం, కిటికీల నుంచి కిందకు దిగారు. అయినా లోపలెవరైనా ఉన్నారా? అని ప్రయాణికులు వేస్తున్న కేకలతో స్లీపర్ సీటులో నిద్రిస్తున్న ప్రయాణికుడు లేచి.. దిగడానికి ప్రయత్నిస్తుండగానే ఓ ప్రయాణికురాలు అతని చేతిని పట్టుకుని కిందకు లాగేశారు. బస్సు పేలిపోయే ప్రమాదం ఉందని, దూరంగా వెళ్లాలని డ్రైవర్ హెచ్చరించాడు. తాము చూస్తుండగానే బస్సు దగ్ధమవుతున్న దృశ్యాలను చూస్తూ.. ఇది కలా.. నిజమా..? అని, దిగకుంటే తమ పరిస్థితేమిటని భావోద్వేగంతో కన్నీటి పర్యంతమయ్యారు. బస్సులో అసలు రక్షణ చర్యల్లేవని, అగ్ని ప్రమాద నివారణకు జాగ్రత్తలు తీసుకోలేదని ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వారు ఇచ్చిన సమాచారంతోనే చౌటుప్పల్ నుంచి వచ్చిన 2 అగ్నిమాపక శకటాలు మంటలను ఆర్పేశాయి. ప్రమాద సంగతి తెలియగానే నార్కట్‌పల్లి సీఐ కె.నాగరాజు, చిట్యాల ఏఎస్ఐ వెంకటయ్య ఆధ్వర్యంలో ఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు సహాయక చర్యలు చేపట్టారు. ప్రమాద నేపథ్యంలో ఆ అర్ధరాత్రి.. రహదారిపై వెళ్లే ఇతర వాహనాల్లో సొంతూళ్లకు బయలు దేరగా, సీఐతోపాటు పోలీసులు కూడా వారికి సహకరించారు. విహారి ట్రావెల్స్ పేరిట నెల్లూరు - హైదరాబాద్ మధ్య రాకపోకలు సాగిస్తున్న ఈ బస్సును నాగాలాండ్‌లో రిజిస్ట్రేషన్ (ఎన్ఎల్01బీ3250) చేశారు. బస్సు యజమాని పేరు కడిమళ్ల శరత్ కాగా, హైదరాబాద్‌లో ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించినందుకు రూ.8,605 జరిమాన చెల్లించాల్సి ఉంది.

మంటలను గమనించి అప్రమత్తం చేశా

'చౌటుప్పల్ శివారులో టీ బ్రేక్ తర్వాత బయలు దేరిన 20 నిమిషాలకు మంటలు రావడం గమనించా. 2 నిమిషాల్లోనే అందరిని అప్రమత్తం చేశాను. ప్రయాణికులందరూ సురక్షితంగా కిందికి దిగారు' అని డ్రైవర్ కృష్ణ తెలిపారు.



నెల్లూరులో బైకులను ఢీకొట్టిన తర్వాత రోడ్డు పక్కకు దూసుకెళ్లిన లారీ

అదుపుతప్పి బైకులను ఢీకొన్న లారీ

- ముగ్గురి మృతి, నలుగురికి గాయాలు
- ఏపీలోని నెల్లూరులో ఘటన

నెల్లూరు(క్రైం)/విజయవాడ/రేణిగుంట, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): ఓ మినీ లారీ కంటైనర్ డ్రైవర్ మితిమీరిన వేగం, ఓ యువకుడి నిర్లక్ష్యం ముగ్గురి ప్రాణాలు తీసుకుంది. నెల్లూరులోని జాతీయ రహదారిపై స్థానిక ఎన్టీఆర్ నగర్ వద్ద అతి వేగంగా వస్తున్న లారీ యూటర్న్ తీసుకుంటున్న బైకర్‌ను తప్పించే క్రమంలో ప్రమాదం జరిగింది. పోలీసుల కథనం మేరకు.. తిరుపతి జిల్లా సూళ్లూరుపేటలో చేపలు అన్‌లోడ్ చేసిన మినీ లారీ కంటైనర్ నెల్లూరుకు బయలుదేరింది. నెల్లూరు ఎస్వీజీఎస్ కళాశాల మైదానం సమీపంలోకి రాగానే వేగంగా వస్తున్న ఓ యువకుడు బైక్‌ను యూటర్న్ తీసుకోవడంతో.. లారీ డ్రైవర్ వేగాన్ని నియంత్రించలేక ఆ బైక్‌ను ఢీకొట్టాడు. అంతేకాక మరో రెండు బైక్‌లను ఢీకొట్టి, రోడ్డుపక్కన ఉన్న చిరువ్యాపారులపైకి దూసుకెళ్లి, ఆ తర్వాత ఓ చెట్టును ఢీకొని ఆగింది. ఈ ప్రమాదంలో బైక్‌లపై వెళ్తున్న అల్లీపురంలోని సిరిగార్డెన్‌కు చెందిన తండ్రి కుమారులైన రిటైర్డ్ పీఈటీ షేక్ ఖాజానాజీం మొహిద్దీన్(70), సచివాలయ ఉద్యోగి ముజాహీద్ ఆలీ(35)తో పాటు ఏసు రేష్(35) అనే వ్యక్తి మృతిచెందారు. రోడ్డుపక్కనే చిరువ్యాపారం చేసుకుంటున్న మంజుల, మాలకొండయ్యతో పాటు అనీల్, కోటి అనే మరో ఇద్దరు గాయపడ్డారు. వీరు నెల్లూరు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఘటనా స్థలాన్ని ఎస్పీ అజిత వేజెండ్ల పరిశీలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మరో రూ.1000 కోట్ల అప్పు

హైదరాబాద్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం తాజాగా మరో రూ.1000 కోట్ల అప్పు తీసుకుంది. ఆర్బీఐ మంగళవారం నిర్వహించిన ఈ-వేలం ద్వారా తెలంగాణ సర్కారు ఈ రుణాన్ని సేకరించింది. 7.44 శాతం వార్షిక వడ్డీతోపాటు 31 ఏళ్ల కాల పరిమితితో ఈ రుణాన్ని తీసుకున్నది. రాష్ట్రంతోపాటు తొమ్మిది రాష్ట్రాలు రూ.15,560 కోట్ల రుణాలు తీసుకున్నాయి.

అక్రమాస్తుల కేసులో.. 21న కోర్టుకు జగన్

- ప్రత్యేక న్యాయస్థానంలో వెల్లడి
- హాజరు మినహాయింపును తీవ్రంగా వ్యతిరేకించిన సీబీఐ
- మెమో ఉపసంహరించుకున్న మాజీ సీఎం
- హాజరుకు 21దాకా గడువిచ్చిన కోర్టు
- ఆరేళ్ల తర్వాత కోర్టు మెట్లు ఎక్కనున్న వైనం

హైదరాబాద్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): అక్రమాస్తుల కేసులో బెయిల్‌పై ఉన్న మాజీ సీఎం, వైసీపీ అధినేత వైఎస్ జగన్ ఈ నెల 21న సీబీఐ ప్రత్యేక కోర్టు ముందు హాజరు కానున్నారు. వ్యక్తిగత హాజరు మినహాయింపు కోరుతూ ఆయన దాఖలు చేసిన మెమోపై సీబీఐ మంగళవారం కౌంటర్ దాఖలు చేసింది. యూరప్ పర్యటన అనంతరం కోర్టులో వ్యక్తిగతంగా హాజరు కావాలని నాంపల్లి ప్రత్యేక న్యాయస్థానం గతంలో ఇచ్చిన ఉత్తర్వులను అమలు చేయాలని గట్టిగా కోరింది. తీవ్ర ఆర్థిక నేరారోపణలను ఎదుర్కొంటున్న జగన్.. ఆరేళ్లుగా ట్రయల్ కోర్టుకు రాకుండా తప్పించుకుని తిరుగుతున్నారని తెలిపింది. ఈ కేసులకు సంబంధించి డిశ్చార్జి పిటిషన్లపై రోజువారీ విచారణ జరుగుతున్నందున జగన్ ప్రత్యక్షంగా కోర్టుకు హాజరవడంలో తప్పేమీ లేదని పేర్కొంది. దీంతో గత్యంతరం లేక వ్యక్తిగత హాజరు మినహాయింపు కోరుతూ దాఖలు చేసిన మెమోను జగన్ తరఫు న్యాయవాది వెనక్కి తీసుకున్నారు. మరి కొద్ది రోజులు సమయం ఇస్తే మాజీ సీఎం వ్యక్తిగతంగా కోర్టులో హాజరవుతారని తెలిపారు. ఈ నెల 21వ తేదీ వరకు కోర్టు సమయం ఇవ్వగా.. అదే రోజున న్యాయస్థానానికి జగన్ వస్తారని న్యాయవాది వెల్లడించారు. దీంతో ఆరేళ్ల తర్వాత ఆయన కోర్టు మెట్లు ఎక్కనున్నారు.

జగన్ పిల్లిమొగ్గలు...


జగన్ అభ్యర్థనతో గత నెలలో ఆయన యూరప్ పర్యటనకు వెళ్లేందుకు సీబీఐ ప్రత్యేక కోర్టు అనుమతి ఇవ్వడం తెలిసిందే. తిరిగొచ్చిన తర్వాత ఈ నెల 14వ తేదీ లోపు కోర్టులో వ్యక్తిగతంగా హాజరు కావాలని ఉత్తర్వుల్లో స్పష్టంగా ఆదేశించింది. అందుకు అంగీకరించి యూరప్ వెళ్లిన మాజీ సీఎం.. స్వదేశానికి వచ్చాక మాత్రం పిల్లిమొగ్గలు వేశారు. రకరకాల కారణాలు చెబుతూ.. హాజరు నుంచి మినహాయింపు కావాలని కోర్టులో మెమో దాఖలు చేశారు. తాను న్యాయస్థానానికి వస్తే తగిన ఏర్పాట్లు చేయడానికి ప్రభుత్వ యంత్రాంగానికి భారమవుతుందని, ఆన్‌లైన్‌లో విచారణకు హాజరవుతానని కోర్టును కోరారు. సీబీఐ అందుకు అంగీకరించకపోవడంతో వేరే మార్గం లేక ప్రత్యక్షంగా న్యాయస్థానంలో హాజరవుతానని తెలిపారు. అక్రమాస్తుల కేసులో సీబీఐ 2012 మే 27న జగన్‌ను అరెస్టు చేసింది. సుమారు 16 నెలలు ఆయన జైలులో ఉన్నారు. 2013 సెప్టెంబరు 23న ప్రత్యేక కోర్టు బెయిల్ మంజూరు చేయగా.. 24వ తేదీన ఆయన జైలు నుంచి విడుదలయ్యారు. అప్పటి నుంచి ఈ కేసుల్లో పన్నెండేళ్లుగా జగన్ బెయిల్‌పైనే ఉన్న సంగతి తెలిసిందే.

ఛత్తీస్‌గఢ్‌లో ఎన్‌కౌంటర్..

ఆరుగురు మావోయిస్టుల మృతి

మృతుల్లో ఇంద్రావతి నేషనల్ పార్కు ఏరియా కమిటీ ఇన్‌చార్జి బుచ్చన్న.. పాపారావు భార్య ఊర్మిళ?

- తప్పించుకున్న మద్దేడు ఏరియా కమిటీ కమాండ్ పాపారావు?
- తప్పించుకున్న వారికోసం గాలింపు: బస్తర్ ఐజీ సుందర్ రాజ్



చర్ల/చింతూరు, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లా ఇంద్రావతి నేషనల్ పార్కు అడవుల్లో మంగళవారం ఉదయం మావోయిస్టులు, కేంద్ర బలగాలకు మధ్య జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఆరుగురు మావోయిస్టులు మృతి చెందారు. నేషనల్‌పార్క్ అటవీ ప్రాంతంలో దాదాపు 25మంది మావోయిస్టులు సంచరిస్తున్నారన్న సమాచారంతో బీజాపూర్, దంతెవాడ జిల్లాలకు చెందిన డీఆర్‌జీ, ఎస్టీఎఫ్ బలగాలు మంగళవారం సంయుక్త ఆపరేషన్ చేపట్టాయి. ఈ క్రమంలోనే ఎన్‌కౌంటర్ జరిగింది. మృతుల్లో మోస్ట్ వాంటెడ్, మద్దేడు ఏరియా కమిటీ కమాండర్ పాపారావు భార్య ఊర్మిళ, నేషనల్ పార్కు ఏరియా కమిటీ ఇన్‌చార్జి బుచ్చన్న ఉన్నట్లు తెలుస్తోంది. ఊర్మిళ మద్దేడు ఏరియా కమిటీ సభ్యురాలుగా పనిచేస్తున్నట్టు సమాచారం. ఈ ఘటనలో పాపారావు తప్పించుకొన్నట్లు తెలుస్తోంది. ఈ ఎన్‌కౌంటర్‌తో దక్షిణ బస్తర్ ప్రాంతంలోని నేషనల్ పార్క్ పరిధిలో ఉన్న ఎయిడెడ్ కమిటీ దాదాపుగా తుడుచుపెట్టుకుపోయిందని పోలీసులు చెబుతున్నారు. ఎన్‌కౌంటర్‌లో చనిపోయిన మావోయిస్టుల్లో ముగ్గురు మహిళలున్నారు. పోలీసులు ఘటనా స్థలం నుంచి పలు తుపాకులు, స్టెన్‌గన్, ఇన్సాస్ పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు. ఎన్‌కౌంటర్‌లో తప్పించుకున్న మావోయిస్టుల కోసం అదనపు బలగాలను పంపించామని, కూంబింగ్ ముగిసిన తరువాత పూర్తి వివరాలు వెల్లడిస్తామని బస్తర్ ఐజీ సుందర్ రాజ్ తెలిపారు. కొద్ది రోజుల క్రితం ఆశన్నతో కలిసి పలువురు మావోయిస్టులు లొంగిపోయారు. వీరంతా నేషనల్ పార్కు అడవుల నుంచి వచ్చారు. వారిచ్చిన సమాచారం ఆధారంగానే బలగాలు ఈ ఆపరేషన్ చేపట్టినట్లు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. మరోవైపు, బీజాపూర్ జిల్లా తార్లగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలోని అన్నారం అడవుల్లోనూ మంగళవారం మావోయిస్టులు, పోలీసు బలగాల మధ్య ఎదురు కాల్పులు జరిగాయి. గాయాలతో పలువురు మావోయిస్టులు బలగాలకు పట్టుబడ్డట్లు సమాచారం.

హిడ్మా కోసం వేల బలగాలు

మార్చి 31కల్లా మావోయిస్టు పార్టీని నిర్మూలించాలన్న లక్ష్యంతో కేంద్రం ప్రారంభించిన ఆపరేషన్ కగార్‌కు గడువు ఇంకా 5 నెలలు మాత్రమే మిగిలి ఉంది. మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు హిడ్మా జాడను పోలీసులు ఇంతవరకు కనుక్కోలేకపోయారు. ఈ నేపథ్యంలోనే తాజాగా వేల మంది బలగాలను రంగంలోకి దింపారు. పామేడు, అబూజ్‌మడ్, నేషనల్ పార్కు, కర్రెగుట్టల్లో గాలింపు ముమ్మరం చేశారు. హిడ్మా లొంగిపోవాలని, హిడ్మా ఇంటికెళ్లి ఛత్తీస్‌గఢ్ హోంమంత్రి విజయశర్మ ఇటీవలే కోరారు. అడవుల్లో ఇంకా సాయుధ పోరాటం చేస్తున్న కేంద్ర కమిటీ సభ్యులు గణపతి, బెహరా, పశులూరి విశ్వనాథం, కాకా హనుమంతు, మల్లా రాజిరెడ్డి, అనల్‌ధా, రణదేవ్, గోసం గాలింపు ముమ్మరం చేశారు. ప్రత్యేక శాటిలైట్ చిత్రాల ద్వారా వారి జాడను కనుగొంటున్నారు.

నిఠారీ వరుస హత్యల కేసులో

సురేందర్ కోలీ నిర్దోషి

- వేరే కేసులు లేకపోతే విడుదల చేయండి
- రెండుదశాబ్దాల నాటి కేసులో సుప్రీం తీర్పు
- నోయిడాలో ఎనిమిది మంది పిల్లల పుర్రెలు
- బయటపడటంతో అప్పట్లో పెను కలవరం
- కోలీకి విధించిన జరిమానాను కూడా రద్దుచేసిన కోర్టు

న్యూఢిల్లీ, నవంబరు 11: దాదాపు రెండు దశాబ్దాల క్రితం దేశాన్ని కలవరపాటుకు గురిచేసిన నిఠారీ వరుస హత్యల కేసులో సుప్రీంకోర్టు కీలక తీర్పు వెలువరించింది. ఈ హత్యలకు సంబంధించి సురేందర్ కోలీపై పలు కేసులు నమోదుకాగా, అందులో ఒకదానిలో కోర్టు మంగళవారం ఆయనను నిర్దోషిగా ప్రకటించింది. తక్కిన కేసుల్లో ఇప్పటికే ఆయన నిర్దోషిగా తేలారు. 15 ఏళ్ల బాలికపై అత్యాచారం, హత్య కేసులోనే ప్రస్తుతం కోలీ జైలులో ఉన్నారు. తనకు ఈ కేసులో విధించిన యావజ్జీవ శిక్షను రద్దు చేయాలంటూ కోలీ సుప్రీంకోర్టులో క్యూరేటివ్ పిటిషన్ వేశారు. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ సూర్యకాంత్‌లతో కూడిన ధర్మాసనం, ఆ పిటిషన్‌ను అనుమతించడంతో ఆయన విడుదలకు దారి సుగమం అయింది. నోయిడాలోని నిఠారీ ప్రాంతంలో 2006 డిసెంబరు 29వ తేదీన వ్యాపారవేత్త మోనిందర్ సింగ్ పంఢేర్ నివాసం వెనుక మురికి కాల్వలో ఎనిమిది మంది పిల్లల పుర్రెలు బయటపడటం అప్పట్లో పెను కలకలం రేపింది. పంఢేర్‌తోపాటు ఆయన ఇంట్లో పని మనిషిగా పనిచేస్తున్న సురేందర్ కోలీని ఈ వ్యవహారంలో పోలీసులు అరెస్టు చేసి పలు కేసులు నమోదు చేశారు. తనపై ఉన్న కేసుల్లో నిర్దోషిగా తేలి పంఢేర్ విడుదల కాగా, 15 ఏళ్ల బాలికపై అత్యాచారం, హత్య కేసు తప్ప తక్కిన అన్ని కేసుల్లో కోలీని కోర్టులు నిర్దోషిగా ప్రకటించాయి. ఈ కేసులో ఆయనకు విధించిన మరణ శిక్షను అలహాబాద్ హైకోర్టు ఈ ఏడాది జనవరిలో యావజ్జీవ శిక్షగా మార్చింది. దీనికి వ్యతిరేకంగా సీబీఐ దర్యాప్తు సంస్థ, బాధిత కుటుంబాలు సుప్రీంకోర్టుకు వెళ్లాయి. వీరంతా కలిపి 14 పిటిషన్లు వేయగా, కోలీ క్యూరేటివ్ పిటిషన్ వేశారు. ఆ 14 పిటిషన్లను ఈ ఏడాది జూలై 30వ తేదీన కొట్టివేసిన సుప్రీంకోర్టు.. కోలీ వేసిన క్యూరేటివ్ పిటిషన్‌కు ఉన్న విచారణార్హతపై పరిశీలన కోసం దానిని అప్పటికి పెండింగ్‌లో ఉంచింది. ఇతర అన్ని కేసుల్లో కోలీ నిర్దోషిగా తేలడాన్ని పరిగణనలోకి తీసుకుంటూ, చివరకు ఆ పిటిషన్‌ను విచారణకు స్వీకరించింది. కేవలం ఒక కత్తి, వాంగ్మూలం ఆధారంగా కోలీని దోషిగా నిర్ధారించారని, నేర నిర్ధారణకు అవసరమైన సరైన సాక్ష్యాధారాలను దర్యాప్తు అధికారులు సంపాదించలేకపోయారని గుర్తించింది. దీంతో వేరే కేసులు లేక విచారణ పెండింగ్‌లో లేకపోతే సురేందర్ కోలీని వెంటనే విడుదల చేయాలంటూ ఆదేశించింది. ఆయనకు విధించిన శిక్షతోపాటు జరిమానాను కూడా రద్దు చేసింది.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: N.Rahul Kumar. Ph. No. (0870) 2100480/84,
RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.